


'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 15

సోమవారం 7-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నాలుగు'తో నగుబాటు

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో పరాజయం -14లో



రుద్రాంక్ష్ పసిడి గురి

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో స్వర్ణ పతకం గెలిచిన భారత షూటర్ -14లో



ఎంఏ బేబి ఎన్నిక

సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కేరళకు చెందిన సీనియర్ నేత మరియమ్ అలెగ్జాండర్ (ఎంఏ) బేబి ఎన్నికయ్యారు.

వివరాలు 6లో ▸



దీక్ష విరమించిన దల్లేవాల్

ఎంఎస్పీకి చట్టబద్ధత సహా పలు డిమాండ్లపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ దీక్ష విరమించారు.


వివరాలు 6లో ▸



అనంత్ పాదయాత్ర పూర్తి

రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ చేపట్టిన ఆధ్యాత్మిక పాదయాత్ర పూర్తయింది.

వివరాలు 12లో ▸



రుణ వేధింపులకు చెక్ పెడదాం

బాకీ వసూలు పేరిట అనుచితంగా ప్రవర్తించే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఏజెంట్ల నుంచి రుణగ్రహీతలకు ఉన్న రక్షణలపై కథనం.

వివరాలు 15లో ▸

న్యూస్‌రీల్

వారంలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు!



తెలంగాణ బీజేపీకి కొత్త రథ సారథి ఎవరు? అనే ఉత్కంఠకు మరో వారం రోజుల్లో తెర పడనుంది. పార్లమెంటు సమావేశాలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియపై పార్టీ ఒక నిర్ణయానికి వచ్చింది.

- వివరాలు 3లో▶

విచారణకు నేనూ వస్తా



కృష్ణా నదీ జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న వాటాలను ఏపీ, తెలంగాణకు పంపిణీ చేసేందుకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్వహిస్తున్న విచారణకు స్వయంగా హాజరవుతానని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

- వివరాలు 2లో▶

అవగాహన పెంచుకో.. అస్త్రాలను వాడుకో!



ఒంటరిగా ప్రయాణించే మహిళల భద్రత కోసం టీ–సేఫ్ యాప్‌ను తెలంగాణ మహిళా భద్రతా విభాగం గతేడాది అందుబాటులోకి తెచ్చింది. ప్రతి మహిళ ఫోన్‌లో ఈ యాప్ ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

- వివరాలు 16లో▶

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్



రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల డైరెక్ట్ నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం విడుదల చేశారు.

- వివరాలు 16లో▶



ఆదివారం రామేశ్వరంలో పంబన్ వర్టికల్ రైల్వే వంతెనను ప్రారంభించిన అనంతరం కొత్తగా ప్రవేశపెట్టిన రామేశ్వరం-తాంబరం (చెన్నై) రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

దేశానికే తలమానికం

పంబన్ రైల్వే వంతెన ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

దేశంలో తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జి జాతికి అంకితం

తమిళనాడులో **8,300** కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

- రామేశ్వరం–తాంబరం (చెన్నై) కొత్త రైలు ప్రారంభం.. ఆపై సభలో ప్రసంగం
- తమిళ మాధ్యమంలో వైద్యవిద్య అందించాలని స్టాలిన్ ప్రభుత్వానికి సూచన
- తమిళనాడుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని స్పష్టీకరణ
- మోదీ కార్యక్రమానికి గైర్హాజరైన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

తమిళనాడుకు నిధుల కేటాయింపులో ఎలాంటి వివక్ష లేదు. 2014 కంటే ముందు పదేళ్లతో పోలిస్తే గత పదేళ్లలో మూడురెట్లు ఎక్కువ నిధులు తమిళనాడుకు ఇచ్చాం. తమిళనాడుకు రైల్వే బడ్జెట్ ఏడు రెట్లు పెంచాం. కేంద్ర ప్రభుత్వ పథకాలతో తమిళనాడులో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారు. అయినా నిధుల విషయంలో కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు.

- వివరాలు 6లో▶

ఇంజనీరింగ్ అద్భుతం | రామనాథ స్వామి ఆలయంలో పూజలు 6లో

ఆదివారం భద్రాద్రి సీతారాముల కల్యాణంలో భాగంగా మాంగళ్యధారణ క్రతువు దృశ్యం



వైభవంగా భద్రాద్రి రాములోరి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి | తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్త జనం | నేడు శ్రీరాముడికి పట్టాభిషేకం.. పాల్గొననున్న గవర్నర్ 5లో



బాల రాముడికి సూర్యతిలకం

- అయోధ్యలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- గర్భాలయంలో మహా మస్తకాభిషేకం నిర్వహించిన అర్చకులు

- వివరాలు 6లో



'సన్న బియ్యం'తో సీఎం లంచ్

లబ్ధిదారుడి ఇంట్లో నేలపై కూర్చొని భోజనం

సంక్షేమ పథకాలపై ఆరా తీసిన వైనం 3లో

సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారు బూరం శ్రీనివాస్ ఇంట్లో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, సీఎస్ శాంతికుమారి, లబ్ధిదారు కుటుంబ సభ్యులు



ఆదివారం తిరుమలలోని శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా 12లో

ఒక్క చాన్స్ ఇవ్వండి

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల పాలన చూశారు.. మాకు అవకాశమిస్తే పారదర్శక పాలన అందిస్తాం
- హైదరాబాద్‌లో మజ్లిస్ ఆగడాలను అరికడతాం.. మజ్లిస్‌ను పెంచి పోషిస్తున్నది బీఆర్‌ఎస్, కాంగ్రెస్సే
- మోదీ నేతృత్వంలో బీజేపీ అత్యంత సమర్థంగా పనిచేస్తోంది



3లో

బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రజలకు కిషన్‌రెడ్డి వినతి

'కంచ' పోరు ఆగదు

- హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటంపై ప్రభుత్వం అపవాదులు
- వర్సిటీ తరలింపు, ఎకో పార్క్ అంటూ కుయుక్తులు
- నిస్వార్థమైన విద్యార్థి–ప్రజా ఉద్యమాలు విజయం సాధిస్తాయి
- కంచ గచ్చిబౌలి స్థలం వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి




2లో

బహిరంగ లేఖలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నేడు 'బనకచర్ల'పై చర్చ!

గోదావరి బోర్డు భేటీలో ఇదే కీలకాంశం

- ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ
- ఇప్పటికే కేంద్రం, కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు
- గోదావరి బోర్డు కోరినా ప్రాజెక్టు వివరాలు ఇవ్వని ఏపీ



- వివరాలు 2లో▶



ఏఐ కాద్సార్! నిజం జింకే!!

టాలెంట్‌ను ట్రంప్ కూడా ఆపలేడు

- నైపుణ్యం లేనివాళ్లను ఎవరూ రక్షించలేరు
- స్కిల్స్ లేకుండా అమెరికా వచ్చేవారికే సమస్య
- ఇండియాలోనే ఉద్యోగం రానివారికి ఇక్కడెలా వస్తుంది?
- భారత విద్యార్థులకు అమెరికా యువత పోటీయే కాదు
- వ్యవసాయ కూలి పనికి కూడా సిద్ధపడటమే సమస్య
- కొన్ని అమెరికా వర్సిటీలతో కన్సల్టెన్సీలు కుమ్మక్కు
- మాయ మాటలతో విద్యార్థులను మోసం చేస్తున్నాయి

డేటా సైంటిస్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ వెంకట్ ఇక్కుర్తి అమెరికా నుంచి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ

ఇప్పుడు ఏటా 3.40 లక్షల మంది భారతీయ విద్యార్థులు వస్తున్నారు. వీళ్లల్లో ఐఐటీ, ఎన్‌ఐటీల్లో చదివేవాళ్లు చాలా తక్కువ. ఇండియాలో ఏ ఉద్యోగం రాని వాళ్లు, నాణ్యతలేని కాలేజీల్లో నైపుణ్యం లేకుండా ఇంజనీరింగ్ చేసినవాళ్లే వస్తున్నారు. ఇండియాలోనే ఉద్యోగం రానప్పుడు అమెరికాలో ఎలా వస్తుంది?



వనం దుర్గాప్రసాద్

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక.. ఆ దేశంలోని విదేశీ ఉద్యోగులు, విద్యార్థులకు గడ్డుకాలం మొదలైందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అమెరికాలో అక్రమంగా ఉంటున్నవారిని తరిమేస్తున్న ట్రంప్ యంత్రాంగం.. విదేశీ విద్యార్థులపై కఠిన ఆంక్షలు పెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే వృత్తి నిపుణులకు అమెరికా ఎప్పుడూ ఆహ్వానం పలుకుతుందని, నైపుణ్యం లేనివారు ఏ దేశంలోనూ ముందుకెళ్లలేరని చెబుతున్నారు అమెరికాలో 30 ఏళ్లుగా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రవాసాంధ్రుడు వెంకట్ ఇక్కుర్తి. నైపుణ్యం ఉన్న ఎవరినీ మిగతా 2వ పేజీలో ▶



అమెరికా అధ్యక్షుడు ట్రంప్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌కు వ్యతిరేకంగా శనివారం లాస్ ఏంజెలెస్ వీధుల్లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వేలాది అమెరికన్లు

ట్రంప్‌కు 'హ్యాండ్సాఫ్' సెగ

- ట్రంప్ విధానాలతో విదేశాల ప్రతీకార టారిఫ్‌ల భారం పడిందని అమెరికన్ల ఆగ్రహం
- దేశవ్యాప్తంగా ఉధృతంగా సాగిన ఆందోళనలు

6లో

యూఎస్ ప్లస్ నినాదంతో ముందుకు!



అంతర్జాతీయంగా కొత్త మార్కెట్ల వైపు భారత్ చూపు | ప్రపంచ మార్కెట్‌కు ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా మారే అవకాశం | దేశీయ పరిశ్రమ ఆశాభావం | సవాళ్లను అవకాశంగా మలుచుకోవాలంటున్న మార్కెట్ వర్గాలు

భారత్ నుంచి గత ఏడాది 87.4 బిలియన్ డాలర్ల విలువైన వస్తు, సేవలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. అయితే, ఈ కాలంలో అమెరికా నుంచి భారత్‌కు అయిన దిగుమతులు 41.8 బిలియన్ డాలర్లు మాత్రమే కావడం గమనార్హం. అంటే అగ్రరాజ్యంతో వ్యాపారంలో మనదే పైచేయి అన్నమాట. యూఎస్‌లో పాగా వేసిన భారత్.. ప్రస్తుత మార్కెట్లలో మరింత చొచ్చుకుపోవడంతోపాటు కొత్త మార్కెట్లకు విస్తరించే సమయం ఆసన్నమైంది. అయితే ట్రంప్ ప్రతీకార సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని ఒక కుదుపు కుదపడం.. అమెరికాలో ఆర్థిక మాంద్యం తప్పదన్న అంచనాల నేపథ్యంలో భారత్ ముందు సవాళ్లు లేకపోలేదు. ఈ సవాళ్లను అవకాశంగా మలుచుకోవాలని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనికోసం యూఎస్ ప్లస్ నినాదాన్ని అందిపుచ్చుకొని ప్రపంచ మార్కెట్‌కు నమ్మదగిన ఆకర్షణీయ, ఆర్థిక భాగస్వామిగా అవతరించాలని అంటున్నాయి.

రిస్క్‌ను తగ్గించడానికి లేదా కొత్త మార్కెట్ల కోసం చూస్తున్న గ్లోబల్ కంపెనీలు సుంకం లేని లేదా తక్కువ సుంకం కలిగిన కేంద్రంగా భారత్‌లో ఎక్కువ పెట్టుబడి పెట్టవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. చైనా ఉత్పత్తులపై అధిక సుంకం కారణంగా భారత్‌కు అతిపెద్ద ప్రయోజనం చేకూరవచ్చని బోరా మల్టీకార్ప్ ఎండీ ప్రశాంత్ బోరా తెలిపారు. అలాగే, వియత్నాం, బంగ్లాదేశ్, ఇండోనేషియా వంటి దేశాలపై అమెరికా విధిస్తున్న పరస్పర సుంకాలు భారత ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూరుస్తాయని అంటున్నారు. వచ్చే 2–3 ఏళ్లలో భారతీయ ఎగుమతిదార్లకు 50 బిలియన్ డాలర్లకు పైగా అదనపు వ్యాపార అవకాశాలు లభిస్తాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ అంచనా వేస్తోంది.

చూపు భారత్ వైపు..

సాక్షి, స్పెషల్ డెస్క్

కొత్త మార్కెట్లకు విస్తరించాలి..

ఇప్పటివరకు వివిధ దేశాలు చైనాపై ఆధారపడకూడదని చైనా ప్లస్ నినాదం అందుకున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం ఎగుమతుల విషయంలో యూఎస్ ప్లస్ నినాదంతో ముందుకెళ్లాలని నిపుణులు సూచిస్తున్నారు. 2024లో భారత్ నుంచి ఎగుమతులు 5.58 శాతం ఎగిసి 814 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. ఇందులో యూఎస్ వాటా 10.74 శాతం మాత్రమే. అంటే సింహభాగం ఎగుమతులు ఇతర దేశాలకు జరుగుతున్నాయన్న మాట. ఎగుమతుల పరంగా యూఎస్‌పై ఆధారపడటం తగ్గించి కొత్త మార్కెట్లకు విస్తరించాలని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. అలాగే ప్రపంచ మార్కెట్లు అంత మెరుగ్గాలేవని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించుకునే పనిలో దేశాలు నిమగ్నమవుతాయి. నాణ్యమైన వస్తువులు తక్కువ ధరకు లభించే మార్కెట్‌వైపు దృష్టిసారిస్తాయి. ఈ పరిస్థితిని భారత్ అవకాశంగా మలుచుకోవాలి. దీర్ఘకాలంలో భారత్ తన ఉత్పాదకతను మెరుగుపరచాలి. డిమాండ్ పెంచేందుకు తయారీ ఖర్చులను తగ్గించాలి. భారత్‌లో ఉత్పత్తులు ఖరీదు ఎక్కువన్న భావన తొలగేలా చేయాలి. దీనికోసం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాన్ని బలోపేతం చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం సూచించింది.

2024లో భారత్ – అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ: 129.2 బిలియన్ డాలర్లు	భారత్ నుంచి యూఎస్‌కు ఎగుమతులు: 87.4 బిలియన్ డాలర్లు. వృద్ధి 4.5 శాతం	యూఎస్ నుంచి భారత్‌కు దిగుమతులు: 41.8 బిలియన్ డాలర్లు. వృద్ధి 3.4 శాతం	వాణిజ్య లోటు: 45.7 బిలియన్ డాలర్లు. వృద్ధి 5.4 శాతం	2005తో పోలిస్తే ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా 2023 నాటికి రెండింతలై 2.4 శాతానికి చేరిక

విశ్వసనీయ భాగస్వామిగా..



భారత్ త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందనే వాస్తవాన్ని చాలా మంది విస్మరిస్తున్నారు. అపార దేశీయ వినియోగం, బలమైన స్వదేశీ సరఫరా వ్యవస్థ దృష్ట్యా మన దేశం సాపేక్షంగా మంచి స్థానంలో ఉంది. ట్రంప్ సుంకాలు భారత్‌కు అపార అవకాశాలను తేవొచ్చు. పరిస్థితిని సద్వినియోగం చేసుకోవడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు అత్యంత విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా మారడానికి గల అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి వేగంగా అనుసరించాల్సిన విధానాలను రూపొందించాలి.

– ఆనంద్ మహీంద్రా, చైర్మన్, మహీంద్రా గ్రూప్

వ్యూహాత్మక స్థానంగా..



ప్రతీకార సుంకాల నేపథ్యంలో కంపెనీలు తమ దృష్టిని భారత్‌పైకి మళ్లించవచ్చు. భారీ, పెరుగుతున్న వినియోగదారుల కేంద్రంగా విదేశీ సంస్థలకు వ్యూహాత్మక స్థానంగా మన దేశం మారొచ్చు. వివిధ దేశాలకు విస్తరించాలని చూస్తున్న కంపెనీలకు ఆకర్షణీయ ప్రత్యామ్నాయంగా భారత్ నిలుస్తుంది. ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీదారులకు ప్రాధాన్యత గమ్యస్థానంగా మారే చాన్స్ ఉంది. ఏఐ, పునరుత్పాదక శక్తి వంటి విభాగాల్లో ఆవిష్కరణ, ఆర్‌అండ్‌డీ కేంద్రంగా అవతరించడానికి భారత్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు.

– డి.విద్యాసాగర్, ఎండీ, ఎస్ఈసీ ఇండస్ట్రీస్

ప్రత్యామ్నాయం లేదు..



జనరిక్ డ్రగ్స్ విషయంలో భారత్‌కు ప్రత్యామ్నాయ దేశం లేదు. టారిఫ్‌లకు సంబంధించి అమెరికాతో బలంగా చర్చించే స్థానంలో ఉన్నాం. యూఎస్ తన ఆర్థిక బలాన్ని ప్రదర్శిస్తే.. జనరిక్స్‌లో యూఎస్‌కు అతిపెద్ద సరఫరాదారుగా మన స్థానాన్ని మనం ఉపయోగించుకోవాలి. అలాగే పూర్తిగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడకుండా దీర్ఘకాలంలో కొత్త మార్కెట్లకు విస్తరించాలి. ఇందుకు యూఎస్ ప్లస్ విధానం సరైన పరిష్కారం.

– రవి ఉదయ్ భాస్కర్
మాజీ డైరెక్టర్ జనరల్, ఫార్మెక్సిల్

క్లుప్తంగా...

వాస్తవాలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



గచ్చిబౌలి (హైదరాబాద్): తాను పార్టీ ప్రతినిధిగానే వచ్చానని, హెచ్‌సీయూ భూముల విషయంలో వాస్తవాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్స్ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులతో మీనాక్షి నటరాజన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీచర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ ఆహ్వానించినా తాము వెళ్లలేదని, మీనాక్షి ఆహ్వానం మేరకు వచ్చామని చెప్పారు. 50 ఏళ్ల నుంచి ఉన్న యూనివర్సిటీ భూములను యథాతథంగా ఉంచాలని, ఎకో పార్క్ చేస్తున్నారనే వదంతులు వస్తున్నాయని, ఇలాంటి ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు. యూనివర్సిటీని ఎకోపార్కుగా చేయడాన్ని విద్యార్థులు, టీచర్స్ సమాజం అంగీకరించదని స్పష్టం చేశారు. తాము చెప్పిన అన్ని అంశాలను మీనాక్షి విన్నారని, తమ వినతిపత్రం స్వీకరించారని, అన్ని అంశాలను పార్టీలో ఉన్నతస్థాయి సమావేశంలో చర్చిస్తామని తమతో చెప్పినట్టు టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. కాగా, గచ్చిబౌలి స్టేడియం నుంచి కంచె గచ్చిబౌలి భూములను చూసేందుకు మీనాక్షి వెళ్లగా, కేసు సుప్రీంకోర్టులో ఉన్న నేపథ్యంలో అనుమతించలేమని పోలీసులు చెప్పడంతో ఆమె వెనుదిరిగారు.

ఏఐకి ముడిపెట్టడం హాస్యాస్పదం

కంచ గచ్చిబౌలిపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట టౌన్: కంచ గచ్చిబౌలి వాస్తవాలను ఏఐకి ముడిపెట్టడం హాస్యాస్పదంగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నెమళ్ల అరుపులు, జింకల చావులు, బుల్డోజర్లు కూడా ఏఐ సృష్టేనా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించడం రేవంత్ పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కన్నా మీ ఎనుముల ఇంటెలిజెన్స్‌ను నమ్ముకోవడమే మంచిదన్నారు. యూనివర్సిటీనే మార్చుతామన్న రేవంత్ లీకులు కూడా అనాలోచితమేనని, రేవంత్ ఇప్పటికైనా తెలివితక్కువ పనులు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని జగదీశ్‌రెడ్డి సలహా ఇచ్చారు.

అమెరికాలో తుపాను.. 16 మంది మృతి

కెంటకీ: అమెరికాలోని పలు రాష్ట్రాలు భీకర తుపానుతో అతలాకుతలమవుతున్నాయి. టెక్సాస్ నుంచి ఓహాయో వరకు సంభవించిన వరదల్లో ఇద్దరు చిన్నారులు సహా 16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఒక్క టెన్నెస్సీలోని 10 మంది చనిపోయారు. నదులు ఉప్పొంగడంతో రహదారులు, వంతెన, ఇతర కీలక మౌలిక వనరులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో, సహాయక సిబ్బంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుపాను ప్రభావంతో 521 విమాన సర్వీసులు రద్దు కాగా, 6,400 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. లూయిస్‌విల్లె, కెంటకీ, మెంఫిస్‌ల్లోని నౌకాశ్రయాల్లో కార్గో షిప్పింగ్ నిలిచిపోయింది. అర్కాన్సాస్, మిస్సిస్సిప్పి, కెంటకీ, టెన్నెస్సీల్లో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

నేడు ‘బనకచర్ల’పై చర్చ!

నేటి గోదావరి బోర్డు 17వ సమావేశం ఎజెండాలో కీలకాంశం

- ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ
- ఇప్పటికే కేంద్రం, కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు
- గోదావరి బోర్డు కోరినా ప్రాజెక్టు వివరాలు ఇవ్వని ఏపీ



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్రం వ్యక్తం చేసిన అభ్యంతరాలపై నేడు గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో కీలక చర్చ జరగనుంది. జీఆర్ఎంబీ చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు 17వ సమావేశం జరగనుంది. తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్.. ఏపీ తరఫున ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొని వాదనలు వినిపించనున్నారు. గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలతో పాటు నాగార్జునసాగర్ నుంచి కృష్ణా వరద జలాలను తరలించి గుంటూరు జిల్లాలో నిర్మించనున్న బొల్లపల్లి రిజర్వాయర్‌లోకి వేస్తామని ఏపీ ప్రతిపాదించింది. దీనికి తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. రూ.80 వేల కోట్ల ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 90 రోజుల్లో 180 టీఎంసీల మిగులు జలాలను తరలిస్తామని ఏపీ చెబుతోంది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే గోదావరి, కృష్ణా బోర్డులతోపాటు కేంద్ర జల్‌శక్తి శాఖకు ఫిర్యాదు చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, ఇతర వివరాలివ్వాలని గోదావరి బోర్డు ఏపీకి లేఖ రాయగా ఇంతవరకు అందించలేదు. సోమవారం నాటి సమావేశంలో ఈ ప్రాజెక్టుపై రెండు రాష్ట్రాల మధ్య వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. సాగర్ కుడికాల్వ సామర్థ్యం పెంచడం ద్వారా కృష్ణా వరద జలాలను బొల్లపల్లి రిజర్వాయర్‌కి తరలిస్తామని ఏపీ చేసిన ప్రతిపాదనతో సాగర్ కింద తెలంగాణలో ఉన్న ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ప్రాజెక్టుల అప్పగింతపై చర్చ

గోదావరి పరీవాహకంలోని మొత్తం 16 ప్రాజెక్టుల నిర్వహణను గోదావరి బోర్డుకు అప్పగించాలని 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలుపై సైతం గోదావరి బోర్డు సమావేశంలో చర్చ జరగనుంది. గోదావరిపై ఉన్న పెద్దవాగు ప్రాజెక్టు మాత్రమే రెండు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అని, దానిని మినహా ఇతర ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదని ఇప్పటికే తెలంగాణ తేల్చి చెప్పింది. తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులను అప్పగిస్తే తమ ప్రాజెక్టులు సైతం అప్పగిస్తామని ఏపీ మెలిక పెట్టింది. గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం తెలంగాణలోని 11 ప్రాజెక్టులు, ఏపీలోని 4 ప్రాజెక్టులు కలిపి గోదావరి బేసిన్‌లోని మొత్తం 15 అనుమతి లేని ప్రాజెక్టులకు అనుమతి పొందాల్సి ఉంది. ఈ ప్రక్రియలో పురోగతిపై సైతం చర్చ జరగనుంది. తెలంగాణలోని 11 ప్రాజెక్టుల్లో తొమ్మిదింటికి సంబంధించిన 8 డీపీఆర్‌లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనుమతుల కోసం సమర్పించగా, 6 ప్రాజెక్టులకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) అనుమతులు సైతం లభించాయి. అపెక్స్ కౌన్సిల్ అనుమతిస్తే పూర్తిస్థాయి అనుమతులు లభించినట్టే. ఏపీ ఇంతవరకు తమ ప్రాజెక్టుల డీపీఆర్‌లను అనుమతుల కోసం సమర్పించలేదు.

ట్రిబ్యునల్ విచారణకు నేనూ వస్తా

న్యాయ నిపుణుల బృందంలో ఉత్సాహం నింపుతా

- నీటి కేసుల్లో ఎలాంటి పురోగతి ఉన్నా నాకు తెలపాలి
- కృష్ణా ట్రిబ్యునల్ తెలంగాణ న్యాయవాదుల బృందంతో సమీక్షలో మంత్రి ఉత్తమ్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న వాటాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్వహిస్తున్న విచారణకు స్వయంగా హాజరై రాష్ట్రం తరఫున మరింత బలంగా వాదనలు వినిపించేలా న్యాయవాదుల్లో ఉత్సాహం నింపుతానని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ నేతృత్వంలో కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట రాష్ట్రం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల బృందంతో ఆదివారం ఆయన జలసౌధలో సమావేశమయ్యారు. న్యాయవాదుల బృందానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డేటా కలెక్షన్, క్షేత్రస్థాయి సమాచారం, పిటిషన్ల రూపకల్పనలో పూర్తి సహకారం అందించాలని నీటిపారుదల శాఖను ఆదేశించారు. న్యాయవాదులకు అవసరమైన రవాణా, బస సదుపాయాలను కల్పించాలని కోరారు. ట్రిబ్యునల్ విచారణ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై న్యాయ నిపుణులతో చర్చించి, పలు సూచనలు చేశారు. తెలంగాణ వాదనలు కేవలం గణాంకాలకు సంబంధించినవి కాదని, న్యాయం కోసం జరిపే పోరాటమని తెలిపారు. నీటి కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని సరిచేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టంచేశారు.

పూర్తి సన్నద్ధతతో ఉన్నాం: న్యాయ బృందం

ఇటీవల జరిగిన విచారణ సందర్భంగా ట్రిబ్యునల్ ఎదుట వినిపించిన వాదనలను సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ మంత్రికి వివరించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరగనున్న విచారణ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రానికి న్యాయమైన నీటి కేటాయింపుల కోసం చేస్తున్న వాదనను బలపరిచే వివిధ రకాల సమాచారాన్ని ట్రిబ్యునల్‌కు అందజేసినట్టు తెలియజేశారు. తెలంగాణ భూభాగంలో కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంతోపాటు రాష్ట్ర జనాభా, సాగునీటి సరఫరా సామర్థ్యం వంటి అంశాలను గమనంలోకి తీసుకుని కేటాయింపులు జరపాలని ట్రిబ్యునల్ ఎదుట వాదిస్తున్నట్లు వెల్లడించారు. కృష్ణా, గోదావరి జల వివాదాల విషయంలో న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు రాష్ట్రం దాఖలు చేసిన అప్పీళ్ల తాజా స్థితిగతులను మంత్రి ఉత్తమ్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పురోగతి ఉన్నా తక్షణమే తనకు తెలియజేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్‌దాస్, ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భోజనం ఎలా ఉంది.. పాఠాలు అర్థమవుతున్నాయా?

విద్యార్థినులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


గురుకులంలో బాలికలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా: రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అయినా.. మల్లు భట్టి విక్రమార్క ఎలాంటి ఆర్భాటం, హడావుడి లేకుండా సామాన్యుడిలా అరుగుపై కూర్చుని విద్యార్థినులతో మాట్లాడారు. భవిష్యత్ లక్ష్యాలు, మెనూ అమలు, బోధనపై ఆరా తీసిన ఆయన.. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆదివారం ఆయన భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తూ, మార్గమధ్యలో తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాలలక్ష్మీపురం వెళ్లారు. అక్కడ సొంతంగా కారు నడుపుతూ వెళ్లిన భట్టి.. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశాక అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆ తర్వాత వైరాలో తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడే అరుగుపై కూర్చుని విద్యార్థినులతో మాట్లాడారు. ఇంగ్లిష్ మీడియం పాఠాలు అర్థమవుతున్నాయా? రాత్రి వేళ కేర్‌టేకర్లు ఉంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఆపై డైనింగ్ హాల్‌కి వెళ్లి.. మెనూ చార్ట్ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తర్వాత ఆయన విద్యార్థినులతో కలసి భోజనం చేశారు.

‘కంచ’ పోరు ఆగదు

- హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటంపై ప్రభుత్వం అపవాదులు
- వర్సిటీ తరలింపు, ఎకో పార్క్ అంటూ కుయుక్తులు
- బహిరంగ లేఖలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల అడవిని శాశ్వతంగా కాపాడుకునేందుకు హెచ్‌సీయూ విద్యార్థులు చేస్తున్న అపూర్వ పోరాటంపై ప్రభుత్వం అపవాదులు వేస్తూ, బెదిరింపులకు దిగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. విద్యార్థులు నిస్వార్థంగా, ఉదాత్త లక్ష్యాలతో చేపట్టిన ఈ ఆందోళన అద్భుతమని ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు, పర్యావరణ కార్యకర్తలు, ప్రజలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దళారిలా ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ కోసం కంచ గచ్చిబౌలి స్థలం వేలాన్ని విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల దృష్టి మరల్చేందుకు ఎకో పార్క్ ఏర్పాటు, యూనివర్సిటీ తరలింపు వంటి ప్రతిపాదనలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. 50 ఏళ్లకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని, ఎకో పార్క్ కన్నా గొప్పగా ఈ క్యాంపస్ పర్యావరణ సమతుల్యతను కాపాడుతోందన్నారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలే ఉందని, ప్రభుత్వ బెదిరింపులను, దుష్ప్రచారాన్ని ఎదుర్కొని ముందుకు సాగాలని విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. 400 ఎకరాల పరిరక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, విద్యార్థులకు అండగా నిలుస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. వేలం వేసే ప్రయత్నాన్ని విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించేదాకా పోరాటాన్ని కొనసాగిద్దామని చెప్పారు.

టాలెంట్‌ను ట్రంప్ కూడా ఆపలేడు

▶ మొదటి పేజీ తరువాయి

ట్రంప్ కాదుకదా.. ఎవ్వరూ అడ్డుకోలేరని, నైపుణ్యం లేనివారిని ఎవ్వరూ రక్షించలేరని చెబుతున్నారాయన. గుంటూరు జిల్లాకు చెందిన వెంకట్‌కు డేటా సైంటిస్టుగా, అమెరికన్ యూనివర్సిటీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా 30 ఏళ్ల అనుభవం ఉంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక అమెరికాలో తాజా పరిస్థితి, భారత విద్యార్థుల స్థితిగతులపై ‘జూమ్ ఇన్’లో ‘సాక్షి’ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు.

ట్రంప్ వచ్చిన తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నాయి?

- ట్రంప్ కొత్తగా తీసుకున్న నిర్ణయాలేమీ లేవు. అమెరికన్ చట్టాలనే కఠినంగా అమలు చేస్తున్నారు. తన దేశానికి మేలు చేయాలన్నదే ఆయన ఆలోచన. టారిఫ్‌లు వేయడం సర్వసాధారణ విషయమే. కాకపోతే దీన్ని ప్రతీకార చర్యగా భావిస్తున్నారు.

భారత విద్యార్థులను అక్కడ వేధిస్తున్నారా?

- భారత్ నుంచి అమెరికాకు ఏటా 3.42 లక్షల మంది చదువుకోవడానికి వస్తున్నారు. ఇందులో సగం మంది తెలుగు విద్యార్థులే. భారత విద్యార్థులంతా తెలివైన వాళ్లే. కాకపోతే నిబంధనలు వదిలేస్తారు. ఇప్పుడదే సమస్యగా మారింది. నిజానికి అమెరికావాళ్లు భారత పౌరులను గౌరవిస్తారు. గోల్డెన్ హ్యాండ్స్ అంటారు. అలాంటి వాళ్లు విద్యార్థులను ఎందుకు వేధిస్తారు. యూనివర్సిటీల్లో పార్ట్‌టైం జాబ్ చేసే ఎవరినీ ఏమీ అనడం లేదు. అడ్డదారిలో మాల్స్, హోటల్స్, ఇళ్లల్లో పనిచేయడాన్ని అడ్డుకుంటున్నారు. అమెరికాకు వచ్చేది దీని కోసమా?

అసలు సమస్య ఏంటి?

- 2016లో అమెరికాకు వచ్చిన భారతీయులు 40 వేలకు మించి లేరు. వీళ్లతా ఐఐటీ, ఎన్ఐటీ, పేరున్న వర్సిటీల్లో చదివిన వాళ్లే. ఎంఎస్ పూర్తయిన తర్వాత వాళ్లల్లో సగం మందిని అమెరికా మంచి ఉద్యోగాలిచ్చి ఉంచేసుకుంది. ఇప్పుడు వీళ్లే అమెరికాకు గొప్ప ఆస్తి. నైపుణ్యం ఉన్న విద్యార్థులను అమెరికా ఎప్పుడూ వదులుకోదు. కానీ ఇప్పుడు ఏటా 3.40 లక్షల మంది భారతీయ విద్యార్థులు వస్తున్నారు. వీళ్లల్లో ఐఐటీ, ఎన్ఐటీల్లో చదివేవాళ్లు చాలా తక్కువ. ఇండియాలో ఏ ఉద్యోగం రాని వాళ్లు, నాణ్యతలేని కాలేజీల్లో నైపుణ్యం లేకుండా ఇంజనీరింగ్ చేసినవాళ్లే వస్తున్నారు. ఇండియాలోనే ఉద్యోగం రానప్పుడు అమెరికాలో ఎలా వస్తుంది? ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులకే 295 జీఆర్ఈ స్కోర్ వస్తోంది. కానీ వీళ్లు 325 స్కోర్ తెచ్చుకుంటున్నారు. ఇది ఎలా సాధ్యం? కన్సల్టెన్సీలు తప్పుడు మార్గంలో జీఆర్ఈ రాయిస్తున్నాయి. వీటిని అమెరికా అధికారులు గుర్తించలేరా? మెక్సికో లాంటి ప్రాంతాల నుంచి లేబర్ వీసాలపై వచ్చే నల్ల జాతీయుల ఉద్యోగాలు కూడా మనవాళ్లు చేస్తామని ముందుకొస్తున్నారు. కాల్పుల ఘటనలకు ఇవే ప్రధాన కారణాలవుతున్నాయి.

అమెరికా విద్యలో నాణ్యత ఉందా?

- అమెరికాలో 25 వేల విశ్వవిద్యాలయాలున్నాయి. దాదాపు ఇవన్నీ ప్రైవేటువే. వీటిల్లో నాణ్యత ఉన్నవి కొన్నే. మిగతా వర్సిటీలు కన్సల్టెన్సీల ద్వారా విద్యార్థులను మభ్యపెట్టి చేర్చుకుంటున్నాయి. కొన్ని వర్సిటీలు ఫీజుల్లో 40 శాతం కన్సల్టెన్సీలకు ఇస్తున్నాయి. దీంతో కన్సల్టెన్సీలు విద్యార్థులను తప్పుదారి పట్టిస్తున్నాయి. ఈ వర్సిటీలు విద్యార్థులు చదివినా చదవకపోయినా డిగ్రీలు ఇస్తున్నాయి. అమెరికాలో ఉండే ఒక వ్యక్తికి సంబంధించిన డాక్యుమెంట్లు 26 చోట్ల వాడారు. దీన్ని అమెరికా అధికారులు ప్రశ్నించారు. తన బంధువు కోసం ఇచ్చిన డాక్యుమెంట్లను కన్సల్టెన్సీలు ఇలా దుర్వినియోగం చేశాయి. నాణ్యత లేని వర్సిటీల్లో నెలకు ఒక క్లాస్ జరుగుతోంది. మిగతా రోజుల్లో మనవాళ్లు చట్ట విరుద్ధంగా డబ్బుల కోసం పని చేస్తున్నారు. ఒక హోటల్‌లో గంటలకొద్దీ పనిచేసే విద్యార్థి ఎంఎస్ ఎలా చదువుతాడు? అతడికి నైపుణ్యం ఎందుకు ఉంటుంది? అమెరికాలో ఉద్యోగం ఎందుకు వస్తుంది?

అమెరికన్లు పనిచేయరు.. భారతీయులను ట్రంప్ అడ్డుకుంటున్నారు.. ఎలా?

- నిజమే.. అమెరికన్లు రెస్టారెంట్లు, ఇళ్లలో పనిచేయరు. భారతీయులూ అలా చేయరనేది అమెరికన్ల నమ్మకం. అందుకే మెక్సికన్లకు ఈవీ–1 వీసా (అగ్రికల్చర్ లేబర్) ఇస్తారు. ఆ జాబితాలో భారత్ లేనేలేదు. అలాంటప్పుడు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడం మంచిదేనా? కరోనా తర్వాత యాంత్రీకరణ పెరిగింది. దీంతో హోటళ్లు, పెట్రోల్ బంకులు సహా అన్నింటిలోనూ రోబోలు వస్తున్నాయి. ముందుముందు మనవాళ్లు పోటీపడే పార్ట్‌టైం ఉద్యోగాలు ఉండవు. ఇంకా చెప్పాలంటే స్కిల్ ఉద్యోగాలు కూడా కష్టమే.

ఇప్పుడు ఉద్యోగాల మాటేమిటి?

- నైపుణ్యం ఉన్నవాళ్లను ఎవరూ అడ్డుకోలేరు. అది లేనివాళ్లను ఎవరూ రక్షించలేరు. 2016కు ముందు వచ్చిన భారతీయుల పిల్లలకు ఇక్కడ పౌరసత్వం వచ్చింది. వాళ్లిప్పుడు ఉద్యోగాల వేటలో ఉన్నారు. కొత్తగా ఇండియా నుంచి వచ్చే పిల్లలకు అమెరికన్లు పోటీనే కాదు. పౌరసత్వం పొందిన భారత సంతతికి చెందిన వాళ్లే పోటీ. కాబట్టి నైపుణ్యం లేకుండా, డబ్బు సంపాదనే ధ్యేయంగా అమెరికా వస్తే ఇబ్బంది పడతారు. అమెరికా వచ్చే ముందు ఒక్కసారి మీ నైపుణ్యం ఏమిటో? దేనికి సరిపోతారో బేరీజు వేసుకోండి. నైపుణ్యం పెరగాలంటే ముందుగా భారత విద్యా విధానంలో మార్పులు తేవాలి. ఇది అభివృద్ధి చెందిన దేశాల అవసరాలు తీర్చేలా లేదు.

క్లుప్తంగా...

నేడు ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు మినహా ఏడుగురు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాతో పాటు గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారంతా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు శ్రీపాల్‌రెడ్డి, ముల్క కొమరయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్ (కాంగ్రెస్)లతో పాటు సీపీఐ నుంచి ఎన్నికైన నెల్లికంటి సత్యంతో సోమవారం మండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణం చేయించనున్నారు. ఈ మేరకు వీరంతా చైర్మన్ సమయం కోరినట్టు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎన్నికైన డాక్టర్ దాసోజు శ్రావణ్ మాత్రం మరో రోజు ప్రమాణం చేయనున్నారు. ఈ నెల 10వ తేదీన.. లేదంటే మరో ముహూర్తంలో ఆయన ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలిసింది.

1.93 శాతం క్షీణించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ (కోవిడ్ సమయం మినహాయించి) సగటున 25.62 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించిందని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. కాగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ శాఖ ఆదాయంలో 1.93 శాతం తగ్గుదల నమోదైందని, ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు స్పష్టమైన నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చడం, మూసీ రివర్ ఫ్రంట్ పేరిట నగర అభివృద్ధిపై బుల్డోజర్ ఎక్కించడం, మెట్రో లైన్ ప్రణాళికల్లో అనవసర మార్పులు చేసి మౌలిక వసతుల ప్రగతిని అడ్డుకోవడం, రాష్ట్రానికి కీలకమైన ఫార్మా సిటీని రద్దు చేయడం వంటి కారణాల వల్ల ప్రజల్లో భయాందోళనలు పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాల వల్ల రాష్ట్రం పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కోల్పోతోందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు.

కడియం అనుచరులు కబ్జాలకు పాల్పడుతున్నారు

తాటికొండ రాజయ్య ఆరోపణ



ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, దేవునూర్ అటవీ భూములను కడియం శ్రీహరి అనుచరులు కబ్జా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. దేవునూర్ శివారు ఇనుపరాతి గుట్టలను ఆయన ఆదివారం పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇనుపరాతి గుట్టల్లో 3,950 ఎకరాల అడవిని రిజర్వు ఫారెస్ట్‌గా 1967లోనే గుర్తించారని, ఈ గుట్టలను కడియం శ్రీహరి ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయన బిడ్డ, ఎంపీ కడియం కావ్య భర్త నజీర్ బినామీల పేరుతో రెండువేల ఎకరాలు కబ్జా చేయడానికి పనులను ప్రారంభించినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో కలెక్టర్ ప్రమేయం కూడా ఉందని, సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి బినామీల పేర్లతో అడవిని దోచుకోవాలని చూస్తున్నారని రాజయ్య అన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య దిష్టిబొమ్మ దహనం

ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

ధర్మసాగర్: మండలంలోని దేవునూర్, ముప్పారం ఇనుపరాతి గుట్టలపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయా గ్రామాల రైతులు ఆదివారం ముప్పారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపి రాజయ్య దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ముప్పారం శివారులోని భూములు వంశపారంపర్యంగా వచ్చాయని, భూములు గుట్ట పక్కన ఉన్నందుకు అటవీశాఖ అధికారులు సాగుచేసుకోనివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి న్యాయం చేయాలని కోరగా కలెక్టర్‌తో మాట్లాడారని, డ్రాఫ్ట్ (అటవీ శాఖ) నోటిఫికేషన్‌లో లేకుండా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి రైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఉన్న నంబర్లతో పాటు నంబర్లు లేని భూములను సైతం ఫారెస్ట్ అధికారులు లాక్కున్నారని వాపోయారు. ఈ విషయాలు తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడటం సరికాదన్నారు.

క్లిక్ చేస్తే అంతే సంగతి!

అశ్లీల చిత్రాలతో ఎరవేస్తున్న సైబర్ నేరగాళ్లు

- యువతే లక్ష్యంగా కొత్త ఎత్తుగడ
- క్రెడిట్/డెబిట్ కార్డుల సమాచారం తస్కరణ
- ఆన్‌లైన్‌లో అందినకాడికి నగదు స్వాహా
- బహుపరాక్ అంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు



మీరు సీరియస్‌గా బ్రౌజింగ్ చేస్తుండగానో... సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లో మునిగిఉన్నప్పుడో... ఆకర్షించే విధంగా పాప్‌అప్స్ వచ్చాయా..? హఠాత్తుగా మీ ఈ-మెయిల్‌కు గుర్తుతెలియని అడ్రస్ నుంచి 'ఫొటోల'తో కూడిన సందేశం వచ్చిందా..? అలాంటి వాటిని క్లిక్ చేసే ముందు ఒక్క క్షణం ఆగండి. ఎందుకంటే అవి మిమ్మల్ని నిలువునా ముంచేసే ప్రమాదం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తున్నారు సైబర్ క్రైమ్ పోలీసులు.

– సాక్షి, హైదరాబాద్

ఆ వివరాలు అత్యంత కీలకం

ఓ వ్యక్తికి చెందిన సొమ్మును ఆన్‌లైన్‌లో స్వాహా చేయడానికి సైబర్ నేరగాళ్లకు అతడి క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్, సీవీవీ కోడ్‌తోపాటు కొన్ని వ్యక్తిగత వివరాలు అవసరం. ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ కచ్చితంగా ఉండాల్సిందే. వీటితోపాటు ఓటీపీ సైతం ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇవి లేకుండా ఆన్‌లైన్‌లో డబ్బు కాజేయడం సాధ్యం కాదు. సాధారణంగా ఈ వివరాల కోసంసైబర్ నేరగాళ్లు వివిధ పేర్లు, వెరిఫికేషన్లు అంటూ, బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేయడం, మెయిల్స్ పంపడంతోపాటు నూడో సైట్లు సృష్టించే వారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అశ్లీలంతో ఎర వేస్తున్నారు.

యువతే టార్గెట్‌గా వెబ్‌సైట్లు

సైబర్ నేరగాళ్ల వలలో యువకులే ఎక్కువగా పడుతున్నారు. వీరిని టార్గెట్‌గా చేసుకుని ఆకర్షించేందుకు కొన్ని అశ్లీల వెబ్‌సైట్లను సైతం నేరగాళ్లు సృష్టిస్తున్నారు. దీని సమాచారం, అర్ధనగ్న, నగ్న చిత్రాలతో కూడిన పాప్‌అప్స్‌ను వివిధ సామాజిక నెట్‌వర్కింగ్ సైట్లతోపాటు వెబ్‌సైట్లకు లింక్ చేస్తున్నారు. వీటికి ఆకర్షితులవుతున్న యువత వాటిని క్లిక్ చేస్తోంది. ఆ తరువాతే అసలు అంకం ప్రారంభమవుతోంది. ఆ సైట్‌లోకి పూర్తిగా లాగిన్ కావాలన్నా, అందులో పొందుపరిచిన వీడియోలు, ఫొటోలు ఓపెన్ కావాలన్నా కొంత రుసుం చెల్లించాలంటూ ప్రత్యేక లింకు ఇస్తున్నారు. దీంతో డబ్బు చెల్లించడానికి క్రెడిట్/డెబిట్ కార్డుల వివరాలు, నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు అందులో పూరిస్తున్నారు. నిగూఢంగా ఉండే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ కారణంగా ఈ వివరాలన్నీ నేరుగా సైబర్ నేరగాళ్లకు చేరుతున్నాయి. ఇవన్నీ వారి చేతికి చిక్కిన తర్వాత ఇక కావాల్సింది ఓటీపీ మాత్రమే. దీనికోసం సదరు వెబ్‌సైట్‌లోనే ప్రత్యేక లింకు ఏర్పాటు చేస్తున్నారు. ఓపక్క ఈ వివరాలతో ఆన్‌లైన్ లావాదేవీలు పూర్తి చేసి.. ఓటీపీ వచ్చేలా ఆప్షన్ ఎంచుకుని వేచి చూస్తున్నారు. వాళ్లు తమ వెబ్‌సైట్‌లో ఓటీపీని పొందుపరిచిన వెంటనే లావాదేవీ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో ఖాతాలోని డబ్బును స్వాహా చేస్తున్నారు. ఈ నేరాలకు పాల్పడే వారు వినియోగిస్తున్న సర్వర్లు విదేశాల్లో ఉంటుండటంతో వారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవడం కూడా అసాధ్యంగా మారుతోందని సైబర్ క్రైమ్ అధికారులు చెబుతున్నారు. ఈ స్కామ్స్ చేయడానికి సైబర్ నేరగాళ్లు ప్రత్యేకంగా కొన్ని కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసినట్లు అనుమానిస్తున్నారు.

వారికి నైతికత ఉండదు

ఆన్‌లైన్ షాపింగ్, చెల్లింపులను పూర్తి నమ్మకమైన సైట్ల ద్వారానే చేపట్టాలి. అశ్లీల సైట్లు నిర్వహించే వారికి నైతికత ఉండదన్నది గుర్తుంచుకోవాలి. అలాంటి వాళ్లు మీ కార్డులు, ఆన్‌లైన్ ఖాతాల వివరాలు తెలిస్తే కచ్చితంగా దుర్వినియోగం చేస్తారు. ఈ తరహా నేరాల్లో మోసపోవడం ఎంత తేలికో... నిందితులు చిక్కడం, నగదు రికవరీ కావడం అంత కష్టం. అప్రమత్తంగా ఉండటం ద్వారానే సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టొచ్చు. ఇలాంటి అశ్లీల వెబ్‌సైట్ల వల్ల కొన్ని సందర్భాల్లో భయంకరమైన వైరస్‌లు కూడా కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లలోకి వచ్చి చేరతాయి. ఫలితంగా అవి పాడవటంతోపాటు డేటా మొత్తం క్రాష్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

–సైబర్ క్రైమ్ అధికారులు

ఆ రెండింటిపై ఫుల్ 'ఫోకస్'

సన్న బియ్యం, రాజీవ్ యువ వికాసం పథకాలకు విస్తృత ప్రచారం

- టీపీసీసీ యోచన..త్వరలో కార్యాచరణ
- ప్రజలకు మేలు చేసే పథకాలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందనే భావన
- కంచ గచ్చిబౌలి భూముల వివాదమే కారణమంటున్న నేతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ, రాజీవ్ యువ వికాసం పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. పేదలకు మేలు చేసే ఈ రెండు పథకాలు కంచ గచ్చిబౌలి భూముల వివాదంతో చర్చలో లేకుండా పోయాయని అభిప్రాయపడుతోంది. ఆ రెండు పథకాలపై ఫోకస్ పెంచి ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమం చేపట్టాలని యోచిస్తోంది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గత 15 నెలల్లో అమలు చేసిన అన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం కల్పించేందుకు వీలుగా ఓ కరపత్రాన్ని టీపీసీసీ సిద్ధం చేసింది. ఈ కరపత్రాలను క్షేత్రస్థాయిలో పంపిణీ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాల గురించి ప్రజలకు పార్టీ శ్రేణులు వివరించనున్నాయి. ముఖ్యంగా సన్న బియ్యం, రాజీవ్ యువ వికాసం కార్యక్రమాల గురించి ప్రజలకు ప్రత్యేకంగా వివరించే విధంగా పార్టీ కార్యాచరణ రూపొందుతోందని, దీనిని ఒకట్రెండు రోజుల్లో టీపీసీసీ విడుదల చేయనుందని సమాచారం.

భూముల వివాదంతో మరుగున..

పదేళ్ల పాటు అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ చేయలేని పేదలకు ఉపయోగపడే రెండు కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టినప్పటికీ, కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో అవి మరుగున పడ్డాయనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని 80 శాతం ప్రజలకు అమలయ్యే విధంగా రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించినా పెద్దగా ప్రచారం లేకుండా పోయిందనే చర్చ జరుగుతోంది. రాజీవ్ యువ వికాసం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని అంటున్నారు. పదేళ్లపాటు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అమలు కాలేదని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు కూడా నిర్వీర్యమయ్యాయనే ఉద్దేశంతో మళ్లీ గ్రామాల్లోని యువతకు ఉపాధి కల్పించేలా దీనికి రూపకల్పన చేసినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు.

లబ్ధిదారులతో భోజనాలు.. నిరుద్యోగులకు సాయం

టీపీసీసీ కీలక నేత ఒకరు మాట్లాడుతూ 'కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది. ప్రభుత్వాన్ని ఓ వైపు బద్నాం చేస్తూనే మరోవైపు పార్టీకి ప్రయోజనం చేకూర్చే పథకాలు మరుగున పడేలా చేస్తోంది. రాజకీయ రాద్ధాంతం కింద పేదల సంక్షేమం నలిగిపోతోంది..'అని వ్యాఖ్యానించడం కాంగ్రెస్ నేతల్లో ఉన్న అభిప్రాయానికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సన్న బియ్యంతో కూడిన భోజనాన్ని లబ్ధిదారులతో కలిసి చేసేలా పార్టీలోని అన్ని స్థాయిల నేతలకు దిశానిర్దేశం చేయాలని, మరోవైపు రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు క్షేత్రస్థాయి కేడర్ సహకరించేలా పిలుపునివ్వాలని టీపీసీసీ యోచిస్తుండడం గమనార్హం.

'సన్న బియ్యం'తో సీఎం లంచ్

- లబ్ధిదారుడి ఇంట్లో నేలపై కూర్చుని భోజనం
- సంక్షేమ పథకాలపై ఆరా తీసిన వైనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తర్వాత సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. సీతారాముల వివాహ వేడుక ముగిశాక బూర్గంపాడు మండలం సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారుడైన బూరం శ్రీనివాస్ ఇంటికి సీఎం వెళ్లారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, సీఎస్ శాంతికుమారి నేలపై కూర్చుని స్టీలు ప్లేట్లలో భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై లబ్ధిదారుడి అభిప్రాయాలను సీఎం తెలుసుకున్నారు. బూరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అవసరమైన సాయం చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. అతని తల్లిదండ్రులకు పట్టువస్త్రాలు అందజేశారు. 'నవమి రోజున సాక్షాత్తూ శ్రీరాముడే తమ ఇంటికి వచ్చినట్టు ఉంది..'అని శ్రీనివాస్ కుటుంబీకులు ఈ సందర్భంగా తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఇదీ మెనూ..: ముఖ్యమంత్రి, ఇతర నేతల కోసం శ్రీనివాస్ కుటుంబీకులు పలు వంటకాలు సిద్ధం చేశారు. రేషన్‌షాపులో సరఫరా చేసిన సన్న బియ్యంతో అన్నం వండారు. పాయసం, పులిహోర, పాలకూర పప్పు, గోంగూర పచ్చడి, మునక్కాయ–దోసకాయ – టమాటా కూర, మజ్జిగ, పెరుగు వడ్డించారు. పానకం కూడా అందజేశారు.

వారంలో తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

- తుది దశకు చేరుకున్న అధిష్టానం కసరత్తు
- బీసీ నేతకే పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం
- మూడవ వారంలో జాతీయ అధ్యక్షుడి ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీజేపీ కొత్త రథ సారథి ఎవరు? అనే ఉత్కంఠకు మరో వారం రోజుల్లో తెర పడనుంది. ఈ అంశంపై అధిష్టానం ఇప్పటికే నేతల అభిప్రాయాలు సేకరించింది. పార్లమెంటు సమావేశాలు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియపై ఒక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అందరినీ సమన్వయపరుస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లే బీసీ నేతకే అధ్యక్ష పగ్గాలు అప్పగించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే 13 రాష్ట్రాలకు అధ్యక్షులను ప్రకటించింది. పార్టీ సిద్ధాంతం ప్రకారం 37 సంస్థాగత రాష్ట్రాలున్న బీజేపీ, మరో ఆరు రాష్ట్రాలకు అధ్యక్షులను ప్రకటించాలి. ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలి. ఈ నెల మూడో వారంలోగా జాతీయ అధ్యక్షుడిని కూడా ఎంపిక చేయాలని అధిష్టానం నిర్ణయించింది. ఈలోగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 12 లేదా 13న అధ్యక్షుడి పేరును ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

కాంగ్రెస్ దూకుడుకు బీసీ కార్డుతో చెక్

రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు, రఘునందన్‌రావు తదితరుల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సమయంలో బీజేపీ గెలిస్తే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత ఆ నినాదాన్ని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. తాజాగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టి, బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లుకు అసెంబ్లీ ఆమోదం పొందింది. బీసీ పోరు గర్జన పేరుతో ఢిల్లీ జంతర్‌మంతర్‌లో నిర్వహించిన సభకు సీఎం రేవంత్‌రెడ్డి సహా బీసీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పలు జాతీయ పార్టీల నేతలు హాజరై సంఘీభావం తెలిపారు. దీంతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారాయి. ఈ పరిణామాలను బీజేపీ అధిష్టానం సునిశితంగా పరిశీలిస్తోంది. గతంలో ఇచ్చిన బీసీ సీఎం హామీ సహా.. బీసీ నినాదాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో ప్రజాదరణ, అనుభవం, అందరినీ కలుపుకుపోయే తత్వం.. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే సామర్థ్యం ఉన్న బీసీ నేతకు రాష్ట్ర అధ్యక్ష పదవిని కట్టబెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. పార్లమెంటు సమావేశాల సమయంలో రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న కొందరు నేతలు ప్రధాని మోదీని కలిశారు. అయితే.. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో వారం రోజుల్లో తేలనుంది.

రహదారి ప్రాజెక్టులకు భూములివ్వండి

సీఎంకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్/ న్యూఢిల్లీ: రాష్ట్రంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి ప్రాజెక్టులకు తక్షణమే భూసేకరణ జరిపి కేంద్రప్రభుత్వానికి అప్పగించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటువరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,500 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే, 2014లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కొత్తగా 2,500 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులను నిర్మించామని తెలిపారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు కాకుండా రూ.12,619.27 కోట్ల అంచనా వ్యయంతో 691.52 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న 16 జాతీయ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి 1,550.529 హెక్టార్ల భూమి అవసరమని చెప్పారు. భూమి సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు, జాతీయ రహదారుల శాఖ అనేకసార్లు లేఖలు రాసినా ఇప్పటివరకు 904.097 హెక్టార్ల భూమిని మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ విషయంలో వ్యక్తిగత చొరవ తీసుకుని భూమిని సకాలంలో అందించి ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయటానికి సహకరించాలని కోరారు.

సీఎస్ఐఆర్ సంస్థలపై కేంద్రమంత్రి ప్రశంసలు

- ఔషధ ఆవిష్కరణ, జన్యు నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్న జితేంద్రసింగ్
- ఏప్రిల్ 22, 23 తేదీల్లో సీఎస్ఐఆర్ స్టార్టప్ కాంక్లేవ్ నిర్వహించాలని నిర్ణయం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్ సంస్థలు డ్రగ్స్ ఆవిష్కరణ, జన్యు నిర్ధారణ, తక్కువ ఖర్చుతో కూడుకున్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్ పదార్థాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు. హైదరాబాద్ ఆధారిత సీఎస్ఐఆర్ ల్యాబ్స్ శాస్త్రీయ పరిశోధనలను ఆదివారం కేంద్రమంత్రి సమీక్షించారు. హైదరాబాద్‌లోని మూడు ప్రధాన సీఎస్ఐఆర్ ల్యాబ్స్ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరిలు కేంద్రమంత్రితో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమీక్ష సందర్భంగా గ్రీన్‌వర్క్స్‌బయోతో కలిసి కంపోస్టబుల్ ప్లాస్టిక్‌ల అభివృద్ధితో సహా సీఎస్ఐఆర్–ఐఐసీటీ కీలక విజయాలను డాక్టర్ రెడ్డి హైలైట్ చేశారు. వైజ్ఞానిక పరిశోధనలు, ఆవిష్కరణలతో హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థగా ఆవిర్భవించిందని జితేంద్రసింగ్ పేర్కొన్నారు. ఈ మూడు సంస్థల సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌లో ఏప్రిల్ 22, 23 తేదీల్లో సీఎస్ఐఆర్ స్టార్టప్ కాన్‌క్లేవ్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

రేవంత్‌రెడ్డి రబ్బర్ స్టాంప్ ముఖ్యమంత్రి

- కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు



కరీంనగర్ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి రబ్బర్ స్టాంప్‌లా మారారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బండి సంజయ్ మొదట కరీంనగర్‌లోని తన నివాసంలో.. తరువాత పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తలతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మంత్రుల కమిటీతో సమీక్ష చేయడమేంటని ప్రశ్నించారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో కాంగ్రెస్ అధిష్టానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరుండాలి? ఎవరు వద్దు అనేదానిపై ముఖ్యమంత్రికి విచక్షణాధికారం ఉంటుందని, తెలంగాణలో పాలన భ్రష్టు పట్టిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని మండిపడ్డారు. కాగా, 45 ఏళ్లుగా బీజేపీ అనేక ఒడిదొడుకులు, అవమానాలను అధిగమించిందన్నారు. 16 రాష్ట్రాల్లో సొంతంగా.. 6 రాష్ట్రాల్లో కూటమి ద్వారా ప్రభుత్వాలను కొనసాగిస్తోందన్నారు. సన్న బియ్యం కోసం కేంద్రం కిలోకు రూ.37 ఖర్చు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం భరించేది కేవలం రూ.10 మాత్రమే అన్నారు. అలాంటప్పుడు రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫొటో ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు నుంచి బియ్యం వరకు ప్రతిపైసా కేంద్రమే చెల్లిస్తోందన్నారు.

బీజేపీకి ఒక్క చాన్స్ ఇవ్వండి

ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన చూశారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మణ్, కొండా తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీకి ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని ప్రజలను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కోరారు. ఇప్పటివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఒక్కసారి బీజేపీకి కూడా అవకాశం ఇస్తే పారదర్శక పాలన ఎలా ఉంటుందో చూపిస్తామని అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయటం.. భారతదేశ గౌరవాన్ని పెంచటం, అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టడమే బీజేపీ లక్ష్య మని పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్ముకున్న సాధారణ వ్యక్తి కుమారుడిని ఈ దేశానికి ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కిందని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మూడు దఫాలుగా అత్యంత సమర్థవంతమైన, పారదర్శక పాలనను బీజేపీ అందిస్తోందని తెలిపారు.

బీజేపీవైపు చూస్తున్న తెలంగాణ ప్రజలు

రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. అందుకే ప్రజలు బీజేపీవైపు చూస్తున్నారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో 77 లక్షల మంది తెలంగాణ ప్రజలు బీజేపీకి అండగా నిలిచారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2 స్థానాల్లో విజయం అందించారని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మజ్లిస్ ఆగడాలను అరికడతాం

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంను పెంచి పోషిస్తున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. జీహెచ్ఎంసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించేందుకు ఆ రెండు పార్టీలు పోటీపడుతున్నాయని ఆరోపించారు. మర్రి చెన్నారెడ్డిని సీఎం పదవి నుంచి దించేందుకు మజ్లిస్ హైదరాబాద్‌లో కల్లోలం సృష్టించిందని, తీగలగుట్ట వద్ద 400 మంది దళితులు, హిందువులపై హత్యాకాండకు ఒడిగట్టిందని ఆరోపించారు. మజ్లిస్ దౌర్జన్యాల వల్ల పాతబస్తీ నుంచి హిందువులు వలస పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మజ్లిస్ పార్టీ ఆగడాలను అడ్డుకుంటుందని ప్రకటించారు. 14వ తేదీ వరకు బీజేపీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, పార్టీ కార్యకర్తలు తమ ఇళ్లపై పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 14 నుంచి 22 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే.లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

మోదీ, అమిత్‌షా అనుమతి లేకుండా టిఫిన్ చేస్తావా?

- కేంద్ర మంత్రి చెప్పులు మోసిన చరిత్ర నీది
- బండి సంజయ్‌పై మహేశ్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో ఉనికి కోసమే కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. ఆయనకు పార్టీ అధ్యక్ష పదవి రాదని తెలిసి ఆగమాగమవుతున్నారని, పార్టీలో గుర్తింపు కోసం తాను కేంద్ర మంత్రినన్న విషయాన్ని కూడా మర్చిపోయి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మహేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'బండి సంజయ్.. ఖబడ్దార్. ఢిల్లీ పెద్దలకు భయపడి బీసీ సంఘాలు నిర్వహించిన ధర్నాకు నువ్వు రాలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కేంద్ర మంత్రి చెప్పులు మోసిన చరిత్ర నీది. సమష్టి నిర్ణయాలు తీసుకునే కాంగ్రెస్ పార్టీని, మా పార్టీ నేతలను నువ్వు విమర్శిస్తావా? అసలు మోదీ, అమిత్‌షాల అనుమతి లేకుండా నువ్వు టిఫిన్ చేస్తావా?'అని మహేశ్‌గౌడ్ ఘాటుగా ప్రశ్నించారు. నోటి కొచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తరహాలోనే హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌తో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని బీజేపీ పోటీ చేస్తోందని, రహస్య మిత్రుల వ్యవహారం మరోమారు బట్టబయలైందని మహేశ్ కుమార్‌గౌడ్ విమర్శించారు.



సత్యం కోసమే సత్యాన్ని ప్రేమించడం అనేది ఈ ప్రపంచంలో మానవ పరిపూర్ణతలో ప్రధాన భాగం. ఇదే అన్ని సుగుణాలకూ విత్తనాల మడి.
– జాన్ లాకి

సాక్షి

సోమవారం, 7 ఏప్రిల్ 2025

చెట్లు కుములుతున్న దృశ్యం

నగరం అప్పుడప్పుడే మేలుకుంటున్న వేళ డాబా మీదికి వెళ్ళి చూడండి: ఎప్పుడు మేలుకున్నాయో తెలియదు, ఎలా వచ్చాయో తెలియదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీద, చిన్న చిన్న మొక్కల మీద, ఎక్కడబడితే అక్కడ చిన్నాపెద్దా పక్షులు, రంగురంగుల బుల్లి బుల్లి పిట్టలు! అవి నిర్విరామంగా కిచకిచల ధ్వనులు చేస్తూనే ఉంటాయి. అవి వాటితో అవి మాట్లాడుకోవడం; ఒకరి ఉల్లాసాన్ని ఒకరు పంచుకోవడం; కొమ్మమీంచి కొమ్మకు, ఆకుమీంచి ఆకుకు గెంతుతాయి, మందారపుష్పాల మెత్తని కేసరకాండాన్ని పట్టుకుని ఊగుతాయి. అది వాటి క్రీడావినోదం. అది కూడా కాసేపే! ఉషఃకాలపు పిల్లగాలులు చల్లచల్లగా వీస్తున్నప్పుడు, సూర్యుడు పూర్తిగా పొడుచుకు రానప్పుడు, పరిసరాలు వేడెక్కనప్పుడు, మరీముఖ్యంగా మానవ సంచారం మొదలవనప్పుడు! ఆ తర్వాత అవి అదృశ్యం! ఎక్కడికెడతాయో తెలియదు, రోజంతా ఎక్కడుంటాయో తెలియదు!

వాటి గురించి ఎప్పుడైనా క్షణకాలం ఆలోచించి చూడండి, అప్పుడేమనిపిస్తుంది? బహుశా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మానవ ధూర్తరాష్ట్రులతో ఆడిన జూదంలో ఓడిపోయి జనారణ్యంగా మారిన తమదైన అరణ్యంలోనే అజ్ఞాతవాసం చేస్తున్న పాండవుల అనంత సంతతి కాదుకదా అనిపిస్తుంది. అవి రోజూ పొద్దుటే కాసేపు తమ కొమ్మల మీద, తమ ఆకుల మధ్య ఇంద్రధనువుల్ని ఆవిష్కరిస్తూ కోలాహలంగా తిరుగుతూ ఉంటే ఆ చెట్లకెంత సంబరం! ఆ చెట్లూ, పిట్టలూ ప్రకృతి చరిత్ర పుటల్లోని తమ గురించిన అధ్యాయాలను మనిషి నిర్దాక్షిణ్యంగా చెరిపేసి పూర్తిగా సొంత అధ్యాయాలతో నింపేసుకున్న తర్వాత, కేవలం ప్రాచీన స్మృతులుగా మారిన తమ అనుబంధం గురించిన ఊసులు ఆ కాసేపూ నెమరేసుకుంటాయి కాబోలు! పక్షులతో పోల్చితే చెట్ల పరిస్థితి మరీ ఘోరం. అవి ఎగరనూ లేవు, ఆపైన వాటివి భారీకాయాలు కనుక అజ్ఞాతవాసయోగం కూడా వాటికి లేదు. తమ కొమ్మల మీద, తమ వేళ్ళ మీద మనిషి గొడ్డలి వేటు ఏ క్షణంలో పడుతుందో నన్న నిత్యభయగ్రస్త జీవితాన్ని నిలువు కాళ్ళమీద గడపక తప్పదు.

చెట్లు కూలుతున్న దృశ్యం గురించి, రాక్షసుని వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరం గురించి, నగరంలో మనిషి కంటక శరీరుడిగా మారడం గురించి, సర్వత్రా వినిపించే కఠోర శబ్దాలు, ధ్వంసక్రీడ, దగ్ధక్రీడల గురించి, పూల చెట్లు విలపించడం గురించి, నిద్రలో నడుస్తున్న మనిషి నెత్తుటి మడుగును దాటలేడని చెప్పి అవి శపించడం గురించి– కవి అజంతా రాస్తాడు. అవును, నిజమే, నిద్రలో నడుస్తున్న మనిషి ప్రకృతిలోని సమస్త జీవజాలం మనుగడనూ నెత్తుటి మడుగు చేశాడు, తను సృష్టించిన ఆ మడుగును తను కూడా దాటలేని పరిస్థితిని తెచ్చుకుంటూనే ఉన్నాడు. ఒకప్పుడంతా అడవేనన్న సంగతి మరచిపోయి, నగరమే నిత్యమూ, సత్యమనే భ్రమలో పడిపోయాడు. చెట్లను కూల్చడం, వాటిని ఆశ్రయించుకున్న జీవజాలానికి నిలువనీడ లేకుండా చేయడమే అభివృద్ధి అని నిర్వచించుకుంటున్నాడు. తను కూడా భాగమైన ప్రకృతికి దూరమై ఒంటరివాడై పోతున్నాడు. అంతా తన ప్రయోజకత్వం, తానే భువికధినాథుడినని విర్రవీగుతున్నాడు.

తను నెత్తిన మోసే తన పౌరాణిక, ఇతిహాస వారసత్వం నుంచి కూడా మనిషి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఎగిరే పర్వతాల గురించి, మానవరూపం ధరించి మాట్లాడే నదుల గురించి, మాట్లాడే పక్షులు, జంతువుల గురించి అవి చెబుతాయి. అది, నువ్వు కూడా ప్రకృతిలో భాగమే సుమా అని గుర్తుచేయడం; ప్రకృతిలో ఏ జీవీ ఎక్కువా కాదు, తక్కువా కాదు, అన్నింటికీ జీవించే హక్కు ఉందని చెప్పడం! అడవులకు, అక్కడి సమస్త ప్రాణులకు రక్షణ కల్పించవలసిన అవసరం గురించి అర్థశాస్త్రం చెబుతుంది; అడవులూ, వాటిని ఆశ్రయించుకుని బతికే జీవులూ రాజ్యంలో భాగం కాని, స్వతంత్ర అస్తిత్వాలన్న సంగతిని ఆనాటి రాజుల వివేకం చెబుతుంది. ప్రాకృతికమైన పూర్తి అవగాహనతో పూర్వులు గీసిన ఈ లక్ష్మణ రేఖలన్నీ ఏమైపోయాయి? అడవిపై విచక్షణా రహితమైన రాజ్యపు రాబందు రెక్క పరచిందెవరు?!

సమకాలీన శాస్త్రవిజ్ఞాన పాఠాలు కూడా మనిషి తలకెక్కడం లేదు; ఈ విశ్వమూ, భూమీ, అందులోని ప్రకృతీ తమవైన ప్రణాళికను, తమవైన కేలండర్‌ను అనుసరిస్తాయనీ, మనిషి ప్రణాళికలనూ, కేలండర్‌నూ అవి ఏ క్షణంలోనైనా కుప్పకూల్చగలవనే ఎరుక లేదు. వందల కోట్ల సంవత్సరాల భూమి చరిత్రలో ఎన్నో మంచుయుగాలు దొర్లాయి. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటాలు జీవి మనుగడను ఎన్నో మలుపులు తిప్పాయి. ఎంతో చరిత్రను తిరగరాశాయి. జీవపరిణామం ఎన్నో మార్పులు చెందింది. మానవ పరిణామంలో ఇప్పుడు చూస్తున్నదే తుది అంకం కాదు, మరిన్ని అంకాలకు అవకాశముందని జన్యుశాస్త్రజ్ఞులు హెచ్చరిక. మరి జంతువులు సహా ఇతర జీవజాలం సంగతేమిటి? మనిషిలోలానే వాటిలో కూడా ఏదైనా ఉత్పరివర్తన జరిగి అవి మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే?!

అది ప్రస్తుతానికి విపరీత ఊహలా అనిపించవచ్చు, కానీ ప్రకృతి గర్భంలో ఏ రహస్యాలు దాగున్నాయో ఎవరికి తెలుసు? కనుక మనిషి నేర్చుకోవలసింది వినమ్రత! ప్రకృతిపట్లా, అందులోని చరాచరాలన్నిటిపట్లా సమభావం, సమరసభావం!! పగబట్టి తిరగబడే ప్రకృతి ముందు తను పిపీలకమన్న ఆత్మజ్ఞానం!!

కఠిన వాస్తవాలను దాచేస్తారా?

కామెంట్

కరణ్ థాపర్

ఆమె పేరు సూచిస్తున్నట్టుగానే సంధ్యా సూరి భారత సంతతికి చెందిన ఫిల్మ్ మేకర్. ఆమె దర్శకత్వం వహించిన 'సంతోష్' సినిమా గత ఏడాది యూకే తరఫున అధికారిక ఎంట్రీగా ఆస్కార్స్‌కు వెళ్లింది. కాన్ (ఫ్రాన్స్) చిత్రోత్సవంలో విశేష మన్ననలు అందుకుంది. 'బాఫ్టా' (బిఏఎఫ్‌టీఏ– ద బ్రిటిష్ అకాడెమీ ఆఫ్ ఫిలిం అండ్ టెలివిజన్ ఆర్ట్స్)కు నామినేట్ అయ్యింది. ఇందులో నటించిన షహానా గోస్వామి ఏసియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో ఉత్తమ నటి అవార్డు గెలుచుకున్నారు. ఇంత ఖ్యాతి గడించినప్పటికీ, కోట్లాది మంది భారతీయులు మాత్రం ఈ సినిమాను ఎప్పటికీ చూడలేరు. సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ– సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్) దీనికి దారుణమైన కత్తెరలు వేసింది. వాటికి అంగీకరిస్తేనే భారత్‌లో ప్రదర్శనకు అనుమతి ఇస్తామని చెప్పడంతో, సంధ్యా సూరి సహజంగానే అందుకు నిరాకరించారు.

పూర్తిగా భారత్‌లోనే నిర్మించిన, భారతీయ నటీనటులతోనే చిత్రీకరించిన, అదీ హిందీలో తీసిన చిత్రం ఇది. ఒక్క మాటలో చెప్పాలంటే పూర్తి భారతీయ చిత్రం. కానీ భారతీయులమైన మనం దీన్ని వీక్షించలేక పోవడం మన దౌర్భాగ్యం. ఎందుకంటే, మనం కాదనలేని ఒక సత్యాన్ని ఇది ఆవిష్కరించింది. దాన్ని మనకు తెలియకుండా దాచి ఉంచగలనని సెన్సార్ బోర్డు అనుకుంటోంది. నేను ప్రస్తావిస్తున్న ఈ సత్యం పోలీసుల కర్కశత్వం, వారు పెట్టే చిత్రహింసల గురించి!



వివాదాస్పద చిత్రం 'సంతోష్'లో షహానా గోస్వామి

ఈ సినిమా నేను చూశాను. ఇది అంతులేని బాధ కలిగిస్తుంది. మనసును విపరీతంగా కలవరపెడుతుంది. ఉత్తర భారత గ్రామీణ ప్రాంతాల్లో సాగే పోలీసుల దాష్టీకానికి ఇది వాస్తవ చిత్రీకరణ. అమాయక ప్రజలను పోలీసులు ఎలా టార్చర్ పెట్టగలరో, దళితులు, ముస్లింలు వారి చేతిలో ఎన్ని దుర్మార్గాలకు గురవుతున్నారో, మానభంగాలను ఏ విధంగా వారు వెనకేసుకొస్తారో, సాధారణ ప్రజానీకాన్ని ఎంతగా భయభ్రాంతులకు గురిచేస్తారో ఈ సినిమా కళ్లకు కడుతుంది. పుట్టుక, సంపద, పలుకుబడి... ఈ మూడింటిలో ఏ బలమూ లేకుండా పోలీసులతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ ఇది సత్యమని, ఇదే వాస్తవమని తెలుసు. ఈ యథార్థం వారికి ఆశ్చర్యం కలిగించదు, వారిని దిగ్భ్రాంతికి అసలు గురి చేయదు. ఎందుకంటే వారికి పోలీసుల వైఖరి నిత్యజీవిత అనుభవం. కానీ సెన్సార్ బోర్డు దీన్ని సమ్మతించడానికి ఇష్టపడటం లేదు. గుర్తించడానికి అంగీకరించడం లేదు.

పోలీసుల హింస, జవాబుదారీతనం లేకపోవడం గురించి 'పోలీస్ టార్చర్ అండ్ (అన్) అకౌంటబిలిటీ' పేరుతో 'కామన్ కాజ్', 'లోక్‌నీతి సీఎస్‌డీఎస్'లు ఇటీవలే సంయుక్తంగా ప్రచురించిన ఒక నివేదిక ఈ సినిమా వాస్తవికతను ధ్రువీకరిస్తోంది. 17 రాష్ట్రాల్లో 8,000 మందికి పైగా పోలీసులను ఈ సంస్థలు సర్వే చేశాయి. వారిలో రమారమి 30 శాతం మంది చిత్రహింసలను సమర్థించారు. ప్రమాదకరమైన నేరగాళ్లను విచారణ ముగిసే వరకూ వేచిచూడకుండా చంపేయడమే మెరుగు అని దరిదాపు 25 శాతం మంది తేల్చి చెప్పారు. ప్రజల్లో భయం ఉండాలంటే కఠిన పద్ధతులు అవలంబించాల్సిందే అంటూ 20 శాతం మంది వెల్లడించారు. ముస్లింలు నేరప్రవృత్తికి లోనయ్యే అవకాశం ఉందని 50 శాతం మంది చెప్పడం ఆశ్చర్యకరం. ఇక, 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్' (ఎస్‌ఓపీ)ను పాటించడం ఎప్పుడో తప్ప జరగదని 40 శాతం కంటే ఎక్కువ మందే అంగీకరించారు. అందుకే కాబోలు... కేవలం 33 శాతం మంది భారతీయులే పోలీసులను విశ్వసిస్తారని 'ఇప్సాస్' సర్వే (యూకే) నిర్ధారించింది. వీటిలో ఏదీ మనకు ఆశ్చర్యం కలిగించదు. ఎవరూ చెప్పనవసరం లేకుండానే ఇవన్నీ నిజాలేనని మనకు సహజంగానే తెలుసు.

పోలీసుల దాష్టీకాన్ని వెల్లడించే అధ్యయనాలకు కొరత లేదు. 'నేషనల్ క్యాంపేన్ ఎగైనెస్ట్ టార్చర్' వార్షిక నివేదిక (2019) ప్రకారం, ఆ ఏడాది 1,723 కస్టడీ చావులు వెలుగు చూశాయి. అంటే పోలీసు కస్టడీలో రోజుకు అయిదుగురు ప్రాణాలు విడిచారు. ఈ అధ్యయ నాలు బట్టబయలు చేసిన వాస్తవాలకే 'సంతోష్' సినిమా కర్కశ, వాస్తవిక దృశ్యరూపం ఇచ్చింది. అయినా సరే, భారతీయులు ఈ సినిమా ఎప్పటికీ చూడలేరు. ఏదైనా అద్భుతం జరిగి సెన్సార్ బోర్డు మనసు మారితే తప్ప!

ముచ్చటైన విషయం ఏమిటంటే, ఇండియాలో చిత్రీకరణ కోసం అనుమతి కోరుతూ సంధ్యా సూరి తన సినిమా స్క్రిప్టును అధికా రులకు సమర్పించినప్పుడు ఎలాంటి అభ్యంతరాలూ వ్యక్తం కాలేదు. 'గార్డియన్' వార్తాపత్రికకు ఆమె ఇదే చెప్పారు. 'ఇప్పుడు చాంతాడు పొడవన్ని కట్స్ జాబితా ఇచ్చారు. ఈ సెన్సార్ కోత లన్నీ కలిపి పేజీలకు పేజీలు ఉన్నాయి'. వాటికి అంగీకరించడం 'అసాధ్యం'. ఎందుకంటే, సినిమా 'విజన్' పూర్తిగా దెబ్బతింటుందని ఆమె వాపోయారు.

నేను ఈ సినిమా చూసిన ప్రభావంతో చెబుతున్నాను. ఇది తప్పనిసరిగా చూడాల్సినది. బాలీవుడ్ సినిమాల్లో కూడా పోలీసు జులుం తరచూ కనబడుతూనే ఉంటుంది. అయితే, అది మృదువుగా, ప్రభావ శూన్యంగా ఉంటుంది. సానుకూల కోణం కూడా సమాంతరంగా నడుస్తుంది. కానీ 'సంతోష్' అలాకాదు. అందులో ఎలాంటి చక్కెర పూతా ఉండదు. కర్కశమైన, ఉపశమన రహితమైన వాస్తవికతను చూపిస్తుంది. చూడటం ఇబ్బందిగానే ఉంటుంది. కానీ వాస్తవాన్ని చూడకుండా మనం ఎలా కళ్లు మూసుకుంటాం? అది తగిన పని కాదు.

అయినా మనం సత్యాన్ని తిరస్కరిస్తూనే పోతున్నాం. 'సంతోష్' అలాంటి తిరస్కారాల జాబితాలో తాజాగా చేరింది. చిత్రహింసలకు వ్యతిరేకంగా రూపొందించిన ఐక్యరాజ్య సమితి ఒప్పందం (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైనెస్ట్ టార్చర్)పై సంతకం చేయని అతి కొద్ది దేశాల్లో ఇండియా ఒకటి. అలా ఆమోదించకపోవడానికి... కస్టడీ హింసను నిరోధించే సొంత చట్టం ఏమైనా ఉందా అంటే అదీ లేదు. నిజానికి ఇవి మనం ఎప్పుడూ చర్చించని యథార్థాలు. ఎప్పుడైనా ప్రస్తావన వచ్చినా, ఆ వెంటనే మర్చిపోతాం.

ఒకవేళ 'సంతోష్'ను మనం చూడడం జరిగితే... ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించే అవకాశం అది ఇస్తుంది. ఈ దారుణాలు ఎందుకు అనుమతిస్తున్నారు? ఇది ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? అని నిలదీస్తాం. బహుశా అందుకే సెన్సార్ బోర్డు మనం ఎప్పటికీ ఈ సినిమా చూడకుండా జాగ్రత్త పడింది.

సత్యమేవ జయతే!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

- ఉత్తర భారత గ్రామీణ ప్రాంతాల్లో సాగే పోలీసుల దాష్టీకాన్ని ఎలాంటి చక్కెర పూత లేకుండా అత్యంత వాస్తవికంగా చూపిన సినిమా 'సంతోష్'.
- 'కామన్ కాజ్', 'లోక్‌నీతి సీఎస్‌డీఎస్'లు వెల్లడించిన ఒక సర్వే ప్రకారం, 17 రాష్ట్రాల్లోని సుమారు 30 శాతం మంది పోలీసులు ఇలాంటి చిత్రహింసలను సమర్థిస్తున్నారు.
- చేంతాడు పొడవు కత్తిరింపులకు అంగీకరిస్తేనే భారత్‌లో ప్రదర్శనకు అనుమతి ఇస్తామని సెన్సార్ బోర్డు చెప్పడంతో సినిమా విజన్ దెబ్బతింటుందని సహజంగానే దర్శకురాలు సంధ్యా సూరి నిరాకరించారు.



భారత సంతతి దర్శకురాలు సంధ్యా సూరి

సోషల్ మీడియా

ఇంత చేసినా...

ఇండియాపై సుంకాల విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరించినట్లే! ఎందుకంటే... మన దేశం ఒక్కటే వాణిజ్య లోటును పూరించడానికి 15 బిలియన్ డాలర్ల శక్తి వనరులను దిగుమతి చేసుకోవడానికీ, శాంతియుత అణు సరఫరా విషయంలో సున్నా సుంకంతో లయబిలిటీ క్లాజ్‌ను (బాధ్యత వహించే షరతు) పలుచన చేయడానికీ గట్టి వాగ్దానం చేసింది. అయినప్పటికీ ప్రతిసుంకాల పట్టుదలతో ట్రంప్ వీటిని విస్మరించారు.
– ఎం.కె. వేణు, సంపాదకుడు

ఇంకో కోణంలో...

ట్రంప్ సుంకాలు గ్లోబల్ సౌత్ దేశాలకు కొత్త అవకాశాన్ని ఇస్తాయి. సామ్రాజ్యవాద దేశాల ఎగుమతుల కోసం చేసే ఉత్పత్తులను మానవీయ అవసరాల కోసం మరలించుకునే, జాతీయ అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే వీలును కల్పిస్తాయి.
– జాసన్ హికెల్, సీనియర్ ఫెలో

మళ్లీ తైవాన్ వైపు...

హోండురస్ (మధ్య అమెరికా దేశం) తిరిగి తైవాన్ మార్కెట్‌లోకి ప్రవేశించాలని చూస్తోంది. 2023 మార్చ్‌లో చైనాకు అనుకూలంగా అది తైవాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది. ఇరుదేశాలకు లాభించేలా చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కాస్తా చైనా తన సరుకులను కుమ్మరించేలా చేసింది. పైగా చైనా వాగ్దానం చేసినట్టుగా హోండురస్ నుంచి తెల్ల రొయ్యలను కొనలేదు. ఇది తీవ్రమైన వాణిజ్య అసమతౌల్యానికి దారితీసింది.
– యూసుఫ్ ఉంఝూవాలా, వ్యాఖ్యాత

అధికారంలో ఉండాలంటే...

ఇస్లామో ఫాసిస్ట్ మహమ్మద్ యూనుస్‌కు అరకాన్ సైన్యం (మయన్మార్)తో యుద్ధం కావాలి. అప్పుడే ఆయన ఏళ్లకు ఏళ్లు ఎన్నికలు జరపకుండా బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉండొచ్చు.
– సలాహ్ ఉద్దీన్ షోయబ్ చౌధురీ, బంగ్లాదేశ్ సంపాదకుడు

దేనికి సంబరం?

అఫ్గాన్ శరణార్థుల బలవంతపు తరలింపునకు సంబర పడుతున్న పాకిస్తానీయులు గుర్తించాల్సింది ఏమంటే, మనం కల్పించడానికి సాయపడ్డ యుద్ధం వల్లే వాళ్లు తమ దేశాన్ని వదిలారు. పాకిస్తాన్‌లో దశాబ్దాలుగా ఉంటూ అత్యంత చిన్న పనులు చేసుకుంటూ బతుకీడుస్తున్నారు. వాళ్ల పరిస్థితికి మీరు కూడా ఎంత దగ్గరగా ఉన్నారో ఆలోచించండి.
– నిదా కిర్మానీ, సోషియాలజిస్ట్

ఇన్ బాక్స్

చర్చలు జరపాలి

ప్రభుత్వం మావోయిస్టులపై జరుపుతున్న యుద్ధాన్ని, మారణకాండను చర్చల ఆధారంగా ముగించాల్సిన సమయం ఆసన్నమైంది! వచ్చే ఏడాది ప్రారంభం నాటికి మావోయిస్టు ముప్పును నిర్మూలిస్తామని మోదీ ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తోంది. ప్రస్తుతం 400 మంది సాయుధ కేడర్ మాత్రమే మిగిలి ఉన్నారని, ఎక్కువ భాగం ఆయుధాలు మావోయిస్టుల నుండి స్వాధీనం చేసుకున్నామని కూడా చెబుతున్నారు. ఇదే వాస్తవమైతే మావోయిస్టుల వలన ప్రభుత్వానికి వచ్చే నష్టం, శాంతి భద్రతల సమస్య ఏమీ లేదు. అయినా ఎన్‌కౌంటర్లు కొనసాగుతూనే ఉన్నాయి.

ఈ సందర్భంలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కాల్పుల విరమణ సంభాషణకు సీపీఐ(మావోయిస్ట్) సంసిద్ధత వ్యక్తం చేయటం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. దాన్ని సులభతరంచేయడానికి, చర్చల కాలంలో యుద్ధాన్ని నిలిపివేయాలని మావోయిస్టులు కోరారు. అయితే, మావోయిస్టులు ఎటువంటి షరతులు ముందుకు తేకపోతేనే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం చర్చలకు వెళుతుందని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి అన్నారు. చర్చలలో మావోయిస్టు సమస్యకు తగిన పరిష్కారం చూపి అమాయక ఆదివాసీల జీవనం సాఫీ అయ్యేలా ప్రభుత్వం వ్యవహరించాలి.

– మన్నవ హరిప్రసాద్
సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్, పొలిట్ బ్యూరో సభ్యుడు

ఏఐలో మనం మేటి కావాలంటే...

విశ్లేషణ

అనిరుధ్ సూరి

కొత్త సంవత్సరం మొదలై మూడు నెలలే అయింది కానీ... కృత్రిమ మేధ రంగంలో ఈ స్వల్ప అవధిలోనే పలు సంచలనాలు చోటు చేసుకున్నాయి. జనవరిలో విడుదలైన డీప్‌సీక్ ఆర్–1 ఒకటైతే... ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన అంతర్జాతీయ ఏఐ సదస్సు ఇంకోటి. ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్‌లు సంయుక్తంగా అధ్యక్షత వహించిన ఈ సదస్సులోనే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఏఐ తీసుకురాగల రాజకీయ, భద్రతాపరమైన సవాళ్లను ప్రపంచం ముందుంచారు. చివరగా మోదీ తాజా అమెరికా పర్యటనలో ఇరు దేశాల మధ్య ఏఐ వంటి కీలక రంగాల్లో సహకారానికి సంబంధించి ఒప్పందం కుదిరింది. ఏఐ రంగం నేతృత్వాన్ని ఆశిస్తున్న భారత్‌పై ఈ పరిణామాల ప్రభావం ఏమిటి?

డీప్‌సీక్ ఆర్–1 సంచలనం తరువాత భారత్‌లో నడుస్తున్న చర్చ ఏమిటీ అంటే... మనదైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) ఒకటి తయారు చేసుకోవాలని. ఇందుకు అవసరమైన ఏఐ చిప్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని! మరోవైపు ప్రభుత్వం కూడా సొంత ఎల్ఎల్ఎం అభివృద్ధిపై ప్రకటన చేసింది. కొన్ని నెలల వ్యవధిలోనే ఇది అందుబాటులోకి వస్తుందని చెప్పింది. నేషనల్ ఏఐ మిషన్ స్టార్టప్‌లు, పరిశోధకుల కోసం పది వేల జీపీయూలు అందుబాటులోకి తెచ్చినట్లు వివరించింది. అంతేకాకుండా... ఎల్ఎల్ఎంలతోపాటు స్మాల్ లాంగ్వేజ్ మోడళ్లు, ప్రాథమికమైన ఏఐ మోడళ్ల తయారీకి పిలుపునిచ్చింది.

ఈ చర్యలన్నీ ఆహ్వానించదగ్గవే అయినప్పటికీ... ఇవి మాత్రమే సరిపోవు. డీప్‌సీక్ విజయవంతమైన నేపథ్యంలో చేపట్టాల్సిన పనుల ప్రాథమ్యాల్లోనూ ఇవి లేవనే చెప్పాలి. అతి తక్కువ ఖర్చు, శిక్షణలతోనే అద్భుతమైన ఎల్ఎల్ఎంను రూపొందించవచ్చునని డీప్‌సీక్ ఇప్పటికే రుజువు చేసింది. చౌక ఆవిష్కరణలకు పేరుపొందిన భారత్‌కు ఇది ఎంతో సంతోషించదగ్గ సమాచారం. అయితే దీనర్థం సొంత ఎల్ఎల్ఎం అభివృద్ధే ఏఐ ఆధిపత్యానికి తొలి అడుగు అని కాదు. అమెరికా, ఇతర దేశాల ఎల్ఎల్ఎంలకు, డీప్‌సీక్‌కు ఉన్న ప్రధానమైన తేడా ఏమిటంటే... శిక్షణకు సంబంధించి భిన్నవైఖరి తీసుకోవడం! ఈ వైఖరి కారణంగానే దాని శిక్షణకు అయిన ఖర్చు చాలా తక్కువగా ఉంది.

భారత్‌లోని టెక్నాలజీ నిపుణులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు స్థూలంగా మూడు. ఏఐలో సృజనను పెంచే అన్ని ప్రాథమిక అంశాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వండి. ఇందుకు ఏఐలో అత్యున్నత నైపుణ్యం కలిగిన వారు అవసరం. అలాగే మనదైన డేటా సెట్లు, రేపటి తరం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ దృష్టికోణం కావాల్సి వస్తాయి. ప్రస్తుతం భారత్‌లో అత్యున్నత స్థాయి ఏఐ నైపుణ్యం లేదు. భారతీయ మూలాలున్న ఏఐ నిపుణులు దురదృష్టవశాత్తూ సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్నారు. పెర్‌ప్లెక్సిటీ ఏఐ సృష్టికర్త అరవింద్ శ్రీనివాస్ భారత్‌లో చేపట్టే ఏఐ కార్యకలాపాలకు నిధులు సమకూర్చేందుకు సిద్ధమని అంటున్నాడే కానీ... ఇక్కడకు వచ్చేందుకు మాత్రం ఇష్టపడటం లేదు.



అమెరికాలో పెర్‌ప్లెక్సిటీ ఏఐ బాగా పాపులర్ కాబట్టి ఈ నిర్ణయం సరైందే అనిపిస్తుంది. కానీ ఏఐ విషయంలో భారత్ నుంచి మేధా వలసను అరికట్టేందుకు ఏదైనా చేయాల్సిన అవసరాన్ని కూడా చెబుతోంది ఇది. దేశంలోని టెక్నాలజీ రంగాన్ని సమర్థంగా వినియోగించుకునేందుకు తగిన వ్యూహం కూడా కావాలిప్పుడు! యూపీఐ లాంటి వ్యవస్థల ద్వారా భారత్‌కు సంబంధించిన డేటా పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నా వీటి ఆధారంగా డేటాసెట్లను ఇప్పటివరకూ ఏఐ స్టార్టప్‌లు తయారు చేయలేకపోయాయి. ఇలాంటివే అనేక డేటాసెట్లు వేర్వేరు చోట్ల పడి మూలుగుతున్నాయి. వీటన్నింటినీ ఉపయోగించడం ఎలాగో చూడాలి. అలాగే భారతీయ ఆర్ అండ్ డీ (పరిశోధన–అభివృద్ధి) రంగానికి కూడా భారీ ప్రోత్సాహకం అవసరం. మోదీ ఆ మధ్య అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, అమెరికాకు చెందిన నేషనల్ సైన్స్ ఫౌండేషన్ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అలాగే ఏఐలో పరిశోధనలకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వంతోపాటు, ప్రైవేట్ రంగం కూడా పెట్టుబడులు పెట్టేలా చేయాలి. ఇవన్నీ చేయడం ద్వారా మాత్రమే సుశిక్షితమైన ఎల్ఎల్ఎం లేదా ఇంకో వినూత్న ఏఐ ఉత్పత్తి ఆవిష్కృతమవుతుంది. ఇలా చేయడం ద్వారా భారత్ ప్రపంచస్థాయిలో తనదైన గుర్తింపు పొందగలుగుతుంది.

రెండో విషయం... ఏఐలో వినూత్న ఆవిష్కరణల కోసం ఓపెన్ సోర్స్ పద్ధతిని అవలంబించడం మేలు. డీప్‌సీక్–ఆర్1, మిస్ట్రల్ వంటివి అన్నీ ఓపెన్ సోర్స్ పద్ధతిలో అభివృద్ధి చేసినవే. ఇలాంటివి మేలా? ఛాట్ జీపీటీ వంటి క్లోజ్డ్ సోర్స్ ఎల్ఎల్ఎంలు మేలా అన్న చర్చ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా నడుస్తోంది. ఫ్రాన్స్‌కు చెందిన మిస్ట్రల్, యూఎస్ కంపెనీ మెటా, చైనా కంపెనీ డీప్ సీక్‌లు ఓపెన్ సోర్స్ బాట పట్టాయి. భారత్ కూడా ఇదే పద్ధతిని ఎంచుకోవాలి. ఓపెన్ సోర్స్ ద్వారా భారతీయ స్టార్టప్ కంపెనీలు, పరిశోధకులు మెరుగ్గా పోటీపడగలరు. అదే క్లోజ్డ్ సోర్స్ అనుకోండి... విదేశీ ఏఐలపై ఆధారపడటం మరింత ఎక్కువ అవుతుంది. ఓపెన్ సోర్స్ బాట పట్టేందుకు యూరప్‌తో పాటు దక్షిణదేశాలు సిద్ధంగా ఉన్నాయి కాబట్టి భారత్ అందరికీ మేలు చేసేలా ఆ యా దేశాలతో ఏర్పాటు చేసుకోవడం మంచిది.

మూడో అంశం... ఏఐలో పోటీతత్వాన్ని పెంచేందుకు భారత్ తక్షణం ప్రయత్నాలు మొదలుపెట్టాలి. అంతర్జాతీయ స్థాయిలో ఏఐ నుంచి రక్షణ ఎలా అన్న అంశంపై ప్రస్తుతానికి అంత దృష్టి పెట్టాల్సిన అవసరం లేదు. ప్యారిస్ సదస్సులో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఏఐపై అమెరికా వైఖరి ఏమిటన్నది సుస్పష్టంగా చెప్పారు. ఈ రంగంలో చైనా పైస్థాయిలో ఉంది కాబట్టి... అమెరికా కూడా ఎలాగైనా ఈ రేసులో తనది పైచేయి అనిపించుకోవాలని చూస్తోంది. ఈ పోటీలో భారత్ కూడా తనదైన ప్రత్యేకతను నిరూపించుకోవాలి. ఎప్పటికప్పుడు మారిపోతున్న ఈ పోటీ తీరుతెన్నులను ఒడిసిపట్టుకోకపోతే కష్టమే. అందుకే ఏఐ నైపుణ్యాలను పెంచేందుకు, ఏఐ ఆర్ అండ్ డీకి సంబంధించి ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీల వాడకానికి తగిన వ్యూహం రూపొందించాలి. యూపీఐ వంటి భారత్‌కు మాత్రమే ప్రత్యేకమైన డేటా సాయంతో ఏఐ రంగంలో సృజనకు వీలుకల్పించే వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రపంచం ఏఐ ఆటలో మనల్ని గుర్తించగలదు.

వ్యాసకర్త ఇండియా ఇంటర్నెట్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్

గురు భక్తి

శ్రీరాముని యువ రాజ్యాభిషేకం నిర్ణయమైన తర్వాత, రఘు వంశీకుల ఆచార్యులు వశిష్ఠుడు ఈ విషయం తెలియజేయటానికి రాముని మందిరానికి వెళతాడు.

శ్రీరాముడు తన గురువు స్వయంగా వచ్చారని తెలిసి, ఎదురు వెళ్లి చేతులు జోడించి, ఆహ్వానించి, భక్తితో ప్రణామం చేశాడు. జానకి బంగారు పాత్రలో స్వచ్ఛ జలం తీసుకురాగా... రాముడు వశిష్ఠుని రత్న సింహాసనంపై ఆసీనుని చేసి, గురు పాదాలను శ్రద్ధా భక్తులతో కడిగాడు. సీతతో సహా ఆ పవిత్ర జలాన్ని శిరసున ధరించి, 'మీ పాద తీర్థం శిరసున ధరించటం వలన ధన్యులమయ్యాము' అంటాడు.

జ్యోతిర్మయం

అప్పుడు వశిష్ఠుడు, 'రామా! నీ పాద తీర్థం శిరసున దాల్చి పార్వతీ పతి శంకరుడు ధన్యుడయ్యాడు. బ్రహ్మ నీ పాద తీర్థం సేవించే పాపాలను తొలగించుకున్నాడు. ఈ రోజు కేవలం గురువుతో ఒక శిష్యుడు ఎలా వ్యవహరించాలో తెలపటానికే నువ్వు ఈ విధంగా చేశావు. నువ్వు, సాక్షాత్తూ లక్ష్మీదేవితో కలిసి భూమిపై అవతరించిన విష్ణువు వని, రావణ సంహారానికే రాముడుగా వచ్చావని నాకు తెలుసు. నీవు మాయా మానుష రూపంతో అన్ని కార్యాలూ చేస్తున్నావు. అందుకు నీవు శిష్యుడవు, నేను గురువుననే సంబంధానికి అనుకూలంగా నేనూ వ్యవహరిస్తాను' అంటాడు.

శ్రీరాముడు స్వయంగా అంతర్యామి. గురువులకు గురువు. ఆయనకు గురు సేవ ఎందుకు? అంటే, లోకోపకారానికే! లోక కల్యాణానికే! గురువు పట్ల ఎలాంటి వినయ విధేయతలుకలిగి ఉండాలో, ఎంత శ్రద్ధా భక్తులతో సేవించాలో తెలపటానికే శ్రీరాముడు ఆ విధంగా వ్యవహరించాడు.

త్రేతా యుగంలోనే కాదు, ద్వాపర యుగంలోనే కాదు, ఏ కాలంలోనైనా గురువుల పట్ల శ్రద్ధా భక్తులు, వినయ విధేయతలు కలిగి ఉంటే అటువంటి శిష్యులకు అసాధ్యమైనది ఏదీ ఉండదని గురు చరిత్రలు, గురు శిష్య సంబంధ పురాణ కథలు వ్యక్తం చేస్తున్నాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

సవరణ: ఏప్రిల్ 6, ఆదివారం నాటి సంచికలోని సంపాదకీయ పేజీలో 'వారి దయ, జనం ప్రాప్తం... అదే పీ–ఫోర్' వ్యాసంలో పొరపాటు దొర్లింది. ''2001 జూలై– 2002 జూన్ మధ్యకాలంలోని ఏపీ రైతుల సగటు రుణభారం'' అన్న వాక్యాన్ని ''2021 జూలై – 2022 జూన్ మధ్యకాలంలోని'' అని సవరించుకొని, చదువుకొనగలరు. – ఎడిటర్

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.దశమి రా.11.13 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పుష్యమి ఉ.10.01 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.11.03 నుండి 12.43 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.54, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఒక్కటైన ట్రాన్స్‌జెండర్లు



నిజామాబాద్ ఖిల్లా రామాలయంలో వివాహం చేసుకుంటున్న ట్రాన్స్‌జెండర్లు

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారి కల్యాణం సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు వివాహం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి నిజామాబాద్‌లో పలువురు ట్రాన్స్‌జెండర్లు వివాహం చేసుకున్నారు. నిజామాబాద్ ఖిల్లా రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అనంతరం.. నలుగురు ట్రాన్స్‌జెండర్లు తమ గురువులతో పసుపుతాడు కట్టించుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

విద్యుదాఘాతంతో బాలుని మృతి



మణితేజ

బొంరాస్‌పేట: విద్యుదాఘాతంతో ఒక బాలుడు మృతి చెందగా.. మరో వృద్ధురాలు అస్వస్థతకు గురైంది. వికారాబాద్ జిల్లా ఎన్కేపల్లిలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన పెద్దకుర్వ వినోద, బసంతప్పలకు ముగ్గురు కుమారులు సంతానం. బసంతప్ప చిన్న కుమారుడు మణితేజ (9)తో కలిసి ఎడ్లకు నీరు తాగించేందుకు.. ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న పశువుల నీటి తొట్టి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న చెట్టు కొమ్మ విరిగి పడటంతో.. విద్యుత్ తీగ తెగి బాలునిపై పడింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా.. పక్కనే ఉన్న బాలుని నానమ్మ గౌరమ్మ సైతం స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రవూఫ్ మణితేజ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మంచానికి నిప్పంటుకొని ప్రభుత్వ టీచర్ మృతి

కోదాడ రూరల్: సిగరెట్ కాల్చుతుండగా మంచానికి నిప్పంటుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలం మంగలి తండాలో ఆదివారం జరిగింది. కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగలితండాకు చెందిన ధరావత్ బాలాజీ (52) నడిగూడెం మండలం చెన్నకేశవాపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో అతడి భార్య పిల్లలతో కలిసి రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న బాలాజీ మద్యం మత్తులో సిగరెట్ కాల్చుతుండగా మంచానికి నిప్పు అంటుకుంది. మద్యం మత్తులో కదల్లేని స్థితిలో ఉన్న అతడు మంటల్లో కాలి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



హన్మంత్‌రెడ్డి

చేవెళ్ల/శంకర్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఒక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని చిన్న శంకర్‌పల్లికి చెందిన బద్దం హన్మంత్‌రెడ్డి (48) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొద్ది రోజులుగా కుటుంబ అవసరాలు, సేద్యం కోసం తలెత్తిన ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఇదే విషయమై రెండు రోజుల క్రితం.. కుటుంబసభ్యులతో గొడవ పడి ఇంట్లో నుంచి ఆయన ఎటో వెళ్లిపోయారు. ఆచూకీ కోసం వెతకగా ఎక్కడా లభించలేదు. దీంతో శంకర్‌పల్లి ఠాణాలో ఈనెల 4వ తేదీన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంతలోనే ఆదివారం ఉదయం పొలం వద్ద హన్మంత్‌రెడ్డి విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవ పడి మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు. చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు



భద్రాద్రిలో సీతారాముల కల్యాణ వేడుకను తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు. చిత్రంలో మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కొండాసురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

భద్రాద్రిలో శ్రీరామనవమి వేడుక
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి పర్యటన, ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బంది పడిన భక్తులు
- నేడు శ్రీరాముడికి పట్టాభిషేకం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా సాగింది. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి శ్రీరామనవమి వేడుకలకు హాజరై జానకి రాములకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా భద్రాచలం తరలివచ్చారు.

12:01 గంటలకు అభిజిత్ లగ్నంలో..

జై శ్రీరామ్ నినాదాల మధ్యన సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఉదయం పది గంటల సమయంలో మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ముందుగా కల్యాణ వేడుకకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా విష్వక్సేన పూజ చేశారు. ఆ తర్వాత పుణ్యావాచనం, శ్రీయోద్వాహం, యోక్త్రాబంధనం, అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12:01 గంటల సమయంలో అభిజిత్ లగ్నంలో వధూవరులైన సీతారాముల శిరస్సుపై జీలకర్ర, బెల్లం ఉంచారు. 12:13 గంటల సమయంలో మాంగళ్య ధారణ జరగగా ఆ తర్వాత తలంబ్రాల వేడుక నిర్వహించారు. చివరిగా మధ్యాహ్నం 12:36 గంటల సమయంలో హారతి ఇవ్వడంతో పెళ్లి తంతు ముగిసింది. సీఎంతో పాటు ఆయన సతీమణి గీత, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, పలువురు ప్రజాప్రతినిధులు ఈ వేడుకకు హాజరయ్యారు.

భక్తులకు ట్రాఫిక్ ఇక్కట్లు..

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:20 గంటల వరకు మొత్తంగా 3.20 గంటల పాటు ముఖ్యమంత్రి భద్రాచలంలో ఉన్నారు. ఈ సందర్భంగా పోలీసుల ఆంక్షలు భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. 3:30 గంటలకు ఆంక్షలు ఎత్తివేయడంతో ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చిన వాహనాలతో పట్టణంలో అనేక చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

నేడు పట్టాభిషేకం..

సోమవారం శ్రీరాముడి పట్టాభిషేకం జరగనుంది. కల్యాణం ముగిసిన మరుసటి రోజు భద్రాచలంలో శ్రీరాముడికి పట్టాభిషేకం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా రానున్నారు.



అల్లీపూర్‌లో తలంబ్రాలు తీసుకొస్తున్న తహసీల్దార్ ఖయ్యూం

రాములోరికి తలంబ్రాలు సమర్పించిన ముస్లిం అధికారి

రాయికల్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో శ్రీసీతారాముల కల్యాణ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ నుంచి తలంబ్రాలు తీసుకొచ్చే ఆనవాయితీ ఉంది. అయితే స్థానిక తహసీల్దార్ ఖయ్యూం ఈ గ్రామానికి స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్నారు. దీంతో ఆదివారం ఆయన కులమత భేదాలను పక్కనపెట్టి తలంబ్రాలను తీసుకొచ్చి రాములోరి వివాహంలో పాల్గొన్నారు.

తలంబ్రాలపై శ్రీరామ నామం

జనగామ: జనగామకు చెందిన కె.శ్రీలత శ్రీరామ నవమిని పురస్కరించుకొని వారం రోజులు కష్టపడి 5,100 బియ్యం గింజల (తలంబ్రాలు)పై శ్రీరామ సూక్ష్మ అక్షరాలు రాసి వేద పండితులకు అందజేశారు.

పచ్చిరొట్ట విత్తనాలకు ఈసారీ తిప్పలేనా?

- విత్తన టెండర్లకు ముందుకు రాని సరఫరాదారులు
- సీడ్ కార్పొరేషన్ ఆర్థిక స్థితిపై భయపడుతున్న విత్తన సంస్థలు
- మరో పక్క పేరుకుపోయిన బకాయిలు

సాక్షి, హైదరాబాద్: ఎరువులతో వట్టిపోతున్న భూములకు సేంద్రియ ప్రక్రియ ద్వారా భూసారాన్ని అందించే పచ్చిరొట్ట విత్తనాల సరఫరాలో ఈ ఏడాది కూడా గందరగోళం తప్పేలా లేదు. గత ఏడాది రైతులు ఎదుర్కొన్న సమస్యలు మళ్లీ పునరావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. యాసంగి పంట కోసిన వెంటనే పచ్చ రొట్ట విత్తనాలను అందించాల్సిన సర్కారుకు విత్తనాభివృద్ధి సంస్థ కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. టెండర్ ప్రక్రియలో జాప్యం, నిధుల కొరత, సరఫరాదారుల స్పందన లేమి వంటి కారణాలతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. దీంతో ఈ ఏడాది కూడా పచ్చిరొట్ట విత్తనాల కొరత తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

టెండర్లలో జాప్యం.. నాలుగోసారి గడువు పొడిగింపు

రాష్ట్రంలో 2.47 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, టెండర్ ప్రక్రియలో ఆలస్యం కారణంగా ఈ లక్ష్యం సాధ్యమయ్యేలా కనిపించడం లేదని అంటున్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ (సీడ్ కార్పొరేషన్) ఈ విత్తనాల సరఫరా కోసం టెండర్లు పిలిచినా, సరఫరాదారుల నుంచి స్పందన కరువైంది. ఇప్పటివరకు నాలుగు సార్లు గడువును పొడిగించినా ఫలితం శూన్యం. తొలుత గత నెల 10న టెండర్లు పిలిచి, 17 వరకు గడువు ఇచ్చిన కార్పొరేషన్, తర్వాత మార్చి 24, ఏప్రిల్ 2, ఇప్పుడు ఏప్రిల్ 9 వరకు గడువును పొడిగించింది. అయినా సరఫరాదారుల నుంచి స్పందన రాలేదు.

సంస్థ ఆర్థిక స్థితిపై ఆందోళన తోనే..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్ల కారణంగా సీడ్ కార్పొరేషన్ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని విమర్శలు ఉన్నాయి. రూ.400 కోట్లమేర బ్యాంకు బకాయిలు ఉన్నాయి. వాటికి నెల నెలా వడ్డీ చెల్లించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో విత్తనాల కోసం పిలిచే టెండర్లకు స్పందన రావడం లేదని సమాచారం. గత ఏడాది విత్తనాలు సరఫరా చేసిన వారికి ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదని తెలిసింది. బకాయిలు చెల్లిస్తేనే టెండర్లు వేస్తామని సరఫరాదారులు అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం.

పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత

పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేయడం వల్ల పంటలకు నత్రజని, ఫాస్పరస్, పొటాష్ వంటి పోషకాలు సహజంగా లభిస్తాయి. దీంతో యూరియా, డీఏపీ, ఎన్‌పీకే వంటి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రసాయన ఎరువులను తగ్గించి సహజ ఎరువుగా ఈ పచ్చరొట్ట ఉపయోగపడుతుంది. రైతులకు 50 శాతం సబ్సిడీపై ఈ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. అయితే ఈసారి విత్తనాల సరఫరాకు కూడా ఆయా సంస్థలు ముందుకు రాకపోవడంతో రైతులకు సబ్సిడీ విత్తనాలు దొరకవనే భయం పట్టుకుంది. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయి, జిల్లాల వారీగా విత్తనాలు అందుబాటులో ఉండాల్సిన సమయంలో, ఇంకా ప్రక్రియ ఆరంభ దశలోనే ఉండటం రైతులను నిరాశపరుస్తోంది.

వైభవంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో గరుడ పటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యనిర్వాహకులు కంకణ భట్టర్ రాజేశ్ గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి హాజరయ్యారు. గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.

మిల్లర్లు చెప్పిందే రేటు

- పదిరోజుల కిందట సన్నాలకు క్వింటాల్‌కు రూ. 2,600... ఇప్పుడు రూ. 2,200
- ఏపీ నుంచి వస్తున్న ధాన్యం, వాతావరణ పరిస్థితులతో భయపడుతున్న రైతులు
- గత్యంతరం లేక, వేచి ఉండలేక తక్కువ ధరకే మిల్లర్లకు అమ్మకం
- మిల్లర్ల సిండికేట్‌ను పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం ధర తగ్గించేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మిల్లులున్న మిర్యాలగూడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో వారు చెప్పిందే రేటుగా సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని 150కి పైగా మిల్లుల్లో పది రోజుల కిందటే కొనుగోళ్లు ప్రారంభమైనా, ప్రభుత్వ కేంద్రాల్లో మాత్రం సన్న ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభించలేదు. జిల్లాలో సన్న ధాన్యం కోసం 75 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, మూడు రోజుల క్రితం ఐదు కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. వాటిల్లోనూ ఇంకా కొనడం లేదు. దీంతో రైతులు మిల్లుల్లోనే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. పది రోజుల కిందట మిల్లర్లు సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ.2,600 వరకు ధర చెల్లించినా, ఇప్పుడు ధాన్యం ఏపీ నుంచి అధికంగా వస్తుండటంతో ఇక్కడ ఒక్కసారిగా ధర తగ్గించేశారు. క్వింటాల్‌కు రూ.2,200లోపే చెల్లిస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఒక్కసారిగా పోటెత్తడంతో ధర తగ్గింపు

ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వర్షం పడితే ధాన్యం తడిసిపోతుందనే భయంతో రెండు రోజులుగా రైతులు ధాన్యం ట్రాక్టర్లతో మిల్లులకు పోటెత్తారు. అదే అదనుగా వివిధ రకాల కొర్రీలు పెడుతూ ధర తగ్గించేశారు. మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి (సన్న ధాన్యం) రూ.2,320గా ప్రభుత్వం నిర్ణయించింది. ఐకేపీ కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాల్‌కు రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 చొప్పున బోనస్ వస్తుంది. ఈ లెక్కన రైతుకు క్వింటాల్‌కు రూ.2,820 ధర లభిస్తుంది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలంటే రోజుల తరబడి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టాల్సి వస్తుంది. ధాన్యంలో తేమ 17 శాతం వరకు ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు బోనస్ చెల్లిస్తుంది. ఈ క్రమంలో వర్షం పడి ధాన్యం తడిచిపోతే ఇక అంతే సంగతులు. పైగా జిల్లాలో ప్రభుత్వ పరంగా సాధారణ రకం ధాన్యం కొనుగోళ్లలోనే వేగం పుంజుకోలేదు. ఇక సన్నధాన్యం కొనుగోళ్లే ప్రారంభం కాలేదు. ఈ బాధలన్నీ పడలేక రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు.

పచ్చ గింజ, పేరు పేరుతో ధర తగ్గింపు

నాగార్జునసాగర్ ఆయకట్టుతోపాటు ఉమ్మడి జిల్లాలో బోరు బావుల కింద సాగు చేసిన రైతులు మిర్యాలగూడ మిల్లుల్లో అమ్ముకునేందుకు నిత్యం వందల ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొస్తున్నారు. పది రోజుల కిందట ధాన్యం తక్కువగా రావడంతో కావేరి, చింట్లు, చిట్టిపొట్టి, హెచ్ఎంటీ వంటి రకాల ధాన్యం క్వింటాల్ ధర రూ.2,600వరకు చెల్లించారు. ఇప్పుడు ధాన్యం రాక పెరగడంతో మిల్లర్లు సిండికేట్ అయ్యారు. ఏ రోజుకు ఆరోజు వారే ధర నిర్ణయించి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో ఏ మిల్లుకు వెళ్లినా తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ధాన్యం పచ్చిగా ఉందని, తాలు ఉందని, ఎక్కువ డ్రై అయ్యిందంటూ కొర్రీలు పెడుతూ రూ.2,200లకు మించి చెల్లించడం లేదు.



రైస్‌మిల్లుల వద్ద ఉన్న ఏపీ ధాన్యం లారీలు

ఏపీ నుంచి జోరుగా వస్తున్న ధాన్యం

కోదాడ, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, హాలియా ప్రాంతాల్లోని మిల్లులకు ఏపీలోని నంద్యాల, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి సన్న ధాన్యం లారీలు పెద్ద ఎత్తున వస్తున్నట్టు తెలిసింది. అందువల్లే మిల్లర్లు ధర తగ్గించేసి కొనుగోళ్లు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాకు రాకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్టు ఉన్నతాధికారులు ప్రకటించి వదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున ఏపీ నుంచి ధాన్యం రావడంతో ధాన్యం ధర తగ్గించారని, ఫలితంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఇంత తక్కువ ధర ఎప్పుడూ లేదు



వరికి గిట్టుబాటు ధర రావడం లేదు. పదేళ్లలో ఇంత తక్కువ ధర ఎప్పుడూ లేదు. 12 ఎకరాల్లో చింట్లు సాగుచేశా. క్వింటాల్‌కు రూ.2,140లే చెల్లించారు. అకాల వర్షాల భయంతో మిల్లులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

– కలారి లింగయ్య, అన్నారం

ఐదారు మిల్లులు తిరిగా..



ఏ మిల్లు వద్దకు వెళ్లినా కొర్రీలే. మేం పండించిన చింట్లు బాగానే ఉన్నా ఇబ్బందులు పెడుతున్నారు. తక్కువ ధరకు ఇవ్వాలనే ఉద్దేశంతో కొనమని చెబుతున్నారు. ఈ విషయంలో అధికారులకు ఫోన్ చేసినా ఎత్తడం లేదు.

– లావూరి లింగా, వాచ్యాతండా

ఏదో కారణంతో తగ్గిస్తున్నారు



నాకున్న నాలుగు ఎకరాల్లో చింట్లు పండించా. పచ్చిగా ఉంటే పచ్చిగా ఉన్నాయని, డ్రైగా ఉంటే ఎక్కువ డ్రై అయ్యాయని చెప్పి ధర తగ్గిస్తున్నారు. గత్యంతరం లేక క్వింటాకు రూ.2,200కే అమ్ముకున్నా.

– కోడిరెక్క ప్రవీణ్, శెట్టిపాలెం

రాజన్న సన్నిధిలో రామన్న కల్యాణం

- వేములవాడలో వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



వేములవాడలో సీతారాముల కల్యాణ మహోత్సవం

వేములవాడ: హరిహర క్షేత్రంగా వెలుగొందుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి జాతరను తలపించేలా దాదాపు లక్షన్నరకుపైగా భక్తులు హాజరయ్యారు. శనివారం రాత్రికే వేములవాడ చేరుకున్న భక్తులు, వసతి గదులు దొరక్క రోడ్లపైనే తలదాచుకున్నారు. వేములవాడలోని వీధులన్నీ భక్తజనంతో సందడిగా మారాయి. మున్సిపాలిటీ తరపున కమిషనర్ అన్వేశ్, అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ అర్చకులు పట్టువస్త్రాలు అందించారు. ఇదిలా ఉండగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివపార్వతులు నెత్తిన జీలకర్ర, చేతిలో త్రిశూలంతో, అక్షింతలు చల్లుకుంటూ రాజన్నను వివాహమాడారు. గుడిచెరువు ఖాళీ స్థలంలో 25వేల మందికి ఉచిత అన్నదానం అందించారు. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేశ్ బీ గీతే, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, తదితరులు హాజరయ్యారు.

నేత్రపర్వంగా రథోత్సవం

- వేములవాడలో ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు



నేత్రపర్వంగా సాగుతున్న స్వామి వారి రథోత్సవం

వేములవాడ: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో సీతారాముల కల్యాణం అనంతరం ఆదివారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. భక్తుల నృత్యాల మధ్య రాజన్న ఆలయం నుంచి.. వేణుగోపాలస్వామి ఆలయం వరకు రథోత్సవం కొనసాగింది. బ్యాండు వాయిద్యాల మధ్య యువకులు, హిజ్రాల నృత్యాలతో రథోత్సవం ఉత్సాహంగా కొనసాగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు హోమగుండంలో పూర్ణాహుతి నిర్వహించారు. తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న వసంత నవరాత్రోత్సవాలు ముగిసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

కిక్కిరిసిన యాదగిరి క్షేత్రం



శ్రీస్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రీరామనవమితో పాటు ఆదివారం సెలవు రోజు కలిసి రావడంతో వివిధ ప్రాంతాల భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. ఆలయ మాడ వీధులు, ప్రసాద విక్రయశాల, క్యూలైన్లు, ముఖ మండపం, బస్టాండ్, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. శ్రీస్వామిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా వివిధ పూజలతో స్వామివారికి నిత్యాదాయం రూ.29,36,468 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

'సాగర్'పై సీఆర్‌పీఎఫ్ పహారా ఉపసంహరణ?



డ్యామ్‌పై సీఆర్‌పీఎఫ్ దళాల పహారా

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ దళాలను త్వరలో ఉపసంహరించుకుంటున్నట్లు సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రోజు.. 2023 నవంబర్ 29 అర్ధరాత్రి ఆంధ్రా పోలీసులు డ్యామ్‌పైకి చొచ్చుకొచ్చి సగం డ్యాంను ఆక్రమించడం తెలిసిందే. అనంతరం కేఆర్ఎంబీ (కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్) ప్రాజెక్టును తమ అధీనంలోకి తీసుకుంది. వారి ఆదేశాల మేరకు ఇరువైపులా (సీఆర్‌పీఎఫ్) కేంద్ర సాయుధ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు ఇరువైపులా డ్యాంపై 16వ గేటు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు.. పైలాన్ పిల్లర్ వద్ద గల మెయిన్‌డ్యామ్ ప్రధాన ద్వారం వరకు తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ దళాలు పహారా కాస్తున్నాయి. ఇరువైపులా కలిపి సుమారు 60 నుంచి 90 మంది విధుల్లో ఉన్నారు. వీరు కాకుండా మరో 80 మంది ఎస్‌పీఎఫ్ (ప్రత్యేక రక్షణ దళం) పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. వాస్తవంగా డ్యామ్‌పై ఎలాంటి గొడవలు లేవు. గత ఏడాది చివర తెలంగాణ వైపు నుంచి ఉపసంహరించుకొని వెనక్కి వెళ్లారు. ఆంధ్ర వైపు నుంచి వెళ్లకపోవడంతో.. తెలంగాణ దళాలు తిరిగి వచ్చి విధుల్లో చేరాయి. సీఆర్‌పీఎఫ్ పహారా ఉపసంహరణ విషయాన్ని సాగర్‌డ్యామ్ ఈఈ మల్లికార్జున్ రావు వద్ద ప్రస్తావించగా.. తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని స్పష్టం చేశారు.

సాగర్ ఎర్త్ డ్యామ్‌పై చెలరేగిన మంటలు

- కాలిపోయిన సీసీ కెమెరాల కేబుళ్లు, విద్యుత్ వైర్లు



సాగర్ ఎర్త్ డ్యామ్‌పై తగలబడిన గడ్డి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్‌కు ఎడమ వైపున గల ఎర్త్ డ్యామ్‌పై ఆదివారం మంటలు చెలరేగాయి. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఎగసి ఎండిపోయిన గడ్డికి అంటుకోవడంతో అగ్నికీలలు ఉవ్వెత్తున లేచాయి. ఎర్త్ డ్యామ్ పైకి వెళ్లే గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బంది గమనించి డ్యామ్ అధికారులను అలర్ట్ చేశారు. వెంటనే మెయిన్ డ్యామ్ ముఖద్వారం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే సుమారు 300 మీటర్ల మేర ఎర్త్ డ్యామ్ వెంట గడ్డి తగలబడింది. గడ్డితో పాటు సీసీ కెమెరా కేబుల్స్, విద్యుత్ వైర్లు కాలిపోయాయి. గత నెల 19వ తేదీన కూడా ఎర్త్ డ్యామ్‌పై గడ్డికి మంటలు అంటుకున్నాయి.



పంబన్ బ్రిడ్జిని ప్రారంభించాక ఆ మార్గంలో వెళ్తున్న నౌక సిబ్బందికి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



కొత్తగా ప్రారంభించిన పంబన్ రైలు వంతెన పట్టాలపై పరుగులు పెడుతున్న రైలు

దేశానికే తలమానికం

పంబన్ రైల్వే వంతెన ప్రారంభించిన ప్రధాని మోదీ

- తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జి జాతికి అంకితం
- రూ.8,300 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం..
- తమిళంలో వైద్య విద్య అందించాలని సూచన
- మోదీ కార్యక్రమానికి గైర్హాజరైన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని రామేశ్వరంలో నూతన పంబన్ రైల్వే వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. దేశంలో మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జిగా రికార్డుకెక్కిన ఈ వంతెనను జాతికి అంకితం చేశారు. ఈ వంతెన దేశానికే తలమానికం అని వ్యాఖ్యానించారు. అలాగే రామేశ్వరం–తాంబరం (చెన్నై) కొత్త రైలుకు పచ్చజెండా ఊపారు. వర్టికల్ బ్రిడ్జి గుండా రాకపోకలు సాగించే కోస్ట్‌గార్డ్ షిప్‌ను సైతం ప్రారంభించారు. అనంతరం సభలో పాల్గొన్నారు. ఈ కీలకమైన కార్యక్రమానికి తమిళనాడు సీఎం స్టాలిన్ గైర్హాజరయ్యారు. ఆదివారం ఉదకమండలంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండడంతో తాను రాలేకపోతున్నట్లు ముందుగానే సమాచారం ఇచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వ తీరుపట్ల ఆగ్రహంతో ఉన్న స్టాలిన్ ప్రధాని మోదీ కార్యక్రమానికి వ్యూహాత్మకంగానే దూరంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. డీలిమిటేషన్‌పై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించాలని ఆయన ఇప్పటికే ప్రధానమంత్రిని కోరారు.

తమిళంలో సంతకాలు చేయలేరా?

తమిళనాడులో రూ.8,300 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాముడు అందించిన సుపరిపాలన మన దేశ నిర్మాణానికి పునాది అని చెప్పారు. రాముడితో తమిళనాడుకు ఎంతో అనుబంధం ఉందంటూ సంగమ శకం నాటి సాహిత్యాన్ని ప్రస్తావించారు. శ్రీలంక నుంచి గత పదేళ్లలో 3,700 మంది తమిళ జాలర్లను వెనక్కి తీసుకొచ్చామని తెలిపారు. వీరిలో 600 మందిని గత ఏడాది కాలంలోనే తీసుకొచ్చినట్లు వెల్లడించారు. తమిళ మాధ్యమంలో వైద్య విద్య అందించాలని తమిళనాడు ప్రభుత్వానికి సూచించారు. దీనివల్ల పేదలకు లబ్ధి కలుగుతుందన్నారు. తమిళనాడుకు ఇటీవల 11 నూతన మెడికల్ కాలేజీలు మంజూరు చేసినట్లు వివరించారు. తమిళ భాషను, సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రపంచంలో అన్ని మూలలకూ తీసుకెళ్లడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. తమిళనాడు నాయకుల నుంచి తనకు లేఖలు వస్తుంటాయని, కానీ, వాటిపై తమిళ భాషలో సంతకాలు ఉండడం లేదని నరేంద్ర మోదీ ఆక్షేపించారు. కనీసం తమిళ భాషలో సంతకాలు చేయాలని కోరారు.

నిధుల కేటాయింపులో వివక్ష లేదు

తమిళనాడు మత్స్యకారులు కష్టపడి పనిచేస్తారని ప్రధానమంత్రి ప్రశంసించారు. 'పీఎం మత్స్య సంపద యోజన' కింద తమిళనాడుకు గత ఐదేళ్లలో భారీగా నిధులు కేటాయించామని చెప్పారు. మత్స్యకారులకు ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీవీడ్ పార్కులు, ఫిషింగ్ హార్బర్లు, ల్యాండింగ్ సెంటర్ల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని ఉద్ఘాటించారు. తమిళనాడుకు నిధుల కేటాయింపులో ఎలాంటి వివక్ష లేదని తేల్చిచెప్పారు. 2014 కంటే ముందు పదేళ్లలో కేటాయించిన దాని కంటే గత పదేళ్లలో మూడురెట్లు ఎక్కువ నిధులు తమిళనాడుకు ఇచ్చామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ఈ నిధులు ఎంతగానో తోడ్పడ్డాయని అన్నారు. నిధుల విషయంలో కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో తమిళనాడులో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని స్పష్టంచేశారు. తమిళనాడుకు రైల్వే బడ్జెట్ ఏడు రెట్లు పెంచామన్నారు. రాష్ట్రంలో 2014 కంటే ముందు రైలు ప్రాజెక్టులకు ఏటా రూ.900 కోట్లు మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు ఏటా రూ.6,000 కోట్లు ఇస్తున్నామని తెలియజేశారు. 2014 తర్వాత రాష్ట్రంలో కేంద్ర నిధులతో 4,000 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు.

రామనాథ స్వామి ఆలయంలో పూజలు

ప్రధాని మోదీ రామేశ్వరంలోని రామనాథ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ వస్త్రాలు ధరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు శ్రీలంక నుంచి రామేశ్వరం చేరుకున్న ప్రధానమంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్డుకు ఇరువైపులా నిల్చొని ఆయనకు అభివాదం చేశారు. నినాదాలతో హోరెత్తించారు. నూతన పంబన్ వంతెనను ప్రారంభించిన అనంతరం మోదీ రామనాథస్వామి ఆలయానికి చేరుకున్నారు. అర్చకులు ఆయనకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఇది దైవిక యాదృచ్ఛికం

హిందూ మహాసముద్రంలోని ప్రాచీన రామసేతును దర్శించుకోవడం ఒక గొప్ప ఆశీర్వచనంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ సంతోషం వ్యక్తంచేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. ''కొద్ది సేపటి క్రితమే శ్రీలంక నుంచి హెలికాప్టర్‌లో వస్తూ రామసేతును దర్శించుకున్నాను. ఇదొక గొప్ప ఆశీర్వచనంగా భావిస్తున్నా. అయోధ్యలో బాలరాముడికి ఆదిత్యుడు తిలకం దిద్దిన సమయంలోనే ఇక్కడ రామసేతు దర్శనం కావడం దైవిక యాదృచ్ఛికం. రెండింటినీ ఒకేసారి దర్శించుకోవడం గొప్ప విషయం. శ్రీరాముడు మనందరినీ ఐక్యంగా కలిపి ఉంచే ఒక బలమైన శక్తి. ఆయన ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలన్నదే నా ఆకాంక్ష'' అని మోదీ అన్నారు.

ఇంజనీరింగ్ అద్భుతం

రామేశ్వరంలో పంబన్ వర్టికల్ సీ–లిఫ్ట్ బ్రిడ్జిని రూ.550 కోట్లతో నిర్మించారు. పొడవు 2.08 కిలోమీటర్లు. 99 స్పాన్లు ఉన్నాయి. మధ్యలో 72.5 మీటర్ల పొడవైన వర్టికల్ లిఫ్ట్ ఇందులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. వంతెన కిందినుంచి భారీ నౌకల రాకపోకలకు వీలుగా ఇది 22 మీటర్ల ఎత్తువరకు పైకి వెళ్లగలదు. నౌకలు వెళ్లిపోయిన తర్వాత యథాతథ స్థితికి చేరుకుంటుంది. ఎప్పటిలాగే రైళ్ల ప్రయాణం సాగించవచ్చు. ప్రధాన భూభాగంలోని మండపం రైల్వేస్టేషన్‌ను రామేశ్వరం దీవితో ఈ వంతెన అనుసంధానిస్తుంది. అత్యాధునిక ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఈ బ్రిడ్జి ఒక ఉదాహరణ. దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ ఉపయోగించారు. హై–గ్రేడ్ రక్షణ పెయింట్ వాడారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వంతెనపై రెండు రైల్వే ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. బ్రిడ్జి నిర్వహణ ఖర్చు కూడా తక్కువే. భక్తులు రామేశ్వరం ఆలయానికి చేరుకోవడం ఇకమరింత సులభతరం కానుంది. ప్రధాన భూభాగం–రామేశ్వరం దీవి మధ్య 1914లో బ్రిటిష్ పాలకుల హయాంలో రైల్వే వంతెన నిర్మించారు. శతాబ్దం పాటు సేవలందించిన ఈ వంతెన గడువు తీరిపోవడంతో అదేచోట కొత్త వంతెన నిర్మాణానికి 2019లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా, ఆదివారం పంబన్ వంతెనను ప్రారంభించిన తర్వాత గంట సేపట్లో సాంకేతిక సమస్య నెలకొంది. కోస్ట్‌గార్డు నౌక కోసం వంతెనను 17 అడుగుల మేర పైకి ఎత్తారు. తిరిగి కిందకు దించే సమయంలో 10 అడుగుల వద్ద సాంకేతిక సమస్య ఏర్పడింది. రైల్వే అధికారులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు.

సీపీఎం ప్రధాన కార్యదర్శిగా
ఎంఏ బేబి ఎన్నిక

మదురై: సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కేరళకు చెందిన సీనియర్ నేత మరియమ్ అలెగ్జాండర్(ఎంఏ) బేబి ఎన్నికయ్యారు. తమిళనాడులోని మదురైలో ఆదివారం జరిగిన సీపీఎం 24వ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఈ ఎన్నిక జరిగింది. కొందరు నేతలు ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధవాలేను ఈ పదవికి బలపరిచారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో బేబి ఎన్నికైనట్లు ప్రకటించారు. కొత్తగా ఏర్పాటైన 18 మందితో కూడిన పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి పొలిట్ బ్యూరో ఎంఏ బేబిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. అదేవిధంగా, 85 మందితో కూడిన సెంట్రల్ కమిటీలోకి 20 శాతం మంది మహిళలను తీసుకున్నట్లు ఆ పార్టీ 'ఎక్స్'లో తెలిపింది. 2023 సెప్టెంబర్‌లో అనారోగ్య కారణాలతో సీతారాం ఏచూరి కన్నుమూయడంతో ప్రధాన కార్యదర్శి పోస్టు ఖాళీ అయింది. అప్పటి నుంచి ప్రకాశ్ కారత్ తాత్కాలిక సమన్వయకర్తగా ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కాగా, పొలిట్ బ్యూరో నుంచి సీనియర్ నేతలు ప్రకాశ్ కారత్, బృందా కారత్ వైదొలిగారు. వీరిద్దరితోపాటు మణిక్ సర్కార్‌ను పార్టీ కేంద్ర కమిటీకి ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రకటించినట్లు సమాచారం.



విద్యార్థి దశ నుంచే..

కేరళలోని ప్రక్కులంలో 1954లో జన్మించిన ఎంఏ బేబి విద్యార్థి దశలోనే సీపీఎం పట్ల ఆకర్షితుడయ్యారు. కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ సభ్యుడయ్యారు. కొల్లమ్‌లోని ఎస్ఎన్ కాలేజీలో బీఏలో చేరినా చదువు కొనసాగించలేకపో యారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల్లో పలు పదవులు చేపట్టారు. 1986–98 మధ్య కాలంలో రాజ్యసభ ఎంపీగా, 2006–16 మధ్య ఎమ్మెల్యేగా కొనసా గారు. కేరళ విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2012 నుంచి పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

130 రోజుల తర్వాత
దీక్ష విరమించిన దల్లేవాల్

చండీగఢ్: పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్(70) ఆమరణ నిరాహార దీక్షను ఆదివారం విరమించారు. పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత సహా పలు డిమాండ్ల సాధనకు గతేడాది నవంబర్ 26వ తేదీ నుంచి ఆయన నిరశన దీక్ష సాగిస్తున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ దీక్ష విరమించాలని శనివారం దల్లేవాల్‌కు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆదివారం పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లా సిర్‌హింద్ వద్ద జరిగిన కిసాన్ మహాపంచాయత్‌లో పాల్గొన్న దల్లేవాల్ నిరవధిక దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటన చేశారు. స్ట్రెచర్‌పై నుంచే ఆయన పంచాయత్‌నుద్దేశించి ప్రసంగించారు. 'నా దృష్టిలో ప్రజలు దైవ స్వరూపులు. మీ మనోభావాలను గౌరవిస్తున్నా. ఇష్టం లేకున్నా మీ కోరిక మేరకు దీక్ష విరమిస్తున్నా. ఇన్నాళ్లూ నేను సూచించిన విధంగా పోరు కొనసాగించిన మీ అందరికీ ధన్యవాదాలు. డిమాండ్లు నెరవేరకుంటే పోరాటం మరింత ఉధృతంగా కొనసాగిద్దాం'అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఆయన నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. దల్లేవాల్ జిందాబాద్ అనే నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం)లు రైతు సమస్యలపై శంభు, ఖనౌరీ సరిహద్దుల్లో నిరసనలు చేపట్టాయి. ఖనౌరీ వద్ద దీక్ష చేపట్టిన దల్లేవాల్ ఆరోగ్యం జనవరిలో క్షీణించింది. ఈ సమయంలో డిమాండ్ల పరిష్కారంపై రైతులతో చర్చలకు అంగీకరిస్తూ కేంద్రం ప్రకటన చేయడంతో వైద్య చికిత్సలకు మాత్రమే అంగీకరించారు. అప్పటి నుంచీ ఫ్లూయిడ్లు మాత్రమే తీసుకుంటున్నారు. మార్చి 19వ తేదీన రైతు సంఘాల ప్రతినిధులతో కేంద్ర బృందం చర్చలు జరపడం తెల్సిందే. తదుపరి చర్చలు ముందుగా ప్రకటించిన విధంగానే మే 4వ తేదీన ఉంటాయని కేంద్ర మంత్రి చౌహాన్ శనివారం తెలిపారు.



వక్ఫ్ బోర్డులను నియంత్రించే
ఉద్దేశం లేదు: నడ్డా

న్యూఢిల్లీ: వక్ఫ్ బోర్డులను నియంత్రించాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జె.పి.నడ్డా స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డులు చట్ట పరిధిలోనే పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆయా బోర్డుల ఆస్తులు విద్య, వైద్యం, ఉపాధి కల్పన కోసం ఉపయోగపడాలని, తద్వారా ముస్లిం వర్గానికి మేలు జరగాలని చెప్పారు. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జె.పి.నడ్డా పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టర్కీతోపాటు చాలా దేశాల్లో వక్ఫ్ బోర్డుల ఆస్తులను అక్కడి ప్రభుత్వాలు నియంత్రణలోకి తీసుకున్నాయని గుర్తుచేశారు. మన దేశంలో మాత్రం బోర్డులు చట్ట పరిధిలో పని చేయాలని చెబుతున్నామని పేర్కొన్నారు. ఎవరైనా సరే నిబంధనల ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే బీజేపీ ప్రస్థానాన్ని నడ్డా ప్రస్తావించారు. నేడు బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీల్లో ఒకటిగా మారిందని అన్నారు. ప్రస్తుతం బీజేపీకి 240 మంది లోక్‌సభ సభ్యులు, 98 మంది రాజ్యసభ సభ్యులు, 1,600 మందికిపైగా ఎమ్మెల్యేలు ఉన్నారని గుర్తుచేశారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక: మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్టీ కార్యకర్తలకు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో వరుసగా పోస్టులు చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని స్పష్టంచేశారు. వారంతా క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేస్తున్నారని, సుపరిపాలన ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. అవిశ్రాంతంగా శ్రమిస్తున్న కార్యకర్తలను చూసి తాను గర్వపడుతున్నానని చెప్పారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని గుర్తుచేశారు. కార్యకర్తల శక్తి, ఉత్సాహం తనకు ఎంతగానో స్ఫూర్తినిస్తున్నాయని వివరించారు. దేశ ప్రజలు బీజేపీలో సుపరిపాలన ఎజెండాను దర్శిస్తున్నారని, ఎన్నికల్లో పార్టీకి లభిస్తున్న చరిత్రాత్మక విజయాలే ఇందుకు తార్కాణమని ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో అన్ని రకాల ఎన్నికల్లో బీజేపీ అప్రతిహత విజయాలతో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. సమాజ సేవకు, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని వెల్లడించారు. గత కొన్ని దశాబ్దాలుగా పార్టీని బలోపేయడానికి కంకణబద్ధులై పనిచేస్తున్న కార్యకర్తల సేవలను గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇదేనని పేర్కొన్నారు. దేశ ప్రగతి కోసం మనమంతా పూర్తి అంకితభావంతో పనిచేయాలని, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించుకోవాలని మోదీ పిలుపు నిచ్చారు.



'వాషింగ్టన్ స్మారకం' వద్ద ఆందోళనకు దిగిన నిరసనకారులు



మస్క్‌ను బహిష్కరించాలంటూ ప్లకార్డు పట్టుకున్న ఆందోళనకారులు



సెయింట్ జేమ్స్ పార్క్‌లో గుమిగూడిన నిరసనకారులు

ట్రంప్‌కు హ్యాండ్సాఫ్ సెగ

- ట్రంప్ విధానాలతో విదేశాల ప్రతీకార టారిఫ్‌ల భారం పడిందని అమెరికన్ల ఆగ్రహం
- దేశవ్యాప్తంగా ఆందోళనలు

వాషింగ్టన్: మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్ నినాదంతో అధ్యక్ష పీఠంపై ఆసీనులైన డొనాల్డ్ ట్రంప్ వెనువెంటనే తీసుకున్న అనూహ్య, విపరీత నిర్ణయాలతో అమెరికన్లు విసిగిపోయారు. విదేశాలపై టారిఫ్‌ల బాంబు విసిరితే అది ప్రతీకార టారిఫ్‌ల రూపంలో తిరిగొచ్చి అధిక ధరలు, ద్రవ్యోల్బణానికి బాటలు వేస్తోందన్న ఆగ్రహంతో ప్రజలు నిరసన బాటపట్టారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక దేశవ్యాప్తంగా ఎన్నడూలేనిస్థాయిలో లక్షలాది మంది స్థానిక అమెరికన్లు ముక్తకంఠంతో నినదిస్తూ ఆందోళనకు దిగిన 'హ్యాండ్సాఫ్' ఉద్యమం శనివారం భారీస్థాయిలో కొనసాగుతోంది. అమెరికాలోని మెజారిటీ రాష్ట్రాల్లో ట్రంప్‌కు వ్యతిరేకంగా శనివారం ఉద్యమం మొదలైంది. రాష్ట్రాల అసెంబ్లీలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సామాజిక భద్రత విభాగ ఆఫీస్‌లు, పార్కులు, సిటీ హాళ్ల వద్ద ప్రధానంగా పెద్దస్థాయిలో ర్యాలీలు జరిగాయి. అత్యంత సంపన్నుల చేతుల్లోకి వెళ్లిన పాలనాపగ్గాలను విడిపిస్తామని నినదించారు. ''మావి ప్రధానంగా మూడు డిమాండ్లు. ప్రభుత్వంపై సంపన్నుల అజమాయిషీ నశించాలి. ప్రభుత్వంలో అవినీతి అంతంకావాలి. మెడికేర్, సోషల్‌సెక్యూరిటీ నిధుల్లో కోత పెట్టొద్దు. వలసదారులు, లింగమార్పిడి వర్గాలు, ఇతరులపై నిర్బంధాల చట్రాలను తొలగించాలి'' అని ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సంఘాల్లో ఒకటైన ఇండివిజిబుల్ ప్రకటించింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫెడరల్ ఎంప్లాయిస్ సహా చాలా కార్మిక సంఘాల సభ్యులు పలు రాష్ట్రాల్లో నిరసన ర్యాలీల్లో పాల్గొన్నారు.

50 రాష్ట్రాల్లో 1,400 చోట్ల..

50 రాష్ట్రాల్లో పౌర హక్కుల సంస్థలు, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ+ మద్దతుదారులు, మాజీ ఫెడరల్ ఉద్యోగులు, మహిళా హక్కుల కార్యకర్తలు, ఎన్నికల సంస్కరణల కార్యకర్తలు, సాధారణ ప్రజానీకం ఈ ఆందోళనలో భాగస్వాములై ట్రంప్ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రధానంగా 1,400 ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. అయితే చాలా వరకు ర్యాలీలు శాంతియుతంగానే కొనసాగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అరెస్టులు జరగలేదు. మ్యాన్‌హాట్టన్ మిడ్‌టౌన్ మొదలు అలాస్కాలోని యాంకరేజ్‌దాకా ప్రతి ప్రధాన నగరం, పట్టణంలో జనం వీధుల్లోకి వచ్చి హ్యాండ్సాఫ్ అని రాసి ఉన్న బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ఆందోళనల్లో పాల్గొన్నారు. వ్యయ నియంత్రణ చర్యలు, సమూల సంస్కరణల పేరుచెప్పి హఠాత్తుగా వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను విధుల నుంచి తప్పించడం, జీడీపీ తగ్గిపోయేలా ఆర్థికవ్యవస్థను అస్తవ్యస్థం చేయడం, వలసలపై ఉక్కుపాదం మోపడం, మానవ హక్కులను కాలరాయడం వంటి చర్యలతో ట్రంప్, ఎలాన్ మస్క్‌పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. అమెరికాలోనేకాదు బ్రిటన్‌లోని లండన్, ఫ్రాన్స్‌లోని పారిస్, జర్మనీలోని బెర్లిన్ నగరాల్లోనూ అమెరికా ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. ''అమెరికాకు ఏమైంది?. ప్రజలను టారిఫ్‌లను ఇబ్బందులు పెట్టడం ఇకనైనా ఆపండి. ట్రంప్ పెద్ద ఇడియట్'' అని రాసి ఉన్న ప్లకార్డులను లండన్‌లో ప్రదర్శించారు.

నిరసనలపై స్పందించిన శ్వేతసౌధం

ట్రంప్ వ్యతిరేక ర్యాలీలపై అధ్యక్ష భవనం స్పందించింది. ''ఇన్నాళ్లూ డెమొక్రాట్ల ప్రభుత్వంలో అక్రమంగా అమెరికాలో చొరబడిన విదేశీయులు, వలసదారులు ప్రభుత్వం నుంచి ఎన్నో పథకాలు, ప్రయోజనాలను అక్రమంగా పొందారు. దాంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లింది. వీళ్ల వల్ల వాస్తవిక లబ్ధిదారులైన సీనియర్ అమెరికన్లు ఎంతో లబ్ధిని కోల్పోయారు. ఆ సంస్కృతికి చరమగీతం పాడి నిజమైన అమెరికన్లకే ప్రభుత్వం నుంచి సామాజిక భద్రత, వైద్యసాయం, వైద్యసదుపాయాలు అందిస్తున్నాం'' అని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

టారిఫ్‌లను తప్పించుకునేందుకు
50 దేశాలు యత్నించాయి

వెల్లడించిన అమెరికా

వాషింగ్టన్: ప్రపంచదేశాలపై టారిఫ్‌ల కొరడా ఝుళిపించిన ట్రంప్ సర్కార్‌ను ఎలాగోలా ఒప్పించి టారిఫ్ వాతల నుంచి తప్పించుకోవాలని దాదాపు 50కిపైగా దేశాలు ప్రయత్నంచేశాయని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. కొన్నేళ్లుగా పలు దేశాల టారిఫ్‌ల భారాన్ని మోస్తున్న తామూ ఇకపై పరస్పర టారిఫ్‌లను విధిస్తామని ఇటీవల ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాటిని అమల్లోకి తెచ్చిన విషయం తెల్సిందే. అయితే ఇవి అమల్లోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని, సంప్రదింపుల ద్వారా టారిఫ్‌ల భారాన్ని కొంతైనా తగ్గించుకునేందుకు దేశాలు ప్రయత్నించాయని వైట్‌హౌస్‌లో జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ కెవిన్ హసెట్ చెప్పారు. 50కిపైగా దేశాలు అమెరికాతో టారిఫ్ సంబంధ మంతనాలు జరిపేందుకు ఆసక్తిచూపాయని కెవిన్ ఓవైపు చెబుతుంటే ఇండోనేసియా, తైవాన్ మాత్రం తాము అమెరికాపై ప్రతీకార టారిఫ్‌లు విధించబోమని ప్రకటించడం విశేషం. అయితే తమపై పడే పన్నుల భారాన్ని కాస్తయినా తగ్గించుకునే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌తో చర్చలకు బయల్దేరారు. సోమవారం ట్రంప్‌తో ఆయన చర్చలు జరిపే అవకాశం ఉంది. అమెరికాలోకి దిగుమతి అయ్యే అత్యధిక దిగుమతులపై సాధారణంగా కనీసం 10 శాతం అదనపు టారిఫ్‌ను శనివారం ట్రంప్ అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో పలు దేశాలు సంప్రదింపుల పర్వానికి తెరలేపాయి. కనీసం 45 రోజులపాటు పెంపు నిర్ణయాన్ని వాయిదావేసుకోవాలని వియత్నాం నేత టో లామ్ కోరారు. పెంపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బ్రిటన్ ప్రభుత్వం తమ దేశ ఆర్థికవ్యవస్థ పరిరక్షణే తొలి ప్రాధాన్యతనిస్తామని ప్రకటించింది. దిగుమతులపై టారిఫ్‌ల కారణంగా ఆయా ఉత్పత్తుల ధరలకు అమెరికా రెక్కలు రానున్నాయి. పెరిగే ధరలతో అమెరికన్ వినియోగదారుల జేబుకు చిల్లుపడనుంది. అయితే తొలినాళ్లలో జనం ఇబ్బందులుపడ్డాసరే కొంతకాలానికి ఆయా వస్తువుల ఉత్పత్తి స్థానికంగా మొదలై ధరలు దిగొస్తాయని ట్రంప్ నమ్మబలుకుతున్నారు.

ద్రవ్యోల్బణం తప్పదు: ''వస్తువులకు డిమాండ్ పెరగడంతో ద్రవ్యోల్బణం సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించలేం. ఇలా టారిఫ్‌లతో సొంతంగా అమెరికా అతిపెద్ద ఆర్థికగాయాలు చేసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి'' అని అమెరికా మాజీ ఆర్థిక మంత్రి ల్యారీ సమ్మర్స్ ఆందోళన వ్యక్తంచేశా రు. ''టారిఫ్ భయాలతో స్టాక్‌మార్కెట్ మదుపరులు అనాలోచిత నిర్ణయాలు తీసుకోకండి. మార్కెట్లు చరిత్రాత్మక కనిష్ఠస్థాయిలకు ఒకవేళ పడినా మళ్లీ ఊహించనంత పెరుగుతాయి'' అని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవరో భరోసా ఇచ్చారు.

పెంగ్విన్లు, సీల్స్‌కూ టారిఫ్ సెగ

అంటార్కిటికా ఖండంలో చివర్లో ఉన్న రెండు మారుమూల బుల్లి ద్వీపాల పైనా టారిఫ్ ఎందుకు విధించారని మీడియా ప్రశ్నించగా లుట్నిక్ అసలు విషయం బయటపెట్టారు. ''ఏ దేశంపై ఎంత టారిఫ్ వేయాలనేది అధికారులు పూర్తిగా నిర్ణయించలేదు. ఈ పనిని చాలావరకు కృత్రిమ మేధ(ఏఐ) చేసింది. అందుకే బుల్లి ద్వీపాలపైనా టారిఫ్ బాంబు పడింది'' అని అన్నారు. వాస్తవానికి ఈ హెర్డ్ అండ్ మెక్‌డొనాల్డ్ ద్వీపాల్లో జనం కంటే పెంగ్విన్లు, సీల్స్ ఎక్కువగా ఉంటాయి. శివారు ద్వీపాలపైనా టారిఫ్ వేయడం చూస్తుంటే ఈ విధానం హేతుబద్ధంగా జరగలేదని, గంపగుత్తగా టారిఫ్ వేశారని కొందరు వాణిజ్య వేత్తలు విమర్శించారు.

ఇద్దరు బ్రిటిష్ ఎంపీలను అడ్డుకున్న ఇజ్రాయెల్

లండన్: అధికార లేబర్ పార్టీకి చెందిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులను ఇజ్రాయెల్ అడ్డుకోవడంపై బ్రిటన్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. పార్లమెంటరీ బృందంలో సభ్యులైన అబ్తిసామ్ మహ్మద్, యువాన్ యంగ్‌లు వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఇజ్రాయెల్ బలగాలు అడ్డుకున్నాయి. ఛారిటీ సంస్థ తరఫున వెళ్లిన తమను ఇజ్రాయెల్ అడ్డుకోవడం దిగ్భ్రాంతి కలిగించిందని ఎంపీలిద్దరూ ఆదివారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. ఎంపీలను నిర్బంధించడంపై ఇజ్రాయెల్ ఇమిగ్రేషన్ విభాగం స్పందించింది. యూకే ఎంపీలిద్దరూ వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్‌పై విద్వేష ప్రసంగాలు చేసేందుకు వచ్చినందునే వారిని అడ్డుకున్నామని తెలిపింది. వీరు భద్రతా బలగాల కార్యకలాపాలను రికార్డు చేసేందుకే వచ్చారని ఆరోపించింది.



బాల రాముడికి సూర్యతిలకం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భవ్య మందిరంలో కొలువుదీరిన బాల రాముడికి ఆదివారం సూర్య భగవానుడు తిలకం అద్దడం చూసి భక్తులు పులకించిపోయారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన తిలకం 4 నిమిషాలపాటు కొనసాగడం అమితంగా ఆకట్టుకుంది. కొందరు గర్భాలయంలో ఆనందంతో నృత్యాలు చేశారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సూర్యతిలకం అద్దే కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది. అలాగే ప్రభు శ్రీరామ్‌లల్లాకు అర్చకులు ప్రత్యేకంగా మహా మస్తకాభిషేకం నిర్వహించినట్లు తెలియజేసింది. 56 పదార్థాలతో కూడిన భోగ్‌ను శ్రీరాముడికి నివేదించారు. ప్రత్యేక హారతి ఇచ్చారు. గర్భాలయంలో సూర్యతిలకం, మహా మస్తకాభిషేకాన్ని నేరుగా చూడలేని భక్తులు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి తన్మయులయ్యారు. శ్రీరామ నవమి సందర్భంగా బాలరాముడిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికిపైగా తరలివచ్చినట్లు అంచనా.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



రండి.. ఉద్యోగాలిస్తాం!

టెక్ సపోర్టర్ పేరుతో లింకులు పంపించి అందినంత దోచేశారు. ఇలా మోసాలకు పాల్పడిన 15 మంది టెలీ కాలర్స్ ఇటీవల సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. -8లో



ఇంటి రుచులకు కేరాఫ్..

పాపులర్ హోమ్ చెఫ్స్ జాబితాలో లిస్టింగ్‌లూ కామన్‌గా మారుతోంది. మొత్తానికి ఇంటి రుచులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు హోమ్ చెఫ్స్. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





సీతారామ్ బాగ్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర



లంగర్‌హౌస్‌లో సీతారాముల కల్యాణం

నేత్రపర్వంగా.. యాత్ర గర్వంగా..

జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్.. అంటూ భక్తుల నినాదాలతో ఆదివారం భాగ్య నగరం మార్మోగింది. ఇటు సీతారాముల కల్యాణోత్సవం.. అటు శోభాయాత్ర ఉత్సాహం.. వెరసీ.. శ్రీరామ నామస్మరణతో సిటీ అంతా మైమరిచిపోయింది. శ్రీరామ నవమి వేడుకలు నగరంలో కన్నుల పండువగా జరిగాయి. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్ దేవాలయాలు ఆధ్యాత్మికతతో పులకించాయి. జానకీ రాముల కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి భారీ బందోబస్తు మధ్య ప్రారంభమైన శ్రీరామ నవమి శోభాయాత్ర ఆద్యంతం భక్తులను అలరించింది. సీతారామ్‌బాగ్, బోయిగూడ కమాన్ చౌరస్తా, మంగళ్‌హాట్ మీదుగా కొనసాగింది. శోభాయాత్ర రహదారులన్నీ కాషాయమయంగా మారాయి. కాగా.. లంగర్‌హౌస్ త్రివేణి సంగం చారిత్రక మత దేవాలయం జానకీ సమేత వీరవెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.



శోభాయాత్రలో కాషాయ జెండాతో ఉత్సాహంగా ఓ చిన్నారి

అంబర్‌పేటలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి





గదతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అంబర్‌పేటలో సాగుతున్న శోభాయాత్ర



శోభాయాత్రలో త్రిశూలంతో ఎమ్మెల్యే రాజాసింగ్



లంగర్‌హౌస్‌లో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సీతారామ్ బాగ్‌లో శోభాయాత్ర

పుష్పక్ బస్సుల్లో రూట్ పాస్‌లు



- ప్రయాణికుల ఆదరణ పొందే దిశగా ఆర్టీసీ ప్రణాళికలు
- అందుబాటులో నెలవారీ పాస్‌లు సైతం..

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ పుష్పక్ బస్సుల్లో రూట్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. నగరంలో ఎక్కడి నుంచైనా ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించేందుకు నెలవారీ పాస్‌లు ఉన్నాయి. అలాగే కొన్ని నిర్దిష్టమైన మార్గాల్లో మాత్రమే ప్రయాణం చేసేందుకు అనుగుణంగా రూట్‌పాస్‌లు దోహదం చేస్తాయి. ఎయిర్‌పోర్ట్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

53 పుష్పక్ సర్వీసులు..

ప్రస్తుతం వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 53 పుష్పక్ ఏసీ బస్సులు ఎయిర్‌పోర్టుకు నడుస్తున్నాయి. 24 గంటల పాటు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. ఎయిర్‌పోర్టు ప్రయాణికుల కోసం వీటిని నడుపుతున్న సంగతి తెలిసిందే. కానీ ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోకి వచ్చే బస్సులకు లభించినట్లు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే సర్వీసులను ప్రయాణికులు ఆదరించడం లేదు. దీంతో పుష్పక్ ఆక్యుపెన్సీ 60 శాతానికే పరిమితమవుతోంది. ప్రతిరోజూ సుమారు 55 వేల మంది డొమెస్టిక్ ప్రయాణికులు, మరో 15 వేల మంది అంతర్జాతీయ ప్రయాణికులు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా పుష్పక్‌లను నడుపుతున్నప్పటికీ ఆదరణ తక్కువగానే ఉంది. దీంతో వివిధ మార్గాల్లో ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది.

నాలుగు రూట్‌లలో..

సుమారు 12 వేల మందికి పైగా ఉద్యోగులు ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్నట్లు అంచనా. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న ఈ ఉద్యోగులంతా వివిధ మార్గాల్లో ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తున్నారు. వీరిని ఆకట్టుకొనేందుకు ఆర్టీసీ రూట్ పాస్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులు నెలవారీ పాస్‌లతో పాటు తమ అవసరాలకు అనుగుణంగా ఈ నాలుగు మార్గాల్లో రూట్‌పాస్‌లను తీసుకోవచ్చు.

రూట్‌పాస్‌లు ఇలా..

- నగరంలో ఎక్కడి నుంచైనా ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించేందుకు నెలవారీ పాస్ రూ.5,260
- శంషాబాద్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు రూ.2,110
- ఆరాంఘర్, బాలాపూర్ నుంచి ఎయిర్‌పోర్టుకు రూ.3,160
- ఎల్బీనగర్, గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టుకు రూ.4,210

గూబ గుయ్!



మోటారు హారన్ మోతలతో చెవులకు చిల్లు

- నగరంలో మితిమీరిన శబ్ద కాలుష్యం
- గచ్చిబౌలి- జీడిమెట్ల- ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో..
- వాహనాలకు స్పెషల్ సైలెన్సర్లు బిగిస్తున్న యజమానులు
- కొన్ని హాట్ స్పాట్లలో 110 డెసిబుల్స్ నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వాహనాల మోత దడ పుట్టిస్తోంది. అవసరం లేకున్నా మోగిస్తున్న హారన్‌లతో రహదారులు దద్దరిల్లిపోతున్నాయి. గచ్చిబౌలి, జీడిమెట్ల, ఉప్పల్, ఫలక్‌నుమా, హుస్సేన్‌సాగర్ తదితర ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయిలో శబ్దాలు నమోదవుతున్నాయి. కొన్ని హాట్ స్పాట్‌లలో 110 డెసిబుల్స్ నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. దీని ప్రభావం వినికిడి శక్తి, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల మధ్య..

కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం.. నగరంలో వివిధ ప్రాంతాలను బట్టి శబ్ద తీవ్రత 45 నుంచి గరిష్ఠంగా 65 డెసిబుల్స్ మధ్య ఉండాలి. అయితే.. జూబ్లీహిల్స్, అబిడ్స్, తార్నాక, గచ్చిబౌలి, జూపార్క్, ఫలక్‌నుమా, ఉప్పల్, హుస్సేన్‌సాగర్, సనత్‌నగర్, జీడిమెట్ల, గడ్డపోతారం తదితర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో 100 డెసిబుల్స్ మించిపోతోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గచ్చిబౌలి- ఉప్పల్ దారిలో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల మధ్య 110 డీబీ శబ్దం నమోదవుతోంది. మోటారు వాహన చట్టం ప్రకారం అనవసరంగా హారన్ మోగించడం నిషేధం.

- సిటీ పరిధిలో మోటారు సైకిల్, కారు, ఆటో, బస్సు, లారీ, ఇతర ప్రైవేటు వాహనాలకు భారీ శబ్దాలు వచ్చే హారన్, సైలెన్సర్లు బిగిస్తున్నారు. పోలీసులు అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్‌లో మోటారు సైకిళ్ల సైలెన్సర్లపై చలానాలు విధిస్తున్నారు. మిగతా హెవీ వెహికిల్స్‌పై మాత్రం దృష్టి పెట్టడం లేదు.

ఆటోమేటిక్ చలానా సిస్టం..

నగరంలో శబ్ద కాలుష్యాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి ట్రాఫిక్ పోలీసులు 2020లో సిగ్నళ్ల వద్ద అకౌస్టిక్ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఫలితంగా సిగ్నల్ దగ్గర పరిమితికి మించి ఎవరైనా హారన్ మోగించినా, ఇంకా ఏ ఇతర కారణాలతోనైనా నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువ శబ్దం చేస్తే ఈ మీటర్ ఆటోమేటిక్‌గా ఫొటో తీసి, చలానా వేస్తుంది. ఇది ప్రతిపాదనలకే పరిమితమైంది.

కర్ణభేరి పగిలితే కష్టమే..



పరిమితికి మించి శబ్దం చేయడం వల్ల వినికిడి లోపం వస్తుంది. 20 డీబీ వకు సేఫ్. నగరంలో సుమారు 70 డీబీ నమోదవుతోంది. ఇది కొంత ప్రమాదకరమే. కళ్లు తిరగడం, ట్యూమర్ వంటివి వచ్చే అవకాశం ఉంది. పనిలో ఏకాగ్రత దెబ్బ తింటుంది. చెవిలోని కర్ణభేరి పగిలితే మళ్లీ దాన్ని పునరుద్ధరించలేం.
– భూపేందర్ రాథోడ్, ప్రొఫెసర్, ఈఎన్‌టీ హెచ్‌ఓడీ, గాంధీ ఆసుపత్రి

హారన్‌ను వీడితే 50 శాతం ధ్వని కాలుష్యం తగ్గుతుంది..



2017 మోటారు వెహికిల్ చట్టం ప్రకారం ప్రమాదమనిపిస్తే తప్ప డ్రైవర్ హారన్ మోగించరాదు. దీన్ని ఎవరూ పాటించడంలేదు. హారన్‌కు బదులు బ్రేక్ వినియోగించాలి. హారన్ వినియోగించకపోతే సుమారు 50 శాతం సమస్య పరిష్కారమవుతుంది. – నరేష్ రాఘవన్, రహదారి భద్రత నిపుణులు

అప్పు డబ్బులు అడిగినందుకు
అంతమొందించాడు

- సికింద్రాబాద్ బోయిగూడలో వ్యక్తి దారుణ హత్య
- మృతదేహాన్ని నీటి సంపులో వేసి నిందితుడి పరార్



హతుడు సత్‌నమ్ సింగ్   నిందితుడు నవీన్

బన్సీలాల్‌పేట్: అప్పు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సికింద్రాబాద్‌లోని బోయిగూడలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. అల్వాల్ ప్రాంతానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి సత్‌నమ్ సింగ్ భాటియా (59) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండేవాడు. బోయిగూడలో టీ కొట్టు నడుపుతున్న నవీన్ (31)కు ఆయన రూ.లక్ష అప్పు ఇచ్చాడు. చాలా రోజులుగా నవీన్ అప్పు డబ్బులు ఇవ్వకుండా సత్‌నమ్ సింగ్‌ను తిప్పించుకుంటున్నాడు. టీ కొట్టు కూడా మూసివేసి తప్పించుకు తిరుగుతున్నాడు. నవీన్ ఇంటి అడ్రస్‌ను తెలుసుకొన్న సత్‌నమ్ సింగ్ ఇటీవల బోయిగూడలోని నిందితుడి ఇంటికి వచ్చిపోతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4న రాత్రి నవీన్ మాట్లాడుకుందామంటూ సత్‌నమ్ సింగ్ భాటియాను ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి ఇంట్లోకి వెళ్లారు. వీరి మధ్య డబ్బుల విషయమై ఘర్షణ జరిగింది. దీంతో నవీన్ సత్‌నమ్ సింగ్‌ను పలు చోట్ల కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఇంటిలోని నీటి సంపులో మృతదేహాన్ని పడేసి సత్‌నమ్ సింగ్ ద్విచక్ర వాహనాన్ని తీసుకొని పరారయ్యాడు.

సెల్‌ఫోన్ ఆధారంగా ..

హత్యకు ముందు.. సత్‌నమ్ సింగ్ భాటియా తన ఫోన్‌లో బ్యాలెన్స్ లేకపోవడంతో బోయిగూడ ప్రాంతంలోని ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకొని కుటుంబ సభ్యులకు కాల్ చేశాడు. మరుసటి రోజు వరకు అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అల్వాల్, ముషీరాబాద్ పోలీసు స్టేషన్‌లలో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ ఆధారంగా బోయిగూడ ప్రాంతానికి వచ్చి వాకబు చేశారు. హతుడి సెల్‌ఫోన్ సిగ్నల్ బోయిగూడలోనే చూపించడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. సత్‌నమ్ సింగ్ కుటుంబీకులు, పోలీసులు శనివారం రాత్రి బోయిగూడకు వచ్చి నవీన్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి లోనికి వెళ్లారు. ఎక్కడా మృతుడి ఆచూకీ.. ఆనవాళ్లు కనిపించలేదు. చివరి ప్రయత్నంగా నీటి సంపును తెరిచి చూడగా.. సత్‌నమ్ సింగ్ భాటియా మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

మెరుపుల్లేవ్..









ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసక బ్యాటింగ్ చేస్తారని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. హైదరాబాద్ బ్యాటర్లెవరూ మెరుపు ప్రదర్శన కనబర్చలేదు. సాధారణంగా సిక్సర్లతో హోరెత్తించే టీమ్ నుంచి సిక్స్‌ల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ఎక్కువ సేపు మైదానంలో నిశ్శబ్దమే కనిపించింది. ఫ్యాన్స్ ఎంజాయ్ చేయగలిగేంత అద్భుత ప్రదర్శన, ఆసక్తికర క్షణాలేవీ కూడా లేకుండా సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ ఆసాంతం ఒకే తరహాలో అతి సాధారణంగా సాగిపోయింది. గత రెండు మ్యాచ్‌లతో పోలిస్తే అభిమానులు ఆటను పూర్తిగా ఆస్వాదించలేకపోయారు. మరోవైపు గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడుతున్న 'లోకల్ బాయ్' సిరాజ్ బౌలింగ్ చేస్తున్న సమయంలో మాత్రం అందరూ బాగా ప్రోత్సహించారు. ప్రత్యర్థి జట్టు తరఫున సన్‌రైజర్స్‌పై ఆధిక్యం కనబరిచినా... అతడి బౌలింగ్ సమయంలో ప్రతీ బంతికి కాస్త హోరు వినిపించింది. ఈ మ్యాచ్‌కు దాదాపు హౌస్‌ఫుల్‌గా దాదాపు 36 వేల మంది ప్రేక్షకులు హాజరు కావడం విశేషం. – సాక్షి, హైదరాబాద్

స్నేహితుల దాడిలో వ్యక్తి మృతి

- పరారీలో నిందితులు
- కేసు నమోదు



ఆకాశ్ సింగ్ (ఫైల్)

మల్కాజిగిరి: స్నేహితుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలికి చెందిన ఆకాశ్ సింగ్ (29) పెయింటర్. ఇదే ప్రాంతానికి చెందిన ఇంతియాజ్, ఆకాశ్ ఇద్దరూ స్నేహితులు. వ్యక్తిగత కారణాలతో కొంతకాలంగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున ఇంతియాజ్ సోదరుడు షారూక్ ఇంటికి రాకపోవడంతో అతడికి ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో జెడ్‌టీసీ గ్రౌండ్స్ వద్దకు వెళ్లి చూసేసరికి ఆకాశ్ సింగ్ అతడి మరో స్నేహితుడు కిషన్, షారూక్ మద్యం తాగుతూ కనిపించారు. దీంతో ఆగ్రహించిన ఇంతియాజ్ అతడితో తిరగవద్దని మందలించాడు. మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఇంతియాజ్ దగ్గరలోనే ఉన్న సిమెంట్ ఇటుకతో ఆకాశ్ తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సోదరులిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనా స్థలంలో ఉన్న కిషన్.. విషయాన్ని ఆకాశ్ కుటుంబ సభ్యులకు చెప్పగా.. వెంటనే వారు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆకాశ్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఆ పార్టీలకు దోచుకోవడమే తెలుసు


పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

- తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బడంగ్‌పేట్: తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దోచుకోవడం, దాచుకోవడానికే వచ్చాయని.. సేవ చేద్దామని కాదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బడంగ్‌పేట్‌లోని కాకతీయ స్కూల్ వద్ద చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేద్దామన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా 11 ఏళ్లుగా మోదీ దేశాన్ని పరిపాలిస్తున్నారని, ఇంతకంటే ఈ దేశానికి నీతివంతమైన దేశ భక్తుడిని ఎవరు తేగలరని ప్రశ్నించారు. నేటి నుంచి అంబేడ్కర్ జయంతి వరకు ప్రతి కార్యకర్త ఇంటిపై పార్టీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజుభూపాల్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, పార్టీ అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

హయత్‌నగర్: సాంకేతిక విద్యలో అనేక మార్పులు వస్తుంటాయని, విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలని తెలంగాణ విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి సూచించారు. పుస్తకాలతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే వెబ్‌సైట్‌ల సహాయాన్ని తీసుకోవాలని చెప్పారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని తట్టిఅన్నారం శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హృదయ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది 484 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించామని, రూ.10 లక్షల వార్షిక వేతనంతో కంపెనీలు వారిని ఎంపిక చేసుకున్నాయని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌కు బైక్ ర్యాలీ


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహేశ్వరం మండల కేంద్రం అంబేడ్కర్ విగ్రహం నుంచి కొంగర కలాన్ కలెక్టరేట్‌కు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలను ఫ్యూచర్‌లో విలీనం చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల దృష్టికి ఇదే విషయాన్ని తీసుకెళ్తామని తెలిపారు. బైక్ ర్యాలీలో అన్ని గ్రామాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల సభ్యులు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మనోహర్, సుదర్శన్ యాదవ్, నర్సింహ యాదవ్, దత్తు, నర్సింహ గౌడ్, కృష్ణ, రవీందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

శోభాయమానం.. కాషాయమయం

- కన్నుల పండువగా శ్రీరామ నవమి శోభాయాత్ర
- జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తిన సిటీ
- ఆకట్టుకున్న విగ్రహాలు, చిన్నారుల వేషధారణలు

అబిడ్స్/జియాగూడ/సుల్తాన్‌బజార్/అఫ్జల్‌గంజ్: నగరంలో ఆదివారం శ్రీరామ నవమి శోభాయాత్ర అట్టహాసంగా కొనసాగింది. జై శ్రీరామ్ నినాదాలు, దేవతామూర్తుల విగ్రహాల ప్రదర్శన, దేశభక్తుల విగ్రహాల ప్రదర్శనతో శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాషాయ జెండాలు చేతబూనిన యువతీ యువకులు యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ స్వయంగా శోభాయాత్ర బందోబస్తును పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం సీతారామ్‌బాగ్ ఆలయం వద్ద భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. అక్కడి నుంచి సీతారామ్‌బాగ్, బోయిగూడ కమాన్ చౌరస్తా, మంగళ్‌హాట్ మీదుగా యాత్ర కొనసాగింది. మధ్యాహ్నం వేళ శ్రీరామ నవమి పల్లకి శోభాయాత్రను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రారంభించారు. మూడు గంటల సమయంలో ధూల్‌పేట గంగాబౌలి నుంచి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభమైంది. ఈ మూడు శోభాయాత్రలు మంగళ్‌హాట్ అనిత టవర్ వద్ద కలుసుకొని ముందుకు సాగాయి. జాలి హనుమాన్, పురానాపూల్, జుమ్మెరాత్ బజార్, చుడీబజార్, భేగంబజార్ ఛత్రి, సిద్దింబర్ బజార్, గౌలిగూడ, కోఠి, హనుమాన్ టేక్డీ వరకు లక్షలాది మంది భక్తుల మధ్య శ్రీరాముడి భక్తిగీతాలు, జై శ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు.

కాషాయమయమైన నగరం

సీతారామ్‌బాగ్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కారణంగా ధూల్‌పేట, మంగళ్‌హాట్, గంగాబౌలి, జాలి హనుమాన్, పురానాపూల్, బేగంబజార్, సిద్దింబర్‌బజార్‌తో పాటు పలు ప్రాంతాలు కాషాయమయంగా మారాయి. రామభక్తులు కాషాయ జెండాలు ఎగరవేస్తూ జై శ్రీరామ్ నినాదాలు చేశారు. పలు చౌరస్తాలు, కీలక ప్రాంతాల్లో, పలు వ్యాపార సంస్థల వద్ద కాషాయ జెండాలు ఎగరవేశారు.


సీతారామ్‌బాగ్ శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

దీపకాంతుల హారతులతో ముగింపు

సుల్తాన్‌బజార్: దేశ ద్రోహులతో తమ యుద్ధం ఎప్పటికీ కొనసాగుతుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సీతారాంబాగ్ రామ మందిర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఆదివారం రాత్రి 10.30 గంటలకు కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల చౌరస్తాలో ముగిసింది. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలకు వందలాది మంది దీపకాంతులతో హారతులిచ్చారు. అనంతరం శ్రీరామ నామ స్మరణలతో హనుమాన్ టేక్డీ చౌరస్తా మారుమోగింది. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ..... హిందూ రాష్ట్రాన్ని అడ్డుకునే వారితో తమ పోరాటం ఉంటుందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా శ్రీరామనవమి శోభాయాత్ర విజయవంతంగా జరిగిందన్నారు. తమకు సహకరించిన వారికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.


హనుమాన్‌టేక్డీ చౌరస్తాలో వందలాది మంది రామభక్తులతో హారతి దృశ్యం

- శోభాయాత్రలో అయోధ్యలో ప్రతిష్ఠించిన రామ్‌లల్లా తరహా విగ్రహం అందరిని ఆకట్టుకుంది. ఇటీవల దేశంలోనే హైలెట్‌గా నిలిచిన చావా సినిమాలోని శంభాజీ మహారాజ్ విగ్రహం అందరిని అలరించింది.
- కోదండరాముడి భారీ విగ్రహం, ఛత్రపతి శివాజీ, సీతారామలక్ష్మణ ఆంజనేయ రథం, వీర హనుమాన్, శ్యాంబాబా, రాణి అవంతీ బాయి, బలశాలి హనుమాన్ విగ్రహాలు, శివపార్వతుల తాండవ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు భవనాలు, ఇళ్ల డాబాలపైకి ఎక్కి ర్యాలీని తిలకించారు..
- శోభాయాత్ర బందోబస్తును నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ స్వయంగా పర్యవేక్షించారు. ఆదివారం సీతారామ్‌బాగ్, ధూల్‌పేట్, బేగంబజార్, కోఠి వరకు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం పోలీసు కంట్రోల్‌రూమ్ ద్వారా డీసీపీలకు, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు చేస్తూ బందోబస్తు నిర్వహించారు.
- అనంతరం బంజారాహిల్స్‌లోని పోలీస్ టవర్ నుంచి సీసీ టీవీలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మోదీ, యోగి ఆధ్వర్యంలో భారత్ నెంబర్ వన్: ఎమ్మెల్యే రాజాసింగ్

ప్రధాని నరేంద్రమోది, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల ఆధ్వర్యంలో భారత దేశం ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా మారుతుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట, పురానాపూల్, భేగంబజార్ ఛత్రి చౌరస్తాల్లో రామభక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భారత్ హిందూ దేశంగా మారాలంటే ప్రతి హిందువు ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా రాజాసింగ్ పలు గీతాలను ఆలపించారు. దేశంపై, శ్రీరాముడిపై పాటలు పాడుతూ రామ భక్తులు, యువతను ఉత్తేజపరిచారు. అఖండ హిందూ దేశంగా భారత్‌ను మార్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ చేశారని, అది మోదీకే సాధ్యమైందన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు పాస్ అయ్యిందని ఒవైసీ బ్రదర్స్ అరుపులు, కేకలు పెడుతున్నారని, వారి అరుపులకు భయపడేది లేదని రాజాసింగ్ పేర్కొన్నారు.



బందోబస్తు లైవ్‌ను పర్యవేక్షిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్


బందోబస్తులో పోలీసులు

రండి.. ఉద్యోగాలిస్తాం!

- నిరుద్యోగ యువతకు సైబర్ నేరస్తుల వల
- నకిలీ కాల్ సెంటర్లలో టెలీకాలర్లుగా నియామకం
- వీరితో సైబర్ మోసాలు చేయిస్తున్న కేటుగాళ్లు
- జీతంతో పాటు కమీషన్ అందిస్తూ యువతకు వల

సాక్షి, సిటీబ్యూరో: పశ్చిమ బెంగాల్‌కు చెందిన సైబర్ నేరగాళ్లు పేట్ బషీరాబాద్‌లో నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. హిందీ, ఇంగ్లీష్ మాట్లాడం వచ్చిన సిటీకి చెందిన యువతీ యువకులను టెలీకాలర్స్‌గా నియమించుకున్నారు. అమెజాన్ ప్రైమ్ సబ్ స్క్రిప్షన్, ఇంటర్నెట్ స్పీడ్ పెంచుతామని వారితో కస్టమర్లకు కాల్స్ చేయించేవారు. టెక్ సపోర్టర్ పేరుతో లింకులు పంపించి అందినంత దోచేసేవారు. ఇలాంటి మోసాలకు పాల్పడ్డ 15 మంది టెలీకాలర్స్ ఇటీవల సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. కానీ అసలు నేరగాళ్లు మాత్రం చిక్కలేదు...ఇదొక్కటే కాదు ఇలాంటి నకిలీ కాల్ సెంటర్ల మోసాలు గ్రేటర్‌లో కోకొల్లలు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాల కోసం నిరుద్యోగ యువతను టార్గెట్ చేస్తున్నారు. టెలీ కాలర్ ఉద్యోగాల పేరుతో ట్రాప్ చేసి సైబర్ మోసాల్లో వారిని ఇరికిస్తున్నారు. హిందీ, ఇంగ్లీష్ బాగా మాట్లాడటం వస్తే చాలు.. ఎలాంటి ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ లేకుండానే జాబ్ ఆఫర్ చేస్తున్నారు. విదేశీ సంస్థలకు ఔట్ సోర్సింగ్ వర్క్ చేస్తున్నట్లు టెలీకాలర్లుగా రిక్రూట్ అయిన వారిని నమ్మించి ఫేక్ ఐడీలు, అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇస్తున్నారు. బ్యాంక్‌లు, ఈ– కామర్స్ సైట్ల కోసం థర్డ్ పార్టీ కస్టమర్ కేర్ సెంటర్లను నడుపుతున్నట్లు చెబుతూ సైబర్ మోసాలు చేయిస్తున్నారు. డార్క్‌వెబ్ సైట్లు, ఏజెన్సీల నుంచి పబ్లిక్ ఫోన్ నంబర్ల డేటా బేస్‌ను కొనుగోలు చేస్తున్నారు. టార్గెట్ రీచ్ అయిన వారికి వేతనంతో పాటు కమీషన్లు కూడా ఇస్తుండటంతో నిరుద్యోగ యువత ఆకర్షితులవుతున్నారు.



నకిలీ కాల్ సెంటర్లు..

బ్యాంక్ లోన్ ఫ్రాడ్స్, లోన్ యాప్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, జాబ్ ఫ్రాడ్ సహా ఆన్‌లైన్ మోసాల్లో ఫేక్ కాల్ సెంటర్లు కీలకం. ఢిల్లీ, నోయిడా, కర్నాటక, యూపీ, పశ్చిమ బెంగాల్ వంటి ఉత్తరాది రాష్ట్రాల కేంద్రంగా నకిలీ కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫేక్ అడ్రస్‌లో సిమ్ కార్డులు, బ్యాంకు అకౌంట్లు క్రియేట్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. నిరుద్యోగ యువతను టెలీకాలర్లుగా నియమించుకుంటున్నారు. ఉద్యోగులుగా జాయిన వారి స్మార్ట్ ఫోన్లను ఆఫీస్ పరిసర ప్రాంతాల్లోకి అనుమతించకుండా బేసిక్ ఫోన్లు చేతికి ఇస్తున్నారు. హిందీ, ఇంగ్లీష్ మాట్లాడే వారికి ఇంపార్టెన్స్ ఇస్తూ, అవతలి వారిని నమ్మించే విధంగా అమ్మాయిలకు స్పెషల్ ట్రెనింగ్ ఇస్తున్నారు. కాల్ సెంటర్లో పనిచేసే ప్రతి ఒక్కరిని ఆర్గనైజర్లు పరిశీలిస్తుంటారు. అనుమానాస్పదంగా ప్రవర్తించే వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తారు. దీంతో పాటు సీసీటీవీ కెమెరాలు వాయిస్ రికార్డ్‌లతో కట్టుదిట్టమైన నిఘా ఉంటుంది.

మెట్రో నగరాలే టార్గెట్..

సౌత్ ఇండియాలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే ఎక్కువ శాతం మందికి హిందీ అర్థమవడం. మాట్లాడటం వచ్చు. దీంతో హిందీ మాట్లాడటం తెలిసిన స్థానిక యువతనే టెలీ కాలర్స్‌గా నియమించుకుని కాల్స్ చేయిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూర్, చెన్నైలాంటి మెట్రో సిటీలను టార్గెట్ చేసేందుకు స్పష్టమైన ఇంగ్లీష్ మాట్లాడే వారిని టెలీకాలర్లుగా నియమిస్తున్నారు. నకిలీ కాల్ సెంటర్లపై పోలీసులు దాడులు చేసిన సమయంలో ఆఫీస్ మేనేజర్లు, టీమ్‌లీడర్లు, టెలీకాలర్లు మాత్రమే పోలీసులకు చిక్కుతున్నారు. ఎక్కడో విదేశాల్లో ఉంటూ ఇక్కడ సైబర్ మోసాలకు పాల్పడుతుండటంతో ప్రధాన సూత్రధారులు పోలీసులకు చిక్కడం లేదు.

ఆలయ హుండీలో రద్దయిన రూ.2వేల నోట్ల కట్టలు



పహాడీషరీఫ్: ఆలయ హుండీలో రద్దయిన రూ.2వేల నోట్ల కట్టలు రెండు బయటపడ్డాయి. ఈ సంఘటన బాలాపూర్ మండలం మామిడిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణోత్సవం అనంతరం గత ఏడాది కాలానికి సంబంధించి హుండీ లెక్కింపు కోసం ఆలయ కమిటీ సభ్యులు తెరిచారు. అందులో రద్దయిన రూ.2 వేల నోట్ల కట్టలు రెండు బయటపడ్డాయి. వాటిని లెక్కించగా రూ.2 లక్షలుగా తేలింది. దీనిని ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళ్తామని నిర్వాహకులు తెలిపారు.

24న చుక్కా రామయ్య ప్రవేశ పరీక్ష

అనంతగిరి: ఐఐటీ చుక్కా రామయ్య ట్రస్ట్‌లో ఉచిత విద్య కోసం ఈ నెల 24న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు 5, 6, 7 తరగతుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎంట్రెన్స్‌కు ఈ నెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94404 83015, 96521 802819, 98495 85729, 94916 76672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: బాగాయత్ రామారావు జ్ఞాపకార్థం ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వంద మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. నిర్వాహకులు బాగాయత్ నాగేశ్వరరావు, వైద్యులు పవన్‌కుమార్, రేఖ పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య


యమున (ఫైల్)

చేవెళ్ల: వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. చేవెళ్ల హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండే గోవిందగారి పురుషోత్తంరెడ్డికి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కాళీమందిర్‌కు చెందిన తరుణి అలియాస్ యమున(30)తో వివాహ జరిగింది. కొన్నేళ్ల పాటు వారిద్దరూ అన్యోన్యంగా ఉన్నారు. అనుకోకుండా శనివారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఆమె గదిలో గడియ పెట్టుకొని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎంత పిలిచినా బయటకు రాకపోవటంతో కుటుంబసభ్యులు తలుపు తెరిచి చూడగా విగత జీవిగా కనిపించింది. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అండగా ఉంటా..

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 240, 241, 242లోని ప్లాట్లు, ఇళ్ల యజమానులకు అండగా ఉంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ప్లాట్ల యజమానులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన.. న్యాయ పరంగా పోరాటం చేయాలని, అందుకు అవసరమైన సహాయం చేస్తానని హామీనిచ్చారు. అదే విధంగా 40 ఏళ్ల క్రితమే లేఅవుట్ వేయడంతో ప్లాట్లుగా మారాయని, దీనిని రాజమ్మ తరఫు వారికి రిజిస్ట్రేషన్ చేయవద్దని తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి ఫోన్‌ద్వారా సూచించారు.

భూమి దక్కదనే కక్షతో..

సుపారీ ఇచ్చి హత్య చేసిన దాయాదులు

- హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ వెంకటేశ్వర్లు

మహేశ్వరం: భూమిపై ఆత్యాశ ప్రాణాలు తీసింది. ఐదెకరాల పొలం తమకు దక్కదనే కక్షతో దాయాదిని సుపారీ ఇచ్చి కారుతో ఢీకొట్టి హత్య చేయించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(60)కు తన దాయాదులైన గూడెపు నర్సింగ్‌రావు, గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లతో తండ్రుల కాలం నుంచి భూ తగాదాలున్నాయి. ప్రస్తుతం అవి కోర్టులో నలుగుతున్నాయి. ఇటీవల శంకరయ్యకు అనుకూలంగా ఐదు ఎకరాల భూమిపై ఇంజెక్షన్ ఆర్డర్ వచ్చింది. దీంతో వివాదాస్పదమైన భూమిలోకి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించారు. ఇది రుచించని దాయాదులు ఎలాగైన ఆయన్ని మట్టుబెట్టాలని పథక రచన చేశారు. ఇందుకు అదే గ్రామానికి చెందిన కొండని ప్రశాంత్‌ను ఎంపిక చేసుకున్నారు. తనకున్న రూ.12 లక్షల అప్పు తీర్చడంతో పాటు ఇల్లు నిర్మిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 2న మధ్యాహ్నం బైక్‌పై శంకరయ్య వెళుతుండగా ప్రశాంత్ కారులో వెనుక నుంచి ఢీకొటి హత్య చేశాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్, కాల్‌డాటా ఇతర వివరాలపై దర్యాప్తు ప్రారంభించారు. ముందుగానే పోలీసులు కారు డ్రైవర్ ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు చెప్పాడు. ఈ మేరకు నిందితులు గూడెపు నర్సింగ్‌రావు, బక్కని కార్తీక్(నర్సింగ్ రావు బామ్మర్ది), గూడెపు కుమార్, గూడెపు శ్రీనివాస్‌లను అరెస్టు చేశారు. హత్య కేసును ఛేదించిన మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లను డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి అభినందించారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.13, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.23, బెండకాయ.35, పచ్చిమిర్చి.45, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.43, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.38, క్యాబేజీ.8, క్యారెట్.15, దొండకాయ.28, గుండు బీన్నీస్.65, గింజచిక్కుడు.55, గోకరకాయ.35, కీర.15, దోసకాయ.18, బీట్‌రూట్.15, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.25, చామగడ్డ.38, మొరంగడ్డ.18, కందగడ్డ.60, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ.9, పొట్లకాయ.18, అరిటికాయ.9, మునగకాయ.4, మామిడికాయ.30, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.23. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

'భూముల పేరిట రాజకీయాలు సరికాదు'

లిబర్టీ: భూముల పేరిట రాజకీయాలు చేయడం విపక్షాలు మానుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు కోరారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గచ్చిబౌలిలోని ప్రభుత్వ భూమిని సెంట్రల్ యూనివర్సిటీ భూమిగా ప్రచారం చేస్తూ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన చేసి రాజకీయ ప్రయోజనాల కోసం వెంపర్లాడుతున్నారని ఆరోపించారు.

మూసేసిన ప్రభుత్వ పాఠశాలలు తెరవాలి

హిమాయత్‌నగర్: గతంలో వివిధ కారణాలతో మూసేసిన ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ స్కూల్స్‌ను తిరిగి ప్రారంభించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అలాగే వాటికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యను ఎలా అభివృద్ధి చేశారో ఇక్కడ కూడా చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ విద్యా సంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో పాటు బ్యాక్‌లాగ్ పోస్టులు యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: మైనర్ డ్రైవింగ్‌కు కళ్లెం వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టోలిచౌకీ ట్రాఫిక్ పోలీసులు శనివారం టోలిచౌకీ, రింగ్ రోడ్డు, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఓ 14 ఏళ్ల మైనర్ బాలుడు టాటా ఏస్ ఆటోను నడుపుతుండడం గమనించి అతడిని ఆపారు. ఈ సందర్భంగా ఆటోకు సంబంధించిన ఆర్‌సీ బుక్‌ను స్వాధీనం చేసుకున్నామని ట్రాఫిక్ ఎస్సై షఫీక్ ఉర్ రహమాన్ తెలిపారు.

ఆర్థికసాయం



ఓల్డ్ బోయిన్‌పల్లి: స్కూల్, క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి యూనియన్ సభ్యులతో పాటు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉండే మురళి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను మృతి చెందడంతో డ్రైవర్స్ యూనియన్ స్వామి కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కార్పొరేటర్ డ్రైవర్ మురళి భార్య మాలతీకి రూ. 10 వేలు, డ్రైవర్స్ యూనియన్ సభ్యులు రూ. 16 వేలు కలిపి రూ. 26 వేలను బీఆర్ఎస్ నాయకుడు మల్లేష్‌యాదవ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు రాజేష్, నాగరాజు, ప్రశాంత్, రాజేష్, నవీన్, రితీష్, విజయ్, రాజు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. భర్త రిమాండ్

గచ్చిబౌలి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై విచక్షణా రహితంగా సిమెంట్ బ్రిక్‌తో దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లికి చెందిన మహ్మత్ బస్రత్(32) కోల్‌కత్తాకు చెందిన షబానా పర్వీన్(22)ను 2024 అక్టోబర్‌లో పెళ్లి చేసుకున్నాడు. హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. బస్రత్ తల్లిదండ్రులతో పర్వీన్ తరచు గొడవ పడుతుండటంతో రెండు నెలల క్రితం వేరు కాపురం పెట్టాడు. కాగా పర్వీన్‌కు వాంతులవుతుండడంతో రాఘవేంద్ర కాలనీలోని సియా లైఫ్ హాస్పిటల్‌లో చేర్పించాడు. ఏప్రిల్1న రాత్రి 10 గంటలకు డిశ్చార్జి చేయగా బయటకు వచ్చి ఇద్దరు గొడవపడ్డారు. కోపంతో బస్రత్ తన్నడంతో షబానా పర్వీన్ కిందపడి పోయింది. అక్కడ ఉన్న రెండు సిమెంట్ బ్రిక్‌లతో దాదాపు 15 సార్లు తల, శరీరంపై మోదాడు. చనిపోయిందనుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలిని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతోంది. వైద్యులు నిర్వహించిన పరీక్షలలో మూడు నెలల గర్భిణి అని తేలిందని, షబానా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం

- వేడుకల్లో పాల్గొన్న మేయర్, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు
- పలుచోట్ల ఊరేగింపు, అన్నదానాలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ హాళ్లలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో శ్రీ రామచంద్రమూర్తి సీతమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. పలుచోట్ల ఎమ్మెల్యే దానం, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అలాగే స్వామివారిని ఊరేగింపు.. అన్నదానాలు చేపట్టారు.

– ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల బృందం



వినాయకనగర్ పర్వతాంజనేయస్వామి ఆలయంలో కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్



మాగంటి కాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో ..



నందినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కవిత



ఎన్టీఆర్‌నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నందినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో..



వేడుకల్లో బీజేపీ హైదరాబాద్ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి



అన్నదానంలో బాబా ఫసియుద్దీన్..



కుమ్మరిబస్తీలో విజయారెడ్డి..



ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో ..



సీతారాముల కల్యాణంలో కార్పొరేటర్



వేడుకల్లో ఏసీపీ రమణ, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్



బంజారాహిల్స్ రోడ్డునంబర్-12 హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో..



శ్రీనగర్ కేశవ్‌నగర్ కాలనీలో..

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



హిమాయత్‌నగర్‌లో పార్టీ జెండా ఎగరవేస్తున్న చింతల రామచంద్రారెడ్డి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు కే.నర్సింగ్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సందీప్ సాయి, ఖైరతాబాద్ కన్వీనర్ వెంకట్ స్వామి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నవీన్, జాయింట్ కన్వీనర్ నరహరి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ డివిజన్‌లో..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, బీజేపీ కౌన్సిల్ మెంబర్ కాడిగారి భోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునం.14లోని భాగ్యనగర్ స్టూడియో ప్రాంతంలో నిబంధనలు ఉల్లంఘించి సాయిరాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్ పేరుతో అపార్ట్‌మెంట్లు నిర్మించారని చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్టీఏ యాక్టివిస్టులు చింతపల్లి రాంచందర్, వెంకన్న తదితరులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో నివేదిక ఇవ్వాలని లోకాయుక్తా జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించగా వారు తనిఖీలు నిర్వహించారు. స్టూడియోకు ఆనుకుని వరద కాలువ ఉండగా, స్లాబ్ నిర్మించారు. అలాగే జీ ప్లస్ 4 అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా రెండు సెల్లార్లు తవ్వడమే కాకుండా పెంట్‌హౌస్ కూడా నిర్మించారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు సదరు కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసు జారీ చేశారు. మరోవైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేయాలని తాజాగా ఫిర్యాదుదారులకు సూచించారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ థియేటర్ మీడియా రిపట్టరి నిర్వహిస్తున్న 24వ శిక్షణ శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆదివారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఔత్సాహిక యువతీ యువకులకు ఈ కార్యక్ర మం ఒక మంచి అవకాశమని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ప్రొడక్షన్ ఓరియంటెడ్ థియేటర్ యాక్టింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రమేష్ కిషన్‌గౌడ్ తెలిపా రు. ఆసక్తిగల అభ్యర్థులు 73968 17623, 92471 40023 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసుల పనితీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ఫిలింనగర్: దీన్‌దయాల్‌నగర్ బస్తీలో సీతారాముల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు పలువురు మహిళలు ఫిలింనగర్ పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. బస్తీలో గంజాయి, మద్యం తాగుతూ ఇష్టారాజ్యంగా తిరుగుతున్నవారిని పెట్రోలింగ్ పోలీసులు వదిలేస్తున్నారంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దానం ఫిలింనగర్ సీఐ శ్రీనివాస్‌లుకు ఫోన్ చేసి మాట్లాడారు. పెట్రోలింగ్ పోలీసులు డబ్బులు వసూలు చేస్తూ నిందితులును వదిలేస్తున్నారంటూ మహిళలు ఫిర్యాదు చేస్తున్నారని, మీరేమో ఉన్నతాధికారులు ఆడించినట్లు ఆడుతూ ప్రజా ఫిర్యాదులు గాలికి వదిలేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇకనైనా విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.



ఎమ్మెల్యే దానంకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

'తూతూమంత్రంగా పార్లమెంట్ సమావేశాలు'

లిబర్టీ: బీసీల సమస్యలు పరిష్కరించకుండానే పార్లమెంట్ సమావేశాలు తూతూ మంత్రంగా ముగించేశారని బీసీ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి మండిపడ్డారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు నెలరోజులకు పైగా సమావేశాలు జరిగినప్పటికీ బీసీల సమస్యలు ప్రస్తావించలేదని అలాగే బీసీల రిజర్వేషన్ బిల్లు కూడా పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు అన్ని రకాలుగా మోసం చేసిందని, బీసీల తిరుగుబాటు జరిగితే పాలకులే గద్దె దిగుతారని హెచ్చరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శాస్త్రీపురం కింగ్స్ కాలనీకి చెందిన అబ్దుల్ వహీద్(40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగా చూసుకోవడం లేదు. ఈ విషయమై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2వ తేదీన సైతం గొడవ జరగడంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అబ్దుల్ వాహిద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామాయణగాథ నృత్యరూపకం



మాదాపూర్: శ్రీరామనవమి సందర్భంగా శిల్పారామంలో ఆదివారం ప్రవీణ వాడపల్లి శిష్యబృందం శ్రీరాముని చరితము నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. దశరథ పుత్రకామేష్టి యాగం, విశ్వామిత్ర యాగం, రావణాసురుడి ప్రవేశం, సీత అపహరణం, హనుమంతుడి లంకదహనం, రామరావణ యుద్ధం , శ్రీరాముని పట్టాభిషేకం ఘట్టాలను ప్రదర్శించారు. కళాకారులు నందిని, శ్రేయ, అమూల్య, అనన్య, దీప్తి, అహనా, అనఘా, కాశ్వీ, స్వాతి, ఆద్య, ప్రియ, వర్షిణి, ధృవ, ప్రకృతి, రిషిక, అదితి, ఆర్య, శశి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరా మహిళాశక్తి బజార్‌లో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

'ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఈటి.నరసింహ

హిమాయత్‌నగర్: ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షణలో సీపీఐ శ్రేణులు ముందుండాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటి.నరసింహ సూచించారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ భవన్‌లో హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ.సలీం అధ్యక్షతన సీపీఐ హైదరాబాద్ జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం మత ప్రాతిపదికన దేశ ప్రజలను విభజించేందుకు కుట్రలను పన్నుతుందని తీవ్రంగా ప్రతిఘటించాలన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు హైదరాబాద్ లో బస్తీలు, కాలనీల్లో త్వరలో పాదయాత్రలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహ, జి.చంద్రమోహన్ గౌడ్, నిర్లేకంటి శ్రీకాంత్, చందు నాయక్, పడాల నళిని, కంపల్లి శ్రీనివాస్, షంషుద్దీన్, ఎండీ సలీం, ఎండ.ఒమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌ది రియల్ ఎస్టేట్ పాలనే..

పలువురు వక్తలు

పంజగుట్ట: రియల్ ఎస్టేట్ వ్యాపారి సీఎం అయితే ఎలా ఉంటుందో రేవంత్ రెడ్డి చేసి చూపిస్తున్నారని, ఆయన అధికారంలోకి రాగానే ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ భూములు హైకోర్టుకు, అనంతగిరి అడవులను నేవీ రాడార్‌కు, ఇప్పుడు హెచ్‌సీయూ భూములు అమ్ముకునేందుకు యత్నిస్తున్నాడని పలువురు వక్తలు విమర్శించారు. జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా (జేఎంఐ) ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తెలంగాణ విఠల్, జేఎంఐ ప్రతినిధి బద్రి మాట్లాడారు. సమావేశంలో జేఎంఐ ప్రతినిధులు ఆకాశ్, సురేందర్, నరేందర్, సురేశ్ భూషన్, ఐలేశ్, విజయ్, రేఖ, పరశురాం, అరుణ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన బాధ్యత ప్రభుత్వానిదే

బంజారాహిల్స్: యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జీహెచ్ఎంసీ స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఫిలింనగర్ లోని ఫిలింఛాంబర్ వద్ద ఏర్పాటు చేసిన లూ కేఫ్ అండ్ స్టోర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది స్వయం ఉపాధి అవకాశాలు దెబ్బతీసేలా వ్యవహరించవద్దన్నారు. కార్యక్రమంలో లూ కేఫ్ నిర్వాహకుడు పృథ్వీ, 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగ్ రావు, సిద్ధు, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లో లూ కేఫ్ అండ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం

కార్మికనగర్‌లో చలివేంద్రం ప్రారంభం

రహమత్‌నగర్: స్థానికుడు దండుగుల ఆనంద్ రాజ్ ఆధ్వర్యంలో కార్మికనగర్‌లో బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నవీన్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటా శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆయన పూర్వీకుల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎన్‌రెడ్డి, నవీన్‌యాదవ్

క్రికెట్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్

రాజేంద్రనగర్: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు యువకులపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... బండ్లగూడ కార్పొరేషన్‌కు చెందిన ఆనంద్, రాఘవేందర్‌తోపాటు మరో ఇద్దరు యువకులు ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆదివారం ఆ నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు దర్యాప్తులో ఉంది.

నవజాత శిశువులకు కాలుష్య ముప్పు


డాక్టర్ కంచన్

సాక్షి, సిటీబ్యూరో: వాయు కాలుష్యం నవజాత శిశువులపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోందని కామినేని ఆసుపత్రి పీడియాట్రీషియన్ డాక్టర్ కంచన్ ఎస్ చన్నావర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి కొంతమంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మరికొంత మంది శిశువులు తక్కువ బరువుగా పుడుతున్నారని పేర్కొన్నారు. గర్భంతో ఉన్న మహిళలు కలుషిత గాలిని పీల్చడంతోనే శిశువుల్లో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న పారిశ్రామికీకరణ, వాహనాల రద్దీ, నిర్మాణ వ్యర్థాలు, చెత్త నిర్వహణ తదితరాలు వాయు నాణ్యతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కామినేని ఆసుపత్రి పరిశోధనల ప్రకారం గడిచిన ఐదేళ్లలో బరువు తక్కువగా పుడుతున్న పిల్లల సంఖ్య 15 శాతం పెరగ్గా, ఆస్తమాతో బాధపడుతున్న పిల్లలు 20 శాతం ఉన్నారని అన్నారు. నాడీ వ్యవస్థ, గుండె కవాటాలు, దీర్ఘకాలిక శ్వాసకోస సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులివ్వండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఒకటో వార్డు నేతాజీ నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్), ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఆదివారం కంటోన్మెంట్‌లో పర్యటించిన ఎంపీ ఈటలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉండే నేతాజీ నగర్లో కమ్యూనిటీ హాలు నిర్మిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఈ స్థలంలో గతంలో స్కూలు ఉండేదని, కొన్నేళ్లుగా ఈ స్థలం పూర్తిగా నిరుపయోగంగా మారిందన్నారు. ఈ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మిస్తే నేతాజీనగర్‌తో పాటు కంసారీ బజార్, కడక్‌పురా, పెద్ద తోకట్టా ప్రాంతాల వారికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బోర్డు తరపున స్థలం కేటాయించడంతో పాటు, నిర్మాణానికి నిధులివ్వాలని కోరారు.


ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి

దిగువకు భూగర్భ జలాలు!

గతేడాది కంటే మరింత పాతాళానికి ● 10 నుంచి 23 మీటర్ల లోతుకు.. ● పెరుగుతున్న ఉష్ణోగ్రత



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు రోజురోజుకూ పాతాళానికి చేరుకుంటున్నాయి. వేసవి నేపథ్యంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. మహా హైదరాబాద్ శరవేగంగా విస్తరిస్తూ కాంక్రీట్ జంగిల్‌గా మారుతుండటమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు అంటున్నారు. మరోవైపు వర్షపునీరు, ఆయా అవసరాలకు వినియోగించిన నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేదు. ఎండలు ముదురుతుండటంతో భూగర్భ జలాల మట్టం రోజురోజుకూ లోతుకు పడిపోతోంది. కేవలం రెండు నెలల వ్యవధిలోనే 10 నుంచి 23 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా శేరిలింగంపల్లి, అమీర్‌పేట్, సరూర్‌నగర్, మారేడుపల్లి మండలాల్లో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఫలితంగా ఆ ప్రాంతాల్లో రోజువారీ అవసరాలకు నీరు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీంతో నగరవాసులు నీటి ఎద్దడితో అవస్థ పడుతున్నారు.

శివారులో మరింత...

కోర్‌సిటీ కంటే శివారు ప్రాంతాల్లోనే భూగర్భనీటి మట్టం మరింత కిందికి దిగజారుతోంది. ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ఇప్పుడు నగరంలో అంతర్భాగమయ్యాయి. పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారగా, చెరువులు, కుంటలు దాదాపు కనుమరుగయ్యాయి. భారీ నిర్మాణాలు జరుగుతుండటంతో బోరు బావుల తవ్వకాలు బాగా పెరిగాయి. వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు పడినప్పటికీ భూమిలోకి నీరు ఇంకకపోవడం, చెరువులు, కుంటలు మాయమవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి.

మూడు నెలల నుంచే...

వర్షకాలంలో పడిన వర్షాలతో ఈ ఏడాది జనవరి వరకు ఆశాజనకంగా కన్పించిన భూగర్భ జలాలు ఆ తర్వాత దిగువకు పడిపోవడం గమనార్హం. హైదరాబాద్ పరిధిలో ఏప్రిల్ నాటికి సగటున 10.10 మీటర్ల నుంచి 20 మీటర్ల వరకు భూగర్భజలాల నీటిమట్టాలు దిగువకు పడిపోయాయి. గత రెండేళ్లలో భూగర్భజలాల నీటిమట్టం పరిస్థితి పరిశీలిస్తే పాతబస్తీలో సగటున 7.91 మీటర్లు, సికింద్రాబాద్ డివిజన్‌లో 12.30 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. రంగారెడ్డి జిల్లా పరిధిలో 15 నుంచి 18 మీటర్ల వరకు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 13.42 మీటర్లకు దిగువకు పడిపోయాయి.

గ్రేటర్ పరిధిలో భూగర్భజల మట్టం ఇలా (మీటర్ల లోతులో)

మండలం	మార్చి నెల
శేరిలింగంపల్లి	23.12
అమీర్‌పేట	20.37
సరూర్‌నగర్	19.78
మారేడుపల్లి	19.44
తిరుమలగిరి	17.23
బండ్లగూడ	15.18
ఆసిఫ్‌నగర్	14.91
మహేశ్వరం	13.88
హయత్‌నగర్	13.87
శంకర్‌పల్లి	12.86
మొయినాబాద్	11.91
కీసర	11.89
సైదాబాద్	11.12
గండిపేట్	10.13
ఖైరతాబాద్	10.11
చార్మినార్	9.68
రాజేంద్రనగర్	9.89
అబ్దుల్లాపూర్ మెట్	7.73
ముషీరాబాద్	7.23

బీజేపీతోనే దేశాభివృద్ధి: కిషన్‌రెడ్డి


బీజేపీ ఆవిర్భావ దినోత్సవాల్లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: బీజేపీ పాలనలోనే దేశంలో అభివృద్ధి సాధ్యమవుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో సిద్ధాంతం కోసం పనిచేసే ఏకైక పార్టీ బీజేపీనే అని అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని ఆ పార్టీ నగర కార్యాలయం వద్ద ఆయన పార్టీ జెండాను ఎగురవేసి ప్రసంగించారు. బీజేపీ ఆవిర్భావం తరువాత 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలిచిన బీజేపీ నేడు కేంద్రంలో అధికారంలో ఉందన్నారు. గత 11 సంవత్సరాల్లో నరేంద్రమోదీ ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. మోదీ పాలనలో కనీసం ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, నాయకులు డాక్టర్ ఎస్.గౌతంరావు, బంగారు శృతి, చింతల రాంచంద్రారెడ్డి, ఆనంద్ గౌడ్, ఓ.శ్రీనివాస్ రెడ్డి, కన్నె ఉమా రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీలను బహిష్కరించాలి

జస్టిస్ చంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: మహిళలు, అణగారిన వర్గాల విద్య కోసం, వరకట్నం, దేవదాసీ వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడిన మహిళలను నేటి తరానికి ఆదర్శంగా చూపాలే కానీ ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేవారిని కాదని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సంఘం (ఏఐఎమ్ఎస్ఎస్), ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ), ఆల్ ఇండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్ (ఏఐడీవైఓ) సంయుక్త ఆధ్వర్యంలో 'మిస్ వరల్డ్ పోటీలను బహిష్కరించండి'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ అమ్మాయిలను అందమైన వస్తువుగా చూపుతూ మార్కెటింగ్ చేయడం తగదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీల నిర్వహణను వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ సెక్రటరీ కృష్ణవేణి, గైనకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గంగాధర్, ఏఐఎమ్ఎస్ఎస్ రాష్ట్ర నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి


కేఎన్ఆర్ హెల్త్‌వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న గాంధీ అలుమ్నీ అసోసియేషన్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీని దేశంలోనే అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు కలిగిన యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జీఎంసీ అలుమ్నీ భవనంలో ఆదివారం నందకుమార్‌రెడ్డి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నందకుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందించారు. నందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక పద్ధతులతో కూడిన నాణ్యమైన వైద్య విద్యను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. వైద్యరంగంలో నూతన ఒరవడి సృష్టించేందుకు నిష్ణాతులైన వైద్యనిపుణులు ఎంతోమంది తెలంగాణలో ఉన్నారని, వారంతా నూతన పద్ధతులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు ముందుకు వస్తే పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

నేను కూడా 'గాంధీ'విద్యార్థినే...

1973 బ్యాచ్‌కు చెందిన తాను కూడా గాంధీ మెడికల్ కాలేజీ విద్యార్థినేనని, ఎంబీబీఎస్ ఇక్కడే పూర్తి చేశానని నందకుమార్‌రెడ్డి తెలిపారు. 1973 బ్యాచ్‌కు చెందిన పలువురు ఆయనను సన్మానించి అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం సీపీఆర్ బేసిక్ లైఫ్ సేవింగ్ కోర్సు పూర్తి చేసిన వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, గాంధీ అలుమ్నీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, ఏవీ రత్నం, కోశాధికారి అభిలాష్, మహేశ్వర్‌రెడ్డి, నర్సింగ్‌రెడ్డి, అలుమ్నీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మహేష్, సభ్యులు రమేష్, సన్నీ డేవిస్‌లతోపాటు పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో హాస్టల్ భవన నిర్మాణం పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీజీ విద్యార్థుల వసతి కోసం క్యాంపస్‌లోని ఐపీయూ ఎదుట కొత్త హాస్టల్ భవన నిర్మాణం పూర్తి అయింది. ప్రారంభం కోసం విద్యార్థులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. అయితే అధికారుల బిజీ షెడ్యూల్ కారణంగా ప్రారంభ విషయం కొలిక్కి రాలేదు. అయితే హాస్టల్ పేరు, ప్రారంభ కార్యక్రమ ముఖ్యఅతిథి, తేదీలపై అధికారులు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతమున్న హాస్టల్ గదులు సరిపోవడం లేదని తర్వతగా ప్రారంభించి వసతి కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌లపై నేడు సమీక్ష


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించి సోమవారం కంటోన్మెంట్‌లో కీలక సమావేశం జరగనుంది. రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి రాకేశ్ మిట్టల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రక్షణ శాఖ డైరెక్టర్‌లు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొనే అవకాశముందని తెలుస్తోంది. ప్యాట్నీ సెంటర్ నుంచి శామీర్‌పేట, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గాల్లో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి అవసరమైన సుమారు 113.7 ఎకరాల రక్షణ శాఖ భూమిని అప్పగించేందుకు ఆ శాఖ ఈ పాటికే అంగీకారం తెలిపింది. మరో 80 ఎకరాల ప్రైవేటు స్థలాల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం నాటి సమావేశంలో ఆయా అంశాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

ఇంటికి చేరిన ఆ ఆరుగురు

వీడిన కుటుంబసభ్యుల మిస్సింగ్ మిస్టరీ



బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో మహేశ్ కుటుంబం

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆరుగురు కుటుంబసభ్యుల మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. ఈ నెల ఒకటో తేదీన బోయిన్‌పల్లి నుంచి బయలుదేరిన మహేశ్- ఉమ దంపతులు, వారి ముగ్గురు కుమారులు, ఉమ సోదరి సంధ్య విజయవాడలో తలదాచుకున్నట్లు తేలింది. సీసీ పుటేజీలు, వారి ఫోన్ నెంబర్‌ల ఆధారంగా పోలీసులు మహేశ్ కుటుంబం ఆచూకీ తెలుసుకున్నారు. ఆదివారం మహేశ్ కుటుంబాన్ని బోయిన్‌పల్లికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు మహేశ్ వెల్లడించినట్లు తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం పోలీసులు వారిని ఇంటికి పంపించివేశారు. దీంతో ఆరుగురు కుటుంబ సభ్యుల కేసు మిస్టరీకి తెరపడింది.

లీజు భూములను స్వాధీనం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఆర్.కృష్ణయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: ప్రభుత్వ భూముల విక్రయంపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి మార్చుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, ఓయూ జేఏసీలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వ భూములను వేలంలో అమ్మడం కాదు, ఇప్పటి వరకు ఇచ్చిన లీజు భూమలను స్వాధీనం చేసుకోవాలి'అని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో కార్యాలయాలు, విద్యార్థుల హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలను నిర్మించాలని, అమ్ముకుంటూ పోతే రేపటి తరానికి భూమి మిగలదని అన్నారు. ప్రభుత్వ భూములను ఎవరు కొనుగోలు చేసినా తెలంగాణలో వచ్చే బీజేపీ ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు అమ్మకుండా ఉద్యమించే విద్యార్థులకు అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్, నీల వెంకటేష్, రాజేందర్, మణికంఠ, అనంతయ్య, రాజునేత, రాందేవ్, బాలస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ పాటకు మరణం లేదు



గద్దర్ ఫౌండేషన్ సదస్సులో మాట్లాడుతున్న అల్లం నారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాగాయకుడు గద్దర్ సాహిత్యానికి, పాటకు మరణం లేదని తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ప్రశ్నించే గొంతులు- పాలకుల అణచివేత'అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తీవ్రమైన నిర్బంధం కొనసాగుతున్న తరుణంలో గద్దర్‌పై కాల్పులు జరిగాయని, అవి తెలంగాణ మలిదశ ఉద్యమ పునర్జీవానికి దోహదపడ్డాయని అన్నారు. ప్రజలే గద్దర్ వారసులని పేర్కొన్నారు. బహుజనులు, పీడిత వర్గాల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ఎక్కడ అణచివేత ఉన్నా ప్రజాస్వామిక స్ఫూర్తితో దానిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రజాగాయని విమలక్క మాట్లాడుతూ గద్దర్ భౌతికంగా మరణించినా పాటల రూపంలో ప్రజల హృదయాలలో జీవించే ఉన్నారన్నారు. గద్దర్ ఆశయాలను కొనసాగించినప్పుడే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి బీవీ సూర్యకిరణ్, జస్టిస్ చంద్రకుమార్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, మీనా కందస్వామి, వేములపాటి అజయ్‌కుమార్, తెలంగాణ ట్రికార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ విజయ్ కుమార్, మల్లారెడ్డి , పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో నగలు, నగదు చోరీ

సికింద్రాబాద్: నగరానికి రైలులో వస్తున్న విశ్రాంత ఉద్యోగి దంపతులకు చెందిన బంగారు ఆభరణాలు, నగదు మాయమైన కేసు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... దురంతో ఎక్స్‌ప్రెస్ రైలులో మహారాష్ట్రకు చెందిన విశ్రాంత ఉద్యోగి కె.మహేందర్ తన భార్యతో కలిసి శనివారం లోకమాన్య తిలక్ రైల్వే స్టేషన్ నుంచి నగరానికి బయలుదేరారు. ఆదివారం ఉదయం నిద్రలేచే సరికి తమ హ్యాండ్ బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. బ్యాగ్‌ను పరిశీలించగా, అందులోని 15 తులాల బంగారు నగలు, 15 వేల నగదు కనిపించలేదు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలుదిగిన తరువాత మహేందర్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన మహారాష్ట్ర, బదిరి ప్రాంతంలో జరిగిన నేపథ్యంలో ఇక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం కేసును అక్కడి రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రామరాజ్య స్థాపనకు కృషి చేయాలి


శ్రీరామ నవమి ముగింపుసభలో పాల్గొన్న గోవింద్‌రాఠి, భగవంతరావు తదితరులు

సుల్తాన్‌బజార్: లోకానికి శ్రీరాముడు ఆదర్శ పురుషుడుగా ఉన్నాడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత దేశ రక్షణ కోసం పాటుపడాలని భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ భగవంతరావు, గోవింద్‌రాఠి అన్నారు. శ్రీరామ నవమి శోభాయాత్ర ముగింపు సభ కోఠిలోని ఆంధ్రాబ్యాంక్ చౌరస్తాలో నిర్వహించారు. సీతారామ్‌బాగ్ రామ్‌మందిర్ నుంచి ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కోఠి ఆంధ్రాబ్యాంక్ వరకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఒగ్గు, డప్పు, కోలాట నృత్యాలు ఎంతగానో అలరించాయి. భగవంతరావు, గోవింద్‌రాఠి, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్ మాట్లాడుతూ రామరాజ్య స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. శ్రీరామనవమిని భాగ్యనగర్ ఉత్సవ సమితి ఎంతో వైభవోపేతంగా నిర్వహించడం పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలో శాంతిభద్రతలను కాపాడారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు వైకుంఠం, మహేందర్ వ్యాస్, శివరాములు, భజరంగ్‌దళ్ నాయకులు బాలస్వామి, దుర్గవాహిని నాయకురాలు వాణి సక్కుబాయి, పప్పుమాత్రే, పెద్ద ఎత్తున రామభక్తులు పాల్గొన్నారు.

సామగ్రి చాటున గంజాయి తరలింపు

● ప్యాకర్స్ అండ్ మూవర్స్ పేరిట దందా
● ముఠాలోని ముగ్గురు నిందితుల అరెస్ట్
● రూ. కోటి విలువ చేసే 273 కిలోలు స్వాధీనం





వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట్: గంజాయి దందాను సరికొత్త పంథాలో కొనసాగిస్తూ ఎట్టకేలకు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ప్యాకర్స్ అండ్ మూవర్స్ సంస్థ (ఇంటి సామాగ్రి తరలించే సంస్థ) పేరుతో ఓ బొలేరో వాహనంలో ఇంటి సామగ్రి చాటున గంజాయిని తరలిస్తున్న ముఠాను బాలానగర్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన పర్దీప్‌కుమార్ (27) బొలేరో యజమాని, హరియాణా రాష్ట్రానికి చెందిన సన్నీ(27) డ్రైవర్, మనీష్‌కుమార్ (29) క్లీనర్‌లు. నగరంలోని బోయిన్‌పల్లిలో నివాసం ఉంటూ ప్యాకర్స్ అండ్ మూవర్స్ లో పనిచేస్తున్నారు. వీరు మార్చి 31న బొలేరో వాహనంలో ఒడిశా రాష్ట్రానికి వెళ్లి 273 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. కాగా, నిఘా వర్గాల విశ్వసనీయ సమాచారంతో బాలానగర్ ఎస్ఓటీ శామీర్‌పేట పోలీసులు శామీర్‌పేటలోని ఓఆర్ఆర్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి గంజాయిని సీజ్ చేశారు.

ఇంటి సామగ్రిని అడ్డు పెట్టి...

పర్దీప్‌కుమార్ తన బొలేరో వాహనాన్ని ముందుగా ప్యాకర్స్ అండ్ మూవర్స్ పేరుతో నడిపేవాడు. ఈ క్రమంలో ఒడిశా నుండి హరియాణాకు గంజాయిని తరలించేందుకు ముందుగా ఇంటి సామగ్రిని కార్టన్ డబ్బాల్లో ప్యాక్ చేశాడు. గంజాయిని కూడా అలాటి డబ్బాల్లోనే ప్యాక్ చేసి తరలిస్తున్నాడు. ఈ మేరకు 273 కిలోల గంజాయి, 7 సెల్ ఫోన్‌లు, బొలేరో వాహనాన్ని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పరారీలో ఇద్దరు నిందితులు...

హరియాణా రాష్ట్రానికి చెందిన సాహిల్ (రిసీవర్)పై 2020 సంవత్సరంలో హైదరాబాద్‌లో సెంట్రల్ నార్కోటిక్స్ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఇతడికి 10 ఏళ్ళ జైలు శిక్ష పడగా హైకోర్టులో బెయిల్ పొంది బయటకి వచ్చాడని డీసీపీ తెలిపాడు. ఇతనితోపాటు సప్లయర్ సుభాష్ బిస్వాస్ పరారీలో ఉన్నారని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఇంట్లో వంటలు చేస్తూ.. అదే చేత్తో ఏదో వేణ్నీళ్లకు చన్నీళ్లు అన్నట్లు పరిమితంగా కేటరింగ్ సేవలు కూడా అందించే హోమ్ చెఫ్స్ అనేది ఇప్పుడు పాత చరిత్ర. స్టార్ హోటల్స్ అధిపతులతో మీటింగ్‌లూ, బడా రెస్టారెంట్లలో ఈటింగ్‌లూ వెరసి పాపులర్ హోమ్ చెఫ్స్ జాబితాలో లిస్టింగ్‌లూ కామన్‌గా మారుతోంది.. ప్రస్తుతం నడుస్తున్న చరిత్రకావచ్చు.. ట్రెండ్ కావచ్చు.. మొత్తానికి ఇంటి రుచులకు కేరాఫ అడ్రస్‌గా నిలుస్తున్నారు హోమ్ చెఫ్స్..

– సాక్షి, సిటీబ్యూరో



నగరంలో రెస్టారెంట్ ఫుడ్ ఫెస్టివల్స్‌లో హోమ్ చెఫ్‌లు ఎక్కువగా పాల్గొంటున్నారు. ప్రత్యేకమైన శైలితో భోజనప్రియులకు కొత్త అనుభవాలు పంచుతున్నారు. హోమ్ చెఫ్స్ కూడా వింత రుచులను వండి వడ్డిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రాంతీయ ప్రత్యేకతలను అచ్చంగా అదే విధంగా అందించడం వీరితోనే సాధ్యమవుతుండడంతో నగరంలోని దాదాపు ప్రతి స్టార్ హోటల్, టాప్ క్లాస్ రెస్టారెంట్ వీరి సేవలను వినియోగించుకునేందుకు తహతహలాడుతున్నాయి.

ఇంటి రుచులకు కేరాఫ్..

హోమ్ చెఫ్..

ఇంటి వంటలకు పెరుగుతున్న డిమాండ్



రెస్టారెంట్స్‌లోని ఫుడ్ ఫెస్టివల్స్‌లో వారిదే పైచేయి

ఇతర నగరాల నుంచి కూడా తరలివస్తున్న హోమ్ చెఫ్స్

వంటింటి నుంచి స్టార్ హోటల్స్‌కు గృహిణులను నడిపిస్తున్న ట్రెండ్



లోకల్.. రుచులు

ఇటీవల సోమాజిగూడలోని ఆక్వా, ది పార్క్‌లో జరిగిన 'బోనాలు ఫెస్ట్' దప్పళం, (మేక ఆఫల్) మేక తల కూర వంటి వంటకాలతో తెలంగాణ అచ్చమైన రుచులను ప్రదర్శించింది అంటే కారణం దానికి సారథ్యం వహించింది ఓ హోమ్ చెఫ్. అదే విధంగా రాయలసీమ రుచుల పండుగకు గానీ, గోదావరి ఘుమఘుమలు వడ్డించాలన్నా గానీ.. నగరంలోని హోమ్ చెఫ్స్‌కు జై కొట్టాల్సిందే అంటున్నాయి రెస్టారెంట్స్. గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్ ఏకంగా ఏడుగురు హోమ్ చెఫ్స్‌తో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి సందడి సృష్టించింది. ఈ ఫెస్టివల్‌లో ఆర్కిటెక్ట్ అయిన మీరా, ప్రీ స్కూల్ యజమాని అయిన స్ఫూర్తి, నిజామీ వంటకాలను ఇంటి నుంచే అందించే షహీన్, మహిళా వ్యాపారవేత్తగా రాణిస్తున్న శ్రియ.. ఇలా భిన్న రంగాలకు చెందిన మహిళలు పాకశాస్త్రంలో ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ రుచుల పండుగకు సారథ్యం వహించారు.



ఇతర నగరాల నుంచి..

ఇంటి వంటకు, ఇంతి వంటకు రెస్టారెంట్స్ పెద్ద పీట వేయడం అనేది స్థానిక మహిళల వరకే పరిమితం కాలేదు. పలు నగరాల నుంచి కూడా హోమ్ చెఫ్స్ నగరానికి తరలి వచ్చేందుకు ఇది దోహదం చేస్తోంది. ఇటీవలే నాగా క్యూలినరీ ట్రయల్స్: గోవా నుంచి హోమ్ చెఫ్ అలిస్టైర్ లెథోర్న్ వచ్చి ది పార్క్‌లో నాగా వంటకాలను ప్రదర్శించారు. ఫ్యూజన్ ఫుడ్‌తో పాటు క్లాసిక్ నాగా వంటకాలను అందించారు.

అమ్మతో ఆరంభం.. అత్తమ్మతో నైపుణ్యం..



నగరంలోని మారియట్ హోటల్ వేదికగా గత నెల్లో బొహ్రా క్యుజిన్‌ను నగరవాసులకు రుచి చూపించారు అలిఫియా అమ్రేలివాలా. తన భర్త అజీజ్‌తో సహా వచ్చి కొన్ని రోజుల పాటు నగరానికి గెస్ట్‌గా ఉండి.. తమ వెరైటీ వంటకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే.. 'చిన్నప్పటి నుంచి వంట చేయడం ఇష్టం, అమ్మ దగ్గర కొంత నేర్చుకున్నా, పెళ్లి తర్వాత, మా అత్తగారి నుంచి మరిన్ని నైపుణ్యాలను అలవర్చుకున్నా.., నా భర్త అజీజ్ కుటుంబ వ్యాపారాన్ని నిర్వహిస్తుండగా, నేను ఇంటి పరిసరాల్లోనే క్యాటరింగ్ ప్రారంభించా. కాలక్రమంలో నా భర్త కూడా సహకారం అందిస్తుండడంతో మా మెనూ విస్తరించాం. ముంబైలో పలు ప్రాంతాల్లో ఫుడ్ ఫెస్ట్‌లు నిర్వహించి, పలు నగరాల నుంచి ఆహ్వానాలు వస్తుండడంతో పూణె, హైదరాబాద్‌లోనూ ఫుడ్ ఫెస్ట్‌లను ఏర్పాటు చేశాం. హైదరాబాదీలు మా వంటకాలను రుచి చూసి, వావ్ ఇవి వెరైటీగా బాగున్నాయి అంటూ కొనియాడడం మాకు ఎంతో సంతృప్తిని అందించింది.

– అలిఫియా, హోమ్ చెఫ్, ముంబై

భగవద్గీత పఠనంలో గోల్డ్ మెడల్..



నిర్విరామంగా 18 అధ్యాయాలు, 701 శ్లోకాల పారాయణం

బంజారాహిల్స్: ఆమె ఓ సాధారణ గృహిణి. ఒకవైపు కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూనే మరోవైపు తనకు ఇష్టమైన సబ్జెక్టులో ఏదైనా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూనే లక్ష్యాన్ని చేరుకోడానికి ఆమె రేయింబవళ్లు శ్రమించారు. అందుకు తగిన ఫలితాన్ని కూడా అందుకున్నారు. ఆమెనే జ్యోతి చాగంటి. మైసూర్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద ఆధ్వర్యంలో అవధూత దత్తపీఠం ప్రతి యేటా నిర్వహించే భగవద్గీత పారాయణ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే జ్యోతి బంగారు పతకాన్ని సాధించారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 701 శ్లోకాలను నిర్విరామంగా పారాయణం చేశారు. రెండు రోజుల క్రితం దుండిగల్‌లోని దత్త ఆశ్రమంలో శ్రీగణపతి సచ్చిదానంద స్వామి నుంచి గోల్డ్‌మెడల్‌తో పాటు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనని ఆమె నిరూపించారు. ఫిలింనగర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తనకు లభించిన గుర్తింపు గురించి మాట్లాడారు.



ఎనిమిది నెలలు శ్రమించా..

గత ఎనిమిది నెలలుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో దీనిని అభ్యసించా. మొదటి ప్రయత్నంలోనే గీత పఠనంలో గోల్డ్ మెడల్ సాధించా. జ్యోతి గీత మకరందం గ్రూప్‌లో టి.నాగలక్ష్మి, ఇతరుల నేతృత్వంలో తాత్విక అంశాలను విస్తృతంగా అధ్యయనం చేశాం. ఈ గ్రూపులోని గురువులు విద్యార్థులకు సరైన ఉచ్చారణను నేర్పించారు. 8 నెలలుగా రోజుకు 7 గంటల పాటు సాధన చేశా. పరీక్షలో పాల్గొనడం అద్భుత అనుభవం. ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి తదుపరి విద్యార్థులకు గీతను బోధిస్తాను.

నగరంలో ఫాస్టెస్ట్ సైబర్‌స్టర్ ప్రదర్శన..

సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక, విలాసవంతమైన కార్లకు పేరొందిన జెఎస్‌డబ్ల్యూ మోటార్ ఇండియాకు చెందిన లగ్జరీ బ్రాండ్ ఎంజీ సెలెక్ట్ తమ ప్రపంచపు వేగవంతమైన ఎంజీ సైబర్‌స్టర్‌ను నగర మార్కెట్లోకి త్వరలోనే అందుబాటులోకి తేనుంది. ఈ నేపథ్యంలో దీంతో పాటు మరో కొత్త కారు ఎంజీ ఎమ్9ను కూడా ప్రత్యేక ప్రివ్యూలో భాగంగా నగరంలో ప్రదర్శించింది. గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఈ రెండు కార్ల షో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరానికి చెందిన పలువురు లగ్జరీ కార్ల యజమానులు, కార్ క్లబ్ మెంబర్స్ హాజరయ్యారు.



కరాటే కింగ్

సాధించాలన్న తపన, కఠోర శ్రమ తోడైతే విజయం అదే దరిచేరుతుంది. అందుకు నిలువెత్తు నిదర్శనం జవహర్ నగర్‌లోని కరాటే మాస్టర్ బొంతూరి రమేష్. కటిక పేదరికంలో చదువుకు మధ్యలోనే ఫులుస్టాప్ పడింది. అయితేనేమి మార్షల్ ఆర్ట్స్‌పై ఉన్న ఆసక్తితో ఆ రంగంలో అడుగుపెట్టి ప్రావీణ్యం సంపాదించాడు. పేద విద్యార్థులకు ఉచితంగా కరాటే విద్యను అందిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో అనేక పతకాలను సాధించాడు.

– జవహర్‌నగర్



మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ..

- 2011 బెంగళూరులో నేషనల్ గోల్డ్ మెడల్
- 2016లో అక్షయ్‌కుమార్ ఇంటర్‌నేషనల్ గోల్డ్‌మెడల్
- వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో దాదాపు 220 గోల్డ్, సిల్వర్ మెడల్స్

- 20 యేళ్లుగా కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ రమేష్
- ఇప్పటి వరకూ దాదాపు లక్ష మందికి శిక్షణ
- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఉచిత కోచింగ్

వరంగల్ జిల్లా స్టేషన్ ఘణపురం ఇప్పాయిగూడేనికి చెందిన బొంతూరి రమేష్ కుటుంబసభ్యులు 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం భాగ్యనగరానికి వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రమేష్ గోల్కొండలో 9వ తరగతి చదువుతున్నప్పుడే కరాటేపై ఆసక్తి పెంచుకున్నాడు. పదో తరగతి పాసైనా ఆర్థిక పరిస్థితి సహకరించక మధ్యలోనే చదువు ఆపేశాడు. బ్రూస్‌లీ సినిమాలు చూసి 12వ యేట నుంచే కరాటే నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. తల్లిదండ్రులు, గ్రాండ్ మాస్టర్ ఆర్‌కే కృష్ణ ప్రోత్సాహంతో కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించాడు. అనంతరం కిక్‌బాక్సింగ్ నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు గెలుచుకున్నాడు. ప్రస్తుతం మాస్టర్ రమేష్ జవహర్‌గర్ పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు, కానిస్టేబుళ్లకు మార్షల్ ఆర్ట్స్ నేర్పుతున్నాడు. ఇప్పటి వరకూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో రన్‌వీర్ తైక్వాండో అకాడమీ ద్వారా దాదాపు లక్ష మంది విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చినట్లు రమేష్ తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా కరాటే విద్యనందించి బీపీ, షుగర్, మానసిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక యోగా శిక్షణ అందిస్తున్నాడు. ఇప్పటికే పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకునేలా కృషి చేస్తున్నాడు. వేసవికాలంలో మరింత మంది విద్యార్థులకు కరాటే విద్యను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.





ఆర్ట్ ఫెస్ట్.. అదిరేట్టు..

- ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు
- పత్యేక ఆకర్షణగా ఎంఎఫ్ హుస్సేన్ చిత్రాలు
- అబ్బురపరుస్తున్న 200 మంది జాతీయ కళాకారుల ఆర్ట్స్
- విభిన్న ఆకృతులతో పలువురు ఆర్టిస్టుల సందడి

సాక్షి, సిటీ బ్యూరో: నగర వేదికగా ఏర్పాటు చేసిన ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్' (ఐఏఎఫ్) దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన కళాకారులతో, ఔత్సాహికులతో సందడి నెలకొంది. నగరంలోని రేతిబౌలి అత్తాపూర్‌లోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్ వేదికగా నడుస్తున్న ఫెస్ట్‌లో 200 మందికి పైగా ప్రముఖ కళా కారులు రూపొందించిన 3,500 పైగా వైవిధ్యమైన కళారూపాలను ప్రదర్శించారు. ఇందులో 25 ఆర్ట్ గ్యాలరీలతో, 100 ఎయిర్ కండీషన్డ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖ కళాకారులు భాగస్వామ్యమవుతున్న ఈ ఆర్ట్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది.





ఎంఎఫ్ హుస్సేన్ వారసత్వానికి నివాళి..


ప్రఖ్యాత భారతీయ కళాకారుడు ఎంఎఫ్ హుస్సేన్ మేనల్లుడు ఫిదా హుస్సేన్ ఎక్స్‌క్లూజివ్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళా ప్రదర్శన ఫెస్ట్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేదికగా తన మామతో ఉన్న సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. భారతదేశం నుంచి బహిష్కరణకు గురైన తర్వాత ఎంఎఫ్ హుస్సేన్ కళను పదిలపరచడంలో ప్రత్యేక బాధ్యతను తీసుకున్నట్లు వెల్లడించారు. 2006 నుంచి 2011 వరకూ ఎంఎఫ్ హుస్సేన్ బహిష్కరణ సమయంలో అతను దుబాయ్, ఖతార్‌లో తనతో నివసించారని పేర్కొన్నారు. ఆ సమయంలో ఆయన సృజనాత్మకతను తాను పరిరక్షించానని, ఇందులో భాగం 2017లో హుస్సేన్ సెరిగ్రాఫ్‌లను భారతదేశానికి తిరిగి ఇచ్చే పనిని చేపట్టానని, ఇది తమ కళా వారసత్వానికి నిదర్శనమని అన్నారు. అనంతరం ముంబై, బరోడాలో ఎంఎఫ్ హుస్సేన్ కళను ప్రదర్శించడం, సమకాలీన కళాకారులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఎక్స్‌క్లూజివ్ ఆర్ట్ గ్యాలరీని స్థాపించానని తెలిపారు.



ఎంఎఫ్ హుస్సేన్‌తో మేనల్లుడు ఫిదా హుస్సేన్ (ఫైల్)

సృజనాత్మకతలో తత్వ శాస్త్రం..

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన అంజలి ప్రభాకర్ సృజనాత్మకత ఇండియన్ ఆర్ట్ ఫెస్ట్‌లో విశేషంగా ఆకట్టుకుంది. జీవితంలోని వివిధ కోణాలను, తత్వశాస్త్రంపై ఆమెకున్న లోతైన అవగాహనను చిత్రాల ద్వారా ప్రదర్శించారు. విజయం, ప్రేమ, ఆధ్యాత్మికతతో పాటు జీవితంలోని అనేక ఆచరణాత్మక అంశాలను అంజలి చిత్రీకరించారు. పెయింటింగ్‌లో నైపుణ్యం, 3డీ మ్యూరల్ ఆర్ట్, మధుబని పెయింటింగ్, క్రిస్టల్ రెసిన్, సెఫోరిక్స్, అబ్‌స్ట్రాక్ట్ వంటి కళల్లో తన సృజనాత్మకతను ఈ ఫెస్ట్‌లో ప్రదర్శించారు. భారత్‌తో పాటు విదేశాల్లో తాను సోలో, గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్స్‌లో పాల్గొన్నానని, తాను రాసిన పుస్తకం 'ట్యూన్స్ ఆఫ్ లైఫ్' విడుదలైందని, ప్రస్తుతం 'మహిళల మానసిక ఆరోగ్యంలో ఆర్ట్ థెరపీ ప్రభావాన్ని అన్వేషించడం' అనే అంశంపై పీహెచ్‌డీ ఎంట్రీని చేస్తున్నట్లు తెలిపారు. 16 ఏళ్లగా అంజలి ఇన్నోవేటివ్ ఆర్ట్ శిక్షకురాలిగా కృషి చేస్తున్నానని అన్నారు. 2017లో ఇండోర్ మిరాజ్ నేషనల్ ఆర్ట్ ఫెస్ట్, భోపాల్ 'ఆర్ట్ ఆల్కెమీ', ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ (ఆష్మి ఇనీషియేటివ్ గాంధీ ఆర్ట్ గ్యాలరీ) వంటి ప్రదర్శనలో తన చిత్రాలకు ప్రశంసలు లభించినట్లు తెలిపారు.







ఆదాలో చైనా ఫస్ట్..

భారతీయులు ఆదా ఎక్కువ చేస్తారని అందరూ అనుకుంటారు. కానీ, ఈ విషయంలో మనవాళ్లను చైనీయులు దాటేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలాల్లో ఒకటి ఆ దేశ ప్రజలు ఆదా చేసే సొమ్ము. జీడీపీలో వీటి శాతం ఎంత ఎక్కువ ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అంత బలంగా ఉన్నట్టు. 2022 నుంచి చూస్తే ప్రపంచంలోని అగ్ర దేశాల్లో చైనాలో ఈ ఆదా ఎక్కువగా ఉంది. ఈ దరిదాపుల్లో ఎవరూ లేరు. ఆ తరవాతి స్థానం మనదే. పెద్దన్న అమెరికా ఆదాలో చాలా వెనకబడి ఉంది.

సంవత్సరం	ఆదా శాతం.. (జీడీపీలో)		
	చైనా	భారత్	అమెరికా
2022	45.7	31.0	18.3
2023	43.0	32.7	17.4
2024	43.4	32.5	17.9
సగటు	44.0	32.1	17.9

ఆధారం: అంతర్జాతీయ ద్రవ్య నిధి

హెల్దీ పునాదితో భవిష్యత్తు బంగారం

నేడు వరల్డ్ హెల్త్ డే

దేశ వ్యాప్తంగా పెరుగుతున్న సగటు ఆయుఃప్రమాణం
ఈ క్రమంలో రేపటి పౌరుల కోసం జాగ్రత్తలు తప్పనిసరి



సాక్షి, స్పెషల్ డెస్క్: దేశ పురోగమనానికి సూచనగా మన దేశవాసుల ఆరోగ్య పరిస్థితులూ క్రమంగా మెరుగుపడుతున్నాయి. 2024 లెక్కల ప్రకారం ఒక వ్యక్తి సగటు ఆయుఃప్రమాణం 70.62 ఏళ్లు. 2023తో పోలిస్తే ఇది 0.29 శాతం ఎక్కువ. ఒక అంచనా ప్రకారం 2030 నాటికి మహిళల ఆయుఃప్రమాణం 75.7 ఏళ్లకూ, పురుషులు 72 ఏళ్లకూ.. అదే 2050 నాటికి మహిళల ఆయుఃప్రమాణం 79.8 ఏళ్లకూ, పురుషులు 76.2 ఏళ్లకు చేరుతుందని అంచనా. అయినా ప్రపంచ సగటు 73.7 ఏళ్లతో పోలిస్తే ప్రస్తుత భారత్‌లోని వ్యక్తుల ఆయుఃప్రమాణం తక్కువే. ఈ ఏడాది వరల్డ్ హెల్త్ డే థీమ్ 'హెల్దీ బిగినింగ్స్.. హోప్‌ఫుల్ ఫ్యూచర్స్'.. అంటే ఓ చిన్నారి తాలూకు బాల్యం ఆరోగ్యంగా ఉంటే ఆ చిన్నారి భవిష్యత్తు సైతం ఆశాజనకంగా ఉంటుందనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వ్యాఖ్యానం. రేపటి మన పౌరుల భవిష్యత్తు మంచి ఆశారేఖలతో వెలగాలంటే.. చిన్నప్పట్నుంచి అంటే 'బిగినింగ్స్' ఆరోగ్యంగా ఉండటమెలాగో చూద్దాం.

ఆరోగ్యం కోసం బ్యాలెన్స్‌డ్ ఆహారం ఎంత ముఖ్యమో వ్యాయామాలూ అంతే అవసరం. వీటిల్లో ఫ్లెక్సిబిలిటీ వ్యాయామాలు, ఏరోబిక్స్, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ వ్యాయామాలు, కోర్ ఎక్సర్‌సైజెస్.. ఇవన్నీ చేస్తుండటం వల్ల బరువు పెరగకుండా ఉండటంతో పాటు ఫిట్‌గా, చురుగ్గా, ఆకర్షణీయంగా కనిపించవచ్చు.

ఫ్లెక్సిబిలిటీ వ్యాయామాలు.. వీటినే స్ట్రెచింగ్ వ్యాయామాలు అని చెప్పవచ్చు. కాళ్లు, చేతులు వేగంగా కదలడంతో కీళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. అసలు వ్యాయామానికి ముందుగా ఈ స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడం అవసరం.

స్ట్రెంగ్త్ ట్రైనింగ్.. ఎక్సర్‌సైజ్ రెజీమ్‌లో ఆసక్తి ఉండి, బరువులు ఎత్తుతూ చేసేవి. వీటిల్లో బరువులతో చేసే వాటితో పాటు పుషప్స్, పులప్స్, అబ్డామినల్ క్రంచెస్, లెగ్ స్క్వాట్స్ వంటివి ఉంటాయి.

వ్యాయామం ప్రధానం

ఏరోబిక్స్.. వీటినే కార్డియో వ్యాయామాలనీ, ఎండ్యూరెన్స్ ఎక్సర్‌సైజ్‌లనీ అంటారు. వీటి వల్ల ఊపిరితిత్తుల నిండా ఆక్సిజన్, గుండె వేగం పెరుగుతాయి. దాంతో ప్రతి కణానికీ, కండరానికీ అందే ఆక్సిజన్, పోషకాలతో సామర్థ్యం పెంపొందుతుంది. చాలాసేపు పనిచేసినా అలసట రాదు. వేగంగా నడక, జాగింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, డాన్సింగ్, వాటర్ ఏరోబిక్స్ ఇవన్నీ ఏరోబిక్స్ ప్రక్రియలే.

పై వ్యాయామాలతో పాటు మానసిక ఆరోగ్యం కోసం యోగా చేస్తూ, మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి ధ్యానం (మెడిటేషన్) చేయాలి. ఎముకలకు అత్యంత అవసరమైన విటమిన్ డీ అందేలా సూర్యకాంతిలో నడవాలి. పొగ తాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ రోజూ ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు కంటినిండా నిద్రపోవాలి.

0 నుంచి ఐదు నెలల వరకు..

చిన్నారుల ఆరోగ్య సంరక్షణ తమ తల్లి గర్భం నుంచే మొదలైతే.. వాళ్ల ఆరోగ్య పునాదులూ పటిష్టంగా ఉంటాయి. కాబోయే తల్లి తన ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న మూడు నెలల ముందు నుంచే తాజా ఆకుకూరలు, పండ్లు తీసుకుంటూ ఉండాలి. ఐరన్ టాబ్లెట్లు, ఫోలిక్ యాసిడ్ తీసుకుంటే పుట్టబోయే చిన్నారి ఆరోగ్యంగా బాగుండటమే కాకుండా స్పైనా బైఫిడా వంటివి నివారితమవుతాయి. పిల్లలు పుట్టాక కనీసం ఆర్నెల్ల పాటు వారికి తల్లిపాలే తాగించాలి. 'యూనివర్సల్ ఇమ్యూనైజేషన్' కార్యక్రమంలో అన్నిరకాల టీకాలు, వ్యాక్సిన్లు ఇప్పించడం ద్వారా వాళ్లు సుదీర్ఘకాలం ఆరోగ్యంగా ఉండేలా చూడాలి.

ఆర్నెల్ల తర్వాత ఘనాహారం



పిల్లలను ఘనాహారం వైపు మళ్లించడాన్ని వీనింగ్ అంటారు. ఘనాహారం వైపునకు మళ్లించేందుకు మార్కెట్లోని ఖరీదైన ఆహారాలు కాకుండా ఇంట్లోనే లభ్యమయ్యే పదార్థాలతో పుష్టికరమైన ఆహారాన్ని అందించవచ్చు. ఆర్నెల్లప్పుడు బియ్యంతో మెత్తగా వండిన పదార్థాలు పెట్టొచ్చు. 6 నుంచి 8 నెలల వయసులో గుజ్జులా ఉడికించిన కూరగాయలు, ఆకుకూరలతో పాటు తాజా పండ్లు ఇవ్వాలి. 8 నుంచి 10 నెలల వయసులో మాంసాహారం తినేవారైతే గుజ్జుగా ఉడికించిన మాంసం, చికెన్, చేపలు, గుడ్లు పెట్టొచ్చు. శాకాహారులైతే తృణధాన్యాలు ఉడికించి ఇవ్వొచ్చు. 11–12 నెలల వయసులో కూరగాయల ముక్కలను ఉడికించి పెట్టొచ్చు. ఇలా అన్ని పోషకాలు ఉన్న ఆహారం వైపునకు మళ్లించాలి.

ఇవి మాత్రం వద్దు

చక్కెర ఎక్కువగా ఉండే కాఫీ, టీ, శీతల పానీయాలు, కోలా డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ తీసుకోకపోవడమే మంచిది. బేకరీ ఫుడ్స్, పిజ్జా, బర్గర్‌ల వంటి ప్రాసెస్‌డ్ ఆహారాల్లో పోషకాలు తక్కువ. నూనెలు, వేపుళ్లు, చిప్స్, ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు వాడే మార్జరిన్‌లో ట్రాన్స్-ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ. వీటికి దూరంగా ఉండాలి.



ఏడాది నుంచి 12 ఏళ్ల వరకు..



ఏడాది నుంచి 12 ఏళ్ల వరకు పిల్లలు ఎదుగుతుంటారు కాబట్టి ఈ సమయంలో అన్ని రకాల పోషకాలు, విటమిన్లూ, మినరల్స్, మైక్రో న్యూట్రియెంట్స్... పుష్కలంగా ఉండే పదార్థాలు తినిపించాలి. ఇవన్నీ ఒకే భోజనంలో దొరకవు కాబట్టి.. రకరకాల ఆహార పదార్థాలు తినేలా చూడాలి. అంటే... వాళ్ల ఆహారంలో పొట్టుతో ఉండే గోధుమ, జొన్న, మొక్కజొన్న, రాగులతో చేసిన పదార్థాలు ఇవ్వాలి. ఎముకల ఆరోగ్యం కోసం క్యాల్షియం అందేలా చూడాలి. గ్రీన్ లీఫీ వెజిటబుల్స్ తప్పనిసరిగా ఇవ్వాలి. పిల్లలకు ఇష్టం లేని ఆహారాలను వాళ్లు ఇష్టంగా తినేలా ఇవ్వాలి. ఉదాహరణకు పండ్లు తినకపోతే వాటిని ఫ్రూట్ సలాడ్స్‌గా, కస్టర్డ్‌తో కలిపి ఇవ్వవచ్చు. పాలు తాగకపోతే మిల్క్‌షేక్‌గా ఇవ్వడం లేదా పాలతో తయారైన స్వీట్లు పెట్టడం చేయాలి. తల్లులు తమ పిల్లలకు వెన్న, నెయ్యి ఎక్కువగా పెడుతుంటారు. ఈ శాచ్యురేటెడ్ కొవ్వులు అంత మంచివి కాదు. అందుకే వాటిని రుచి కోసం చాలా పరిమితంగా తీసుకోవాలి.

కౌమార యువత నుంచి మధ్య వయసు వచ్చే వరకు...

16 ఏళ్లు దాటాక.. యవ్వనంలో, ఆపైన కూడా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలే తీసుకుంటూ ఉండాలి. మన ప్రధాన ఆహారమైన బియ్యం విషయానికి వస్తే దంపుడు బియ్యం, కూరల్లో ముదురాకుపచ్చ రంగులో ఉండే గ్రీన్‌లీఫీ వెజిటబుల్స్ మంచివి. మాంసాహారంలో చేపలు మంచి ఆహారం. రెడ్ మీట్ కంటే కొవ్వు తక్కువగా ఉండే చికెన్ వంటివి తీసుకోవాలి. అరటి, నారింజ వంటి పండ్లలో విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. పీచు ఎక్కువగా ఉండే జామ, బొప్పాయి, పుచ్చకాయతోపాటు డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి.

వృద్ధాప్యం తొలి దశలో పరీక్షలు కీలకం



ఇక వృద్ధాప్యపు తొలి దశ అయిన 60–68 ఏళ్ల మధ్య చాలా మందిలో డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు పరీక్షలతో వీటిని ముందస్తుగానే గుర్తించి సత్వర వైద్యం పొందాలి. 50–60 ఏళ్ల మధ్య మహిళల్లో హార్మోన్ మార్పులు, రుతుక్రమంలో మార్పులు, ఒక వయసు దాటాక రుతుక్రమం ఆగిపోయే మెనోపాజ్ వంటివి కనిపిస్తుంటాయి. ఈ దశలో తమ సమస్యలకు తగిన మందులతో పాటు 68 ఏళ్ల నుంచి 70 ఏళ్లు దాటాక ఏ టైమ్‌లో తీసుకోవాల్సిన వ్యాక్సిన్లను ఆ టైమ్‌లో (ఉదా: నిమోకోకల్ వ్యాక్సిన్) తీసుకుంటూ ఉండాలి. ఈ జాగ్రత్తలతో పాటు డాక్టర్ల సూచనలు పాటిస్తుంటే అందరూ జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు.

–డాక్టర్ ఉషారాణి, సీనియర్ ఫిజీషియన్

పట్టర.. పట్టు..



పందెం గుండును ఎత్తుతున్న అలైఖ్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): శ్రీరామ నవమి సందర్భంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో ఆదివారం బరువులు ఎత్తే పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల స్థాయిలో 120 కేజీల బరువు గల గుండును ఎత్తడం, 100 కేజీల బరువు గల మినుముల బస్తాను ఎత్తడం వంటి పోటీలను ఏర్పాటు చేశారు. పలువురు ఔత్సాహికులు ఇందులో పాల్గొనగా.. నువ్వా, నేనా అన్నట్లు రసవత్తరంగా ఈ పోటీలు సాగాయి. గుండును ఎత్తి వెనుకకు వేసే పోటీల్లో నిర్ణీత ఐదు నిమిషాల సమయంలో తిరుమలగిరికి చెందిన అలైఖ్య ఎనిమిది రౌండ్లు ఎత్తివేసి మొదటి బహుమతిని గెలుచుకున్నాడు. అదే విధంగా ప్రశాంత్ నిర్ణీత ఐదు నిమిషాల సమయంలో ఆరు రౌండ్లు ఎత్తివేసి ద్వితీయ బహుమతిని గెల్చుకున్నాడు. మినుముల బస్తా పోటీల్లో మొత్తం ఏడుగురు పాల్గొనగా మొదటి బహుమతి కీరు, ద్వితీయ బహుమతి పోలేపల్లి మహేశ్, తృతీయ బహుమతిని శ్రీకాంత్ గెలుచుకున్నారు.

ఆకట్టుకున్న 25 అడుగుల అగరబత్తి



శ్రీరామనవమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పల్లివీధికి చెందిన రామభక్తుడు నరసింహమూర్తి 25 అడుగుల అగరబత్తీని తయారు చేసి ఆశ్చర్యపరిచారు. సర్వే కర్ర, అగరబత్తి పౌడర్‌ను ఉపయోగించి తయారు చేసిన ఈ బత్తీకి వారం సమయం పట్టిందని, సుమారు 48కిలోల బరువు ఉందని ఆయన తెలిపారు. పలాసలోని సీతారామాలయం ఎదుట ఆదివారం ఈ అగరబత్తీని వెలిగించగా, సుమారు గంటన్నరసేపు ప్రాంగణంతో పాటు, చుట్టుపక్కల సువాసన వ్యాపించి అందరినీ ఆకట్టుకుంది. - కాశీబుగ్గ

కోవా సారె కనువిందు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టు వద్ద ఉన్న పట్టాభి రామాలయంలో సీతారాముల కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతుల ఆధ్వర్యాన జరిగిన స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సత్యవాణి దంపతులు కోవాతో తయారు చేయించిన 108 రకాల స్వీట్లు, పిండి వంటలను శ్రీరాముని తరఫున సీతమ్మకు సారె (కంత)గా సమర్పించారు. - పి.గన్నవరం

ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో.. వారిని ధర్మం రక్షిస్తుంది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సనాతన హిందూ ధర్మ రక్షణ కోసమే శ్రీరాముడు తపించాడు
- సీతారామ్‌బాగ్ ఆలయంలో ప్రత్యేక పూజలు
- శ్రీరామ నవమి శోభాయాత్ర ప్రారంభించిన గవర్నర్



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

అబిడ్స్ (హైదరాబాద్): సనాతన హిందూ ధర్మ రక్షణ కోసమే శ్రీరాముడు తపించాడని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో.. వారిని ధర్మం రక్షిస్తుందని అన్నారు. ఆదివారం సీతారామ్‌బాగ్‌లో శ్రీరామ నవమి శోభాయాత్ర వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చరిత్రాత్మకమైన సీతారామ్‌బాగ్ ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు శ్రీరాముడు ఆదర్శమని అన్నారు. ప్రతి భారత పౌరుడు భగవాన్ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. శ్రీరాముడు చూపిన సన్మార్గంలో ప్రజలు పయనించి దేశ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ అనే నినాదంతో శ్రీరాముడి మార్గంలో నడుస్తూ దేశ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ధార్మిక సమాజ స్థాపన ఎంతో అవసరమని అన్నారు. అంతకు ముందు ఉత్తర భారతదేశంలోని గోవర్ధన పీఠానికి చెందిన అనంత విభూతిత్ అదోక్ష జనానంద్‌దేవ్ తీర్థ మహారాజ్ మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ కోసం శ్రీరాముడు జీవితాన్ని అంకితం చేశారన్నారు. శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న భాగ్యనగర్ శ్రీరామ నవమి ఉత్సవ సమితి నాయకులను ఆయన అభినందించారు. దేశ అభివృద్ధికి శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో పయనించాలని సూచించారు. త్రిపుర రాష్ట్రం డిప్యూటీ స్పీకర్ రామ్‌ప్రసాద్ పాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో శ్రీరామ నవమి శోభాయాత్ర లక్షల మంది భక్తుల మధ్య కన్నుల పండువగా కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో పాటు ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, పలు హిందూ సంఘాల నేతలను భాగ్యనగర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ఇతర నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం వేలాది మంది రామభక్తుల మధ్య శ్రీరామ నవమి శోభాయాత్ర ప్రారంభమైంది.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను ఇస్తున్న నిర్వాహకులు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి



తిరుమల శ్రీవారి దర్శనానికి ఆదివారం విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఆలయ మహద్వారం వద్ద టీటీడీ ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్యచౌదరితో పాటు అర్చకులు సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా.. టీటీడీ ఈఓ తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'రింగు' పొడవునా సర్వీసు రోడ్లు!

ఔటర్ తరహాలో నిర్మించేలా ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టుకు సవరణలు

- పీఎం గతిశక్తిలోని ఎన్‌పీజీ ఆదేశంతో డిజైన్ మార్చిన ఎన్‌హెచ్‌ఏఐ
- స్థానిక వాహనదారులకు ఉపయోగపడేలా రెండు వరుసల్లో నిర్మాణానికి సూత్రప్రాయ నిర్ణయం
- ట్రాఫిక్ అధ్యయన నివేదిక వచ్చాక తుది ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు సమీప ప్రాంతాల ప్రజలకు ఇది శుభవార్త. ప్రస్తుతం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డును సర్వీసు రోడ్లతో కలిపి నిర్మించారు. ఇవి వాహనదారులకు బాగా ఉపయోగపడుతున్నాయి. తాజాగా ట్రిపుల్ ఆర్ పొడవునా, ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇప్పటివరకు రూపొందించిన ప్రాజెక్టు డిజైన్‌లో సర్వీసు రోడ్డు ప్రస్తావన లేదు. దీనిని సాధారణ జాతీయ రహదారిలా కాకుండా యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మిస్తున్నందున, సర్వీసు రోడ్లు అవసరం లేదని తొలుత నిర్ణయించారు. కానీ సర్వీసు రోడ్లు లేకుంటే స్థానిక జనావాసాల్లోని వాహనదారులకు ఇది ఉపయోగంగా ఉండదని, కచ్చితంగా సర్వీసు రోడ్లు కావాలని స్థానికులు ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో చెప్పారు. కానీ ఎన్‌హెచ్‌ఏఐ తోసిపుచ్చింది. అయితే తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో ఎన్‌హెచ్‌ఏఐ తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఈ మేరకు రోడ్డు డిజైన్‌ను మార్చి సర్వీసు రోడ్డు ఆప్షన్‌ను చేర్చింది.

పీఎం గతి శక్తిలోని ఎన్‌పీజీ ఆదేశంతో..

కీలక ప్రాజెక్టుల్లో జాప్యాన్ని నివారించేందుకు వాటిని పీఎం గతి శక్తి పర్యవేక్షణలో ఉంచుతున్న సంగతి తెలిసిందే. పీఎం గతి శక్తిలో భాగంగా ఉన్న నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్‌పీజీ) ఇటీవల భేటీ అయినప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుపై చర్చించింది. ఈ ప్రాజెక్టు వల్ల చుట్టుపక్కల అభివృద్ధి వేగంగా ఉంటుందని, కొత్త ఎస్‌ఈజడ్‌లు, శాటిలైట్ టౌన్‌షిప్‌లు వస్తాయని, అప్పుడు స్థానిక జనావాసాల్లోని వాహనదారుల కోసం ఈ రోడ్డుకు అనుబంధంగా సర్వీసు రోడ్లు అవసరమవుతాయని అభిప్రాయపడింది. ఈ రోడ్డు నిర్మించే అలైన్‌మెంటుతో పాటే స్థానిక రోడ్లపై ప్రస్తుతం వాహనాల రద్దీ ఎలా ఉందో తెలుసుకునేందుకు ట్రాఫిక్ సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. కాగా 2021–22లో నిర్వహించిన ట్రాఫిక్ స్టడీతో పోలిస్తే కొత్త అధ్యయనంలో వాహనాల సంఖ్య అంచనాను మించి పెరిగితే, వచ్చే ఐదారేళ్లలో రెట్టింపవుతుందని అంచనా వేసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రధాన క్యారేజ్‌వే మీదుగా కాకుండా, దిగువగా వెళ్లి ఇతర రోడ్లతో అనుసంధానమయ్యే వాహనాల సంఖ్య కూడా భారీగా ఉంటుందని, సర్వీసు రోడ్లు లేకుంటే ఆ వాహనాలకు ఈ రోడ్డు ఉపయోగపడదని అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ట్రాఫిక్ స్టడీలో వాహనాల సంఖ్య బాగా పెరిగినట్టు తేలితే కచ్చితంగా సర్వీసు రోడ్లు నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐకి సిఫారసు చేసింది. అయితే వాహనాల సంఖ్య బాగా పెరిగిందని ఇప్పటికే ఓ అంచనాకు వచ్చిన నేపథ్యంలో, సర్వీసు రోడ్ల నిర్మాణానికి వీలుగా ట్రిపుల్ ఆర్ డిజైన్లు సిద్ధం చేస్తున్నారు.

తొలుత 5.5 మీటర్లు..ఒకే వరుస

ట్రిపుల్ ఆర్‌కు రెండు వరుసల సర్వీసు రోడ్డును డిజైన్ చేస్తున్నారు. తొలుత 5.5 మీటర్లతో కూడిన ఒకే వరుస సర్వీసు రోడ్డును నిర్మించాలని, వాహనాల రద్దీ పెరిగిన తర్వాత దాన్ని 7.5 మీటర్లకు, రెండు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. అయితే సర్వీసు రోడ్లు ఫ్లైఓవర్లు ఉన్న చోట ఉండవు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు ఉన్న చోట.. వాటి దిగువగా నీటి ప్రవాహం కోసం ఏర్పాటు చేసే చానళ్ల ద్వారా యూ టర్న్ తరహాలో ఉండి మళ్లీ ప్రధాన క్యారేజ్ వేను ఆనుకుని దిగువగా ముందుకు కొనసాగుతాయి. ఈ మేరకు ప్రధాన క్యారేజ్ వే, దిగువ ప్రాంతాలకు కేటాయించిన అలైన్‌మెంటులో కూడా కొన్ని మార్పులు చేస్తున్నారు. ట్రాఫిక్ స్టడీ వివరాలను కేంద్రానికి సమర్పించిన తర్వాత, ఢిల్లీ స్థాయిలో అధికారులు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుని స్థానిక ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

నేడు హార్బర్ ఫేజ్ విన్యాసాలు ముగింపు

సాక్షి, విశాఖపట్నం: భారత్, అమెరికా త్రివిధ దళాల పరస్పర సహకారం మరింత బలోపేతానికి నిర్వహిస్తున్న టైగర్ ట్రయాంఫ్–2025 విన్యాసాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్ 1న విశాఖలో ప్రారంభమైన హార్బర్ ఫేజ్ విన్యాసాలు సోమవారంతో ముగియనున్నాయి. 8 నుంచి ఈ విన్యాసాలు కాకినాడ వేదికగా 12 వరకు జరగనున్నాయి. 11, 12 తేదీల్లో కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉమ్మడి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. 13న విశాఖ తీరంలో యూఎస్ఎస్ కామ్‌స్టాక్ యుద్ధ నౌకలో ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామని భారత నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. అనంతరం యూఎస్ రక్షణ దళాలకు వీడ్కోలు కార్యక్రమం జరగనుంది.

అనంత్ ఆధ్యాత్మిక పాదయాత్ర పూర్తి

- జామ్‌నగర్ నుంచి ద్వారక వరకు 180 కిలోమీటర్ల మేర యాత్ర



ద్వారక: రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ చేపట్టిన ఆధ్యాత్మిక పాదయాత్ర ఆదివారం పూర్తయింది. గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచి శ్రీకృష్ణుడు ఏలిన ద్వారకకు ఈయన యాత్ర నిర్వహించారు. మార్చి 29న యాత్ర ప్రారంభించి 9 రోజుల్లో పూర్తిచేశారు. రోజూ 12 నుంచి 15 కిలోమీటర్ల చొప్పున నడిచారు. ఆదివారం శ్రీరామనవమి పర్వదినంతోపాటు హిందూ క్యాలెండర్ ప్రకారం అనంత్ అంబానీ జన్మదినం కూడా కావటం విశేషం. ఆదివారం ద్వారకలోని శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్భాటం లేకుండా.. ఆధ్యాత్మిక దారిలో..

దేశంలోనే అత్యంత ధనవంతుల కుటుంబమైన అంబానీలు ఏం చేసినా మీడియా కావాల్సినంత కవరేజీ ఇస్తుంది. కానీ, అనంత్ తన పాదయాత్రను ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పూర్తిగా ఆధ్యాత్మిక చింతనతో నిర్వహించారు. కనీసం సోషల్‌మీడియాలో కూడా ఆయన యాత్ర వివరాలు కనిపించలేదు. యాత్రను ఒక ఉత్సవంగా కాకుండా శ్రీకృష్ణ భగవానుడికి తనను తాను మనసా, వాచా, కర్మణా అర్పించుకొనే మార్గంగా నిర్వహించటం విశేషం. యాత్ర పొడవునా ఆయన వెంట అతికొద్ది మంది సన్నిహితులు, ఆధ్యాత్మికవేత్తలు మాత్రమే ఉన్నారు. చిన్నప్పటి నుంచే స్థూలకాయం, ఆస్తమా, కుషింగ్స్ సిండ్రోమ్ వంటి హార్మోన్ సమస్యలతో బాధపడుతున్న అనంత్ అంబానీ.. రోజూ 15 కిలోమీటర్ల చొప్పున నడక సాగించి యాత్రను పూర్తిచేసి భగవంతుడిపై తనకు ఉన్న అపార భక్తిని చాటుకున్నారు.



మంచిమాట

క్షమ... సఫల జీవితానికి చుక్కాని

క్షమాగుణానికి సుఖ శాంతులను చేకూర్చే మహత్తరమైన గుణం ఇమిడి ఉంది. అది తెలుసుకుంటే జీవితమే మారిపోయి ఆనందంగా వుండే అవకాశం ఉంటుంది. క్షమ సఫల జీవితానికి చుక్కాని. క్షమ ఒక ఆయుధం. దాన్ని ధరించితే దుర్జనుడేమీ చేయలేడు. ఈ క్షమాగుణం అనేది ఒక అద్భుతమైనది. ఈ గుణాన్ని ప్రదర్శించటం అంటే కొందరు తమ వ్యక్తిత్వం దెబ్బతింటుందేమో అని అనుకుంటారు. కానీ అది వ్యక్తిత్వాన్ని పెంచేదే కాని తగ్గించేది మాత్రం కాదు.

మనిషి కొన్ని బంధాలకు, అనుబంధాలకు లోబడి ఉండటం సహజం. అందులో తన కుటుంబీకులే గాకుండా బంధువులు, స్నేహితులు, సన్నిహితులు కూడా వుంటారు. అయితే ఈ అనుబంధాలు ఎల్లవేళలా ఒకేలా ఉండవు. ఏదో ఒక సమయంలో ఏదో ఒక చిన్న తేడా రావొచ్చు. దాంతో అప్పటి నుంచి మన మనసుకు కొంచెం ఇబ్బంది కలగవచ్చు. ఇప్పుడు ఆ సంబంధాలు చెడిపోయినా, ఒకప్పుడు అవి ఆనందాన్ని, ప్రేమను, తృప్తిని ఇచ్చినవే. అసలు ఈ సంబంధాలు ఎలా ఏర్పడినాయని ఆలోచిస్తే, కొన్ని మేధోపరమైనవి, కొన్ని ఆర్థికపరమైనవి కాగా, కొన్ని వారి ఆలోచనలు, భావాలు కలిస్తే వచ్చినవి అయి ఉంటాయి. ఇష్టాయిష్టాలు ఒకటి కావటంవల్ల కూడా కొన్ని బంధాలు దీర్ఘ కాలం నిలిచే వీలుంది. భౌతిక రూపానికి కూడా కొందరు ఇష్టపడతారు. అలా దగ్గరవుతారు. ఎంతో గొప్పగా సాగుతాయి ఈ సంబంధాలు. కానీ ఎక్కడో చిన్న తేడా వస్తుంది. వచ్చిన చిక్కల్లా అక్కడే. కొందరు వెంటనే సరి దిద్దుకోగలుగుతారు. మరికొందరికి అది కుదరక పోవచ్చు. ఆ చిన్న తేడా వలన గతంలో ఉన్న అనుబంధంలో తేడా వస్తుంది. అది ఒకోసారి పలకరింపులు కూడా లేని స్థితికి తీసుకు వెళ్లి, బంధమే చెడి పోయే స్థితికి పడిపో వచ్చు లేదా అసలు బంధమే తెగిపోయి, ఎడముఖం పెడముఖంగా మారిపోవచ్చు. కానీ తర్వాతి కాలంలో ఎప్పుడో మనకు అనిపించవొచ్చు, అయ్యో ఇదేమిటీ ఇలా చేసుకున్నాము అని, అటువంటి పరిస్థితి రాకుండా ఉంటే బాగుండేది అని. ఇలాంటి భావన తర్వాతి కాలంలో కలుగవొచ్చు.

కొన్ని సందర్భాలలో సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నా కుదరని మానసిక స్థితి వెంటాడుతుంది. సంబంధాలు ఇలా చెడిపోవడానికి కారణం అవతలి వారేనని అర్థం అయినా, సంబంధాలు తిరిగి కొనసాగాలని అనుకుంటే క్షమాగుణం కలిగి ఉండాలి. ప్రతీకారేచ్ఛ లేకపోవడమే సహనం. ఓరిమిని మించిన సద్గుణం మరొకటి లేదు.

ప్రతి ఇద్దరి మధ్య ఎన్నో మంచి చెడులు వారికి మాత్రమే తెలిసినవి ఉండొచ్చు. అవతలి వారు చాలాసార్లు మనకు ఎన్నో మంచి చేసిన సందర్భాలు ఉండి ఉండొచ్చు. ఆ మంచిని మర్చిపోయి, మధ్యలో చేసిన తప్పును పట్టుకుని సంబంధాలను చెడగొట్టుకోవడం మంచిదికాదు. అది సరి అయిన పద్ధతి కాదు. తప్పొప్పులనేవి జరుగుతూనే ఉంటాయి. అది సహజం. ఎవరైనా చేయొచ్చు. ఎవరి వలన తప్పు జరిగినా రెండవవారు పెద్దమనసుతో క్షమించగలిగిన గుణం కలిగి ఉండాలి. క్షమించటం అనేది విజయమే కానీ ఓటమి కాదు. క్షమించటంలో చాలా లాభాలున్నాయి. మొదటిది... పాడైపోయిన సంబంధాలను పునరుద్ధరించుకోవడం. రెండవ లాభం మనలోని కోపం, కసి మాయం కావడం. దీనివల్ల మనలో ఉన్న మానసిక ఒత్తిడి దూరమై మనసులోని బరువు ఒక్కసారిగా దిగిపోయినట్లవుతుంది. ఇది ఇక కొత్త అనుభూతిని కలుగ చేస్తుంది.

ఇక్కడ ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. అర్థం లేని ఆలోచనలన్నింటినీ పక్కన పెట్టాలి. మనం గతంలో అనుకున్న విషయం ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలి. అదే నండీ... అసలు ఆ బంధం తెగకుండావుంటే బాగుండేదని అనుకున్న విషయం. ఆ ఆలోచన రాగానే, తిరిగి మనలను గతంలోకి తీసుకువెళుతుంది. కొందరు ఇదంతా కర్మ ఫలం అంటారు. అయితే ఇక్కడ ఆ కోణంలో కూడా ఆలోచిస్తే, ఇతరుల వలన మనం పడిన కష్టాల ఆలోచన వదిలి, మనం ఇతరులకు చేసిన, కలిగించిన ఇబ్బందుల ఆలోచన మొదలవుతుంది. ఇక క్షమించడం మనందరం నేర్చుకుందాం. హాయిగా జీవిద్దాం.

– డా. పులివర్తి కృష్ణమూర్తి

గతంలో మన వలన చెడిపోయిన సంబంధాల ఆలోచన చేస్తే మన తప్పు ఉందన్న విషయం అర్థమవుతుంది. తప్పులను ఒప్పుకోవటం అంటే మెట్టు దిగడం కాదు... వాస్తవాన్ని అంగీకరించడం. అది మనలోని అహాన్ని హరిస్తుంది. ఆ తర్వాత ఇక ఇతరుల తప్పులను క్షమించడం అంత కష్టం కాదు. సులభంగా క్షమించ గలుగుతారు.

ఆత్మబోధిని

మీలోనే ఉంది అమృత భాండం



సర్వం శివమయం జగత్. చరాచర ప్రపంచం అంతా శివమయం. ఈ విశాల విశ్వంలో శివుడు కానిది ఏదీ లేదు. ఈ సమస్త సృష్టి పంచ భూతాలతో నిండి వుంది.

శివుడు సకల జగాలకు పాలకుడు. దుఃఖాన్ని తొలగించి శుభాలనిచ్చే దేవుడు. శివ తత్త్వం గురించి ఎంత చెప్పినా తక్కువే. శివ, శంకర, రుద్ర, హర... అని ఎలా పలికినా అందరినీ కటాక్షించే మహా దేవుడు, భక్త సులభుడు శివుడు. శివ తత్వం అర్థం చేసుకున్న వారు కైవల్యాన్ని పొందటం అత్యంత సులభం. మరణాన్ని నివారించే అమృతం కోసం దేవతలు, దానవులు సముద్ర మథనం చేయాలని శివుడి వద్దకు వెళ్లారు. సృష్టి రక్షణ కోసం తానే సర్వమూ అయ్యే సర్వాత్ముడు శివుడు. అమృతోత్పత్తి కోసం దేవతలు, దానవులు అత్యంత ఉత్సాహంతో క్షీర సాగర మథనంలో పాలు పంచుకున్నప్పుడు ముందుగా ఆవిర్భవించింది 'హాలాహలం'. ఆ పాల్కడలిని తరువగా తరువగా సాగర మధ్యంలో పొగలు రేగాయి. నల్లటి చిచ్చు పుట్టి వాసుకి విష జ్వాలతో ముల్లోకాలను నల్లగా మాడ్చివేయ సాగింది. ఆ భయంకరమైన విషం కారణంగా ప్రాణి కోటితో పాటు, దేవతలు, రాక్షసులు, బ్రహ్మ దేవుడు సైతం హాహాకారాలు చేస్తూ తమను కాపాడమని శివుడిని కోరారు. కరుణామయుడైన శివుడు సకల ప్రాణికోటి సంరక్షణార్థం వెంటనే తన అభయాన్ని ఇచ్చాడు. విశ్వ రక్షణ కోసం అతి భయంకర హాలాహలాన్ని నేరేడు పండులా మింగి, కంఠంలో నిలిపాడు. ఈ మహత్తర కార్యంతో లోకాలకు ఎటువంటి కీడూ వాటిల్లకుండా చేసిన వాత్సల్య సింధువు నీలకంధరుడు పరమశివుడు. ఐతే శివపురాణంలోని ఈ కథకు మరొక కోణం ఉంది. యోగ సాధకులు, సాధనా పరులు తెలుసుకోవాల్సిన విషయం ఇది. సిద్ధ విద్యా రహస్యాన్ని ఆవిష్కరించే కోణం ఇది.

సముద్ర మథనం జరపడానికి విని యోగించిన సర్పం మన లోపల కుండలిని శక్తికి ప్రతీక, అసురులు మనలోని ఆసురీ ప్రవత్తులకు ప్రతీక, దేవతలు మనలోని దివ్య గుణాలకు ప్రతీక. మన శ్వాస గమనమే మథనం. మనిషి మంచి ఆలోచనలు, చర్యలు చేసినప్పుడు ప్రాణ శక్తి గమనం దేవతల దిశగా సాగుతుంది. చెడు ఆలోచనల వల్ల ప్రాణ శక్తి గమనం అసురుల దిశగా ప్రయాణం సాగిస్తుంది. ఈ విధంగా ప్రతీ రోజు చేసే ఆలోచనల ప్రభావంతో నిరంతర మథనం జరుగుతుంటుంది. ఎప్పుడైతే రుద్ర స్వరూపమైన 'సుషుమ్న' జాగృతం అవుతుందో, అప్పుడు చెడు అనే హాలాహలమంతా ఆవిరైపోతుంది. సాధన వల్ల శరీరంలో జరిగే మథనం వల్ల అమతం సిద్ధిస్తుంది. ధ్యాన సాధన ద్వారా యోగి అమత బిందువులను తనలోనే ఆస్వాదించగలడు. ఇది యోగంలో ఉన్నతమైన ప్రక్రియ. అమతత్వం సిద్ధింప చేసుకున్న యోగి, తాను అనుకున్నప్పుడు మాత్రమే అతి సులభంగా, ఒక వస్త్రాన్ని విడిచిన చందంగా దేహాన్ని వదిలి పెట్టగలడు. ధ్యాన సాధన వల్ల మత్యువు కబంధ హస్తాల నుండి యోగి విముక్తుడు అవ్వగలడు. అంతటి అద్భుతమైనది ధ్యానం. ధ్యానమే జీవుడికి అమృత మార్గం.



– గురుమా ఆత్మానందమయి
సుషుమ్న క్రియా యోగ గురువులు

వారం పర్వం

మరణ భయాన్ని తొలగించే ధర్మరాజ దశమి!!

చైత్రశుక్ల దశమికే ధర్మరాజ దశమి అని పేరు. సాధారణంగా ధర్మరాజనగానే పాండవ జ్యేష్ఠుడైన ధర్మరాజే అందరికీ గుర్తొస్తాడు. కానీ ఇక్కడ ధర్మరాజంటే యమ ధర్మరాజు. ఈ దశమి రోజు యముడిని పూజిస్తే మరణభయం తొలగిపోతుందని పెద్దలు చెబుతారు. ముఖ్యంగా నచికేతుడి కథ వినడం ఈ ధర్మరాజ దశమి రోజు చాలా మంచిది.

ఇక నచికేతుడి కథలోకి వెళితే..

పూర్వం వాజశ్రవసుడనే బ్రాహ్మణుడున్నాడు. అతను ఒకసారి విశ్వజిత్ యాగాన్ని సంకల్పించాడు. యాగం అద్భుతంగా సాగి, నిరాటంకంగా ముగిసింది. వాజశ్రవసుడు తన వద్ద ఉన్న వాటన్నింటినీ అడిగిన వారికల్లా లేదనకుండా దానాలు చేయసాగాడు. బాల్యచాపల్యంతో నచికేతుడు తండ్రి దగ్గరకు వెళ్లి,''నాన్నా! నన్నెవరికి దానం చేస్తారు?'' అని అడిగాడు. పిల్లవాడు అదే ప్రశ్నను మాటిమాటికీ అడగడంతో, తండ్రి చికాకుతో 'నిన్ను ఆ యముడికి దానం చేస్తున్నాను పో' అన్నాడు. తండ్రి నోటినుంచి ఆ మాట వినిపించగానే, నచికేతుడు ఆ యమునికి తనను తాను అర్పించుకునేందుకు బయలుదేరాడు.

యమలోకంలో నచికేతునికి యముని దర్శనం అంత త్వరగా లభించలేదు. ఎప్పుడో మూడు రోజుల తరువాత నచికేతుని గమనించాడు యముడు. అతని నుంచి విషయం తెలుసుకున్నాడు. బాలుడైన నచికేతుని సత్యనిష్ఠకు ముచ్చట




పడి, ''నువ్వు నా ద్వారం ముందు మూడురోజులపాటు నిద్రాహారాలు లేకుండా గడిపావు కాబట్టి, నేను నీకు మూడు వరాలను ఇస్తాను.. తీసుకో..'' అన్నాడు. 'మీరు నన్ను దానంగా స్వీకరించలేదు కాబట్టి, నా తండ్రి నా మీద కోపగించుకో కుండా, నన్ను సంతోషంగా తిరిగి స్వీకరించాలి. అదే నా తొలి కోరిక' అన్నాడు నచికేతుడు. దానికి యముడు 'తథాస్తు' అన్నాడు. ఇక రెండవ కోరికగా, 'ఎవరైనా సరే.. స్వర్గాన్ని చేరుకునేలా ఒక యజ్ఞాన్ని అనుగ్రహించండి' అన్నాడు నచికేతుడు. యముడు, 'నచికేత యజ్ఞం' పేరుతో ఒక యజ్ఞాన్ని ఉపదేశించాడు. ఇక మూడవ కోరికగా, 'చనిపోయిన తరువాత మనిషి ఏమవుతాడు?' అని అడిగాడు నచికేతుడు. నచికేతుని తృష్ణను చూసిన యముడు ముచ్చటపడి అతడికి ఆత్మతత్వం గురించి సుదీర్ఘంగా వివరించాడు. ఆత్మజ్ఞానం గురించి యముడికీ నచికేతునికీ మధ్య జరిగిన సంభాషణే, కఠోపనిషత్తులో ముఖ్య భాగం వహిస్తుంది. నిజానికి ఈ ఉపనిషత్తు, మరో భగవద్గీతను తలపిస్తుంది. అందుకే వివేకానందుల వంటి జ్ఞానులకి, 'కఠోపనిషత్తు' అంటే ఎంతో ఇష్టం. 'నచికేతుడి వంటి దృఢమైన విశ్వాసం ఉన్న ఓ పది పన్నెండు మంది పిల్లలు ఉంటే, ఈ దేశానికే ఒక కొత్త దిశను చూపించగలను' అంటారు వివేకానందుల వారు.

– డి.వి.ఆర్.
(నేడు ధర్మరాజ దశమి)

నేల మీద ఉన్నప్పుడే సేసేయాలా...

''ఒకే పని సెసేనాకి... ఒకే నాగ బతికేనాకి... ఇంత పెద్ద బతుకెందుకు... ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసేయాలా... పుడతామా ఏటి మళ్లీ... సెప్పే!' అని రామ్‌చరణ్ ఉత్తరాంధ్ర యాసలో డైలాగ్స్ చెప్పారు. 'పెద్ది' సినిమా కోసమే ఈ హీరో ఈ డైలాగ్స్ చెప్పారు. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ స్పోర్ట్స్ పీరియాడికల్ ఫిల్మ్ 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాల సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా 'పెద్ది' ఫస్ట్ షాట్-రిలీజ్ డేట్ గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 27న (రామ్ చరణ్ బర్త్ డే) రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించారు. ఇక 'పెద్ది పెద్ది పెద్ది' అంటూ బ్యాక్‌గ్రౌండ్‌లో ఫ్యాన్స్ కేరింతలు పెడుతూ ఉండటం, క్రికెట్ గ్రౌండ్‌లోకి రామ్‌చరణ్ అడుగుపెట్టి, బ్యాట్‌తో ఓ వినూత్న స్టైలిష్ షాట్ కొట్టడం వంటి విజువల్స్ 'పెద్ది' ఫస్ట్ షాట్-రిలీజ్ డేట్ గ్లింప్స్‌లో కనిపిస్తాయి. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, సినిమాటోగ్రఫీ: ఆర్.రత్నవేలు.



● రామ్‌చరణ్

తల్లీకొడుకు... యాక్షన్



● విజయశాంతి, కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా, విజయశాంతి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సోహైల్ ఖాన్, శ్రీకాంత్, 'యానిమల్' పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సినిమాలో తల్లీ కొడుకు పాత్రల్లో విజయశాంతి, కల్యాణ్‌రామ్ నటించారు. అర్జున్ పాత్రలో కల్యాణ్‌రామ్, ఐపీఎస్ పోలీసాఫీసర్ వైజయంతి పాత్రలో విజయశాంతి నటించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ సినిమా కొత్త స్టిల్స్‌ను రిలీజ్ చేశారు. తల్లీకొడుకు యాక్షన్‌కి సై అన్నట్లుగా ఓ స్టిల్ ఉంది. ''మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ మూవీ ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.



● అనన్య నాగళ్ల

బాలీవుడ్‌లో ఎంట్రీ

తెలుగులో సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తున్న అనన్య నాగళ్ల బాలీవుడ్ ఎంట్రీ ఖరారైనట్లుగా తెలిసింది. రాకేశ్ జగ్గి దర్శకత్వంలో ఏక్తా ఫిల్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హిమ్మత్ లడుమోర్ ఓ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ హిందీ చిత్రంలో తెలుగు హీరోయిన్ అనన్య నాగళ్ల మెయిన్ లీడ్ రోల్ చేస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో ఓ ట్రైబల్ యువతిగా అనన్య నటిస్తున్నారని, ఈ మూవీకి 'కాంత' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని భోగట్టా. త్వరలోనే ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన రానుంది.


కన్నమ్మా...



● అంకిత్, నీలఖి

అంకిత్ కొయ్య, నీలఖి పాత్రా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బ్యూటీ'. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వంలో వానరా సెల్యూలాయిడ్, మారుతీ టీమ్ ప్రొడక్ట్, జీ స్టూడియోపై అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కె.ఆర్. బన్సల్ నిర్మించారు. ఈ చిత్రంలో 'కన్నమ్మ... కన్నమ్మా...' అంటూ సాగే పాటను ఆదివారం విడుదల చేశారు. చిత్రసంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటను సనారే రాయగా ఆదిత్య ఆర్కే, లక్ష్మీ మేఘన ఆలపించారు. ''ఈ పాటలో హీరో హీరోయిన్ కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. పాట ట్యూన్, లిరిక్, చిత్రీకరణ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: శ్రీ సాయికుమార్.

సీతా పయనంలో...



● ధృవ సర్జా

అర్జున్ సర్జా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సీతా పయనం'. అర్జున్ కుమార్తె, హీరోయిన్ ఐశ్వర్యా అర్జున్ మెయిన్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీరామ్ ఫిలింస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో ధృవ సర్జా (అర్జున్ మేనల్లుడు, కన్నడ స్టార్ హీరో) నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''అర్జున్ సర్జా తన అనుభవంతో, కమర్షియల్ అంశాలతో కూడిన అద్భుతమైన కథను రూపొందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలో ధృవ సర్జా కూడా పాల్గొంటున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్.

రామంకు శ్రీకారం



● 'రామం' పోస్టర్

శ్రీరామ నవమి సందర్భంగా 'రామం' అనే పాన్ ఇండియా సినిమాను ప్రకటించారు చిత్రాలయం స్టూడియోస్ అధినేత వేణు దోనేపూడి. 'ది రైజ్ ఆఫ్ అకిరా' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. లోకమాన్య ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ చిత్రనిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ– ''ధర్మ సంస్థాపనకు యుద్ధం చేసిన రాముడి అడుగు జాడల్లో నడుస్తూ... ఆయన చూపిన బాట ప్రపంచానికి ఆదర్శం అని చాటి చెప్పే ఓ గొప్ప యోధుడికి సంబంధించిన కథాంశంతో ఈ మూవీని రూపొందించనున్నాం. నేటి కాలానికి అలనాటి రామరాజ్యాన్ని కనెక్ట్ చేస్తూ, ఇప్పటివరకు రానటువంటి వైవిధ్యమైన కథతో 'రామం' సినిమా ఉంటుంది. ఈ సినిమాలో ఓ యువ తెలుగు నటుడు హీరోగా నటిస్తారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం. దేశవ్యాప్త నటీనటులు, సాంకేతిక నిపుణులు, అంతర్జాతీయ సాంకేతిక విలువలతో, అత్యుత్తమ నిర్మాణ ప్రమాణాలతో ఈ సినిమాను తెరకెక్కించనున్నాం'' అని తెలిపారు.

ఆర్కియాలజీ నేపథ్యంలో...



● ఆశా వెంకటేశ్

సురేష్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా జీవీ పెరుమాళ్ వర్ధన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'చంద్రేశ్వర'. బేబీ అఖిల సమర్పణలో డా. రవీంద్ర చారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ''మంచి కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ క్రైమ్ కామెడీ సస్పెన్స్ ఎంటర్‌టైనర్ మూవీని సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం'' అని కో ప్రొడ్యూసర్స్ పి. సరిత, వి. బాలకృష్ణ పేర్కొన్నారు. ''ఆర్కియాలజీ నేపథ్యంలో సాగే చిత్రం ఇది. ఏ టెక్నాలజీ లేని ఆ కాలంలో మన పూర్వీకులు గొప్ప దేవాలయాలు నిర్మించారు. అప్పటి వారి జీవన విధానం ఎలా ఉండేది? అనే అంశంతో ఈ చిత్రాన్ని డివోషనల్ టచ్‌తో పాటు వినోద ప్రధానంగా రూపొందించాం'' అని డా. రవీంద్ర చారి తెలిపారు.

ఓటీటీ
ఇది చూడొచ్చు

గ్రీకు వీరుడు రెండో రూపంలో...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం గ్లాడియేటర్ 2 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



చరిత్రలో ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరుచుకుంది గ్రీకు సంస్కృతి. ఎన్నో వైవిధ్యమైన పోరాటాలకు, వీరోచితంగా పోరాడిన వీరుల కథలతో రోమ్ రాచరికపు చరిత్ర నిండి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని భాషలలో గ్రీకు కథలకు సంబంధించి ఎన్నో సినిమాలు వచ్చాయి. కానీ 25 ఏళ్ల క్రితం హాలీవుడ్‌లో వచ్చిన 'గ్లాడియేటర్' సినిమా మాత్రం ప్రపంచ సినీ ప్రేక్షకులకు చాలా ప్రత్యేకం. అప్పట్లో 110 మిలియన్ డాలర్లతో రూపొందిన ఈ సినిమా 465 మిలియన్ డాలర్ల వరకు రాబట్టిందంటేనే తెలుస్తుంది ఈ సినిమా శక్తి ఏంటో. ప్రముఖ హాలీవుడ్ హీరో రస్సెల్ క్రోవ్ నటించిన ఈ సినిమా సూపర్ డూపర్ హిట్టయింది. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'గ్లాడియేటర్ 2' రిలీజైంది. నాటి 'గ్లాడియేటర్'తో పోలిస్తే అంత పెద్ద హిట్ కాకపోయినా నేటి టెక్నాలజీతో సినిమా ఆద్యంతం మంచి విజువల్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. పాల్ మెస్కల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు నాటి 'గ్లాడియేటర్' దర్శకుడైన రిడీ స్కాటే దర్శకత్వం వహించారు. ఇక కథా పరంగా 'గ్లాడియేటర్ 2'లో ఏముందంటే హీరో అయిన హన్నో భార్య అరిషత్‌ను చంపి, హన్నోను రోమన్ జనరల్ అకాసియస్ బానిసగా తీసుకెళతాడు. హన్నో కొలోసియంలో గ్లాడియేటర్‌గా పోరాడుతూ ఉండగా తన తల్లి ఆ రాజ్యపు పట్టపు రాణి అయిన లూసిల్లా అని, తాను మాక్సిమస్ వారసుడని తెలుసుకుంటాడు. మాక్సిమస్ కుట్రతో లూసిల్లాను కొలోసియంలో ఉరి తీయాలనుకుంటాడు. బానిసగా వచ్చిన హన్నో తన తల్లిని కాపాడుకుంటాడా? అలాగే తనను బానిసగా తెచ్చిన అకాసియస్... హన్నోకి అండగా ఉంటాడా? అనేది మాత్రం ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'గ్లాడియేటర్ 2'లోనే చూడాలి. మొదటి గ్లాడియేటర్ కన్నా ఈ గ్లాడియేటర్‌లో ఎక్కువ పోరాట సన్నివేశాలతో పాటు గ్రీకు సంస్కృతి సామాన్యులకు సైతం అర్థమయ్యేలా కథలో జొప్పించారు. తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా ఉంది కాబట్టి నాటి రోమ్ కథను హాయిగా మన భాషలో చూసేయొచ్చు. అయితే పిల్లలతో కాకుండా పెద్దవాళ్లు మాత్రం చూడదగ్గ మంచి అడ్వెంచరెస్ ఫిల్మ్.

– హరికృష్ణ ఇంటూరు



భారత బాక్సర్లకు ఆరు పతకాలు

తొలిసారి నిర్వహించిన వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు ఆరు పతకాలతో మెరిశారు. బ్రెజిల్‌లోని ఫాజ్ డు లుగాకు నగరంలో ఈ టోర్నమెంట్ జరిగింది. పురుషుల 70 కేజీల విభాగంలో భారత బాక్సర్ హితేశ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఫైనల్లో హితేశ్‌తో తలపడాల్సిన ఒడెల్ కమారా (ఇంగ్లండ్) గాయం కారణంగా బరిలోకి దిగలేదు. దాంతో 'వాకోవర్'తో హితేశ్‌కు బంగారు పతకం ఖరారైంది. పురుషుల 65 కేజీల విభాగంలో అభినాశ్ జమ్వాల్ రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఫైనల్లో అభినాశ్ 0–5తో యురీ రెయిస్ (బ్రెజిల్) చేతిలో ఓడిపోయాడు. సెమీఫైనల్లో పరాజయం పాలైన నలుగురు భారత బాక్సర్లు జాదూమణి సింగ్ (50 కేజీలు), మనీశ్ రాథోడ్(55 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), విశాల్ (90 కేజీలు) కాంస్య పతకాలు గెల్చుకున్నారు. ఆరు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో 19 దేశాల నుంచి 130 మంది బాక్సర్లు పోటీపడ్డారు.

రుద్రాంక్ష్ పాటిల్ 'పసిడి' గురి



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మహారాష్ట్రకు చెందిన 21 ఏళ్ల రుద్రాంక్ష్ 252.9 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. మార్టన్ పెనీ (హంగేరి; 251.7 పాయింట్లు) రజతం, జూలియన్ గుటిరెజ్ (అర్జెంటీనా; 230.1 పాయింట్లు) కాంస్యం గెలిచారు. ఫైనల్లో పోటీపడ్డ మరో భారత షూటర్ అర్జున్ బబూటా 144.9 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచాడు. అంతకుముందు 47 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్ రౌండ్‌లో అర్జున్ 643.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో, రుద్రాంక్ష్ 633.7 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో టాప్–8లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్లో పోటీపడతారు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచి నాలుగు పతకాలతో రెండో స్థానంలో ఉంది. శనివారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని అందించింది. ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో రుద్రాంక్ష్‌కిది ఐదో పతకం కావడం విశేషం. గతంలో అతను రెండు స్వర్ణాలు (2023 కైరో), రెండు కాంస్యాలు (2023 భోపాల్) సాధించాడు.

'నాలుగు'తో నగుబాటు

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో పరాజయం

సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ చేతిలో చిత్తు ● 4 వికెట్లతో మెరిసిన సిరాజ్

ఇన్నింగ్స్‌లో 12 ఓవర్లు ముగిసేవరకు ఒక్క సిక్స్ కూడా లేదు... ఒకదశలో వరుసగా 6 ఓవర్ల పాటు కనీసం ఫోర్ కూడా రాలేదు... విధ్వంసక బ్యాటింగ్‌తో మంచినీళ్ల ప్రాయంలా బౌండరీలతో విరుచుకుపడే సన్‌రైజర్స్ జట్టేనా ఇది? మొదటి మ్యాచ్ తర్వాత గతి తప్పిన బ్యాటింగ్‌తో హైదరాబాద్ అదే వైఫల్యాన్ని కనబర్చింది. ఒక్క బ్యాటర్ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. ఫలితంగా ఐపీఎల్ 18వ సీజన్‌లో వరుసగా నాలుగో ఓటమితో సన్‌రైజర్స్ ఆఖరి స్థానంతోనే మరింత అథమ స్థితికి చేరింది. గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతున్న హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ తన సొంతగడ్డపై నాలుగు వికెట్లతో చెలరేగి సన్‌రైజర్స్‌ను కుప్పకూల్చాడు. పవర్‌ప్లేలో అతను ఓపెనర్లను అవుట్ చేసిన తర్వాత హైదరాబాద్ జట్టు కోలుకోలేకపోయింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ ఆడుతూ పాడుతూ అలవోకగా ఛేదించింది. గిల్, సుందర్, రూథర్‌ఫోర్డ్ రాణించడంతో మరో 20 బంతులు మిగిలి ఉండగానే టైటాన్స్ జట్టు గెలుపు ఖాయమైంది.



క్లాసెన్ బౌల్డ్



19 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో 100 వికెట్లు పడగొట్టిన 19వ భారతీయ బౌలర్‌గా, ఓవరాల్‌గా 26వ బౌలర్‌గా సిరాజ్ గుర్తింపు పొందాడు. ఇప్పటి వరకు 97 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ మొత్తం 102 వికెట్లు పడగొట్టాడు.

4/17 ఐపీఎల్ చరిత్రలో సిరాజ్ తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేశాడు. 2023లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను 21 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు.

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఉప్పల్ స్టేడియంలోనూ కోలుకోలేకపోయిన జట్టు వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఓడింది. ఆదివారం జరిగిన ఈ పోరులో శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ రెడ్డి (34 బంతుల్లో 31; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ సిరాజ్ (4/17) పదునైన బౌలింగ్‌తో రైజర్స్‌ను దెబ్బ తీయగా... సాయికిషోర్, ప్రసిధ్ కృష్ణ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం టైటాన్స్ 16.4 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (43 బంతుల్లో 61 నాటౌట్; 9 ఫోర్లు), తొలిసారి టైటాన్స్ తరఫున ఆడిన వాషింగ్టన్ సుందర్ (29 బంతుల్లో 49; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) భాగస్వామ్యంతో జట్టు గెలుపు సులువైంది. వీరిద్దరు మూడో వికెట్‌కు 56 బంతుల్లో 90 పరుగులు జోడించారు. గిల్, షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (16 బంతుల్లో 35 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) కలిసి 21 బంతుల్లో 46 పరుగులు భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ముగించారు.

ఓపెనర్లు విఫలం...

టి20 క్రికెట్‌లో తొలిసారి ట్రవిస్ హెడ్ (5 బంతుల్లో 8; 2 ఫోర్లు)కు సిరాజ్ బౌలింగ్ చేశాడు. అయితే ఈ పోరాటం ఐదు బంతులకే పరిమితమైంది. మొదటి ఓవర్లో 2 ఫోర్లు కొట్టిన హెడ్‌ను చివరి బంతికి సిరాజ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత తన మూడో ఓవర్లో అభిషేక్ శర్మ (16 బంతుల్లో 18; 4 ఫోర్లు)ను కూడా సిరాజ్ వెనక్కి పంపడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఓపెనర్లను కోల్పోయిన హైదరాబాద్ 45 పరుగులే చేయగలిగింది. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (14 బంతుల్లో 17; 2 ఫోర్లు) కూడా విఫలమయ్యాడు. ఈ దశలో నితీశ్, హెన్రిచ్ క్లాసెన్ (19 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే నితీశ్ మరీ నెమ్మదిగా ఆడాడు. భారీ షాట్లు ఆడటంలో అతను పూర్తిగా విఫలమయ్యాడు. ఐదో ఓవర్ నుంచి 10వ ఓవర్ వరకు హైదరాబాద్ బ్యాటర్లు ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయారు. 13వ ఓవర్ నాలుగో బంతికి గానీ తొలి సిక్స్ నమోదు కాలేదు. రషీద్ బౌలింగ్‌లో క్లాసెన్ ఈ సిక్స్ బాదాడు. నాలుగో వికెట్‌కు నితీశ్, క్లాసెన్ 39 బంతుల్లో 50 పరుగులు జోడించారు. క్లాసెన్ అవుటైన తర్వాత తక్కువ వ్యవధిలో నితీశ్, కమిందు (1), అనికేత్ వర్మ (18) కూడా వెనుదిరిగారు. చివర్లో ప్యాట్ కమిన్స్ (9 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కాస్త ధాటిగా ఆడటంతో స్కోరు 150 పరుగులు దాటింది. 15–19 ఓవర్ల మధ్య 34 పరుగులే రాబట్టిన రైజర్స్ ఇషాంత్ వేసిన ఆఖరి ఓవర్లో గరిష్టంగా 17 పరుగులు సాధించింది.

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో టైటాన్స్ ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. షమీ తన తొలి ఓవర్లో సాయి సుదర్శన్ (5)ను వెనక్కి పంపగా, బట్లర్ (0)ను కమిన్స్ అవుట్ చేశాడు. అయితే సన్‌రైజర్స్ ఆనందం ఇక్కడికే పరిమితమైంది. గిల్, సుందర్ కలిసి జట్టును విజయం దిశగా నడిపించారు. ఈ క్రమంలో వారికి హైదరాబాద్ బౌలర్ల నుంచి ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. సిమర్జిత్ ఓవర్లో సుందర్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో 20 పరుగులు వచ్చాయి. పవర్‌ప్లేలో టైటాన్స్ స్కోరు 48 పరుగులకు చేరింది. మరోవైపు గిల్ కూడా కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. 36 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. ఎట్టకేలకు షమీ బౌలింగ్‌లో అనికేత్ అద్భుత క్యాచ్‌తో వెనుదిరిగిన సుందర్ అర్ధ సెంచరీని చేజార్చుకున్నాడు. 41 బంతుల్లో 47 పరుగులు చేయాల్సిన స్థితిలో క్రీజ్‌లోకి వచ్చిన రూథర్‌ఫోర్డ్ చెలరేగిపోయాడు. అభిషేక్ ఓవర్లో అతను 4 ఫోర్లు బాదడం విశేషం. ఆ తర్వాత మ్యాచ్ ముగించేందుకు టైటాన్స్‌కు ఎక్కువ సమయం పట్టలేదు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) తెవాటియా (బి) సిరాజ్ 18; హెడ్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 8; ఇషాన్ కిషన్ (సి) ఇషాంత్ (బి) ప్రసిధ్ 17; నితీశ్ రెడ్డి (సి) రషీద్ (బి) సాయికిషోర్ 31; క్లాసెన్ (బి) సాయికిషోర్ 27; అనికేత్ (ఎల్బీ) (బి) సిరాజ్ 18; కమిందు (సి) సుదర్శన్ (బి) ప్రసిధ్ 1; కమిన్స్ (నాటౌట్) 22; సిమర్జిత్ (బి) సిరాజ్ 0; షమీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 152. వికెట్ల పతనం:** 1–9, 2–38, 3–50, 4–100, 5–105, 6–120, 7–135, 8–135. **బౌలింగ్:** సిరాజ్ 4–0–17–4, ఇషాంత్ శర్మ 4–0–53–0, ప్రసిధ్ కృష్ణ 4–0–25–2, రషీద్ ఖాన్ 4–0–31–0, సాయికిషోర్ 4–0–24–2.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయిసుదర్శన్ (సి) అనికేత్ (బి) షమీ 5; గిల్ (నాటౌట్) 61; బట్లర్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 0; సుందర్ (సి) అనికేత్ (బి) షమీ 49; రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 35; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (16.4 ఓవర్లలో 3 వికెట్లకు) 153. వికెట్ల పతనం:** 1–15, 2–16, 3–106. **బౌలింగ్:** షమీ 4–0–28–2, కమిన్స్ 3.4–0–26–1, సిమ్రన్‌జీత్ 1–0–20–0, ఉనాద్కట్ 2–0–16–0, అన్సారీ 4–0–33–0, కమిందు మెండిస్ 1–0–12–0, అభిషేక్ శర్మ 1–0–18–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.257
గుజరాత్	4	3	1	6	1.031
బెంగళూరు	3	2	1	4	1.149
పంజాబ్	3	2	1	4	0.074
కోల్‌కతా	4	2	2	4	0.070
లక్నో	4	2	2	4	0.048
రాజస్తాన్	4	2	2	4	-0.158
ముంబై	4	1	3	2	0.108
చెన్నై	4	1	3	2	-0.891
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై X బెంగళూరు
వేదిక: ముంబై
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐ బ్యాంక్‌లో 119 పోస్టులు

ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 119.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్-8, అసిస్టెంట్ జనరల్ మేనేజర్-42, మేనేజర్-69
» **విభాగాలు:** ఆడిట్–ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఫైనాన్స్–అకౌంట్స్, లీగల్, రిస్క్ మేనేజ్‌మెంట్, డిజిటల్ బ్యాంకింగ్, అడ్మినిస్ట్రేషన్–రాజ్‌భాష, ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్(ఐఎండీ), సెక్యూరిటీ, కార్పొరేట్ క్రెడిట్/రిటైల్ బ్యాంకింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–ఎంఐఎస్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా డిగ్రీ, బీసీఏ, బీఎస్సీ, బీటెక్, బీఈ, ఎల్ఎల్‌బీ, పీజీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టుకు 35 నుంచి 45 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు 28 నుంచి 40 ఏళ్లు, మేనేజర్‌కు 25 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,02,300, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.85,920, మేనేజర్‌కు రూ.64,820.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.04.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2025
» **వెబ్‌సైట్:** https://www.idbibank.in

టీజీ ఆర్‌జేసీ సెట్-2025

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ(టీఆర్‌ఈఐ)..రాష్ట్రంలోని 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మాధ్యమం)లో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్ఆర్జేసీ) సెట్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా బాలురకు 15, బాలికలకు 20గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయి.అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 2,996.
» **గ్రూపులు–సీట్లు:** ఎంపీసీ–1496, బైపీసీ–1440, ఎంఈసీ–60.
» **అర్హత:** ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 మార్చిలో పదో తరగతి పరీక్షలో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 150 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఎంపీసీ పరీక్షకు ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బైపీసీకి ఇంగ్లిష్, బయాలజీ, ఫిజికల్ సైన్స్, ఎంఈసీ పరీక్షకు ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, గణితం సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పదో తరగతి స్థాయిలో ఒక్కో సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2.30 గంటలు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.04.2025
» **పరీక్ష తేది:** 10.05.2025.
» **వెబ్‌సైట్:** https://tgrjc.cgg.gov.in

ఏపీ పీజీసెట్-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుంది.

» **కోర్సుల వివరాలు:** ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంసీజే, ఎంఎల్ఐబీఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీటెక్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి ఏడాది పరీక్ష రాస్తున్న వారు అర్హులు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.05.2025.
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**30.05.2025
» **ప్రవేశ పరీక్షలు:** 09.06.2025 నుంచి 13.06.2025 వరకు
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

» ఇంటర్ సహా ఎన్నో కోర్సులు, కెరీర్ అవకాశాలు
» ఇంటర్మీడియెట్‌లో ప్రతి గ్రూప్‌లోనూ ఎంతో ప్రత్యేకత
» టెక్నికల్ నైపుణ్యాలకు దారి చూపే ఐటీఐ, పాలిటెక్నిక్

'పది' తర్వాత పయనం ఇలా

పదో తరగతి.. ప్రతి విద్యార్థి జీవితంలో కీలకమైన దశ! టెన్త్ తర్వాత ఎటువైపు అడుగులు వేయాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు, ఇంటర్మీడియెట్‌లో వివిధ గ్రూప్‌లు.. దేన్ని ఎంచుకోవాలి! ఇంటర్‌లో ఏ గ్రూప్‌లో చేరితే.. ఎలాంటి కెరీర్ అవకాశాలు లభిస్తాయి! ఇలా.. పదో తరగతి ఉత్తీర్ణులకు ఎన్నో సందేహాలు!! ఈ నేపథ్యంలో.. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉపయోగపడేలా.. టెన్త్ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..

ఇంటర్మీడియెట్

తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పూర్తయిన విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంటర్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్.. ఇలా అనేక గ్రూప్‌లు! వీటి ద్వారా లభించే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై సరైన అవగాహనతో గ్రూప్‌ను ఎంచుకోవడం మేలు చేస్తుంది.

ఇంజనీరింగ్‌కు ఎంపీసీ

టెన్త్ ఉత్తీర్ణుల్లో అత్యధిక శాతం మంది ఎంపిక చేసుకునే గ్రూప్.. ఎంపీసీ. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల కలయికగా ఉండే ఈ గ్రూప్ అభ్యర్థులకు సహజంగా కొన్ని లక్షణాలు ఉండాలి. ముఖ్యంగా కంప్యుటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ నైపుణ్యాలు అవసరం. మన కళ్ల ముందు కనిపించే మెషిన్‌లు, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ పరికరాలు, వాటి పనితీరు తెలుసుకునే ఆసక్తి ఉన్న వారు ఎంపీసీ గ్రూప్‌నకు సరితూగుతారు.

ఉన్నత విద్య: ఎంపీసీ గ్రూప్ అర్హతతో ఈఏపీసెట్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ తదితర ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకు సాధించి ఇంజనీరింగ్‌లో కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. అంతేకాకుండా ఎన్‌డీఏ, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీం వంటి పరీక్షల ద్వారా డిఫెన్స్ రంగంలో కెరీర్‌ను సొంతం చేసుకోవచ్చు. వీటితోపాటు భవిష్యత్తులో సైన్స్ రంగంలో స్థిరపడాలనుకుంటే.. బీఎస్సీ పూర్తి చేసి.. ఆ తర్వాత ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ద్వారా పరిశోధన రంగంలో అవకాశాలు అందుకోవచ్చు.

మెడికల్ కోర్సులకు బైపీసీ

ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల అభ్యర్థులకు ప్రధాన వేదికగా నిలుస్తున్న గ్రూప్.. బైపీసీ. లైఫ్ సైన్సెస్‌పై సహజ ఆసక్తి, ప్రకృతి, పర్యావరణ స్పృహ, మానవుడు, ఇతర జీవుల భౌతిక నిర్మాణం, వ్యాధుల గురించి తెలుసుకోవాలనే ఉత్సుకత వంటివి ఉండాలి. సహనం, ఓర్పు అనేవి బైపీసీ విద్యార్థులకు ఉండాల్సిన ఇతర ముఖ్య లక్షణాలు.

బైపీసీతో ఉన్నత విద్య: జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ యూజీ (అండర్ గ్రాడ్యుయేట్)లో ర్యాంకు సాధించి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. మెడికల్ కోర్సులతోపాటు ఆయుష్ కోర్సులు, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, పారా మెడికల్ కోర్సుల్లోనూ చేరొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ, ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశాలు ఉన్నాయి. లైఫ్ సైన్సెస్, బయాలాజికల్ సైన్సెస్‌లో కెరీర్ కోరుకునే అభ్యర్థులకు మార్గం బీఎస్సీ (బీజెడ్‌సీ).

కామర్స్ కెరీర్స్‌కు సీఈసీ

భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య రంగాల్లో కెరీర్ కోరుకునే విద్యార్థులకు సరితూగే గ్రూప్.. సీఈసీ. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌లు కలయికగా ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేస్తే కార్పొరేట్ కొలువులు సొంతం చేసుకునే దిశగా కీలక మైలురాయి దాటినట్లే. ఈ కోర్సు విద్యార్థులకు కాలిక్యులేషన్ స్కిల్స్, గణాంకాల విశ్లేషణ, సూక్ష్మ స్థాయి పరిశీలన వంటివి ఉండాలి.

ఉన్నత విద్య అవకాశాలు: వాస్తవానికి సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్య పరంగా బీకాం కోర్సు ముఖ్య మార్గంగా నిలుస్తోంది. బీకాం చదువుతూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించడం ద్వారా కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్ కాలర్ ఉద్యోగాలు లభిస్తాయి.

పీజీ స్థాయిలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సుల్లో చేరొచ్చు. ఎంబీఏలో చేరేందుకు బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా నిర్వహించే ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి. అదేవిధంగా ప్రముఖ బిజినెస్ స్కూల్స్ ఐఐఎంలు, ఇతర మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఎంబీఏలో చేరేందుకు క్యాట్, మ్యాట్, సీమ్యాట్ వంటి పరీక్షల్లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

మరో మెరుగైన గ్రూప్.. ఎంఈసీ

ఇంటర్మీడియెట్‌లో ఆదరణ పొందుతున్న మరో గ్రూప్.. ఎంఈసీ. మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్ట్‌ల కలయికగా ఉండే ఈ గ్రూప్‌ను ఎంపిక చేసుకుని ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే.. ఇటు మ్యాథమెటిక్స్ అర్హతగా ప్రవేశం లభించే బీఎస్సీ కోర్సులోనూ.. అటు కామర్స్ అర్హతగా ప్రవేశం లభించే బీకాం కోర్సుల్లోనూ చేరే వీలుంటుంది.

కంప్యుటేషనల్, కాలిక్యులేషనల్ స్కిల్స్ ఉన్న విద్యార్థులు.. అదే విధంగా ఏకాగ్రత, ఒక పనిపై సుదీర్ఘ సమయం వెచ్చించే ఓర్పు, సహనం ఉన్న విద్యార్థులు ఎంఈసీ గ్రూప్‌నకు సరితూగుతారు.



ఉన్నత విద్య అవకాశాలు: సంప్రదాయ బీకాం, బీఎస్సీ కోర్సులు అభ్యసించొచ్చు. వీటితోపాటు సీఏ, ఐసీడబ్ల్యూఏఐ, సీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశించొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ తర్వాత ఎంబీఏ, ఎంకాం వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పోటీ పరీక్షలకు హెచ్‌ఈసీ

భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకున్న వారికి అనుకూలించే గ్రూప్.. హెచ్‌ఈసీ. హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌లుగా ఉండే హెచ్‌ఈసీపై పట్టు ద్వారా పలు ఉద్యోగ పోటీ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. ఇటీవల కాలంలో హెచ్‌ఈసీ అర్హతగా ప్రవేశం లభించే బీఏ కోర్సులోనూ జాబ్ ఓరియెంటెడ్ గ్రూప్ కాంబినేషన్స్ (ఉదా: సోషల్ స్టడీస్, సోషల్ సైన్సెస్, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ తదితర) అందుబాటులోకి వస్తున్నాయి. ఈ గ్రూప్ సబ్జెక్ట్స్‌తో బీఏ పూర్తి చేయడం ద్వారా ప్రైవేటు రంగంలోనూ కొలువులు దక్కించుకోవచ్చు.

ఆర్‌జేసీస్

పదో తరగతి ఉత్తీర్ణులకు రెగ్యులర్ జూనియర్ కళాశాలలతోపాటు మరో ఉత్తమ మార్గం.. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు. ఆర్‌జేసీ సెట్ ద్వారా వీటిలో ప్రవేశం లభిస్తుంది. ఈ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారికి పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో బోధన ఉంటుంది. అంతేకాకుండా విద్యార్థులను ఈఏపీసెట్, నీట్ యూజీ, జేఈఈ, సీఏ సీపీటీ, తదితర ప్రవేశ పరీక్షలకు సన్నద్ధులను చేసే విధంగా ప్రత్యేక శిక్షణ సైతం లభిస్తుంది.

పాలిటెక్నిక్స్

పదో తరగతితోనే ఇంజనీరింగ్ కెరీర్‌కు మార్గం.. పాలిటెక్నిక్ కోర్సులు. మూడేళ్ల ఈ డిప్లొమా కోర్సులను పూర్తి చేసుకుంటే.. పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. ఉన్నత విద్య పరంగా ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈ–సెట్)లో ర్యాంకు ద్వారా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించొచ్చు.

వృత్తి విద్య శిక్షణకు కేరాఫ్ ఐటీఐ

పదో తరగతి అర్హతతో వృత్తి విద్య శిక్షణ పొందేందుకు మార్గం.. ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్). నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ పరిధిలోని ఐటీఐల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ ఎయిర్ కండిషనింగ్ తదితర పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకు సాధారణంగా ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ వెలువడుతుంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ పరిధిలో ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న ప్రాంతీయ ఒకేషనల్ ట్రైనింగ్ కౌన్సిల్స్ ఈ ప్రవేశ ప్రక్రియలను నిర్వహిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత పారిశ్రామిక సంస్థల్లో ఎంట్రీ లెవల్లో టెక్నీషియన్స్‌గా అడుగు పెట్టొచ్చు. అదే విధంగా అప్రెంటీస్ షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ నిర్వహించే అప్రెంటీస్‌షిప్ సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో మరింత ప్రాముఖ్యం ఉంటుంది.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్ ద్వారా డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ కోర్సుల కాల పరిమితి రెండేళ్లు. ఇంజనీరింగ్ కోర్సు కాల పరిమితి మూడేళ్లు. వ్యవసాయ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సంస్థలు వంటివాటిలో ఉద్యోగాలు లభిస్తాయి. వీరికి ప్రారంభంలో రూ.15వేల వరకు వేతనం లభిస్తుంది.

సత్వర ఉపాధికి ఒకేషనల్ కోర్సులు

ఇంటర్మీడియెట్‌తోనే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలతోపాటు స్వయం ఉపాధికి మార్గం కల్పిస్తున్న కోర్సులు.. ఒకేషనల్ కోర్సులు. ఈ ఒకేషనల్ కోర్సుల ద్వారా ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌షిప్ నుంచి ఆటో మొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ.. టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో శిక్షణ పొందొచ్చు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డ్‌లు.. అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హోం సైన్స్, హ్యూమానిటీస్, పారా మెడికల్ విభాగాల్లో మొత్తం 27 ఒకేషనల్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా సంబంధిత రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్– ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– బ్యాంకింగ్ అవేర్‌నెస్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	931	346
	75,365	22,904

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	15,588 ▽	963
డోజోన్స్	38,315 ▽	2,231
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,055 ▽	420
డాక్స్	20,642 ▽	1,076
షాంఘై (ఏప్రిల్ 3 ముగింపు)	3,342 ▽	9
నికాయ్	35,781 ▽	955

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	83.40	87.08
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	108.44	113.32
€	యూరో	భారతీయ	91.80	96.31
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	49.74	54.48
S$	సింగపూర్ డాలర్	భారతీయ	61.34	66.01
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.83	23.39
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	22.32	24.10
¥	చైనా యువాన్	భారతీయ	10.83	12.65

రుణ వేధింపులకు చెక్ పెడదాం..!

బాకీ వసూలు పేరిట అనుచితంగా ప్రవర్తించరాదు

- అలాంటి చర్యలను ఉపేక్షించక్కర్లేదు
- పరువుకు భంగం కలిగిస్తే కోర్టులో కేసు వేయొచ్చు
- బ్యాంక్‌తో రాజీ ఒప్పందానికి ప్రయత్నించొచ్చు
- ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించొచ్చు

ఢిల్లీకి చెందిన అనుజ్ (35) వ్యాపారంలో సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తాను తీసుకున్న వ్యక్తిగత రుణం ఈఎంఐలను సకాలంలో చెల్లించలేకపోయాడు. దాంతో రుణ వసూళ్ల ఏజెంట్ల బృందం ఆయన ఇంటి ముందు వాలిపోయింది. నినాదాలూ చేస్తూ, ఆ దారిలో వెళ్లే ఒక్కొక్కరిని పిలిచి అనుజ్ రుణం ఎగ్గొట్టాడంటూ దుష్ప్రచారం మొదలు పెట్టారు. తద్వారా అనుజ్‌కు పరువుపోయినట్టయింది. ఇది అనుజ్ ఒక్కడి సమస్యే అనుకుంటే పొరపాటు. ఏటా లక్షలాది మంది ఇలా రుణ రికవరీ ఏజెంట్ల వేధింపులకు గురవుతున్నవారే. వీటిని భరించలేక బలవన్మరణానికి పాల్పడిన వారూ ఉన్నారు. రుణ గ్రహీతలకూ కొన్ని హక్కులు ఉన్న విషయాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. రుణం చెల్లించకపోతే వసూలు చేసుకునే విషయంలోనూ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు/వాటి ఏజెంట్లకూ నిర్దేశిత నిబంధనలు, పరిమితులు ఉన్నాయి. వాటిని హద్దుమీరి వ్యవహరిస్తుంటే సహించక్కర్లేదు. అనుచిత చర్యల నుంచి రక్షణ కోరడమే కాదు, ఉపశమనం పొందొచ్చు. ఈ విషయమై సమాచారం అందించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్



గతంతో పోల్చితే నేడు రుణాలు ఎంతో సులభంగా లభిస్తున్నాయి. దీంతో రుణ ఎగవేతలు కూడా పెరిగాయి. సూక్ష్మ రుణాలు, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు రుణాల్లో ఇటీవలి కాలంలో చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. కొన్ని వర్గాల రుణ గ్రహీతలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల ప్రభావం బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల రుణ వసూళ్లపై ప్రభావం చూపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని నెలల పాటు వసూలు కాకుండా ఉండిపోయిన రుణాలను మొదట బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు తమ రుణ రికవరీ బృందాలకు అప్పగిస్తాయి. లేదా రుణ రికవరీ ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. ఫలితం లేకపోతే అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలకు (ఏఆర్‌సీలు) విక్రయిస్తాయి. రుణ రికవరీ ఏజెన్సీలు రుణం వసూలు చేసినందుకు ఇంత చొప్పున తీసుకుంటాయి. ఏఆర్‌సీలు అయితే మొండి బాకీలను తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని, వాటిని వసూలు చేసుకునేందుకు చర్యలు మొదలు పెడతాయి. ఇక్కడ ఎక్కువ సందర్భాల్లో కనిపించేది.. రుణం తీసుకున్న వారిని నయానో, భయానో నానా రకాలుగా వెంటపడి, వేధించి వసూలు చేసుకోవడమే ఏజెంట్ల పని.

స్పష్టమైన నిబంధనలు

రుణ వసూళ్లకు రుణదాతలు కఠిన చర్యలకు పాల్పడుతున్న విషయం ఆర్‌బీఐ దృష్టికి రావడంతో.. రుణ రికవరీ ఏజెంట్ల నియంత్రణ విషయమై, వారి నడవడికపై లోగడే సమగ్రమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ తర్వాత పలు విడతలుగా వాటిని మెరుగుపరుస్తూ నోటిఫికేషన్‌లను జారీ చేసింది. రుణ గ్రహీతలకు ఉన్న హక్కులను గౌరవిస్తూనే, నైతిక విధానాల్లో వసూలుకు నిబంధనలు అమల్లో పెట్టింది. వీటి ప్రకారం.. రుణాన్ని పారదర్శకమైన విధానాల్లోనే వసూలు చేసుకోవాలి. మాటలతో లేదా చేతలతో వేధింపులకు దిగకూడదు. రుణానికి సంబంధించి, రుణ గ్రహీతకు సంబంధించి గోప్యత, గౌరవాన్ని కాపాడాలి. వారి పరువు నష్టానికి భంగం కలిగించకూడదు. బెదిరించకూడదు. రుణం చెల్లించలేదంటూ నోటీసు జారీ చేసి చట్టబద్ధమైన మార్గాల్లోనే వసూలుకు చర్యలు తీసుకోవాలి. అంతేకాదు రుణ గ్రహీతకు కాల్స్ చేయడం కూడా ఉదయం 8 గంటల తర్వాత, రాత్రి 7గంటల్లోపేనని నిబంధలు చెబుతున్నాయి. రుణం చెల్లింపులు ఆగిపోయిన అన్ని కేసుల్లోనూ ఉద్దేశపూర్వకమని చెప్పలేం. ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోవడం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలు ఎదురుకావడం వంటివి చోటు చేసుకోవచ్చు. కనుక చెల్లింపులు చేయని రుణ గ్రహీతలు అందరినీ ఒకే గాటన కట్టడాన్ని సమర్థించలేం.

గుర్తింపును ధ్రువీకరించుకోవాలి..

నేడు సైబర్ మోసాలు పెరిగిపోయాయి. తమకు వస్తున్న కాల్స్ అన్నీ రుణం వసూలు కోసమని భావించడానికి లేదు. అందులో సైబర్ మోసగాళ్ల కాల్స్ కూడా ఉండొచ్చు. అందుకని రుణం విషయమై వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. అవతలి వ్యక్తి బ్యాంక్ అధీకృత ఉద్యోగియేనా? లేదంటే సంబంధిత వ్యక్తికి బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ ధ్రువీకరణ ఉందా? అన్నది నిర్ధారించుకోవాలి. వారి గుర్తింపు కార్డ్‌ను చూపించాలని కోరాలి. ఆ ఐడీ కార్డ్ మీరు రుణం తీసుకున్న బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ జారీ చేసిందేనా? అని పరిశీలించాలి. సరైనదని భావిస్తేనే వారితో వివరాలు పంచుకోవచ్చు. లేదంటే నేరుగా బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సిబ్బందితోనే డీల్ చేసుకుంటామని తెగేసి చెప్పేయాలి.

నిబంధనలు పాటించాల్సిందే..

ఆర్‌బీఐ నియంత్రణలోని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, కోపరేటివ్ బ్యాంక్‌లు అన్నీ కూడా ఆర్‌బీఐ ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాల్సిందే. ఈ విషయంలో ఏజెంట్లకు సరైన శిక్షణ ఇవ్వాలని, వారి ప్రవర్తనకు బ్యాంక్‌లే బాధ్యత వహించాలని ఆర్‌బీఐ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. బ్యాంక్‌లు తమ వెబ్‌సైట్లలో రికవరీ ఏజెన్సీల వివరాలను వెల్లడించాలి. ఫలానా రికవరీ ఏజెంట్ లేదా ఏజెన్సీకి రుణ వసూలు బాధ్యత అప్పగించామని రుణగ్రహీతకు బ్యాంక్ ముందస్తు సమాచారం ఇవ్వాలి. బ్యాంక్ అధీకృత లేఖ, బ్యాంక్ నోటీసును ఏజెంట్లు చూపించాలి. ఒకవేళ ఏజెంట్ల నుంచి అనుచిత, అనైతిక తీరును ఎదురైతే అప్పుడు రుణ గ్రహీతలు తమ హక్కులను కాపాడుకునేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కాల్స్ చేసి వేధించినట్టయితే కాల్ రికార్డులను భద్రపరుచుకోవాలి. ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్‌ల రూపంలో వేధిస్తే వాటిని సైతం జాగ్రత్త పరుచుకోవాలి. ఇంటికొచ్చి వేధిస్తుంటే వీడియో తీసి సేవ్ చేసుకోవాలి. ముందుగా సంబంధిత బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలి. స్పందన లేకపోతే అప్పుడు ఆర్‌బీఐని ఆశ్రయించొచ్చు.

ఇలా చేస్తే నయం..



- ఆర్‌బీఐ రిజిస్టర్డ్ సంస్థల నుంచే రుణాలను తీసుకోవాలి. ఒకవేళ సమస్య ఎదురైతే పరిష్కరించుకోవడం సులభం.
- రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోవడానికి సహేతుక కారణాలను బ్యాంక్ సిబ్బందికి తెలియజేసి, తగిన సమయం కోరొచ్చు. రుణాన్ని తిరిగి చెల్లించే ప్రణాళికను సమర్పించొచ్చు.
- రుణం తీసుకునే ముందు ఒప్పందం నిబంధనలను, తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలి.

వేధింపులపై చర్యలు



- రుణ రికవరీ ఏజెంట్ల వేధింపులు, బెదిరింపులకు సంబంధించి ఆధారాలను సేకరించాలి. వీటిని బ్యాంక్ లోన్ ఆఫీసర్ లేదా నోడల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లాలి.
- స్పందన లేకపోతే, వేధింపులు ఆగకపోతే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ సేవలపై కన్జ్యూమర్ కోర్టులో ఫిర్యాదు దాఖలును పరిశీలించొచ్చు.
- వేధింపుల నుంచి ఉపశమనం కోసం స్థానిక కోర్టులో సివిల్ వ్యాజ్యం దాఖలు చేసి ఇంజంక్షన్ ఉత్తర్వులు పొందొచ్చు.
- తమ ఆందోళనలను బ్యాంక్ పట్టించుకోకపోతే అప్పుడు ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. ప్రతీ ప్రాంతానికి ప్రత్యేక అంబుడ్స్‌మన్ ఉంటారు. వారి చిరునామా, కాంటాక్ట్ వివరాలను ఆర్‌బీఐ వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు.
- వేధింపులకు సంబంధించి ఆధారాలకు దొరకకుండా ఉండేందుకు రికవరీ ఏజెంట్లు గుర్తించడానికి వీల్లేని ఫోన్ నంబర్లు లేదా వాట్సాప్ ద్వారా సంప్రదింపులు చేసే అవకాశం లేకపోలేదు. అలా గుర్తించినట్టయితే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు.
- రికవరీ ఏజెంట్లు రుణ గ్రహీత కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, స్నేహితుల నంబర్లకు కాల్ చేసి బెదిరిస్తున్న ఘటనలు కూడా చూస్తున్నాం. ఇలా చేసినా లేదా పనిచేసే కార్యాలయం, నివాస సమీపంలో సమస్యలు సృష్టించినట్టయితే వారిపై పరువునష్టం కేసు దాఖలు చేయొచ్చు.
- అనుమతి లేకుండా ఇంట్లోకి ప్రవేశించినట్టయితే కోర్టులో కేసు వేయొచ్చు.
- రుణ రికవరీ ఏజెంట్ల వేధింపులపై న్యాయ నిపుణులతో చర్చించి వారి సలహా మేరకు సరైన చర్యలు చేపట్టొచ్చు.

ఆర్‌బీఐ కఠిన చర్య

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై ఆర్‌బీఐ ఇటీవలే రూ.కోటి జరిమానా విధించింది. రికవరీ ఏజెంట్లకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలడంతో కఠినంగా వ్యవహరించింది. అది కూడా నిర్దేశించిన వేళల్లో (ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటలు) కాకుండా ఇతర సమయంలో కాల్స్ చేసి రుణ గ్రహీతలను వేధించినట్టు బయటపడింది. రుణ వసూళ్లలో పేరున్న సంస్థలు సైతం ఎలా వ్యవహరిస్తున్నాయన్న దానికి ఇదొక ఉదాహరణ.



కఠిన చట్టాలు...

సూక్ష్మ రుణ గ్రహీతల కోసం కర్ణాటక ప్రభుత్వం ఇటీవలే ఓ సంచలనాత్మక చట్టాన్ని తీసుకొచ్చింది. వేధింపులు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు, శిక్షలకు ఇందులో చోటు కల్పించింది. రాష్ట్రంలో రుణ వసూళ్ల ఆగడాలు పెరిగిపోవడంతో ఇలాంటి చర్యకు దిగింది. సూక్ష్మ రుణ సంస్థల నుంచి రుణాలు తీసుకున్న వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. ఆర్‌బీఐ నిర్దేశించిన రుణ వసూలు నిబంధనలను ఉల్లంఘించే రుణ రికవరీ ఏజెంట్లు, ఫైనాన్స్ కంపెనీ యజమానులపై సుమోటో కేసులు నమోదు చేసేందుకు, హెల్ప్‌లైన్ ఏర్పాటుకు ప్రతి జిల్లా స్థాయిలో చర్యలకు ప్రభుత్వం ఆదేశించడం గమనార్హం.



వీనస్ పైప్స్ | బ్రోకరేజ్: ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,223 **టార్గెట్:** రూ. 1,700


ఎందుకంటే: గత ఐదేళ్లుగా వీనస్ పైప్స్ అండ్ ట్యూబ్స్ తయారీ సామర్థ్యాలను భారీగా విస్తరించుకుంటూ వచ్చింది. వెరసి పైపులు, ట్యూబుల తయారీ సామర్థ్యం 4 రెట్లుపైగా ఎగసి 38,400 టన్నులకు చేరింది. ఈ బాటలో తదుపరి విస్తరణలో భాగంగా అత్యున్నత నాణ్యతగల(హైగ్రేడ్) స్టెయిన్‌లెస్ స్టీల్, టైటానియం- వెల్డెడ్ ట్యూబ్స్, ఫిట్టింగ్స్, సీమ్‌లెస్ పైపులు, ట్యూబుల విభాగంలో కార్యకలాపాల పటిష్టతపై దృష్టి పెట్టింది. తద్వారా మొత్తం సామర్థ్యాలను 46,800 టన్నులకు పెంచుకోనుంది. స్థాపిత సామర్థ్య విస్తరణ ప్రభావంతో కంపెనీ మార్కెట్ వాటా 2020లో నమోదైన 3.6 శాతం వాటా 2024కల్లా 6.2 శాతానికి బలపడింది. తద్వారా పరిశ్రమలోని ప్రత్యర్థి సంస్థలతో పోలిస్తే మార్కెట్ వాటా పెంచుకోవడంలో ముందుంది. ఇందుకు 2020-24 కాలంలో అమ్మకాల పరిమాణం వార్షిక పద్ధతిలో 28 శాతం జంప్‌చేయడం ప్రధానంగా సహకరించింది. మదర్‌హాల్‌లో పైపుల(14,400 టన్నులు) తయారీ ద్వారా సీమ్‌లెస్ పైపుల బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్‌లో మరింత పటిష్టతను సంతరించుకుంది. ముడిసరుకులు తదితరాల విషయంలో ఇతర సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంతో లాభదాయకత మెరుగుపడనుంది. 2023-24లో నిర్వహణలాభ(ఇబిటా) మార్జిన్లు 5.7 శాతం బలపడ్డాయి. ఈ నేపథ్యంలో వార్షిక ప్రాతిపదికన మూడేళ్ల(2025, 26, 27)లో ఆదాయం 24 శాతం, ఇబిటా 26 శాతం, నికర లాభం 28 శాతం చొప్పున పురోగమించగలవని భావిస్తున్నాం. ఇందుకు సామర్థ్యాలతోపాటు విస్తరించనున్న ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియో, బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్, పెరుగుతున్న మార్కెట్ వాటా, ఎగుమతులు తదితర అంశాలు మద్దతివ్వనున్నాయి.



పీడీఎస్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 400 **టార్గెట్:** రూ. 790

ఎందుకంటే: ఒక ఇన్వెస్టర్ కోసం ఇటీవల రెడీమేడ్ దుస్తుల గ్లోబల్ మార్కెటింగ్, మ్యాన్యుఫాక్చరింగ్ కంపెనీ పీడీఎస్ లిమిటెడ్ యాజమాన్యంతో రోడ్ షో నిర్వహించాం. ఈ సందర్భంగా ప్రమోటర్ పాలక్ సేథ్, గ్రూప్ సీఈవో సంజయ్ జైన్, గ్రూప్ సీఎఫ్‌వో రాహుల్ అహుజా కంపెనీ వృద్ధి వ్యూహాలను లోతుగా విశ్లేషించారు. 3-3-3 విజన్‌ను సాధించే లక్ష్యాలను వెల్లడించారు. రానున్న మూడేళ్లలో 3 బిలియన్ డాలర్ల స్థూల వాణిజ్య విలువ(జీఎంవీ)తోపాటు 3 శాతం నికర లాభం సాధించాలని ఆశిస్తోంది. ఇందుకు ఈ కాలంలో రెండంకెల వృద్ధి(సుమారు 15 శాతం) రేటును నిలుపుకుంటూ 3 బిలియన్ డాలర్ల జీఎంవీని అందుకోవడం, తద్వారా 2.1 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించడం, పెట్టుబడులు వెచ్చించే స్థాయి నుంచి సమకూర్చుకునేవైపు మళ్లడం, ఉద్యోగులపై వెచ్చించిన గత వ్యయాలతో ఫిక్స్‌డ్ వ్యయాలను తగ్గించుకోవడం ద్వారా మార్జిన్లను బలపరచుకోవడం తదితర వ్యూహాలను సిద్ధం చేసుకుంది. తద్వారా 2027కల్లా 3 శాతం నికర లాభాలపై కన్నేసింది. దీనిలో భాగంగా అధిక విలువగల విభాగాలలోకి విస్తరించనుంది. ఇతర ప్రాంతాలలో కొత్త కస్టమర్లను పొందడం, తద్వారా వృద్ధి అవకాశాలను వినియోగించుకోవడంపై దృష్టి పెట్టనుంది. ఇటీవల రూ. 41 కోట్ల ఈక్విటీ నిధులు వెచ్చించి నిట్ గ్యాలరీ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్(కేజీఐఎల్)లో 55 శాతం వాటాను సొంతం చేసుకుంది. 2025 మే నెలకల్లా పూర్తిస్థాయిలో కేజీఐఎల్‌ను వినియోగించుకునే అవకాశముంది. దీంతో ముడి వనరులను సమకూర్చుకోవడం ద్వారా తయారీ సామర్థ్యాలను పటిష్టపరచుకునేందుకు వీలు చిక్కనుంది. గ్లోబల్ రిటైల్ కంపెనీల ఔట్‌సోర్సింగ్ పెరగనుండటం, తయారీ కార్యకలాపాలు టర్న్‌అరౌండ్ కానుండటం, సాస్, బ్రాండ్ మేనేజ్‌మెంట్ ద్వారా కొత్త ఆదాయ మార్గాలు కంపెనీకి భవిష్యత్‌లో లబ్ధిని చేకూర్చనున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్లు పతనబాటలో...
ఇక ఒక రాష్ట్రం... ఒక ఆర్ఆర్‌బీ!



టారిఫ్ టెర్రర్...

ఇన్వెస్టర్లకు ఫీవర్!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేల్చిన 'లిబరేషన్ డే' టారిఫ్ బాంబ్‌తో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అల్లకల్లోలం మొదలైంది. ప్రధానంగా భారత్, చైనా వంటి కీలక దేశాల ఆర్థిక వ్యవస్థలు మరింత మందగమనంలోకి జారిపోవచ్చని, దీంతో ప్రపంచ ఎకానమీ గాడి తప్పుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోపక్క, చైనా కూడా 34% ప్రతీకార సుంకాలతో విరుచుకుపడింది. ఇతర దేశాలూ ఇదే బాట పట్టి వాణిజ్య యుద్ధం ముదిరితే, అమెరికాతో పాటు యూరప్ కూడా మాంద్యంలోకి జారే ప్రమాదం ఉంది. దీంతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లతో పాటు కమోడిటీలు (బంగారం, వెండి, కాపర్, క్రూడ్ ఇతరత్రా) కూడా కుప్పకూలుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడుల విషయంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడం మేలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- అమెరికా ప్రతీకార సుంకాలతో ప్రపంచ ఎకానమీకి దెబ్బ
- ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు క్రాష్..
- మనకూ భారీ కరెక్షన్లు తప్పవు...
- పెట్టుబడులపై ఆచితూచి వ్యవహరించాలి
- నిపుణుల సూచన

భారత్‌ను పదే పదే టారిఫ్ కింగ్‌గా పేర్కొంటూ వస్తున్న ట్రంప్.. కాస్త కనికరించి 27 శాతం ప్రతీకార సుంకాలతో సరిపెడుతున్నట్లు ప్రకటించారు. కనీసం 10 శాతం నుంచి గరిష్ఠంగా 50 శాతం దాకా టారిఫ్‌లను వడ్డించడంతో ప్రపంచ దేశాలన్నీ గగ్గోలు పెడుతున్నాయి. అమెరికాకు కీలక వాణిజ్య భాగస్వామిగా ఉన్న భారత్ ఎగుమతులపై సుంకాల పోటు కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అసలే వృద్ధి మందగమనంలో ఉన్న మన జీడీపీకి ఇది మరింత ప్రతికూలాంశంగా చెబుతున్నారు. వృద్ధి రేటుపై కనీసం అర శాతం ప్రభావం ఉండొచ్చనేది (ఈ ఆర్థిక సంవత్సరం 6 శాతానికి పరిమితం కావచ్చు) ఆర్థిక నిపుణుల అభిప్రాయం. మరో పక్క, వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైతే రూపాయి బలహీనపడొచ్చని.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కూడా పడిపోయే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. అయితే, ఇతర వర్ధమాన దేశాలు, ముఖ్యంగా ఆసియాలో మనకు ప్రధాన పోటీదారులైన చైనా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలపై మన కంటే అధిక సుంకాలు విధించడం అనేది మనకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. 'ట్రంప్ లిబరేషన్ డే టారిఫ్‌లపై సంబంధిత దేశాలన్నీ ప్రతీకార సుంకాలతో విరుచుకుపడితే, 2008 ఆర్థిక సంక్షోభం, కోవిడ్ తర్వాత అతి పెద్ద ఆర్థిక కుదుపు తప్పదు. టారిఫ్ ప్రభావిత తీవ్ర ఆటుపోట్లు కొన్నాళ్ల పాటు స్టాక్ మార్కెట్లలో కొనసాగవచ్చు' అని వెస్టెడ్ ఫైనాన్స్ ఫౌండర్, సీఈఓ విరమ్ షా పేర్కొన్నారు.

మార్కెట్లో మరింత కరెక్షన్ తప్పదు...

టారిఫ్ వార్ దెబ్బకు అమెరికా, యూరప్, ఆసియా వ్యాప్తంగా సూచీలు లిబరేషన్ డే రోజున 3-6% కుప్పకూలగా.. వారాంతంలో మరో 5-6% క్రాష్ అయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లో ఇన్వెస్టర్ల సంపద రెండు రోజుల్లో 4 ట్రిలియన్ డాలర్లకు పైగా తుడిచిపెట్టుకుపోవడం సుంకాల సునామీకి నిదర్శనం! ట్రేడ్ వార్‌తో ఎగుమతులు మందగిస్తే, వృద్ధి రేటుకు మరింత సెగ తగులుతుందని, స్వల్పకాలికంగా మార్కెట్లో కరెక్షన్ కొనసాగే అవకాశం ఉందని యాక్సిస్ సెక్యూరిటీస్ పేర్కొంది. 'టారిఫ్‌ల దెబ్బతో ద్రవ్యోల్బణం ఎగబాకే ముప్పు పొంచి ఉంది. దీంతో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఇకపై సాధ్యపడకపోవచ్చు. అంతేకాకుండా వాణిజ్యపరమైన అడ్డంకులతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారే రిస్క్ పెరుగుతుంది. అంతిమంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా కకావికలం అవుతుంది' అని అభిప్రాయపడింది. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్ పోటీపరంగా కాస్త మెరుగైన స్థితిలోనే ఉన్నప్పటికీ, అమెరికాలో మాంద్యం ముప్పు మన మార్కెట్లకు ప్రతికూలాంశమని ఎడెల్వీజ్ ఎంఎఫ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (ఈక్విటీస్) త్రిదీప్ భట్టాచార్య పేర్కొన్నారు.

ఇన్వెస్టర్లు ఏం చేయాలి?



'ట్రంప్ టారిఫ్‌లపై ఇతర దేశాల ప్రతీకార సుంకాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనించాలి. ముఖ్యంగా రక్షణాత్మక రంగాలైన ఎఫ్ఎంసీజీ, యుటిలిటీస్ షేర్లు కాస్త మెరుగైన పనితీరు ప్రదర్శించవచ్చు. సైక్లికల్ రంగాల (ఆటో, మెటల్స్) షేర్లకు ప్రతికూలం. టారిఫ్‌లపై కుదిరే వాణిజ్య ఒప్పందాల ఫలితాలే దీర్ఘకాలింగా మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయి. స్వల్పకాలానికి మాత్రం మన మార్కెట్లలో తీవ్ర ఆటుపోట్లు తప్పవు. పెట్టుబడుల విషయాలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి' అని స్టాక్స్‌కార్ట్ సీఈఓ ప్రణయ్ అగర్వాల్ సూచించారు. మార్కెట్లో స్వల్పకాలిక సెంటిమెంట్ చాలా బలహీనంగా ఉన్నప్పటికీ.. దీర్ఘకాలికంగా మన ఆర్థిక మూలాలు పటిష్టంగానే ఉన్నాయని ఆనంద్ రాఠీ గ్రూప్ చీఫ్ ఎకనమిస్ట్ సుజన్ హజ్రా చెప్పారు. టారిఫ్‌ల దెబ్బతో తక్షణం మార్కెట్లో తీవ్ర కుదుపులు ఉన్నప్పటికీ.. మధ్య, దీర్ఘకాల దృక్పథంతో భారీగా కరెక్షన్‌కు గురైనప్పుడల్లా పటిష్ట ఫండమెంటల్స్ ఉన్న నాణ్యమైన స్టాక్స్‌లో క్రమానుగతంగా పొజిషన్లను పెంచుకోవాలని ఆయన సూచిస్తున్నారు. నిఫ్టీ గతేడాది సెప్టెంబర్లో 26,277 పాయింట్ల గరిష్టాన్ని తాకగా.. 2025 మార్చిలో 21,964 పాయింట్లకు (దాదాపు 16.6 శాతం) క్షీణించింది. ఎఫ్‌పీఐల దన్నుతో ఆ తర్వాత 7 శాతం బౌన్స్ అయ్యింది. అయితే, ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటన తర్వాత ప్రపంచ మార్కెట్ల క్రాష్‌తో పాటు మన సూచీలు కూడా మళ్లీ రివర్స్ గేర్ వేశాయి. ఈ వారంలో 2.5 శాతం పడ్డాయి.

డెట్ ఫండ్స్‌కు దన్ను...



జీడీపీ వృద్ధి మందగమనానికి తోడు ఇప్పుడు టారిఫ్‌ల పిడుగుతో ఎకానమీకి దన్నుగా ఆర్‌బీఐ సరళతర పాలసీని కొనసాగించే అవకాశం ఉంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా గత పాలసీ సమీక్షలో రెపో రేటును పావు శాతం తగ్గించడం (6.25 శాతానికి) సంగతి తెలిసిందే. దీంతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య సరఫరా (లిక్విడిటీ) పెంచేందుకు కూడా పలు చర్యలు ప్రకటించింది. 'వాణిజ్య యుద్ధాలతో పాటు ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నుంచి దేశీ ఫైనాన్షియల్ మార్కెట్లకు రక్షణ కల్పించేందుకు ఆర్‌బీఐ రానున్న రోజుల్లో వడ్డీరేట్లను మరింత తగ్గించడంతో పాటు సానుకూల లిక్విడిటీ చర్యలను చేపట్టవచ్చు. దీనివల్ల వడ్డీ రేట్లు దిగిరావడం వల్ల ఇప్పటికే ట్రేడవుతున్న అధిక కూపన్ (వడ్డీ) రేటు బాండ్ ధరలు పెరుగుతాయి. ఫలితంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ నికర అసెట్ విలువ (ఎన్ఏవీ) ఎగబాకేందుకు దోహదం చేస్తుంది. డెట్ ఫండ్స్లో పెట్టుబడి పెట్టే ఇన్వెస్టర్లకు ఇది సానుకూలాంశమని నిపుణులు చెబుతున్నారు.



అవగాహన పెంచుకో... అస్త్రాలను వాడుకో..!

మహిళా భద్రత కోసం అందుబాటులో పోలీసుల సాంకేతికత

- ఒంటరి ప్రయాణంలో తోడుగా 'టీ-సేఫ్'యాప్
- సాధారణ ఫోన్ అయితే డయల్ 100 వాడుకోవచ్చంటున్న పోలీసులు
- వీటి వినియోగంపై మరింత అవగాహన పెరగాలంటున్న నిపుణులు
- మీ భద్రత కోసమే టీ-సేఫ్: మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్

అప్రమత్తత, అవగాహన ఉంటే ఎలాంటి ఆపద నుంచైనా బయటపడే ఉపాయం మనకు తడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నప్పుడు వెన్నంటి ఉండేలా ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో వీటి వినియోగం ఉండడం లేదు. ఒంటరిగా ప్రయాణం చేసే మహిళల భద్రత కోసం అమ్ములపొదిలిలో అస్త్రం వంటి టీ-సేఫ్ యాప్‌ను తెలంగాణ మహిళా భద్రత విభాగం గతేడాది అందుబాటులోకి తెచ్చింది. ఎంతో ఉపయుక్తమైన ఈ యాప్ తెలంగాణలోని ప్రతి మహిళ మొబైల్‌ఫోన్‌లో తప్పక ఉండాల్సిన అవసరం ఉందని పోలీసులు చెబుతున్నారు. టైంపాస్ కోసం సోషల్ మీడియా, గేమింగ్ యాప్‌లకు బదులు ఇలాంటి సాంకేతిక అస్త్రాలను మన ఫోన్‌లో ఉంచుకుంటే ఆపద సమయంలో వాడుకోవచ్చని అంటున్నారు. మహిళా భద్రత కోసం పోలీసులు అందుబాటులో ఉంచిన సాంకేతికతపై ప్రత్యేక కథనం.

- సాక్షి, హైదరాబాద్

టీ-సేఫ్ యాప్ ఏంటి?

ఒంటరిగా ప్రయాణం చేసే మహిళలు, బాలికలు, ఇతర పౌరులెవరైనా సురక్షితంగా గమ్యం చేరే వరకు పోలీసుల పర్యవేక్షణ కొనసాగేలా తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం రూపొందించిన నూతన సాంకేతికతే టీ-సేఫ్ (ట్రావెల్-సేఫ్) యాప్. దేశంలోనే తెలంగాణ పోలీసులు ఈ తరహా సేవను మొదటిసారిగా అమల్లోకి తెచ్చారు. స్మార్ట్‌ఫోన్‌తోపాటు సాధారణ ఫోన్లు ఉన్నవారు సైతం టీ-సేఫ్ సేవలను పొందేలా దీన్ని రూపొందించారు. ఎన్ని రకాలుగా వాడుకోవచ్చంటే..

1 స్మార్ట్‌ఫోన్‌లో టీ-సేఫ్ యాప్...: స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారు గూగుల్ ప్లే స్టోర్‌లో(https: //play.google.com/store/apps/ details?id=com.tswomensafety.tsafe) టీ- సేఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రయాణ సమయంలో యాప్‌లో సూచించిన విధంగా మన వివరాలు నమోదు చేస్తే.. యాప్ ద్వారా పోలీసులు లైవ్ ట్రాకింగ్ ద్వారా ప్రయాణాన్ని పర్యవేక్షిస్తారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే రంగంలోకి దిగుతారు.

2 టీ-సేఫ్ వెబ్ సైట్ ద్వారా...: మొబైల్‌లో టీ-సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉండకపోతే, https://tsafe.tspolice.gov.in/wap/ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవచ్చు. ఇందులోకి లాగిన్ అయిన తర్వాత.. పేరు, మొబైల్ నంబర్, ఏ వాహనంలో ప్రయాణిస్తున్నారు, ఎక్కడికి వెళ్లాలి తదితర వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత స్టార్ట్‌మై ట్రిప్ ఆప్షన్ ఓకే చేయాలి. అంతే ప్రయాణికురాలు లేదా ప్రయాణికుడు సురక్షితంగా గమ్యం చేరే వరకు పోలీసులు పర్యవేక్షిస్తారు.

3 సాధారణ ఫోన్‌తోనూ... డయల్ 100 ద్వారా...: స్మార్ట్ ఫోన్ లేకపోయినా టీ-సేఫ్ సేవలు వాడుకోవచ్చు. సాధారణ ఫోన్ ఉన్నవారు ప్రయాణం ప్రారంభించే ముందు డయల్ 100కు కాల్ చేయాలి. అందులో వచ్చే ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) ఆప్షన్లో 8 నంబర్‌ను నొక్కాలి. వ్యక్తిగత వివరాలు, ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నాం.. ప్రయాణించే వాహనం నంబర్ లాంటి వివరాలు ఇస్తే సరిపోతుంది. వెంటనే ఒక కోడ్ నంబర్‌ను పెట్టుకోవాల్సిందిగా సూచిస్తారు. ఆ తర్వాత గమ్యం చేరేవరకు పోలీసుల నుంచి ప్రతీ 15 నిమిషాలకు మీకు అలర్ట్ మెసేజ్, మధ్యలో ఐవీఆర్ పద్ధతిలో ఫోన్‌కాల్స్ వస్తుంటాయి. ఆ ఫోన్లో ఇతరులు ఆన్సర్ చేసేందుకు అవకాశం లేకుండా ముందే సిద్ధం చేసి పెట్టుకున్న కోడ్ ఉపకరిస్తుంది. ఒకవేళ సరైన స్పందన లేకపోతే వెంటనే వాహనం వివరాలు, రూట్, లైవ్ ట్రాకింగ్ లింక్ ఆ పరిధిలోని పోలీస్ ప్యాట్రో వాహనాలకు వెళ్తాయి. నిమిషాల వ్యవధిలోనే వారు సదరు వాహనం వద్దకు చేరుకుంటారు.

తెలంగాణలో మొబైల్ ఫోన్ల వాడకం ఇలా...

2025 మార్చినాటికి తెలంగాణలో 4 కోట్లకు పైగా మొబైల్ ఫోన్లు వినియోగంలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీటిలో సుమారు 1.9 నుంచి 2.2 కోట్ల మంది మహిళలు వాడుతున్నట్లు అంచనా. ఈ లెక్కన చూస్తే మహిళల భద్రతకు సంబంధించి పోలీసులు అందుబాటులోకి తెచ్చిన యాప్‌లు, ఇతర సాంకేతికతకు సంబంధించిన యాప్‌ల వినియోగం ఎంతో పెరగాల్సి ఉంది.

పోలీస్ రెస్పాన్స్ టైం ఇదీ...

ఆపదలో ఉన్నామని పౌరుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత తెలంగాణ పోలీస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైం హైదరాబాద్ సహా నగర, పట్టణ ప్రాంతాల్లో సగటున 5-10 నిమిషాలు కాగా.. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 15-20 నిమిషాలకు పైగా ఉంది.

ఆపదలో ఉన్నారా..?

- డయల్ 100కు ఫోన్ చేయొచ్చు.
- డయల్ 112 ఎమర్జెన్సీ నంబర్‌కు కాల్ చేయొచ్చు.
- ఒంటరి ప్రయాణ సమయంలో టీ-సేఫ్ యాప్‌ను వాడొచ్చు.

టీ-సేఫ్ యాప్ ఆండ్రాయిడ్ డౌన్‌లోడ్‌లు: 42,000+
టీ-సేఫ్ యాప్ వాడిన మొత్తం ట్రిప్పులు: 36,263
ఎస్ఓఎస్ అలర్ట్‌లు వాడిన వారి సంఖ్య: 26,000+
ఆటోమేటెడ్ వెరిఫికేషన్ కాల్స్: 78,000+
టీ-సేఫ్ ఏజెంట్ కాల్స్: 65,000+
గూగుల్ రేటింగ్: 4.8

టీ-సేఫ్ వాడిన వారిలో కొందరు గూగుల్ రివ్యూలో ఇలా పేర్కొన్నారు..

బోధి జియన్నా.. ఫిబ్రవరి 19, 2025
టీ-సేఫ్ మహిళల భద్రతకు ఎంతో ఉపయోగపడే యాప్. నేను అర్ధరాత్రి సమయంలో ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి వెళ్తున్నప్పుడు ఈ యాప్‌ను వినియోగించాను. నా ప్రయాణం పూర్తయ్యే వరకు పోలీస్ టీం ఫాలోఅప్ చేస్తూనే ఉంది. థాంక్యూ తెలంగాణ పోలీస్.

సీహెచ్. కీర్తిశ్రీ.. జనవరి 23, 2025
నేను హైదరాబాద్‌లో ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు నా ప్రాణ స్నేహితుడు దీన్ని సిఫార్సు చేశాడు. ప్రతి అమ్మాయి భద్రత కోసం దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నప్పుడు నేను సురక్షితంగా ఉన్నానో లేదో తనిఖీ చేయడానికి నాకు చాలా కాల్స్ వచ్చాయి. మొత్తం పోలీసు శాఖ నా వెనుక ఉందని నాకు అనిపించింది.

హన్సిక.. డిసెంబర్ 18, 2024
నేను చాలా సురక్షితంగా నా ఇంటికి వెళ్తున్నాను. ప్రతి అమ్మాయికి ఇది చాలా మంచి యాప్. మీరు డయల్ 100కు కాల్‌చేసినా కూడా పోలీసులు చుట్టూ ఉంటారు. మీరు సురక్షితంగా మీ గమ్యస్థానానికి వెళ్తారు. నేను చాలా రోజులుగా దీనిని ఉపయోగిస్తున్నా.

సురక్షిత ప్రయాణానికి టీ-సేఫ్...



టీ-సేఫ్ అనేది దేశంలో మొట్టమొదటి రైడ్-మానిటరింగ్ సేవ. ఇది ప్రత్యక్ష ట్రాకింగ్, పోలీసు హెచ్చరికలతో కాల్ లేదా యాప్ ద్వారా మహిళలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తుంది. యాప్ డౌన్‌లోడ్ ద్వారానే కాదు.. 100కు డయల్ చేసి ఐవీఆర్‌లో 8 నొక్కవచ్చు. ప్రయాణికుడు గమ్యస్థానానికి వెళ్లే మార్గంలో ఏవైనా ఇబ్బందులుంటే వెంటనే పోలీసులు అప్రమత్తం అవుతారు. వెంటనే అక్కడకు చేరుకుంటారు.

- శిఖాగోయల్, మహిళా భద్రత విభాగం డీజీ

జీడీపీలో తగ్గిన ఎమ్ఎస్ఎమ్ఈల వాటా

దేశంలో గత 5 ఏళ్ల కాలంలోనే ఎమ్ఎస్ఎమ్ఈల సంఖ్య భారీగా పెరిగింది. 2025 జనవరి 29 నాటికి ఉద్యమ్ పోర్టల్‌లో నమోదైన ఎమ్ఎస్ఎమ్ఈల సంఖ్య 3.34 కోట్లు. వీటిలో 2021-22 నుంచి 2024-25 మధ్య నమోదైనవే 1.44 కోట్లు. నిజానికి జీడీపీలో ఎమ్ఎస్ఎమ్ఈల స్థూల విలువ జోడింపు (జీవీఏ) గణనీయంగా పెరిగింది. జీడీపీలో అత్యధికంగా 30.5 శాతం వరకు వెళ్లింది. కానీ, కరోనా సంక్షోభం ఎమ్ఎస్ఎమ్ఈ రంగంపై కోలుకోలేని దెబ్బ తీసింది. దాంతో జీడీపీలో ఎమ్ఎస్ఎమ్ఈల జీవీఏ తగ్గింది.

సంవత్సరం	జీడీపీలో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా (శాతం)
2018-19	30.5
2019-20	30.5
2020-21	27.3
2021-22	29.6
2022-23	30.1

ఆధారం: కేంద్ర ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ

గురువు కరువు!

- జాతీయ ఉన్నత విద్యాసంస్థల్లో అధ్యాపకుల తీవ్ర కొరత
- ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎంలలో సగానికిపైగా ప్రొఫెసర్లు లేరు
- స్పష్టం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

సాక్షి, అమరావతి: దేశంలోని ప్రతిష్టాత్మక జాతీయ ఉన్నత విద్యాసంస్థల్లో బోధన సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా బోధించేవారు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్‌లు, సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు వివిధ రకాల ఉన్నత విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉండటంపై మేధావి వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. తాజాగా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం... ఈ విద్యాసంస్థల్లో మొత్తం 18,940 టీచింగ్ పోస్టులు మంజూరు కాగా, 28.56 శాతం ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలలో 2,540 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా, 56.18% ఖాళీగా ఉన్నాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వెల్లడించింది.

బడ్జెట్‌లో 90శాతం జీతాలకే..

- జాతీయ స్థాయి ఉన్నత విద్యాసంస్థలతోపాటు సెంట్రల్ యూనివర్సిటీల్లో టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటం అధ్యాపక-విద్యార్థి నిష్పత్తిని ప్రభావితం చేస్తోందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. ఇది బోధన నాణ్యతను దెబ్బతీస్తుందని హెచ్చరించింది.
- కాంట్రాక్టు ఉద్యోగాలను దశలవారీగా తొలగించి, అర్హత కలిగిన అధ్యాపకులను శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలను ఇచ్చేలా విద్యా మంత్రిత్వశాఖ నిర్మాణాత్మక ప్రణాళికను రూపొందించాలని సూచించింది.
- విద్యార్థుల నమోదు నిష్పత్తికి తగ్గట్టుగా బోధన సౌకర్యాలు కల్పించాలని తెలియజేసింది.
- ముఖ్యంగా ఉన్నత విద్యకు కేటాయించిన బడ్జెట్‌లో 90శాతం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకే ఖర్చవుతుండటంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభ్యంతరం వ్యక్తంచేసింది. ప్రభుత్వాలు ఖర్చులను తగ్గించుకునేందుకు శాశ్వత ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేకుండా కాంట్రాక్టు పద్ధతులను అవలంబించడంతో వ్యవస్థలు దెబ్బతింటాయని హెచ్చరించింది. విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్టుగా అధ్యాపకులు లేకుండా నాణ్యమైన విద్యను ఎలా అందిస్తారని ప్రశ్నించింది.
- శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమించాలని సూచించింది. కేవలం మెరిట్ ఆధారంగా పారదర్శకంగా అధ్యాపక నియామక ప్రక్రియ చేపట్టాలని స్పష్టం చేసింది. ఇందుకోసం నియామక ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తులు, స్క్రీనింగ్, సమాచార మార్పిడి కోసం సాంకేతికతను పెంపొందించాలని, తద్వారా ఇతరుల జోక్యాలను తగ్గించవచ్చని స్పష్టంచేసింది.



సెంట్రల్ యూనివర్సిటీల్లో రిజర్వ్‌డ్ కేటగిరీ టీచింగ్ పోస్టులు ఇలా..

విభాగం	మంజూరు	ఖాళీలు
ఓబీసీ	3,652	1,521
ఎస్సీ	2,315	788
ఎస్టీ	1,154	472

సెంట్రల్ యూనివర్సిటీల్లో రిజర్వ్‌డ్ కేటగిరీ నాన్ టీచింగ్ పోస్టులు ఇలా..

విభాగం	మంజూరు	ఖాళీలు
ఓబీసీ	4,495	1,983
ఎస్సీ	2,013	1,001
ఎస్టీ	3,409	1,491

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం జాతీయ విద్యా సంస్థల్లో ఖాళీలు ఇలా..

విభాగం	మంజూరు	ఖాళీల శాతం
ప్రొఫెసర్	2,540	56.18
అసోసియేట్ ప్రొఫెసర్	5,102	38.28
అసిస్టెంట్ ప్రొఫెసర్	11,298	17.97

నీళ్లు లేకుండా బట్టలు ఉతికేద్దామా?



అదెలా సాధ్యం అనే డౌట్ వచ్చిందా? నీళ్లు లేకుండా చిన్న పని కూడా చేయలేం కదా? అలాంటిది బట్టలు ఉతకడమా? వినడానికే వింతగా ఉంది.. అని అనుకుంటున్నారా? టెక్నాలజీతో ఏదైనా సాధ్యమే. సమస్త ప్రాణకోటికీ నీరు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే, ప్రపంచం సాంకేతికంగా ఎంత ముందుకు వెళుతున్నా.. నీటి కష్టాలు మాత్రం తీరడంలేదు. ఈ భూ మండలంపై 71 శాతానికి పైగా నీరున్నా.. మనిషి అవసరాలకు ఉపయోగపడేది కేవలం ఒక శాతం మాత్రమే. జనం పెరిగిపోవడం, వాతావరణ మార్పులు వెరసి.. నీటి కష్టాలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. నిత్య జీవితంలో మనిషికి నీటి అవసరం చాలా ఉంటుంది. పట్టణాల్లో అయితే సగటున ఒక వ్యక్తి వంటకు, స్నానాలకు, బట్టలు ఉతకడానికి, ఇంటి అవసరాలు తదితరాల కోసం రోజూ 135 లీటర్ల నీటిని వినియోగిస్తున్నాడు. ఇక మన దేశంలో అయితే ఒక్కో ధోబీ ఘాట్‌లో రోజుకు 78 వేల లీటర్లకు పైగా నీటిని వినియోగిస్తున్నారు. పైగా ఇలా బట్టలు ఉతకడం వల్ల నీటి వృథా అవడమే కాదు.. టన్నుల కొద్దీ డిటర్జెంట్లు, మైక్రో ప్లాస్టిక్‌లు, రసాయనాలు నదులు, సరస్సుల్లోకి విడుదలై ఆ నీటి వనరులను కలుషితం చేస్తున్నాయి.

మరి ప్రత్యామ్నాయమేంటి?

బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషీన్లు వినియోగించడం తెలిసిందే. సాధారణంగా వాషింగ్ మెషీన్‌లో ఒకసారి బట్టలు ఉతకడానికి 30 నుంచి 40 లీటర్ల నీళ్లు సరిపోతాయి. మామూలుగా బట్టలు ఉతకడంతో పోలిస్తే ఇది తక్కువే. ప్రస్తుతం బట్టలు ఉతకడానికి నీరు (హెచ్‌టూఓ) తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలో అసలు నీళ్లే లేకుండా బట్టలు ఉతకలేమా అనే ఆలోచన రావడంతో ఆ దిశగా అడుగులు ముందుకు పడ్డాయి. తొలుత నైలాన్ బీడ్స్ సహాయంతో దుస్తులు ఉతికే వాషింగ్ మెషీన్ వచ్చింది.అయితే, ఇది పూర్తిగా నీరు, డిటర్జెంట్ లేకుండా ఆ పని చేయలేకపోయింది. కానీ 80 శాతం వరకు నీటిని ఆదా చేసింది. తర్వాత కాలంలో కూడా వీటికి సంబంధించి పలు పరిశోధనలు జరిగాయి. ఈ క్రమంలో కార్బన్ డైఆక్సైడ్ (సీవోటూ) ఉపయోగిస్తే.. నీటి అవసరమే ఉండదని తేల్చారు. ద్రవరూప కార్బన్ డై ఆక్సైడ్‌తో బట్టలు ఉతకడం సులభమేనని నిర్ధారణకు వచ్చారు.

ఎలా పనిచేస్తుంది?

ఇది మామూలు వాషింగ్ మెషీన్ల కంటే పెద్దగా ఉంటుంది. ఇందులో కార్బన్ డైఆక్సైడ్ గ్యాస్ రూపంలో ఉంటుంది. దుస్తులను నిర్దేశిత చాంబర్‌లో వేసి స్విచ్ ఆన్ చేయాలి. అప్పుడు గ్యాస్ రూపంలో ఉన్న కార్బన్ డైఆక్సైడ్ ద్రవరూపంలోకి మారి బట్టలకు ఉన్న మురికిని వదిలిస్తుంది. బట్టలు ఉతకడం పూర్త యిన తర్వాత ఆ ద్రవం తిరిగి గ్యాస్ రూపంలోకి మారిపోయి.. పునర్వినియోగానికి సిద్ధంగా ఉంటుంది. నీటి వినియోగం లేనందున బట్టలు మళ్లీ ఆరబెట్టాల్సిన అవసరం లేదు. బట్టలు ఉతకడం పూర్తయిన తర్వాత పొడిగానే బయటకు వస్తాయి.

-సాక్షి సెంట్రల్ డెస్క్

ప్రయోజనాలేంటి?

ఈ మెషీన్‌కు నీళ్లే కాదు.. ఎలాంటి డిటర్జెంట్లూ అవసరం లేదు. దుస్తులు పాడైపోతాయనే బెంగా లేదు. పైగా ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. అంతేకాదు ఇది పర్యావరణ అనుకూలంగానూ ఉంటుంది. ఇక ప్రతికూలతల విషయానికి వస్తే.. ఖరీదు కాస్త ఎక్కువే. దీన్ని ఇంట్లో పెట్టడానికి కాస్త ఎక్కువ ప్లేస్ కావాలి. అయితే నీరు, ఇతరత్రా నిర్వహణ వ్యయం ఆదాతో పోలిస్తే వీటిని ప్రతికూలతలుగా పరిగణించక్కర్లేదనేది నిపుణుల మాట.

ప్రస్తుతానికి ఈ వాషింగ్ మెషీన్లు యూఎస్, యూకే, జపాన్ వంటి దేశాల్లో వినియోగంలో ఉన్నాయి. ముఖ్యంగా హోటళ్లు, ఆస్పత్రుల వంటి చోట్ల వినియోగిస్తున్నారు. ఇంటి అవసరాలకు ఉపయోగించడం ఇంకా మొదలుకాలేదు. ప్రపంచవ్యాప్తంగా పలు వాషింగ్ మెషీన్ల బ్రాండ్లు

మన మార్కెట్లో అందుబాటులో ఉన్నాయా?

వీటిని పరీక్షిస్తున్నాయి. అయితే అత్యధిక జనాభా కలిగి, అత్యధిక నీటి అవసరం ఉన్న భారత్ మాత్రం ఆ దిశగా ఇంకా ప్రయత్నించడం లేదు. ఈ విధానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అందరికీ అవగాహన కల్పించి, ఆ మేరకు సాంకేతికతను అందిపుచ్చుకుంటే మనం కూడా ఎంతో నీటిని ఆదా చేసే అవకాశం ఉంటుంది.



తెరపైకి టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ !

- మన టైగర్ రిజర్వ్‌లలో ఫ్రంట్‌లైన్ స్టాఫ్ వేకెన్సీ 41.62 శాతం
- దేశవ్యాప్తంగా పులులు, ఇతర వన్యప్రాణుల వేటకు ముమ్మర ప్రయత్నాలతో అటవీశాఖ అప్రమత్తం

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణలో 'టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్'ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో పెద్దపులుల సంరక్షణకు మరిన్ని చర్యలు చేపట్టేందుకు ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో పులుల సంఖ్య సమృద్ధిగా ఉండగా, కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లో పులులు స్థిరనివాసం ఏర్పరచుకోవడం లేదు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఆనుకొని ఉన్న మహారాష్ట్ర సరిహద్దు, తిప్పేశ్వర్, తడోబా పులుల అభయారణ్యాల నుంచి ఆదిలాబాద్ మీదుగా టైగర్ కారిడార్ ఉన్న విషయం తెలిసిందే. ఈ కారిడార్‌లో ఐదారు పులులు తరుచుగా సంచరిస్తూ చుట్టుపక్కల గ్రామస్తులకు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని రెండు పులుల అభయారణ్యాలతోపాటు మిగతా ప్రాంతాల్లో కూడా పులుల ఆవాసాల పెంపుదలకు 'టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్'ఏర్పాటు దోహదపడుతుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) జరిపిన పరిశీలన ప్రకారం చూస్తే... మన రాష్ట్రంలో ఫ్రంట్‌లైన్ స్టాఫ్ వెకెన్సీ 41.62 శాతంగా ఉన్నట్టుగా వెల్లడైంది.

యాక్టివ్‌గా వేటగాళ్ల సిండికేట్

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పులులను లక్ష్యంగా చేసుకొని వేటగాళ్లు ఓ గ్యాంగ్‌గా ఏర్పడినట్టు మహారాష్ట్రలో నమోదైన ఓ కేసు ద్వారా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. గ్యాంగ్‌లోని వేటగాళ్లలో ఒకరు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి వచ్చారని, కొంతకాలం ఇక్కడే ఉన్నట్టుగా బయటపడింది. ఈ వేటగాడి అనుచరులు కేటీఆర్‌కు వెళ్లినట్టు, పులుల శరీర భాగాలకు సంబంధించిన డీల్‌కు సంబంధించిన ఆర్థిక కార్యకలాపాలు కాకినాడలో చోటుచేసుకున్నట్టుగా తేలింది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల వారీగా పులుల సంరక్షణ, అటవీ పరిరక్షణ చర్యలు చేపడుతున్న అటవీ సిబ్బంది ఎంతమంది అవసరమైతే... ఎంతమంది ఉన్నారనే దానిపై ఎన్‌టీసీఏ పరిశీలించింది. ఏటీఆర్, కేటీఆర్‌లను కలిపితే 41.61 శాతం ఫ్రంట్‌లైన్ స్టాఫ్ వెకెన్సీ ఉన్నట్టుగా తేల్చారు. ఏపీలో అయితే 62.17 శాతంగా ఉన్నట్టుగా తెలిసింది. మరోవైపు ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్లు, ఇతర ఫ్రంట్‌లైన్ స్టాఫ్‌కు సంబంధించిన పోస్టుల భర్తీ అనేది అటవీశాఖకు సవాల్‌గా మారుతోంది. అధిక శ్రమతో పాటు తక్కువ వేతనం, ఎక్కువ పనిగంటలు ఉండడంతో ఎఫ్‌బీవోలుగా చేరినవారు ఎక్కువకాలం కొనసాగడం లేదని అధికారులు చెబుతున్నారు. అందువల్ల ఈ పోస్టులకు పెట్టే పరీక్షల విధానాన్ని మార్చి టెన్త్/ఇంటర్ వంటి విద్యార్హతలతో సంబంధం లేకుండా అడవుల పట్ల అవగాహన, జంతువుల గురించి తెలిసిన వారిని, స్థానిక ఆదివాసీ, గిరిజనులను నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుందనే అంచనాకు వచ్చారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్

కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల డైరెక్ట్ నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం విడుదల చేశారు. గతంలో తీసుకొచ్చిన గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. 12 విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2,500కు పైగా బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నియామకాలను ఎలా చేపట్టాలనే దానిపై కొన్ని నెలల క్రితం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సు చేసిన మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. యూజీ, పీజీతో పాటు సాంకేతిక, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే అధ్యాపకుల నియామకానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. నియామక ప్రక్రియలో మూడు దశలను అనుసరిస్తారు. ప్రతీ యూనివర్సిటీలోనూ కమిటీ ఏర్పాటు చేసి, రోస్టర్ విధానం, రిజర్వేషన్ విధానానికి సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేస్తారు. దీనికి విశ్వవిద్యాలయం వీసీ నాయకత్వం వహించాల్సి ఉంటుంది.



ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి..

అకడమిక్ రికార్డ్, పరిశోధనలకు సంబంధించి 50 మార్కులను కేటాయిస్తారు. యూనివర్సిటీ వీసీ, ఉన్నత విద్యా మండలి సబ్జెక్ట్ నిపుణుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డిపార్ట్‌మెంట్ ముఖ్యుడు మార్కుల స్క్రూటినీ చేస్తారు. అభ్యర్థికి సంబంధించి యూజీ నుంచి రీసెర్చ్ వరకూ వివిధ విద్యా స్థాయిల్లో మార్కులను ఖరారు చేస్తారు. మొత్తం వంద మార్కుల్లో ఇంటర్వ్యూకు 20 మార్కులు, టీచింగ్ నైపుణ్యానికి 30 మార్కులు ఉంటాయి. మిగతా 50 మార్కులను యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విభాగాల నుంచి అభ్యర్థి సాధించిన మార్కుల శాతం ఆధారంగా తీసుకుంటారు.

నాలెడ్జ్ అండ్ స్కిల్స్‌కు 30 మార్కులు ఇస్తారు. ఈ మార్కులను టీచింగ్, బుక్ ఆథర్‌షిప్, జాయింట్ ఆథర్ షిప్, ఎడిట్ ఆథర్‌షిప్, కో-ఎడిటర్ ఆథర్‌షిప్, పోస్టు-డాక్టోరల్ షిప్‌గా విడగొడతారు. ఈ మార్కులను ఆయా సబ్జెక్టు లెక్చరర్లు పరిశీలించి, నిర్ణయిస్తారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు ఇస్తారు. ఇందులో సబ్జెక్టు ప్రజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, ఓవరాల్ పర్సనాలిటీ, నైపుణ్యాన్ని బట్టి మార్కులు వేస్తారు.

యూజీలో మార్కులు ఇలా..

యూజీలో సాధించిన మార్కుల శాతాన్ని బట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఎంపికకు మార్కులు కేటాయిస్తారు. అవి ఈ విధంగా ఉంటాయి.

మార్కుల శాతం	పొందే మార్కులు
70కి పైగా	8
60-70	6
50-60	4
50 కన్నా తక్కువ	2
పీజీ మార్కులు ఇలా..	
70	12
60-70	10
50-60	8
అర్హత పరీక్షల మార్కులు ఇలా..	
జేఆర్ఎఫ్	10
ఎన్ఈటీ, ఎస్ఈటీ (వీటిల్లో ఏదైనా)	
స్లెట్	5
పీహెచ్‌డీ	10
ఎంఫిల్	5
రీసెర్చ్ పబ్లికేషన్స్	5

ఫేర్‌వెల్ వేడుకలో ప్రసంగిస్తూనే కుప్పకూలిన విద్యార్థిని

ధారాశివ్: కళాశాల ఫేర్‌వెల్‌లో ఎంతో ఉత్సాహంతో ప్రసంగిస్తూనే 20 ఏళ్ల విద్యార్థిని కుప్పకూలి హఠాన్మరణం చెందింది. మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లా పరండాలో ఈ ఘటన జరిగింది. స్థానిక ఆర్‌జీ షిండే కళాశాలలో ఆదివారం చోటుచేసుకున్న ఈ విషాదం సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. వర్షా ఖర్రాట్ అనే విద్యార్థిని వీడ్కోలు సమావేశంలో అక్కడున్న వారిని నవ్విస్తూ, నవ్వుతూ మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వర్షకు 8 ఏళ్ల వయసులోనే గుండె సర్జరీ జరిగింది. ఆ తర్వాత ఆమె ఎలాంటి ఆరోగ్య సమస్యకు గురి కాలేదు. ఎలాంటి మందులు కూడా తీసుకోవడం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ప్రసంగిస్తుండగానే ఆమె అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఉంటుందని, పర్యవసానంగా బ్రెయిడ్ డెత్‌కు, మరణానికి దారి తీసి ఉండొచ్చని భావిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



యాదగిరి.. వేదసిరి

యాదగిరిగుట్టలో వేద పాఠశాల

- ఆలయ నగరిలో భూమి కేటాయింపు
- శృంగేరీ పీఠం ఆధ్వర్యంలో నిర్మాణం, నిర్వహణ
- రూ.43.79 కోట్ల అంచనా వ్యయం
- తొలివిడతలో రూ.23.79 కోట్లు విడుదల
- 2027 నాటికి పూర్తికానున్న పనులు

సాక్షి, యాదాద్రి: రాష్ట్రంలో తొలిసారిగా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానానికి వేద పాఠశాల మంజూరైంది. రాష్ట్రంలో తొలి వేద పాఠశాల కావడంతో ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహిస్తున్న వేద పాఠశాల తరహాలో.. యాదగిరిగుట్టలో వేద పాఠశాల నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేద పాఠశాల పనుల పర్యవేక్షణకు.. శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలోని యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి సంస్థ (వైటీడీఏ) ఒక కమిటీని ఏర్పాటు చేసింది. యాదగిరిగుట్ట పక్కనే ఉన్న పెద్ద గుట్ట టెంపుల్ సిటీ స్థలంలో.. వేద పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వైటీడీఏని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ఆమోదించడం తెలిసిందే. ఇందులో వేద పాఠశాల ఏర్పాటు అంశం ఉంది.

ఆలయ నగరిలో 15 ఎకరాల స్థలం

వేద పాఠశాల కోసం ప్రభుత్వం ఆలయ నగిరిలో (పెద్దగుట్ట) 15 ఎకరాల స్థలం కేటాయించింది. యాదగిరిగుట్ట గుడి అభివృద్ధిలో భాగంగా భక్తుల వసతుల కోసం కాటేజీలు నిర్మించాలని గత ప్రభుత్వం 250 ఎకరాల్లో లే అవుట్ అభివృద్ధి చేసింది. ఇందులో విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీలు, విద్యుదీకరణ, హెలీప్యాడ్, ఎవెన్యూ ప్లాంటేషన్, పచ్చిక బయళ్లు, సుందరీకరణ పనులు చేపట్టారు. కాగా, ప్రస్తుతం పెద్దగుట్ట పైన కాటేజీల నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రభుత్వం పెద్దగుట్టపైన గల ఖాళీ భూమిని వేద పాఠశాలకు కేటాయించింది. దాతరపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 154, 156, గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 169లో ఈ భూమి ఉంది. వేద పాఠశాల కోసం గతంలో రాయిగిరి వద్ద వైటీడీఏకి లీజుపై కేటాయించిన 17.13 ఎకరాల భూమిని రద్దు చేశారు. సరైన రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేకపోవడమే రద్దుకు ప్రధాన కారణం.



శృంగేరీ పీఠం ఆధ్వర్యంలో వేద పాఠశాల

తమిళనాడులోని శ్రీ కంచి కామకోటి పీఠం, కాంచీపురం శృంగేరి పీఠం ఆధ్వర్యంలో వేద పాఠశాల నిర్వహించనున్నారు. వేద పండితులు, అర్చకులను స్కాలర్లుగా తీర్చిదిద్దుతారు. ప్రస్తుత వేద పండితులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తారు. వేదం చదువుకునే వారికి.. వేద పాఠశాలలో బోధన సౌకర్యం కల్పిస్తారు. ఇప్పటికే యాదగిరిగుట్టలో దేవస్థానం పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సంస్కృత పాఠశాలను కూడా.. వేద పాఠశాలలోనే నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం సూత్రప్రాయంగా పరిశీలిస్తోంది.

ఆశ్రమం తరహాలో నిర్మాణం

రాష్ట్రంలో తొలిసారిగా నిర్మించనున్న వేద పాఠశాల కోసం రూ.43.79 కోట్లు అవసరమని ప్రభుత్వ అంచనా. ఆశ్రమం తరహాలో నిర్మించే వేద పాఠశాలకు ప్రభుత్వ ఆమోదం లభించింది. దీన్ని మూడు దశల్లో నిర్మించనున్నారు. మొదటి దశలో రూ.23.79 కోట్ల వ్యయంతో రెండో దశలో రూ.10 కోట్లతో, మూడో దశలో రూ.10 కోట్లతో పూర్తి చేయనున్నారు. మొదటి దశ పనుల కోసం రూ.23.79 కోట్ల నిధులను కేటాయించారు. ఇందులో సీజీఎఫ్ (క్రెడిట్ గ్యారంటీ ఫండ్) ప్రభుత్వం రూ.13.79 కోట్లు, వైటీడీఏ రూ.5 కోట్లు, యాదగిరిగుట్ట దేవస్థానం రూ.5 కోట్లు మంజూరు చేసింది. వేద పాఠశాల డిజైన్ రూపొందించి, నిర్మాణ పర్యవేక్షణకు మూర్తి అండ్ మనియన్ సంస్థను నియమించనున్నారు. వైటీడీఏ పనులను కంచికామకోటి పీఠం పర్యవేక్షించనుంది. 2027 నాటికి వేద పాఠశాలను పూర్తి చేయనున్నారు.

వేద పాఠశాల కోసం కమిటీ



వేద పాఠశాల నిర్వహణ కోసం ప్రభుత్వం కమిటీని నియమించనుంది. అధ్యక్షునిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కన్వీనర్‌గా దేవాదాయశాఖ కమిషనర్, సభ్యులుగా వైటీడీఏ వైస్ చైర్మన్, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో, శ్రీ కంచికామకోటి పీఠం, వేదపాఠశాల యాదగిరిగుట్ట చైర్మన్ శ్రీగోవింద హరి, రిటైర్డ్ ఈఎన్‌సీ కె.కొండల్ రావు, దేవాదాయశాఖ ప్రధాన ఇంజనీర్ సభ్యులుగా ఉంటారు.




ఆదివారం భద్రాచలంలో సీతారాముల కల్యాణం కోసం మిథిలా స్టేడియానికి తీసుకొస్తున్న ఉత్సవ విగ్రహాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించుకునేందుకు పోటీపడుతున్న భక్తులు



ఆదివారం హైదరాబాద్ అంబర్‌పేటలో శోభాయాత్ర ప్రారంభించిన సందర్భంగా హనుమాన్ వేషధారణ వ్యక్తితో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రామయ్య పట్టాభిషేకం నేడే

- భద్రగిరిలోని మిథిలా స్టేడియంలో వేడుక
- చతుఃస్థానార్చన హోమంతో మొదలు
- రాజదండం, రాజముద్ర, కిరీటధారణ
- ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గత ఏడాది రామయ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చక బృందం

భద్రాచలం: త్రేతాయుగంలో శ్రీరాముడి మహాపట్టాభిషేకం స్మరణకు వచ్చేలా.. అదే చైత్ర మాసం, పుష్యమి నక్షత్రం ముహూర్తాన రామచంద్రమూర్తికి పట్టాభిషేకం జరిపించడం భద్రాచల క్షేత్రంలో ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో సోమవారం పట్టాభిషేకం జరగనున్న నేపథ్యాన వేడుక నిర్వహణపై కథనమిది.

హోమంతో మొదలు..

ఉదయం యాగశాలలో చతుఃస్థానార్చన హోమం నిర్వహిస్తారు. అనంతరం 10 గంటల సమయాన శంఖు, చక్ర, ధనుర్బాణాలు ధరించిన లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో తీసుకొస్తారు. మేళతాళాలు, కోలాటం, భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ మిథిలా స్టేడియంలోని మండపానికి చేర్చాక సింహాసనంలో వేంచేపు చేస్తారు. అనంతరం ఎలాంటి విఘ్నాలు రాకుండా విష్వక్సేన పూజ, ఆ తర్వాత పుణ్యాహవాచనం చేసి మంత్ర జలంతో పూజలో ఉపయోగించే వస్తువులు, ప్రాంగణాలను శుద్ధి చేస్తారు.

మూడు మండపాలు

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు.. మూడు ఉప మండపాలను ఏర్పాటు చేస్తారు. ఒక మండపంలో హనుమంతుడు, సుగ్రీవుడు సహా ఎనిమిది మంది రామపరివారం, అష్టదిక్పాలకులను ఆవాహనం చేస్తారు. మధ్య మండపంలో మంత్రజలంతో 500 నదులు, నాలుగు సముద్రాల జలాలను ఆవాహన చేస్తారు. మూడో మండపంలో శ్రీరాముడి రాజముద్ర, రాజదండం, పాదుకలను ఉంచుతారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చన చేస్తారు. మండపంలో పంచకుండాత్మక-పంచేష్టిసహిత చతుర్వేద హవన పురస్కృతంగా మండప త్రయ ఆరాధన నిర్వహిస్తారు.

ఎనిమిది మంది మంత్రులు

పట్టాభిషేకం నిర్వహించే వేద పండితులు శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించేందుకు వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞులను తమలో వరింపజేసుకుంటారు. అనంతరం పట్టాభిషేక కార్యక్రమ నిర్వహణకు సిద్ధమవుతారు. వీరికి నేతృత్వం వహించేందుకు వాల్మీకి స్థానాన్ని మరొకరు వరింపజేసుకుంటారు.

యుద్ధకాండ శ్లోకాలు పఠిస్తూ..

పట్టాభిషేకంలో కీలకమైన కిరీటధారణకు ముందు రామాయణం యుద్ధకాండలో గల పట్టాభిషేక పారాయణంలోని 101 శ్లోకాలు పఠిస్తారు. అనంతరం 'రాజాధిరాజ'అంటూ శ్రీరాముడి విశిష్టతలు వివరిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ ముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణ పాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్ర కిరీటాలను స్వామివారికి ప్రదా నం చేస్తారు. లక్ష్మీదేవిని ఆవాహన చేసిన రాజముద్రికను కుడి చేతి వేలికి తొడుగుతారు. ఆ తర్వాత పూర్తి రాజ లాంఛనాలతో సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి అలంకరిస్తారు. పట్టాభిషేకం పూర్తయ్యాక స్వర్ణఛత్రం నీడలో ఎడమవైపు రాజఖడ్గం, కుడి వైపున రాజదండంతో శ్రీరాముడు దర్శనమిస్తారు. తలపై సామ్రాట్ కిరీటంతో గరుత్మంతుడి చామరల సేవను ఆస్వాదిస్తూ భక్తులకు దర్శనమిస్తారు.

రానున్న గవర్నర్

పట్టాభిషేక వేడుకకు గవర్నర్లు వచ్చి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఈసారి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భద్రాచలం రానున్నారు. కాగా, పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తే విజయసిద్ధి కలుగుతుందని భక్తుల నమ్మిక. అందుకే సీతారాముల కల్యాణానికి వచ్చిన భక్తులు చాలా మంది ఇక్కడే వేచి ఉండి పట్టాభిషేకం చూశాక వెనుదిరుగుతారు.

'కాసుల'పల్లి

డ్రైనేజీల్లేవు.. మురుగు కనిపించదు

- ఇంటింటా ఇంకుడుగుంతలు
- ఇంటి ఆవరణలో పెరటి తోటలు
- పక్కాగా పంచసూత్రాలు అమలు
- శ్రీకారం చుట్టిన అప్పటి కలెక్టర్ శ్రీదేవసేన

కాసులపల్లి గ్రామ వివరాలు

నివాసాల సంఖ్య	జనాభా	పురుషులు	మహిళలు	పింఛన్లు	రేషన్ కార్డులు	ఈజీఎస్ జాబ్ కార్డులు	స్వశక్తి మహిళా సంఘాలు
495	1,584	790	794	143	481	367	36



కాసులపల్లి గ్రామం

పెద్దపల్లి రూరల్: ఇంట్లోనుంచి మురుగునీరు బయటకు రాదు.. మురుగునీటి కాలువలు అసలే కనిపించవు.. ఎందుకంటే ఆ ఊరిలో ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకున్నారు.. కలుషిత, వ్యర్థపు నీటిని ఇంకుడుగుంతల్లోకే మళ్లిస్తున్నారు.. పాత డ్రైనేజీలను పూడ్చేశారు. దీంతో మురుగునీటి కాలువల్లేని గ్రామంగా పెద్దపల్లి మండలం కాసులపల్లి ప్రత్యేక గుర్తింపు పొందింది. అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి స్వగ్రామంలో ఇంకుడుగుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై చూపిన ప్రత్యేక శ్రద్ధ ఫలితమిది.

పంచసూత్రాలతో పెరటి తోటలు



రోజువారీ అవసరాల కోసం కూరగాయలు, ఆకుకూరలను మార్కెట్‌కి వెళ్లి కొనుగోలు చేయడం సహజమే.. కానీ పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామస్తులు తమ ఇళ్ల ఆవరణలోనే కూరగాయలు, పండ్లు, పూల మొక్కలు పెంచుతున్నారు. దీంతో కూరగాయల కోసం వెచ్చించే సొమ్ముతోపాటు.. సమయం కూడా ఆదా అవుతోంది. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన శ్రీదేవసేన చేపట్టిన పంచ సూత్రాల కార్యక్రమం స్ఫూర్తితో.. పెరటి తోటల పెంపకంపై గ్రామస్తులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

గ్రామాన్ని సందర్శించిన అప్పటి గవర్నర్ తమిళిసై..




2019 డిసెంబర్ 12న అప్పటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కాసులపల్లి గ్రామాన్ని సందర్శించారు. పెరటితోటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, పూలమొక్కలు పెంచడం ద్వారా.. బహుళ ప్రయోజనాలు ఉంటాయని, శ్రద్ధతో పెంచుతున్న గ్రామస్తులు అభినందనీయులని ఆమె వ్యాఖ్యానించారు.



సేంద్రియ పద్ధతిలో సాగు..


కాసులపల్లి గ్రామస్తులు ఇప్పటికీ తమ ఇళ్ల ఆవరణలోని ఖాళీ స్థలాలను బట్టి తోటకూర, పుదీనా, కొత్తిమీర, ఉల్లితోపాటు వంకాయ, టమాటా, క్యాబేజీ, అలసంద, గోరుచిక్కుడు, కాకర, సొర, మిరప, చిక్కుడు లాంటి కూరగాయలు పండిస్తున్నారు. వీటితోపాటు పాలకూర, చుక్కకూర, తోటకూర లాంటి ఆకుకూరలూ పండిస్తూ.. తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇదంతా సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తుండటం గమనార్హం. పైసా ఖర్చు లేకుండానే తాజా కూరగాయలను వండుకుని తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. బంధు, మిత్రులకు కూడా వాటిని అందిస్తున్నారు. ఖర్చు ఆదాతోపాటు ఇంటి ఆవరణ పచ్చదనంతో నిండి, ఆహ్లాదంగా ఉంటోందని గ్రామస్తులు చెబుతున్నారు. తీరిక దొరికినప్పుడల్లా పెరటి తోటల్లో కుటుంబ సభ్యులు అందరూ పనులు చేసుకుంటున్నారు.



ఇంటింటా పెరటి తోటలే..

కూరగాయలు, ఆకుకూరలను పెద్దపల్లి మార్కెట్ నుంచి కొనుగోలు చేసి తీసుకొచ్చేవాళ్లం. ఇప్పుడు ప్రతీ ఇంటి ఆవరణ పెరటితోటతో నిండిపోయింది. నిత్యం తాజా కూరగాయలను తెంపుకొని వండుకుంటున్నాం. రసాయన మందులు వాడకుండా సేంద్రియ ఎరువు వినియోగిస్తున్నాం.

– ఇనుగాల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్



దోమల బెడద తగ్గింది

మా ఊళ్లో మురుగునీటి కాలువలను పూడ్చి, ఇంటి ఆవరణలోనే ఇంకుడు గుంతలు నిర్మించుకున్నాం. దీంతో దోమల బెడద గణనీయంగా తగ్గింది. ఉదయం నిద్ర లేవగానే కాసేపు పెరటితోటలో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నాం.

– కూర మల్లారెడ్డి, గ్రామస్తుడు



ఖాళీ స్థలమే కనిపించదు

మా ఊరిలో ఇంటింటా కూరగాయలు, పూలు, పండ్లతోటలు అందుబాటులో ఉన్నాయి. ఊళ్లోకి రావడంతోనే ఇరువైపులా పచ్చని పండ్లనిచ్చే చెట్లు, పక్షుల కిలకిలారావాలు స్వాగతం పలుకుతాయి. ప్రతీఇంటి ఆవరణలో కూరగాయలు, పండ్లు, పూలమొక్కలతో నిండి ఖాళీస్థలం అనేదే కనిపించదు. – రాజిరెడ్డి, గ్రామస్తుడు

కోదండ రాముని దర్శనం కోసం..



శ్రీరామనవమి పర్వదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వెలసిన కోదండ రాముని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

సందడే సందడి



అసలే ఆదివారం.. ఆపై శ్రీరామ నవమి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పనులపైన బయటకు వెళ్లిన విశాఖ నగరవాసులు సాయంకాలం చల్లగాలికోసం ఇలా ఆర్కే బీచ్‌కు చేరుకుని సేదదీరారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరానికి చేరువగా..



పది అడుగులేస్తే అందుతుందన్నంత దూరంలో భారీ నౌక.. ఒడ్డునే అలలతో ఇబ్బంది లేకుండా భారీ పైప్.. దీంతో విశాఖ ఆర్కే బీచ్‌కు వచ్చిన యువత ఈ డ్రెడ్జింగ్ నౌకతో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పీఓఈఎం-04 శకలాలు సముద్రంలోకి



పీఎస్ఎల్వీ సీ60 రాకెట్‌లోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పరమెంట్ మాడ్యూల్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గత ఏడాది డిసెంబర్ 30న పీఎస్ఎల్వీ సీ60 ద్వారా స్పేడెక్స్ ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఆ తరువాత నాలుగో దశలోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పరమెంట్ మాడ్యూల్(పీఓఈఎం-04) తన పనిని పూర్తిచేసింది. తదనంతరం దాని శకలాలను శనివారం ఉదయం 8.03 గంటలకు హిందూ మహాసముద్రంలో పడదోసినట్టు ఇస్రో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. పీఎస్ఎల్వీ రాకెట్‌ల సిరీస్‌లో పీఓఈఎం-4 అంటే నాలుగో దశతో కొన్ని పేలోడ్స్ వివిధ రకాల కక్ష్యల్లో ప్రవేశపెట్టి కొత్తరకం కక్ష్యలను అన్వేషించింది. ఈ క్రమంలో ఇప్పటికి నాలుగు పీఓఈఎంలను ప్రయోగించగా పీఎస్ఎల్వీ సీ60కి అమర్చిన పీఓఈఎం మాత్రం 1000 రకాల కక్ష్యలను పూర్తి చేసి 24 పెలోడ్స్‌ను వివిధ రకాల కక్ష్యల్లోకి ప్రవేశపెట్టి తన పనిని పూర్తిచేసింది. పీఓఈఎం-4 ఇంజిన్ 55.2 డిగ్రీల వంపుతో భూమికి 350 కిలోమీటర్ల ఎత్తులో వృత్తాకార కక్ష్యను తొలగించింది. దీంతో ప్రమాదవశాత్తూ విచ్ఛిన్నమయ్యే సంభావ్య ప్రమాదాన్ని తగ్గించేందుకు మిగిలిపోయిన అపోజి ఇంధనాన్ని బయటకు పంపడం ద్వారా పీఓఈఎం-4 శకలాలు హిందూ మహాసముద్రంలో పడిపోయే విధంగా చేయడం విశేషం.

బహుముఖ ప్రజ్ఞ

గత ఏడాది డిసెంబర్ 30న పీఎస్ఎల్సీ 60 రాకెట్ స్పేడెక్స్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తరువాత పీఓఈఎం దాని కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ దశలో మొత్తం 24 పేలోడ్స్‌ను అమర్చి పంపించిన విషయం తెలిసిందే. ఈ 24 పేలోడ్స్‌ను కచ్చితత్వంతో కూడిన కక్ష్యల్లో ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించింది. పీఓఈఎం-4 ప్రయోగాత్మక ప్లాట్‌ఫామ్‌గా బహుముఖ ప్రజ్ఞను నిరూపించిందని ఇస్రో పేర్కొంది.

స్మార్ట్‌గా చెడగొడుతున్నాయ్!

కందుకూరు రూరల్: యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఒక వీడియోను ఓపెన్ చేస్తే చాలు ముందు వచ్చేది యాడ్స్. ఆ యాడ్స్ కూడా అశ్లీలంగా ఉంటాయి. ఆసక్తి కలిగించేలా థంబ్ నెయిల్ టైటిళ్లు ఉంటాయి. ఉదాహరణకు.. లవ్, ఫ్యాషన్, సెక్స్ గురించి మాట్లాడుకోవడం లేదా తెలుసుకోవడంలో తప్పేముంది. వెంటనే ఈ యాప్ డౌన్‌లోన్ చేసుకోండని ఒక యాడ్. మీకు గార్ల్ ఫ్రెండ్. బాయ్‌ఫ్రెండ్ లేదని బాధపడుతున్నారా... ఒంటరిగా ఫీలవుతున్నారా.. ఇంకెందుకు ఆలస్యం ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎంజాయ్ చేయండి.. ఇది మరో యాడ్.

దారుణంగా థంబ్ నెయిల్

యూట్యూబ్ వీడియోలో థంబ్ నెయిల్ టైటిల్స్ మరీ దారుణంగా ఉంటున్నాయి. వయస్సులో ఉన్నవాళ్లు ఈ వీడియోను ఒంటరిగా చూడండి. చిన్నపిల్లలకు దూరంగా ఉండి ఈ ఆడియోను వినండి. పెళ్లిలో శృంగారం పాత్ర ఎంటీ? ఇలా రకరకాలుగా పిల్లలను ఆకర్షించే విధంగా టైటిళ్లు పెడుతున్నారు. అవి చూసిన పిల్లలు తెలిసీ తెలియక ఈ వీడియో ఎంటి ఇలా ఉంది డాడీ అని ఒకరు. శృంగారం అంటే ఎంటీ మమ్మి ఒక పాప.. ఈ వీడియోలో చిన్న చిన్న బట్టలు వేసుకున్నారెంటమ్మా అని మరొకరి ప్రశ్న. ఇలా తల్లిదంండ్రులకు పిల్లల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నా పిల్లల అల్లరిని తట్టుకోలేక స్మార్ట్ ఫోన్లు ఇస్తున్నారు. గతంలో వీడియో గేమ్స్‌కు ఎక్కువగా పిల్లలు ఆకర్షితులు అవుతున్నారని గేమ్‌లు డౌన్‌లోన్ చేయడం లేదు. అయితే నేరుగా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు ఓపెన్ చేసి వీడియో చూస్తుండు అని తల్లిదండ్రులు చెప్పి వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ ఆ వీడియో చూస్తూ ఉన్న సమయంలో మధ్య మధ్యలో అశ్లీల యాడ్స్ వస్తున్నాయి. వాటిని చూసిన పిల్లల ఆలోచనా సరళి మారిపోతోంది.

ఇప్పడంతా గూగుల్ తల్లి మాయ.. తాజాగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కొత్తపుంతలు తొక్కుతున్న స్థితిలో మనం ఉన్నాం. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ప్రపంచం అంతా మన చేతిలో ఉంటోంది. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందుతుందో అంతే వేగంగా దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, యువత వీటి ప్రభావానికి లోనై బానిసలవుతున్నారు. ఇప్పుడుగనుక తల్లిదండ్రులు మేల్కొనకపోతే భవిష్యత్‌లో పిల్లలు చెడుదారులు పట్టే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- మొబైల్‌లో యూట్యూబ్ ఓపెన్ చేస్తే అశ్లీల యాడ్స్
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ స్క్రోలింగ్ వీడియోల్లో కూడా ఇదే పరిస్థితి
- యూట్యూబ్‌లో అయితే థంబ్ నెయిల్‌లోనే ఆసక్తి కలిగించే టైటిళ్లు
- చిన్నారులు, యువతపై పెనుప్రభావం
- లైబ్రరీలు, క్రీడా మైదానాలు వదిలేస్తున్న విద్యార్థులు



తల్లిదండ్రులే కారణమా..?

యూట్యూబ్‌లో తల్లిదండ్రులు ఏ విధమైన వీడియో చూస్తున్నారో ఆ అంశాలకు అనుగుణంగానే ఆ తర్వాత వచ్చే వీడియోలు డిస్‌ప్లే అవుతుంటాయి. తండ్రి లేక తల్లి ఎలాంటి వీడియో చూస్తున్నారో అదే ఫోన్ పిల్లలు చూస్తుంటే అలాంటివే తిరిగి మీకు ముందుగా ఓపెన్ అవుతుంటాయి. యూట్యూబ్‌లోనే స్క్రోలింగ్ వీడియో చూసి ఏ వీడియోకి అయితే లైక్ కొడతామో అలాంటి రిలేటెడ్ వీడియోలే తిరిగి వస్తుంటాయి. ఇలా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వీడియోలు వస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఫోన్ పిల్లలకు ఇస్తున్నారంటే మీరు ఎలాంటి వీడియో చూస్తున్నారో వారికి కూడా అర్థమవుతుంది. వాటినే పిల్లలు చూసేలా మీరే పరోక్షంగా కారణం అవుతున్నారు.

గమనించకపోతే అంతే సంగతులు..

ఇది ఇలా ఉంటే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు హోమ్ వర్క్ ఇస్తున్నారు. ఇంటి వద్ద వర్క్ చేసేటప్పుడు అర్థం కాకపోతే తల్లిదండ్రులను అడగండి లేదా రేపు స్కూల్‌కు వచ్చిన తర్వాత ఆ వర్క్ చేయండని ఉపాధ్యాయులు చెప్పాలి. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయులు ఆ ప్రశ్న అర్థం కాకపోతే గూగుల్‌లో కొట్టండి లేదా యుట్యూబ్‌లో చూడండని చెప్తున్నారు. ఇళ్లకు వచ్చిన పిల్లలు మా సార్ ఫోన్‌లో చూసి ఈ లెక్కలు చేయమన్నాడని తల్లిదండ్రులను అడుగుతున్నారు. ఇక ఫోన్ వాళ్ల చేతికి పోతుంది. ఆ విద్యార్థి లెక్కలు చేస్తున్నాడా... ఇకేమైనా చూస్తున్నాడా అనేది ఆ తల్లిదండ్రులకు అర్థం కాదు. ఇలా ఓ తండ్రి కుమారుడికి ఫోన్ ఇస్తే లెక్కలకు బదులు ఏమి చూస్తున్నాడో గమనించాడు. తరువాత ఉపాధ్యాయుని వద్దకు వెళ్లి మీరు పిల్లలకు ఫోన్లు చూసి వర్క్ చేయమని చెప్పడం ఏమిటని ప్రశ్నించాడు. కానీ ఇలా అందరు పేరెంట్స్ అడగలేరు కదా.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



ఆధునిక ప్రపంచంలో సామాజిక మాధ్యమాల అవసరం ఉన్నప్పటికీ.. వాటి వినియోగంలో పరిపక్వతను, విజ్ఞతను పాటించాల్సిన అవసరం ఉంది. సామాజిక మధ్యమాలు, మొబైల్ గేమ్స్‌కు బదులు పిల్లలు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి. మొబైల్ ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. చిన్న పిల్లలు అల్లరి చేస్తున్నారని మీ ఫోన్ పిల్లలకు ఇచ్చేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ పి.పాపారావు, ఆల్ ఇండియా సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

స్మార్ట్‌ఫోన్లతో అనర్థాలు



స్మార్ట్‌ఫోన్ల వల్ల అనర్థాలు జరుగుతున్నాయి. కళాశాలల్లో ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడే విద్యార్థులు కూడా వేల రూపాయల మొబైల్స్ వాడుతున్నారు. తల్లిదండ్రులు కూడా ఇలాంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. కానీ ఎంత వరకు ఉపయోగించాలో అంతే ఉపయోగించాలి. అది కాస్తా వీరే కార్యకలాపాలకు దారి తీస్తున్నాయి. కళాశాలలకు ఫోన్లు తీసుకురావడం నిషేధించేందుకు ప్రయత్నించాలి.

– డాక్టర్ ఎం.రవికుమార్, టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

స్మార్ట్ ఫోన్లతో నష్టమే..

స్మార్ట్ ఫోన్లతో ఎంత మేలు ఉందో... అంతే చెడు కూడా ఉందని మానసిక వైద్య నిపుణులు చెప్తూనే ఉన్నారు. కానీ ప్రస్తుతం ఫోన్లు లేని విద్యార్థులు ఉండడం లేదు. పదో తరగతికి వచ్చారంటే ఫోన్ కచ్చితంగా ఉండాల్సిందే. ఇంటర్మీడియట్ చదివే పిల్లలను కాలేజీలకు ఫోన్లు తీసుకురావద్దన్నా వినడం లేదు. కందుకూరులోని కళాశాల సంక్షేమ హాస్టళ్లలోని అబ్బాయిలు, అమ్మాయిలు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. ఈ ఫోన్ల వల్ల ఏ విద్యార్థి కూడా సమయానికి నిద్ర పోవడం లేదు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో వీడియోలు ఓపెన్ చేసి చూస్తుంటే ఎప్పుడు అవుతారో కూడా తెలియని పరిస్థితి. దీని వల్లనే గాఢ నిద్ర లేక మానసికంగా యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రీడా మైదానాల్లో ఉండాల్సిన విద్యార్థులు ఫోన్లు పట్టుకొని చెట్ల కింద, రూమ్‌లలో ఉండిపోతున్నారు.

గుంటూరులో శోభాయాత్ర



నగరంపాలెం: శ్రీరామనవమి సందర్భంగా గుంటూరు నగరంలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఆదివారం ఉదయం శ్రీరామనవమి శోభాయాత్ర ప్రారంభమైంది.

సహస్ర ఘటాభిషేకంలో శ్రీవైష్ణవస్వాములకు ఆహ్వానం

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాత్రి నిర్వహించే సహస్ర ఘటాభిషేకంలో పాల్గొనేందుకు శ్రీవైష్ణవ స్వాముల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు www. simhachlamdevasthanam. net వెబ్‌సైట్ ద్వారా లేదా, endow-eosvlnsd@gov. in ఈమెయిల్ ద్వారా పంపించవచ్చన్నారు. లేకుంటే దేవస్థానం కార్యాలయ పనివేళల్లో నేరుగా అందించవచ్చన్నారు. దరఖాస్తులను ఈ నెల 15లోపు చేరేలా పోస్టల్(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్‌వీఎల్ఎన్ఎస్ దేవస్థానం, సింహాచలం, విశాఖపట్నం-530028) లేదా దేవస్థానం వాట్సాప్ నెం.9398734605లో ద్వారా కూడా పంపించవచ్చని తెలిపారు. ముందుగా వచ్చిన 300 దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.









అతిథులు వచ్చేశాయ్..!

ప్రతి ఏటా వేసవిలో యూరప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియాలోని పలు దేశాల నుంచి ప్రకాశం జిల్లా జరుగుమల్లి వచ్చే ఎగ్రెట్ జాతి పక్షులు ప్రస్తుతం సందడి చేస్తున్నాయి. పెద్దసంఖ్యలో జంటలుగా వచ్చిన ఈ పక్షులు ఇక్కడి చెట్లపై ఎంతో ఆసక్తికరంగా గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతున్నాయి. చుట్టుపక్కల చెరువులు, పొలాల్లో చేపలు, ధాన్యం గింజలు తెచ్చి పిల్లలకు అందించి పోషిస్తున్నాయి. పిల్లలకు రెక్కలొచ్చి ఎగిరే శక్తి రాగానే వాటిని తీసుకుని ఆయా దేశాలకు వెళ్లిపోతుంటాయి. మగ పక్షి ఎండు పుల్లలు తీసుకొచ్చి ఆడ పక్షికి అందిస్తుంటే.. ఆడ పక్షి గూడు కట్టి గుడ్లు పెట్టి పొదగడం, పిల్లలు పుట్టాక ఆహారం అందించడం వంటి దృశ్యాలు చూస్తూ పక్షి ప్రేమికులు మైమరిచిపోతున్నారు. ఈ పక్షులకు ఎటువంటి హానీ కలగకుండా గ్రామస్తులు కాపాడుతున్నారు. - సాక్షి, ఒంగోలు










నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



సింహాచలం: శ్రీ రామనవమి సందర్భంగా ఆదివారం సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. విశేషంగా భక్తులు తరలివచ్చి స్వామి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఆలయ మండపంలోని వేదికపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

రమణీయం.. రాములోరి కల్యాణం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్వామి వారి నిత్యకల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ వేడుకను నిర్వహించారు. ముందుగా తొళక్క వాహనంపై సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు విశేష పుష్పాలంకారాలు చేసి ఆలయ ప్రధాన రాజగోపురం, క్షేత్ర పురవీధుల మీదుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మండపంలో చిన వెంకన్న, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు మరో రజత సింహాసనంపై సీతారాముల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. రాత్రి తొళక్క వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది.

రేపు అప్పన్న వార్షిక కల్యాణోత్సవం



సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి జరగనుంది. సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులు, ముత్తైదువులు పసుపు కొమ్ములను దంచి కొట్నాలు ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ముక్కోటి దేవతలకు కల్యాణోత్సవ ఆహ్వానం పలుకుతూ ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవాన్ని నిర్వహిస్తారు. గోవింద రాజస్వామిని బంగారుచాయ పల్లకీలో, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగిస్తారు. రాత్రి 10.30 గంటల నుంచి ఉత్తర రాజగోపురం ఎదురుగా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న భారీ వేదికపై వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



రత్నాల రాశులతో విలసిల్లిన నేల హంపి.
కాఫీ తోటలతో విలసిల్లుతున్న చిక్‌మగళూరు.
హొయసల వాస్తుశైలికి తార్కాణం హలేబీడు.
బహు విశేషణాల మల్లిగ మాల మైసూరు.
మైసూర్ పాలకుల బెంగళూరు ప్యాలెస్.
మధ్యలో మృగరాజు గాండ్రించే బందీపూర్.

చివరాఖరుకు అరేబియా తీరాన గోవా...
ఒకే రైలుబండిలో మొత్తం తిరిగి వద్దాం.
రాజమహల్లాటి గోల్డెన్ చారియట్ ట్రైన్ ఉంది.
ప్రైడ్ ఆఫ్ కర్నాటక విత్ గోవా ప్యాకేజ్ ఉంది.
మెనీ మెనీ థాంక్స్ టూ ఐఆర్‌సీటీసీ.


● గోల్డెన్ చారియట్ టూర్

మనోరథ విహారం




గోల్డెన్ చారియట్ లోపలి దృశ్యాలు

గోల్డెన్ చారియట్ అనేది మన దేశంలో విలాసవంతమైన పర్యటన కోసం ఇండియన్ రైల్వేస్ డిజైన్ చేసిన రైలు ప్రయాణం. ఇందులో ప్రైడ్ ఆఫ్ కర్నాటక విత్ గోవా, జ్యువెల్స్ ఆఫ్ సౌత్, గ్లింప్సెస్ ఆఫ్ కర్నాటక ప్యాకేజ్‌లున్నాయి. ప్రైడ్ ఆఫ్ కర్నాటక విత్ గోవా ప్యాకేజ్‌లో బెంగళూరు, నంజన్‌గుడ్, బందీపూర్ వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, మైసూరు, హలేబీడు, చిక్‌మగుళూరు, హంపి, గోవాలు కవర్ అవుతాయి.



దుద్ సాగర్ ఫాల్స్ – గోవా



గోవా బీచ్



గోవా మెమోరియల్



శాంతా దుర్గా టెంపుల్ – గోవా

ప్యాకేజ్ ఇలా...

- ప్రైడ్ ఆఫ్ కర్నాటక విత్ గోవా 5 రాత్రులు, 6 రోజుల ప్యాకేజ్‌లో డీలక్స్ క్యాబిన్ ట్విన్ షేరింగ్‌లో ఒకరికి 4,20,680 రూపాయలు. సింగిల్ సప్లిమెంట్ కేటగిరీ 3,15,950 రూపాయలు.
- రెండు పడకల క్యాబిన్‌కి అటాచ్‌డ్ బాత్‌రూమ్ కూడా ఉంటుంది.
- టూర్‌లో అన్ని భోజనాలు, టీ కాఫీ, నీటి బాటిల్, కూల్ డ్రింకులతోపాటు వైన్, బీర్ వంటి ఇతర డ్రింకులు,
- రైలులో పారా మెడికల్ సర్వీస్, బట్లర్ సర్వీస్, స్టేషన్‌లలో పోర్టర్ సర్వీస్
- గైడ్ సర్వీస్‌తోపాటు పర్యాటక ప్రదేశాల్లో ఎంట్రన్స్ ఫీజ్, స్టిల్ కెమెరా ఫీజ్.
- డీలక్స్ క్యాబిన్ బుక్ చేసుకున్న పర్యాటకులకు రైలు దిగి రోడ్డు మార్గాన ప్రయాణానికి వోల్వో బస్, వోక్స్‌వ్యాగన్ వంటి వాహనాలుంటాయి.
- లాండ్రీ ఖర్చులు, ప్యాకేజ్‌లో లేని ఇతర బేవరేజ్‌లు, పర్యాటక ప్రదేశాల్లో వీడియో కెమెరా ఫీజ్, ఇంటి నుంచి టూర్ మొదలయ్యే ప్రదేశానికి చేరడానికి, పర్యటన పూర్తయిన తర్వాత ఇంటికి వెళ్లడానికి అయ్యే వాహన ఖర్చులు ఈ ప్యాకేజ్‌లో వర్తించవు.

5వ రోజు


గోవాలో విహారం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత నార్త్ గోవాలోని చర్చ్‌ల వీక్షణం. తిరిగి స్టేషన్‌కి వచ్చి ట్రైన్‌లో లంచ్. ట్రైన్ మాద్‌గోవ్ వైపు సాగుతుంది. సాయంత్రం సౌత్ గోవాలో ఉత్సాహం ఉరకలు వేసే కార్యక్రమాలు, గాలా డిన్నర్ తర్వాత ట్రైన్ బెంగళూరు వైపు సాగుతుంది.

గోవా అంటే మనకు అరేబియా తీరమే గుర్తు వస్తుంది. కానీ ఇది ఒక మినీ వరల్డ్. ప్రాచ్య పాశ్చాత్యాల కలయిక. పోర్చుగీసు పాలకులు నిర్మించిన కట్టడాలు ఒక్కొక్కటి ఒక్కో అద్భుతం. చర్చ్‌ల నిర్మాణంలో వైవిధ్యత ఆకట్టుకుంటుంది. ఇక్కడ కొన్ని హిందూ ఆలయాలు కూడా పాశ్చాత్యశైలిలో ఉంటాయి. హిందూ–క్రిస్టియన్ ఐకమత్యాన్ని చాటే శిల్పాన్ని తప్పకుండా చూడాలి. లీనింగ్ టవర్ ఆఫ్ పీసాను పోలిన నిర్మాణం ఉంది. అది మంగేషి ఆలయం.

4వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోస్పేట జంక్షన్‌లో ట్రైన్ దిగి హంపిలోని పర్యాటకప్రదేశాల వీక్షణానికి తీసుకువెళ్తారు. లంచ్ సమయానికి తిరిగి రైలెక్కాలి. సాయంత్రం వరకు ఖాళీ సమయం. రాత్రి భోజనం తర్వాత గోవా వైపు ప్రయాణం సాగుతుంది.

హంపి: తుంగభద్ర తీరాన 14వ శతాబ్దంలో విలసిల్లిన నగరం. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని ప్రతిబింబిస్తున్న ఆనవాలు. యునెస్కో ఈ ప్రదేశాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. కృష్ణదేవరాయలు పాలించిన నేల. రాయల కాలంలో రత్నాలు రాశులు పోసిన నేలలో ఇప్పుడు మనకు కనిపించేవి రాళ్లు మాత్రమే. విరూపాక్ష ఆలయం, ముస్లిం పాలకుల చేతిలో ధ్వంసమైన నిర్మాణాల శిథిలాల ఆధారంగా వాటి పూర్తి స్వరూపాన్ని మనోనేత్రంతో వీక్షించుకోగలిగితే నాటి శిల్పకారుల చాతుర్యానికి చేతులెత్తి మొక్కకుండా ఉండలేం. హంపిని ఏటా సందర్శించే ఏడు లక్షల పర్యాటకుల్లో మనమూ ఉందాం.



మైసూరు ప్యాలెస్

1వ రోజు

బెంగళూరు నుంచి నంజన్‌గుడ్‌కి ప్రయాణం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పర్యాటకులు యశ్వంత్‌పూర్ రైల్వే స్టేషన్‌లో ఉదయం ఎనిమిదిన్నరకు ట్రైన్ ఎక్కి లో తమకు కేటాయించిన క్యాబిన్‌లో చెక్ ఇన్ అవుతారు. రైలు 9.45కి స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. లంచ్ రైల్లోనే. మధ్యాహ్న ఒకటిన్నరకు నంజన్‌గుడ్ చేరుతుంది. రైలు దిగిన తర్వాత రోడ్డు మార్గాన బందిపూర్ వైల్డ్‌లైఫ్ సాంక్చురీకి ఒకటిన్నర గంట ప్రయాణం. సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరున్నర వరకు అడవిలో విహారం తర్వాత తిరిగి నంజన్‌గుడ్ స్టేషన్‌కు చేరి రైలెక్కాలి. ఎనిమిది తరవాత రాత్రి భోజనం. రైలు మైసూరు వైపు సాగుతుంది.


బందీపూర్: ఇది దట్టమైన అడవి. పశ్చిమ కనుమలు అంటేనే పచ్చదనానికి పుట్టిల్లు. దట్టమైన అడవుల నెలవు. ఈ పర్వతశ్రేణుల్లో విస్తరించిన అడవి ఇది. ఈ పులుల సంరక్షణ కేంద్రంలో పులి ఠీవిగా రాజుగా సంచరిస్తుంటుంది. కానీ పగలు చూడలేం. సీసీ కెమెరాల్లో రికార్డయిన విజువల్స్‌ని మాత్రమే చూడగలం. మైసూర్– ఊటీ హైవేలో ఉంది. ఈ అటవీ ప్రాంతం ఏనుగులు, రకరకాల జింకలు, వందలాది జాతుల పక్షుల నిలయం. ఇక్కడ మహావృక్షాలను చూడడానికి తలెత్తి ఆకాశాన్ని చూడాల్సిందే. ఆకాశాన్నంటే మహావృక్షాలనే అతిశయోక్తి అలంకారం ఈ వృక్షాలను చూసే పుట్టిందేమో! వెదురు, టేకు, రోజ్‌వుడ్ వృక్షాలుంటాయి. చందనవృక్షాలను తాకి చేతిని వాసన చూసుకుని మురిసిపోవచ్చు. అడవిలో సఫారీకి పర్యటించడానికి జీపులు, మినిబస్సులున్నాయి. ఇప్పుడు ఎలిఫెంట్ సఫారీ లేదు. ట్రెకింగ్ చేయవచ్చు. కానీ ఈ టూర్ ప్యాకేజ్‌లో అంత సమయం ఉండదు.

5 రోజు గోవా


4 రోజు హోస్పేట




హొయసల టెంపుల్ హలిబేడు



కాఫీ గింజలు కోస్తున్న మహిళ



హంపి




మంగూషి టెంపుల్ – గోవా

3వ రోజు


హలేబీడు, చిక్‌మగళూరుకు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత బణావర్‌లో రైలు దిగి హలేబీడుకు వెళ్లాలి. హలేబీడు సైట్‌సీయింగ్ తర్వాత రైలెక్కి మధ్యాహ్న భోజనం చేస్తూ చిక్‌మగళూరుకు వెళ్లాలి. సాయంత్రం కాఫీ తోటల్లో విహారం, సాంస్కృతిక కార్యక్రమాల తర్వాత అక్కడే రాత్రి భోజనం పూర్తి చేసుకుని రైలెక్కి హోస్పేటకు సాగిపోవాలి.

హలేబీడు... ఇది 11వ శతాబ్దంలో విలసిల్లిన హొయసల సామ్రాజ్యానికి తార్కాణం. ఢిల్లీ సుల్తానుల విధ్వంసం తర్వాత మిగిలిన శిథిలాలు నాటి శిల్పుల గొప్పదనాన్ని తెలుసుకోవడానికి మిగిలిన ఆనవాళ్లు. ఏకరాతిలో చెక్కిన మహాశిల్పాలు చూపు తిప్పుకోనివ్వవు. బారులు తీరిన ఏనుగులు, సింహాలతో ఆలయం గోడలంతా శిల్పనైపుణ్యమే. ఈ శిల్పాలను ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తే ఇందులో ఒక మహా చారిత్రక గ్రంథం దాగి ఉందని చెబుతారు చరిత్రకారులు.

చిక్‌మగళూరు: విస్తారమైన కాఫీ తోటల మధ్య కాఫీ సువాసనను ఆఘ్రాణిస్తూ విహరించడం గొప్ప అనుభూతి. కాఫీ తోటల్లో చెట్ల సన్నని కొమ్మలు కాఫీ గింజల బరువుకు నేలకు వంగిపోతుంటాయి. ఆకుపచ్చ రంగు నుంచి ఎరుపు రంగుకు మారిన గింజలను కోసి బుట్టలో వేస్తుంటారు మహిళలు. టీ తోటల్లో టీ ఆకు సేకరించే వాళ్లు బుట్టను వీపుకు కట్టుకుంటారు. కాఫీ గింజలను సేకరణలో బుట్టను ముందుకు తగిలించుకుంటారు. కాఫీ పొడి తయారు చేసే ఫ్యాక్టరీల నుంచి కాఫీ వాసన గాల్లో తేలుతూ పర్యాటకులను ఆహ్వానిస్తుంది.




చిక్‌మగళూరు కాఫీ తోటల్లో....



కాఫీ తోటలు

3 రోజు చిక్‌మగుళూరు




హెబీ ఫాల్స్

3 రోజు హలేబీడు



నంది విగ్రహం మైసూరు

1&6 రోజు బెంగళూరు



బెంగళూరు ప్యాలెస్

6వ రోజు

యశ్వంత్‌పూర్ స్టేషన్‌కు ట్రైన్ చేరుతుంది. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత నిర్వహకులు పర్యాటకులకు వీడ్కోలు పలుకుతారు.

2వ రోజు

మైసూరు పర్యటన. ఉదయం రైల్లో బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత రైలు దిగి మైసూరు ప్యాలెస్‌కు రోడ్డు ప్రయాణం. మధ్యాహ్న భోజనం సమయానికి రైలెక్కాలి లేదా ఆ సమయంలో శ్రీరంగపట్టణం వెళ్లి రావచ్చు. ట్రైన్ శుభ్రం చేసుకోవడం కోసం ఆగుతుంది. రాత్రి భోజనం రైల్లోనే, బనావర్ రైల్వే స్టేషన్‌కు ప్రయాణం సాగుతుంది.

మైసూరు: ఈ నగరానికి ఉన్నన్ని విశేషణాలు బహుశా మరే నగరానికీ ఉండకపోవచ్చు. హెరిటేజ్ సిటీ, సిటీ ఆఫ్ ప్యాలెస్, ద కల్చరల్ క్యాపిటల్ ఆఫ్ కర్నాటక, సాండల్‌వుడ్ సిటీ, సిటీ ఆఫ్ జాస్మిన్...ఇన్ని పేర్లతో పిలుచుకుంటారు. ఇంకా ముఖ్యంగా పర్యాటకులు గుర్తుంచుకోవాల్సింది మైసూరు ఉచ్చారణ గురించి. ఇంగ్లిష్ స్పెల్లింగ్ ఆధారంగా మైసూర్ లేదా మైసోర్ అని పలికితే కన్నడిగులకు నచ్చదు. సౌమ్యులు కాబట్టి కోప్పడరు కానీ నొచ్చుకుంటారు. మైసూరు అనాల్సిందే. వడయార్‌లు నివసించిన మైసూరు ప్యాలెస్, మైసూరుకి ఆ పేరు తెచ్చిన చాముండి హిల్స్‌లో చాముండేశ్వరి ఆలయం వంటి పర్యాటక ప్రదేశాలను చూసిన తర్వాత ఇక్కడ దొరికే మైసూరు మల్లిగె (మల్లెపూలు)లు కొనుక్కుని జడకు చుట్టుకుని మురిసిపోవాల్సిందే. అలాగే మైసూరు సిల్క్ చీరలు, మైసూర్ శాండల్ సోప్‌లు కూడా.

2 రోజు మైసూరు

1 రోజు నంజన్‌గుడ్



బందీపూర్ అటవీ ప్రాంతంలో ఏనుగులు



బందీపూర్ పులుల సంరక్షణ కేంద్రం



గొప్ప పనులు చేయడానికి ఏకైక మార్గం
ఏమిటంటే చేసే పనిని ప్రేమించడం
- స్టీవ్ జాబ్స్, యాపిల్ కంపెనీ మాజీ సీఈఓ

బిజినెస్ రీల్

బ్యాంక్ ఖాతాల్లో మహిళల వాటా గుడ్

- 39.2 శాతం మహిళల **ఖాతాలే**
- గ్రామీణ ప్రాంతాలలో **42.2 శాతం**

న్యూఢిల్లీ: దేశీయంగా బ్యాంక్ **ఖాతాల్లో** మహిళల వాటా 39.2 శాతమ**ని ఒక నివేదికలో** కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలలో అయితే మరింత అధికంగా 42.2 శాతంగా నమోదైనట్లు వెల్లడించింది. 'ఉమన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2024: సెలెక్టెడ్ ఇండికేటర్స్, డేటా' పేరుతో గణాంకాలు, పథకాల అమలు శాఖ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం మహిళల ఖాతాల ద్వారా మొత్తం బ్యాంక్ డిపాజిట్లలో 39.7 శాతం లభిస్తున్నాయి. ఇక కొన్నేళ్లుగా స్టాక్ మార్కెట్లో ప్రజల పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీంతో డీమ్యాట్ ఖాతాల సంఖ్య బలపడుతూ వస్తోంది.



2021 మార్చి 31లో నమోదైన 33.26 మిలియన్ డీమ్యాట్ ఖాతాలు 2024 నవంబర్ 30కల్లా 143.02 మిలియన్లకు చేరాయి. వెరసి నాలుగు రెట్లుపైగా ఎగశాయి. వీటిలో పురుషుల ఖాతాలు భారీగా 26.59 మిలియన్ల నుంచి 115.31 మిలియన్లకు జంప్‌చేశాయి. అయితే మహిళల ఖాతాలు సైతం 6.67 మిలియన్ల నుంచి 27.71 మిలియన్లకు ఎగశాయి. 1952లో 17.32 కోట్లుగా నమోదైన మహిళా ఓటర్ల సంఖ్య 2024కల్లా 97.8 కోట్లకు జంప్‌చేసింది. కనీసం ఒక మహిళా డైరెక్టర్‌గల.. డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లలోనూ పురోగతి కనిపిస్తోంది. 2017లో ఈ తరహా స్టార్టప్‌లు 1,943 నమోదుకాగా.. 2024కల్లా 17,405కు ఎగశాయి. వెరసి మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్ సంఖ్య బలపడుతోంది.

ఐపీఓకు రెండు కంపెనీలు రెడీ

ముంబై: ఐపీఓ ద్వారా నిధుల సమీకరించేందుకు రెండు కంపెనీలు సిద్ధమయ్యాయి. సాయి ఇన్ఫినియం, అడ్వాన్స్ అగ్రోలైఫ్ సంస్థలు పబ్లిక్ ఇష్యూకు అనుమతులు కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించాయి. ఈ రెండు ఇష్యూలు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) లేకుండానే జరగనున్నాయి.



సాయి ఇన్ఫినియం 1.96 కోట్ల తాజా ఈక్విటీలు జారీ చేయనుంది. సమీకరించిన నిధుల్లో 17.4 మెగావాట్ల హైబ్రిడ్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.130 కోట్లు, రోలింగ్ మిల్లు కొనుగోలుకు రూ.65 కోట్లు, కార్గో వెసెల్ కొనుగోలుకు రూ.19 కోట్లు ఉపయోగించనుంది.

అడ్వాన్స్ అగ్రోలైఫ్: అగ్రోకెమికల్ తయారీ కంపెనీ 'అడ్వాన్స్ అగ్రోలైఫ్' 1.92 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల ద్వారా నిధులు సమీకరించనుంది. అర్హులైన కంపెనీ ఉద్యోగులకు రిజర్వేషన్ సదుపాయం కల్పించింది. అలాంటి వారికి డిస్కౌంట్‌తో షేర్లు కేటాయించనుంది. సమీకరించిన నిధుల్లో రూ.135 కోట్లు మూలధన అవసరాలకు మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-4-2025

విశాఖ	445-00
చిత్తూరు	480-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

మార్కెట్లు పతనబాటలో..

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు అత్యధిక సమయం పతనబాటలో సాగవచ్చని పలువురు సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. అయితే రిజర్వ్ బ్యాంక్ పాలసీ సమీక్ష, యూఎస్ టారిఫ్‌ల ప్రభావం, ఫెడ్ గత పాలసీ మినిట్స్ వెల్లడి తదితర పలు అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. దీంతో తీవ్ర ఆటుపోట్లకు వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. వివరాలు చూద్దాం..

యూఎస్ టారిఫ్‌ల ఎఫెక్ట్

- ఫెడ్ మినిట్స్‌కూ ప్రాధాన్యత
- ఈ వారం ట్రేడింగ్ 4 రోజులే
- ఆర్‌బీఐ పరపతి సమీక్షపై దృష్టి
- ట్రెండ్‌పై నిపుణుల అంచనా



ముంబై: గత వారాంతాన యూఎస్ స్టాక్స్ అత్యంత భారీ పతనాన్ని చవిచూశాయి. నేడు(7న) యూఎస్ స్టాక్ మార్కెట్లకు 'బ్లాక్‌మండే' ఎదురుకావచ్చని అక్కడి నిపుణులు అంచనా వేశారు. భారత్‌సహా చైనా, జపాన్ తదితర ప్రధాన దేశాలపై ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లను ప్రకటించడంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినవచ్చని, మాంద్యంలోకి జారుకోవచ్చని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లలో సైతం అమ్మకాలకు తెరలేచే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2020 తరువాత గత వారం యూఎస్ మార్కెట్లు 6 శాతం పడిపోయాయి. 5 లక్షల కోట్ల డాలర్లకుపైగా మార్కెట్ విలువ ఆవిరైంది. వెరసి ఈ వారం దేశీ మార్కెట్లు పతన బాటలో సాగవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. కాగా.. గురువారం (10న) శ్రీ మహావీర్ జయంతి సందర్భంగా మార్కెట్లు పనిచేయవు. దీంతో ట్రేడింగ్ 4 రోజులకే పరిమితంకానుంది.

గత వారమిలా

ప్రపంచ దేశాలపై యూఎస్ టారిఫ్‌ల ఎఫెక్ట్‌తో గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు సైతం డీలా పడ్డాయి. ఆటుపోట్ల మధ్య సెన్సెక్స్ నికరంగా 2,050 పాయింట్లు(2.65 శాతం) పతనమై 75,365 వద్ద ముగిసింది. ఈ బాటలో నిఫ్టీ 615 పాయింట్లు(2.6 శాతం) కోల్పోయి 22,904 వద్ద స్థిరపడింది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5 శాతం క్షీణించి 40,509కు చేరగా.. స్మాల్‌క్యాప్ 1.65 శాతం నీరసించి 45,867 వద్ద నిలిచింది.

వడ్డీ రేట్లపై కన్ను

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన నేడు(7న) ప్రారంభంకానున్న మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) పరపతి సమీక్షా సమావేశాల తుది నిర్ణయాలు బుధవారం(9న) వెలువడనున్నాయి. గత పాలసీ సమీక్షలో వడ్డీ రేట్లకు **కీల**కమైన రెపో రేటును 0.25 శాతం తగ్గించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజా సమావేశంలో మరో పావు శాతం కోతకు వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్‌మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అంచనా వేశారు. కాగా.. ఇదే రోజు యూఎస్ ఫెడ్ కమిటీ(ఎఫ్ఓఎంసీ) గత పాలసీ వివరాల మినిట్స్ విడుదలకానున్నాయి. ఫెడ్ ఫండ్స్ రేట్లను 4.25-4.5 శాతంవద్ద యథాతథంగా కొనసాగించేందుకే కట్టుబడింది. 10న మార్చి నెలకు యూఎస్, చైనా కన్జూమర్ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలకానున్నాయి. ఇక వారాంతాన(11న) దేశీయంగా ఫిబ్రవరి నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ), మార్చి రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) వివరాలు వెల్లడికానున్నాయి. జనవరిలో ఐఐపీ 5 శాతం పుంజుకోగా.. ఫిబ్రవరిలో సీపీఐ 3.62 శాతంగా నమోదైంది.

టీసీఎస్ రెడీ

గురువారం సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టీసీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) చివరి త్రైమాసిక(క్యూ4) ఫలితాలు విడుదల చేయనుంది. దీంతో జనవరి-మార్చి(క్యూ4) ఫలితాల సీజన్ ప్రారంభంకానుంది. కాగా.. అక్టోబర్ మొదలు అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) మార్చి చివరి వారంలో నికర కొనుగోలుదారులుగా మారినప్పటికీ తిరిగి ఏప్రిల్‌లో అమ్మకాల బాట పట్టడం సెంటిమెంటును బలహీనపరుస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ పేర్కొన్నారు. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు రూ. 10,355 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం గమనార్హం! ఎఫ్‌పీఐలు ఫిబ్రవరిలో దేశీ స్టాక్స్ నుంచి రూ. 34,574 కోట్లు, జనవరిలో మరో రూ. 78,027 కోట్లు చొప్పున పెట్టుబడులు ఉపసంహరించిన సంగతి తెలిసిందే.

వాట్సాప్ ద్వారా ఫండ్స్‌లో పెట్టుబడులు

హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వినూత్న ఫీచర్

ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలోనే తొలిసారిగా ట్యాప్2ఇన్వెస్ట్ ఫీచరును ప్రవేశపెట్టినట్లు తెలిపింది. దీనితో కేవైసీ ధృవీకరణ పూర్తి చేసుకున్న ఇన్వెస్టర్లు వాట్సాప్ (నంబరు 82706 82706) ద్వారా ఇన్వెస్ట్ చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. ఇన్వెస్ట్‌మెంట్ యాప్ తరహాలోనే ఇది పనిచేస్తుందని తెలిపింది.



దీనితో కేవలం ఆయా ఆప్షన్లపై క్లిక్ చేయడం ద్వారా తమ స్కీముల్లో ఏకమొత్తంగా లేదా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) రూపంలో పెట్టుబడులు పెట్టొచ్చని సంస్థ వివరించింది. యూపీఐ ఆటోపే, నెట్‌బ్యాంకింగ్, ఇతరత్రా డిజిటల్ చెల్లింపు విధానాలను ఇది సపోర్ట్ చేస్తుందని కంపెనీ ఎండీ నవనీత్ మునోత్ తెలిపారు.

కోటక్ ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్..

ఎనర్జీ థీమ్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు కొత్తగా ఎనర్జీ ఆపర్చూనిటీస్ ఫండ్‌ను ప్రవేశపెట్టినట్లు కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తెలిపింది. ఇది ఏప్రిల్ 17తో ముగుస్తుంది. ఇందులో కనీసం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, పట్టణీకరణ మొదలైనవి పెరుగుతుండటంతో వచ్చే 11 ఏళ్లలో దేశీయంగా మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం రెట్టింపవుతుందనే అంచనాలు నెలకొన్నట్లు సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు. ఈ నేపథ్యంలో ఎనర్జీ సెక్టార్‌లో ఇన్వెస్ట్‌మెంట్ ప్రయోజనాలను పొందడానికి ఈ ఫండ్ తోడ్పడుతుందని చెప్పారు.

జీవిత బీమాలో మహిళలకు మంచి కెరియర్..



సమీర్ జోషి, చీఫ్ ఏజెన్సీ ఆఫీసర్
బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్



చాలా మంది మహిళలకు, ముఖ్యంగా గృహిణులకు, ఇంటి బడ్జెట్లు చూసుకోవడం, ఖర్చుల విషయంలో నిర్ణయాలు తీసుకోవడం, భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకోవడమనేది దైనందిన చర్యగానే ఉంటుంది. ఈ బాధ్యతలే, ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టడం, కమ్యూనికేషన్, సమస్యలను పరిష్కరించగలిగే సామర్థ్యాల్లాంటి అమూల్యమైన నైపుణ్యాలను అలవర్చుకోవడానికి ఉపయోగపడతాయి. విజయవంతమైన జీవిత బీమా అడ్వైజరు/కన్సల్టెంటుగా మారాలంటే అచ్చంగా ఇలాంటి నైపుణ్యాలే అవసరం. అడ్వైజరు, కన్సల్టెంటుగా మారడమనేది, జీవిత లక్ష్యాలకు సంబంధించి ప్రణాళికలు వేసుకోవడంలో ఇతరులకు తోడ్పడటంతో పాటు తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం కూడా కృషి చేయడానికి ఉపయోగపడుతుంది. ఐఆర్‌డీఏఐ ప్రకారం 2022 మార్చి నాటికి దేశీయంగా మొత్తం జీవిత బీమా ఏజెంట్లలో మహిళల వాటా 29 శాతంగా ఉంది. సుమారు 24.43 లక్షల మంది ఏజంట్లలో దాదాపు 7 లక్షల మంది మహిళా ఏజంట్లు ఉన్నారు. మహిళలు ముందుకొచ్చి, అవకాశాలను అందిపుచ్చుకుంటే, ఈ సంఖ్య మరింతగా పెరగొచ్చు.

అడ్వైజరుగా ఇలా మారొచ్చు..

1. ప్రాథమిక అర్హతలు, శిక్షణ: బీమా పథకాలు, విక్రయించేందుకు టెక్నిక్‌లు, ఆర్థిక ప్రణాళిక సూత్రాలు మొదలైన విషయాల్లో అభ్యర్థులకు అవగాహన కల్పించేలా చాలా మటుకు కంపెనీలు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. సమర్థవంతంగా క్లయింట్లకు మార్గదర్శకత్వం వహించేందుకు మహిళలకు అవసరమయ్యే సాధన సంపత్తిని వీటి ద్వారా సమకూర్చుకోవచ్చు.

2. నెట్‌వర్కింగ్: క్లయింట్ల నమ్మకాన్ని చూరగొనాలంటే సంభాషించే నైపుణ్యాలు, ఇతరులతో కలిసి పని చేయగలగడం, అవసరమైతే సారథ్య బాధ్యతలు చేపట్టడం, పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మల్చుకోగలిగే సామర్థ్యాల్లాంటివి చాలా ముఖ్యం. తాము అడ్వైజరుగా వ్యవహరించే సంస్థల సహాయంతో మహిళలు సామర్థ్యాలను మెరుగుపర్చుకుని, దీర్ఘకాలిక ప్రొఫెషనల్ కనెక్షన్లను ఏర్పర్చుకోవచ్చు.

3. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవడం: డిజిటల్ యుగంలో భావి కస్టమర్లను చేరుకునేందుకు సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్ అనేవి శక్తివంతమైన సాధనాలుగా ఉంటున్నాయి. తమ అనుభవాన్ని తెలియజేసేందుకు, భావి కస్టమర్లలో అవగాహనను పెంపొందించేందుకు మహిళలు ఈ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకోవచ్చు.

4. నిరంతరం నేర్చుకోవడం, అభివృద్ధి చెందడం: పరిశ్రమలో వచ్చే కొత్త పోకడలు, కొత్త ప్రోడక్టులు, నియంత్రణ నిబంధనలపరమైన మార్పుల గురించి ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంటే దీర్ఘకాలికంగా విజయాలకు దోహదపడుతుంది. సంబంధిత సర్టిఫికేషన్ల పొందితే కెరియర్‌లో పురోగమించడానికి ఉపయోగకరంగా ఉంటుంది.

చివరగా చెప్పేదేమిటంటే మహిళలు, ముఖ్యంగా గృహిణులు తమకు అంతర్గతంగా ఉండే నైపుణ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుని, కెరియర్‌ను నిర్మించుకోవడానికి జీవిత బీమా రంగం అవకాశం కల్పిస్తుంది.

సరైన శిక్షణ, సంకల్పం, నెట్‌వర్కింగ్ సామర్థ్యాలను అలవర్చుకుంటే ఫైనాన్షియల్ అడ్వైజర్లుగా మహిళలూ విజయవంతగా రాణించగలరు. ఫైనాన్షియల్ అడ్వైజర్లు కావడం ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం, వర్క్-లైఫ్ సమతుల్యత, ఇతరులకు సాధికారత కల్పించే సంతృప్తిని పొందవచ్చు.

జీవిత బీమాలో కెరియర్‌తో ఆర్థిక స్వాతంత్ర్యం

జీవిత బీమా రంగంలో మహిళలు కెరియర్‌పరంగా పురోగమించడంతో పాటు ఆర్థికంగా సాధికారతను కూడా పొందేందుకు అవకాశాలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కన్సల్టెంటుగా కెరియర్ ఇటు వ్యక్తిగత బాధ్యతలు, అటు ప్రొఫెషనల్ ఆకాంక్షల మధ్య సమతౌల్యం పాటిస్తూ, ఆర్థికంగా స్థిరత్వాన్ని పొందేందుకు వెసులుబాటు కలిగిస్తుంది. స్థిరమైన ఆదాయార్జన పొందడంతో పాటు అర్థవంతమైన ప్రభావాన్ని చూపేందుకు ఇందులో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. తద్వారా తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకోవడంలో తోడ్పడటమే కాకుండా ఆర్థిక స్వాతంత్ర్యం పొందేందుకు కూడా ఇది ఉపయోగపడగలదు.

ఇక ఒక రాష్ట్రం-ఒక ఆర్‌ఆర్‌బీ!

విలీనాలతో 43 నుంచి 28కి తగ్గనున్న సంఖ్య

- పనితీరు మెరుగుపరిచేందుకు ఆర్థిక శాఖ చర్యలు

న్యూఢిల్లీ: దేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్‌ఆర్‌బీ) నిర్వహణ పనితీరును మెరుగుపరిచేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. త్వరలోనే 'ఒక రాష్ట్రం-ఒక ఆర్‌ఆర్‌బీ' ప్రణాళికను ఆర్థిక మంత్రిత్వ శాఖ అమలు చేయనుంది. ఈ మేరకు విలీన కార్యాచరణ (రోడ్‌మ్యాప్)ను రూపొందిస్తోంది. దీంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 43 ఆర్‌ఆర్‌బీల సంఖ్య 28కి పరిమితం కానుంది. విలీనాలకు సంబంధించిన సమస్యలన్నీ దాదాపు కొలిక్కి వచ్చినట్టేనని, నాలుగో విడత త్వరలోనే పూర్తవుతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రోడ్‌మ్యాప్ ప్రకారం వివిధ రాష్ట్రాల్లో ఒకటి కంటే ఎక్కువగా ఉన్న 15 ఆర్‌ఆర్‌బీలు వేరే వాటిలో విలీనమవుతాయి. ఇలా ఆర్‌ఆర్‌బీల సంఖ్య ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ (4), ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ (3 చొప్పున), బీహార్, గుజరాత్, జమ్ము కాశ్మీర్, కర్ణాటక, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ (2 చొప్పున) ఉన్నాయి. తెలంగాణ విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ)కి చెందిన ఆస్తులు, అప్పులను ఏపీజీవీబీ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మధ్య విభజించేందుకు సంబంధించిన సమస్యలన్నీ కొలిక్కి వచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.



మూలధనం దన్ను...

విలీనాలకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఆర్‌ఆర్‌బీలకు కేంద్రం ఇప్పటికే రూ.5,445 కోట్ల మూల ధనాన్ని సమకూర్చింది. దీంతో 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వాటి క్యాపిటల్ అడిక్వసీ రేషియో ఆల్‌టైమ్ గరిష్టానికి (14.2 శాతం) చేరింది. 2023-24లో మొత్తం ఆర్‌ఆర్‌బీల కన్సాలిడేటెడ్ నికర లాభం కూడా అత్యధిక స్థాయిలో రూ.7,571 కోట్లకు ఎగబాకింది. స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) 10 కనిష్ఠ స్థాయిలో 6.1 శాతానికి దిగిరావడం గమనార్హం. 2024 మార్చి నాటికి దేశంలో 26 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 43 ఆర్‌ఆర్‌బీలు 22,069 శాఖల నెట్‌వర్క్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

ఉమ్మడి కుటుంబం.. మంచి కుటుంబం



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ట్యాక్స్ కాలంలో ఎన్టీఆర్ ఉమ్మడి కుటుంబం, ఏఎన్నార్ మంచి కుటుంబం ప్రస్తావన ఎందుకొచ్చిందంటే .. అంటే ఒకే గూడు కింద ఉమ్మడిగా ఉంటూ, వ్యాపారం చేస్తూ, పన్ను భారం పడకుండా, చట్టం దృష్టిలో 'మంచి కుటుంబం'గా పేరు పడ్డ అయ్యర్ కథే.. ట్యాక్స్ ప్లానింగ్‌కి ప్రేరణ.

పాల్ఘాట్ నుంచి పావలా పట్టుకుని పారిపోయినప్పుడు పరమేశ్వరన్ అయ్యర్ వయస్సు 10 ఏళ్లు. 1960లో హైదరాబాద్‌లో అడుగుపెట్టిన వేళ అయ్యర్‌కి తన స్వశక్తితో పాటు కృషి కూడా తోడు కావడంతో అదృష్టం కలిసి వచ్చింది. ఇడ్లీ, సాంబార్, దోశలు అమ్ముతూ బాగా సంపాదించాడు. ఎకరం పైగా జాగా కొన్నాడు. పెళ్లి, పిల్లలు, అందరూ ఒకే చోట నివాసం... ఒకే పొయ్యి.. ఒకే వంట. ముగ్గురు మగపిల్లలు పిల్లలు తండ్రి మాట విని, వారికి చేదోడు వాదోడుగా ఉంటూ అదే వ్యాపారం కొనసాగిస్తున్నారు. అమ్మాయికి పెళ్లి చేసి అత్తారింటికి పంపించాడు అయ్యర్. అప్పు సొప్పు లేకుండా తనకో ఇల్లు, ముగ్గురు పిల్లలకు తలా ఇల్లు కట్టించాడు. నాలుగు ఇళ్లు.. మెయిన్ రోడ్డుకు పక్కనే వ్యాపారానికి అనువుగా మల్గీలు. అందరివీ క్యాంటీన్లే. ఒక్కొక్కరు ఒక్కో రకం వంటకాలతో ఒకరికొకరు పోటీ కాకుండా, సమిష్టి కృషితో, పాతిక మంది పనివాళ్లతో వ్యాపారం సాగిస్తున్నారు.

ఎవరి వ్యాపారం వారిదే, ఎవరి బ్యాంక్ అకౌంటు, ఎవరి లెక్కలు, ఎవరి పాన్ వారివే. అందరికీ పెళ్లిళ్లయి, చదువుకుంటున్న పిల్లలున్నారు. కార్లు, స్కూటర్లు ఉన్నాయి. అయ్యర్ భార్య పేరు మీద ఆస్తి ఉంది. ఓనర్‌గారికి అయ్యర్, కొడుకులు నెలవారీగా అద్దె ఇస్తుంటారు. ఆవిడదో ప్రత్యేక ఇన్‌కం ట్యాక్స్ అసెస్‌మెంట్. అందరూ బాగానే సంపాదిస్తున్నారు. జీఎస్‌టీ పరిధిలో లేరు. నామమాత్రంగా పన్ను కడతారు. పాత పద్ధతి ప్రకారం అవకాశం ఉన్నన్ని రాయితీలు, తగ్గింపులు, మినహాయింపులు పొందేవారు. ఇప్పుడు కొత్త పన్ను విధానం వైపు మొగ్గు చూపుతున్నారు.

అనుకోని ఆదా ఏమిటంటే, తిండి మీద ఖర్చులు, కుటుంబ పోషణ అంతా క్యాంటీన్ల ఖర్చుతో వెళ్లిపోతుంది. చుట్టాలు పక్కాలకు మర్యాదలకు లోటు ఉండదు. మిగతా ఖర్చులు మాత్రమే చూసుకోవాల్సి ఉంటోంది. కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 50 లక్షలు దాటుతున్నా పన్నుభారం సున్నా .. లేదా అత్యంత కనిష్ఠ స్థాయిలో ఉండేలా చూసుకుంటున్నారు. వాళ్ల ఎరం జాగా, ఇళ్ల విలువ ప్రస్తుతం వంద కోట్లు దాటుతుంది. స్థిరాస్తి చెక్కు చెదరదు. ఆదాయం నిత్య పంట. పుష్కలంగా ఉంటుంది. ఇలా అయ్యర్ కుటుంబం ఉమ్మడిగా ఉంటూ, పన్ను భారం భారీగా పడకుండా చక్కని ఆర్థిక ప్రణాళికలతో మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తోంది.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అన్ని కాలాలకూ అనుకూలం

నిప్పన్ ఇండియా లార్జ్‌క్యాప్ ఫండ్

ఇటీవలి కాలంలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ కంపెనీల విలువలు గణనీయంగా పెరిగిపోవడం, అక్కడి నుంచి అదే తీవ్రతతో దిద్దుబాటుకు గురికావడం చూస్తున్నాం. దీంతో ఇన్వెస్టర్లలో అప్రమత్త ధోరణి నెలకొంది. పోర్ట్‌ఫోలియోలో లార్జ్‌క్యాప్ ప్రాధాన్యాన్ని వారు ఇప్పుడు అర్థం చేసుకుంటున్నారు. స్మాల్, మిడ్‌క్యాప్‌తో పోల్చిచూసినప్పుడు లార్జ్‌క్యాప్ కంపెనీల్లో (మార్కెట్ విలువలో టాప్100 కంపెనీలు) అస్థిరతలు తక్కువ. అంతేకాదు ఆయా రంగాల్లో ఇవి బలమైన కంపెనీలు కూడా. కనుక మొదటిసారి ఇన్వెస్టర్లకు సైతం లార్జ్‌క్యాప్ ఫండ్స్ పెట్టుబడులకు అనుకూలమని నిపుణులు సూచిస్తుంటారు. ఈ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో నిప్పాన్ ఇండియా లార్జ్‌క్యాప్ ఫండ్ ఒకటి.



రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో పెట్టుబడులపై 9 శాతం రాబడిని అందించింది. అదే మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే వార్షిక రాబడి 18 శాతానికి పైనే ఉంది. ఐదేళ్లలో ఏటా 26.64 శాతం, ఏడేళ్లలో 14.91 శాతం, పదేళ్లలో 12.89 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. నిఫ్టీ 100 టీఆర్‌ఐ సూచీ, లార్జ్‌క్యాప్ ఫండ్స్ విభాగం కంటే ఈ పథకమే దీర్ఘకాలంలో మెరుగైన పనితీరు చూపించింది. పదేళ్ల క్రితం ఈ పథకంలో రూ.లక్ష పెట్టుబడి పెట్టి ఉంటే, అది ఇప్పుడు రూ.4.78 లక్షలుగా మారేది. గత పదేళ్లలో ప్రతి నెలా రూ.5,000 చొప్పున సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే, ఆ మొత్తం రూ.15.44 లక్షలు అయ్యేది. గత పదేళ్లలో ఏ ఒక్క ఏడాది ఈ పథకం ప్రతికూల రాబడిని ఇవ్వలేదు. రూ.100 నుంచి ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.



మెరుగైన పనితీరు

మార్కెట్ కరెక్షన్ల సమయాల్లో పెట్టుబడుల విలువ క్షీణతను తక్కువకు పరిమితం చేయడంలో పోటీ పథకాలతో పోల్చితే ఈ పథకం ముందుంది. ఈ పథకం కనీసం 80 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. మిడ్, స్మాల్‌క్యాప్‌లో మంచి అవకాశాలున్నాయని భావించినప్పుడు మిగిలిన పెట్టుబడులను ఆయా విభాగాలకు కేటాయిస్తుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే దిగ్గజాలుగా అవతరించి, వ్యాపారపరంగా బలమైన మూలాలున్న వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. అంతేకాదు, భవిష్యత్‌లో దిగ్గజాలుగా అవతరించే వాటిని గుర్తించి పెట్టుబడులు పెడుతుంది. బలమైన మూలాలున్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడమే కాదు, దీర్ఘకాలం పాటు కొనసాగడం ఈ పథకం మెరుగైన పనితీరుకు కారణాల్లో ఒకటి. మంచి వృద్ధికి అవకాశాలున్న కంపెనీలను సహేతుక విలువల వద్ద గుర్తించి పెట్టుబడి పెడుతుండడాన్ని గమనించొచ్చు.

పోర్ట్‌ఫోలియో చూస్తే...

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 34,212 కోట్లపెట్టుబడులున్నాయి. ఇందులో 98.46 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, కేవలం 1.53 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీల్లోనూ 91 శాతం పెట్టుబడులు లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 8.69 శాతం, స్మాల్‌క్యాప్‌లో 0.26 శాతమే పెట్టుబడులు కలిగి ఉంది. మిడ్, స్మాల్ క్యాప్ విలువలు అధిక స్థాయిలకు చేరడంతో ఈ విభాగాలకు పెట్టుబడులను తక్కువకు పరిమితం చేసినట్టు తెలుస్తోంది. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో అత్యధికంగా 36 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఇంధన రంగ కంపెనీల్లో 12.34 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 11.23 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 11 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.59
రిలయన్స్ ఇండస్ట్రీస్	6.33
ఐసీఐసీఐ బ్యాంక్	5.98
యాక్సిస్ బ్యాంక్	4.89
బజాజ్ ఫైనాన్స్	4.24
ఎల్అండ్‌టీ	3.88
ఇన్ఫోసిస్	3.61
ఎస్‌బీఐ	3.56
ఎన్‌టీపీసీ	2.61
టీసీఎస్	2.55

వెల్‌డన్ వెర్‌స్టాపెన్

వరుసగా నాలుగోసారి జపాన్ గ్రాండ్‌ప్రిలో టైటిల్ సొంతం
ఈ సీజన్‌లో తొలి విజయం దక్కించుకున్న రెడ్‌బుల్ డ్రైవర్



ఆధిక్యంలో వెర్‌స్టాపెన్



సుజుకా (జపాన్): ఫార్ములావన్ తాజా సీజన్‌లో తొలి రెండు రేసుల్లో మెక్‌లారెన్ ఇద్దరు డ్రైవర్లను దాటి ముందుకెళ్లడంలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ సఫలం కాలేకపోయాడు. కానీ మూడో రేసులో మాత్రం వెర్‌స్టాపెన్ జోరును అడ్డుకోవడంలో మెక్‌లారెన్ ఇద్దరు డ్రైవర్లు విఫలమయ్యారు. వెరసి ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లోని మూడో రేసులోనూ మూడో విజేత అవతరించాడు. సీజన్ మొదటి రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్... సీజన్ రెండో రేసు చైనా గ్రాండ్‌ప్రిలో మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి టైటిల్స్ సాధించారు. ఆదివారం జరిగిన సీజన్ మూడో రేసు జపాన్ గ్రాండ్‌ప్రిలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ పూర్తి ఆధిపత్యం చలాయించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో తనకెంతో కలిసొచ్చిన సుజుకా సర్క్యూట్‌లో వరుసగా నాలుగో ఏడాది జపాన్ గ్రాండ్‌ప్రి టైటిల్‌ను దక్కించుకున్నాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 53 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 22 నిమిషాల 06.983 సెకన్లలో ముగించి చాంపియన్‌గా నిలిచాడు. 2022, 2023, 2024 జపాన్ గ్రాండ్‌ప్రి రేసుల్లో వెర్‌స్టాపెన్‌కే అగ్రస్థానం దక్కింది. మెక్‌లారెన్ డ్రైవర్లు లాండో నోరిస్ రెండో స్థానంలో, ఆస్కార్ పియాస్ట్రి మూడో స్థానంలో నిలిచారు. రెడ్‌బుల్ తరఫున తొలిసారి ప్రధాన డ్రైవర్‌గా వ్యవహరించిన జపాన్‌కు చెందిన యుకీ సునోడా 12వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. గత సీజన్‌లో ఆరంభంలో వరుస విజయాలతో అదరగొట్టి ఆ తర్వాత వెనుకబడిపోయిన వెర్‌స్టాపెన్‌కు ఈ ఏడాది తొలి రెండు రేసుల్లో మెక్‌లారెన్ నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. దాంతో వెర్‌స్టాపెన్ ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో రెండో స్థానంలో, చైనా గ్రాండ్‌ప్రిలో నాలుగో స్థానంలో నిలిచాడు. కానీ గత నాలుగేళ్లు ఫార్ములావన్‌లో ఓవరాల్ టైటిల్ సాధించిన వెర్‌స్టాపెన్ మూడో రేసులో మాత్రం వెనుకంజ వేయలేదు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన అతను దూసుకుపోయాడు. ఒక్కసారి వెర్‌స్టాపెన్ ఆధిక్యంలోకి వెళితే అతడిని ఓవర్‌టేక్ చేయడం కష్టంతో కూడుకున్నదని మెక్‌లారెన్ డ్రైవర్లకు తెలుసు. జపాన్ గ్రాండ్‌ప్రిలో అదే జరిగింది. మొదట్లోనే ఆధిక్యంలోకి వెళ్లిన వెర్‌స్టాపెన్ చివరి ల్యాప్ వరకు ఆధిక్యంలో కొనసాగి రెండు సెకన్ల తేడాతో విజేతగా నిలిచాడు.

జపాన్ గ్రాండ్‌ప్రి ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:22:06.983	-	25
2	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:22:08.406	1.423 సెకన్లు	18
3	ఆస్కార్ పియాస్ట్రి	మెక్‌లారెన్	1:22:09.112	2.129 సెకన్లు	15
4	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	1:22:23.080	16.097 సెకన్లు	12
5	జార్జి రసెల్	మెర్సిడెస్	1:22:24.345	17.362 సెకన్లు	10
6	కిమీ ఆంటోనెలి	మెర్సిడెస్	1:22:25.654	18.671 సెకన్లు	8
7	లూయిస్ హామిల్టన్	ఫెరారీ	1:22:36.165	29.182 సెకన్లు	6
8	ఇసాక్ హద్జార్	రేసింగ్ బుల్స్	1:22:44.117	37.134 సెకన్లు	4
9	అలెగ్జాండర్ అల్బోన్	మసీగ్రామ్ హాస్	1:22:47.350	40.367 సెకన్లు	2
10	ఒలివెర్ బేర్మన్	మసీగ్రామ్ హాస్	1:23:01.512	54.529 సెకన్లు	1

పాయింట్ తేడానే...

24 రేసులతో కూడిన తాజా సీజన్‌లో మూడు రేసులు ముగిశాక లాండో నోరిస్ 62 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 61 పాయింట్లతో వెర్‌స్టాపెన్ రెండో స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి మధ్య తేడా ఒక్క పాయింట్ మాత్రమే ఉండటం గమనార్హం. సీజన్‌లోని తదుపరి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి ఈనెల 13న జరుగుతుంది.

64 ఫార్ములావన్ చరిత్రలో వెర్‌స్టాపెన్ సాధించిన విజయాలు. అత్యధిక రేసుల్లో గెలిచిన డ్రైవర్ల జాబితాలో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నాడు. లూయిస్ హామిల్టన్ (105), మైకేల్ షుమాకర్ (91) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

4 రెండు వేర్వేరు గ్రాండ్‌ప్రి రేసులను వరుసగా నాలుగేళ్ల పాటు సాధించిన నాలుగో డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ గుర్తింపు పొందాడు. వెర్‌స్టాపెన్ అబుదాబి (2020, 2021, 2022, 2023), జపాన్ గ్రాండ్‌ప్రి (2022, 2023, 2024, 2025) రేసులలో ఈ ఘనత సాధించాడు. ఈ జాబితాలో జిమ్ క్లార్క్ (బెల్జియం గ్రాండ్‌ప్రి; బ్రిటన్ గ్రాండ్‌ప్రి 1962-1965), మైకేల్ షుమాకర్ (స్పెయిన్ గ్రాండ్‌ప్రి 2001-2004 ; యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి 2003-2005), లూయిస్ హామిల్టన్ (బ్రిటన్ గ్రాండ్‌ప్రి 2001-2004 ; యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి 2014-2017) కూడా ఉన్నారు.

ఐఎస్‌ఎల్ ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీ

మడ్‌గావ్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రీ సారథ్యంలోని బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు రికార్డు స్థాయిలో నాలుగోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన రెండో అంచె సెమీఫైనల్లో బెంగళూరు జట్టు 1-2 గోల్స్ తేడాతో గోవా ఫుట్‌బాల్ క్లబ్ చేతిలో ఓడినప్పటికీ... ఓవరాల్‌గా ఎక్కువ గోల్స్ చేసి తుదిపోరుకు అర్హత సాధించింది. బెంగళూరు తరఫున సునీల్ ఛెత్రీ (90+2వ నిమిషంలో) ఆట ఆఖర్లో ఏకైక గోల్ సాధించగా... గోవా జట్టు తరఫున బోర్జా హరేరా (49వ నిమిషంలో), అర్మాండో సాడికు (88వ నిమిషంలో) చెరో గోల్ కొట్టారు. ఇరు జట్ల మధ్య బుధవారం జరిగిన తొలి అంచె సెమీఫైనల్లో బెంగళూరు జట్టు 2-0 గోల్స్ తేడాతో గోవాపై విజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల్లో కలిపి బెంగళూరు జట్టు 3 గోల్స్ సాధించగా... గోవా జట్టు 2 గోల్స్‌కే పరిమితమైంది. దీంతో ఛెత్రీ సారథ్యంలోని బెంగళూరు 3-2తో ముందంజ వేసింది. నేడు జంషెడ్‌పూర్, మోహన్ బగాన్ జట్ల మధ్య రెండో అంచె సెమీఫైనల్ పోటీ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో శనివారం ఫైనల్లో బెంగళూరు తలపడుతుంది.

ఐ-లీగ్ చాంపియన్ చర్చిల్ బ్రదర్స్ ఎఫ్‌సీ



న్యూఢిల్లీ: ఐ-లీగ్ 2024-2025 సీజన్‌లో గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది. రియల్ కశ్మీర్ ఫుట్‌బాల్ క్లబ్‌తో ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌ను 1-1 గోల్స్‌తో 'డ్రా' చేసుకున్న చర్చిల్ బ్రదర్స్ జట్టు 40 పాయింట్లతో అగ్రస్థానంతో లీగ్‌ను ముగించింది. తాజా సీజన్‌లో 22 మ్యాచ్‌లాడిన చర్చిల్ బ్రదర్స్ జట్టు 11 విజయాలు, 4 పరాజయాలు, 7 'డ్రా'లు నమోదు చేసుకుంది. ఈ క్రమంలో మొత్తం 45 గోల్స్ చేసిన ఆ జట్టు... ప్రత్యర్థులకు 25 గోల్స్ ఇచ్చుకుంది. శ్రీనగర్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో చర్చిల్ బ్రదర్స్ జట్టు తరఫున రఫీఖ్ అమిను (50వ నిమిషంలో) ఏకైక గోల్ కొట్టగా... రియల్ కశ్మీర్ జట్టు తరఫున రామ్‌సంగ ట్లైచున్ (8వ నిమిషంలో) గోల్ చేశాడు. ఆదివారమే జరిగిన మరో మ్యాచ్‌లో ఇంటర్ కాశీ జట్టు 3-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇంటర్ కాశీ జట్టు 22 మ్యాచ్‌లాడి 11 విజయాలు, 5 పరాజయాలు, 6 'డ్రా'లతో 39 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.

ఏఐఎఫ్‌ఎఫ్ నిర్ణయంపై ఉత్కంఠ

ఐ-లీగ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే అర్హత సాధిస్తుంది. ప్రస్తుతానికి చర్చిల్ బ్రదర్ జట్టు 'టాప్'లో ఉన్నప్పటికీ... సీజన్‌లో భాగంగా జనవరి 13న నామ్‌ధారి స్పోర్ట్స్ క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో అర్హత లేని ఆటగాడిని బరిలోకి దింపారని ఇంటర్ కాశీ జట్టు ఆరోపించింది. ఈ అంశంపై అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ఈ నెల 28న విచారణ చేపట్టనుంది. ఒకవేళ నిర్ణయం ఇంటర్ కాశీకి అనుకూలంగా వస్తే... మరో 3 పాయింట్లు వారి ఖాతాలో చేరనున్నాయి. అప్పుడు ఆ జట్టు 42 పాయింట్లతో పట్టిక అగ్రస్థానానికి చేరనుంది. ఆదివారమే జరిగిన మరో మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్ 4-3 గోల్స్ తేడాతో గోకులం కేరళ జట్టుపై గెలుపొందింది.

శ్రీనిధి డెక్కన్ జట్టుకు తొమ్మిదో స్థానం

మొత్తం 12 జట్లు పోటీపడ్డ ఐ-లీగ్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ 9వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సీజన్‌లో 22 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 7 విజయాలు, 8 పరాజయాలు, 7 'డ్రా'లతో 28 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. 2021-2022 సీజన్‌లో మూడో స్థానం, 2022-2023 సీజన్‌లో రెండో స్థానం, 2023-2024 సీజన్‌లో రెండో స్థానం పొందిన శ్రీనిధి డెక్కన్ జట్టు ఈసారి మాత్రం నిరాశపరిచింది.

బుమ్రా X బెంగళూరు



బుమ్రా



బెంగళూరు జట్టు

గాయం నుంచి కోలుకున్న ముంబై స్టార్ పేసర్
- రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో నేడు ముంబై ఇండియన్స్ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో మరో కీలక సమరానికి రంగం సిద్ధమైంది. ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో పోరుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఐపీఎల్ టైటిల్ సాధించలేకపోయిన ఆర్‌సీబీ... ఈసారి ఆరంభం నుంచే మంచి ప్రదర్శన చేస్తుంటే... మరోవైపు లీగ్‌లో ఘన చరిత్ర ఉన్న ముంబై ఇండియన్స్ పడుతూ లేస్తూ సాగుతోంది. బెంగళూరు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట గెలవగా... హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై ఇండియన్స్ నాలుగు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క దాంట్లోనే విజయం సాధించింది. బ్యాటర్ల వైఫల్యం ముంబైని ఇబ్బంది పెడుతున్నా... స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనంతో జట్టు బలం రెట్టింపైంది. సోమవారం మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని ముంబై కోచ్ జయవర్ధనే వెల్లడించడంతో... ఇది బెంగళూరు బ్యాటింగ్‌కు బుమ్రా బౌలింగ్‌కు మధ్య సమరంగా మారిపోయింది. మరోవైపు తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి జోరు కనబర్చిన ఆర్‌సీబీ... చివరి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓడింది. తిరిగి గెలుపు బాటపట్టాలని బెంగళూరు ఎదురు చూస్తోంది.

బ్యాటర్లు రాణిస్తేనే...

ముంబై ఇండియన్స్ ప్రధాన బలమైన స్టార్ బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నారు. 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ప్రభావం చూపలేకపోగా... హైదరాబాద్ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోతున్నాడు. నాలుగు మ్యాచ్‌ల్లో కలిసి ముంబై జట్టు తరఫున ఇప్పటి వరకు కేవలం రెండే అర్ధశతకాలు నమోదయ్యాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సూర్యకుమార్ యాదవ్, రికెల్టన్ చెరో హాఫ్ సెంచరీ చేశారు. ప్రాక్టీస్‌లో గాయం కారణంగా లక్నోతో మ్యాచ్‌లో బరిలోకి దిగని రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. తాజా సీజన్‌లో 177 పరుగులు చేసిన సూర్యకుమార్ అదే ప్రదర్శన కొనసాగించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో ఫర్వాలేదనిపిస్తున్నా... బ్యాటింగ్‌లో మరింత ధాటిగా ఆడాల్సిన అవసరముంది. లక్నోతో పోరులో వికెట్లు చేతిలో ఉన్నా... భారీ షాట్లు ఆడలేక ఇబ్బంది పడిన ముంబై... ప్రాక్టీస్‌లో తమ లోపాలపై దృష్టి పెట్టింది. బౌల్ట్, పాండ్యా, అశ్వని కుమార్, దీపక్ చాహర్, విఘ్నేశ్ పుతుర్ రూపంలో ముంబైకి మెరుగైన బౌలింగ్ దళమే ఉంది. బుమ్రా రాకతో ముంబై బౌలింగ్ దళం మరింత పటిష్టమైంది.

కోహ్లిపైనే భారం...

ఐపీఎల్ ఆరంభం నుంచి ఒకే ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తున్న విరాట్ కోహ్లిపైనే బెంగళూరు ఎక్కువగా ఆధార పడుతోంది. సీజన్ ఆరంభ పోరులో అర్ధశతకంతో ఆకట్టుకున్న విరాట్... ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేకపోతున్నాడు. మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ నుంచి మరింత బాధ్యతాయుత ఇన్నింగ్స్ రావాల్సి ఉంది. మిడిలార్డర్‌లో కెప్టెన్ రజత్ పాటీదార్‌తో పాటు దేవదత్ పడిక్కల్ ప్రభావం చూపలేకపోతున్నారు. వీరిద్దరు నిలకడ కనబర్చాల్సిన అవసరముంది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ మంచి టచ్‌లో ఉండగా... కృనాల్ పాండ్యా అటు బంతితో, ఇటు బ్యాట్‌తో రాణించాల్సిన అవసరముంది. గతంలో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన టిమ్ డేవిడ్ ఈ మ్యాచ్‌లో కీలకం కానున్నాడు. ఇక బౌలింగ్ విషయానికి వస్తే గత సీజన్‌లతో పోల్చుకుంటే బెంగళూరు బౌలింగ్ దళం ఈసారి బలంగా కనిపిస్తోంది. ఆస్ట్రేలియా పేసర్ హాజల్‌వుడ్‌తో పాటు ఐపీఎల్‌లో అపార అనుభవమున్న భువనేశ్వర్, యశ్ దయాళ్ పేస్ భారాన్ని మోయనున్నారు. లివింగ్‌స్టోన్, రసిక్ సలామ్‌తో కలిసి కృనాల్ పాండ్యా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు.



వసంతం వేళ చెర్రీ బ్లోసమ్ సీజన్ ప్రారంభ వేడుకను పురస్కరించుకుని జనం వీధుల్లోకి వచ్చి పండుగ చేసుకున్నారిలా. జర్మనీలోని బాన్ పట్టణం ఆదివారం ఇందుకు వేదికయింది.



శ్రీలంకలో పర్యటన సందర్భంగా ఆదివారం ఆ దేశ అధ్యక్షుడు దిస్సనాయకేతో కలిసి ప్రధాని మోదీ అనురాధపురలోని చారిత్రక ప్రాముఖ్యమున్న జయ శ్రీమహా బోధి వృక్షాన్ని సందర్శించుకుని, పూజలు చేశారు.

అతి స్క్రీన్‌టైమ్‌తో అధిక కుంగుబాటు!

టీనేజీ అమ్మాయిల డిప్రెషన్‌కు స్క్రీన్‌టైమ్‌కు మధ్య సంబంధం

- పరిశోధనలో వెల్లడి

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, టెలివిజన్, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్... స్క్రీన్ ఏదైనా సరే ఎక్కువ సమయం చూడటం పిల్లల్లో సమస్యలను పెంచుతోంది. ప్రత్యేకంగా టీనేజీ అమ్మాయిలు ఎక్కువగా దీని దుష్పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఉందని తాజా అధ్యయనంలో తేలింది. అతిగా స్క్రీన్ చూసే టీనేజీ అమ్మాయిలు కుంగుబాటు బారిన పడే అవకాశాలు ఎక్కువ అవుతాయని తాజా పరిశోధన తేల్చిచెప్పింది. టీనేజ్ అమ్మాయిల్లో మానసిక అనారోగ్యానికి, అధిక స్క్రీన్‌టైమ్‌కు మధ్య సంబంధం ఉందని అధ్యయనం చెబుతోంది. ఎక్కువసేపు స్క్రీన్ చూస్తే ఆ మేరకు నిద్ర తగ్గిపోతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. తక్కువ నిద్ర కారణంగా వారిలో ఉద్రేకం ఎక్కువ అవుతుందని, తర్వాత నిరాశ, నిస్పృహలు ఆవహిస్తున్నాయని స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. 12 నుంచి 16 ఏళ్ల వయసు ఉన్న 4,810 మంది టీనేజీ అమ్మాయిలపై ఈ పరిశోధనా బృందం ఒక అధ్యయనం చేసింది. ఈ పరిశోధన తాలూకు వివరాలు 'పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనలో భాగంగా సంబంధిత విద్యార్థులు రోజూ ఎంత సమయం డిజిటల్ ఉపకరణాల స్క్రీన్‌లను చూస్తున్నారు? వారు ఎంత సమయం నిద్రపోతున్నారు?. ఎంత గాఢమైన నిద్రలోకి జారుకుంటున్నారు?. వారిలో ఈకాలంలో ఏమేరకు నిస్పృహకు లోనయ్యారు? నిస్పృహ లక్షణాలు తదితరాలను సేకరించారు. స్క్రీన్ టైమ్ పెరిగిన కాలంలో మూడు నెలల్లోనే నిద్ర నాణ్యత బాగా తగ్గిపోయింది. నిద్రపోయే సమయం తగ్గిపోయింది. నిద్రను కొన్ని నిమిషాలపాటు వాయిదా వేయడం మొత్తం జీవగడియారం పనితీరుపైనా ప్రభావం చూపుతోంది. అధిక స్క్రీన్ టైమ్ అబ్బాయిలను 12 నెలల తర్వాత ప్రభావితం చేస్తోంది. అమ్మాయిల్లో స్క్రీన్‌టైమ్‌కు, నిద్రాభంగానికి, డిప్రెషన్‌కు అవినాభావ సంబంధం ఉందని తేలింది. టీనేజీ అమ్మాయిల్లో స్క్రీన్‌టైమ్‌కు, డిప్రెషన్‌కు మధ్య అవినాభావ సంబంధంలో నిద్ర దాదాపు 38 నుంచి 57 శాతం ప్రముఖ పాత్ర పోషిస్తోందని వెల్లడైంది. స్క్రీన్ చూసిన అబ్బాయిల్లో నిద్రాభంగం అధికంగా ఉంది. కానీ ఈ నిద్రాభంగం వారి మానసిక ఆరోగ్యంపై పెద్దగా ప్రభావం చూపడం లేదని పరిశోధకులు చెప్పారు. 2024 సెప్టెంబర్‌లోనే స్వీడిష్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ టీనేజర్ల స్క్రీన్‌టైమ్‌పై ఆంక్షలు విధించడం తెల్సిందే.

యూకే అణు జలాంతర్గాములపై రష్యా నిఘా!

రహస్య పరికరాలను గుర్తించిన యూకే అధికారులు

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) అణు జలాంతర్గాములపై రష్యా ప్రత్యేకంగా నిఘా పెట్టిందా? సముద్రంలో వాటి కదలికలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి రహస్యంగా సెన్సార్లు ఏర్పాటు చేసిందా? అవుననే అంటున్నాయి అంతర్జాతీయ మీడియా కథనాలు. యూకే చుట్టుపక్కల ఉన్న సముద్ర జలాల్లో కొన్ని సెన్సార్ పరికరాలను బ్రిటిష్ రాయల్ నేవీ గుర్తించినట్లు సమాచారం. రష్యా తమ అణు జలాంతర్గాములపై నిఘా పెట్టినట్లు యూకే ఆరోపిస్తోంది. తమకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నట్లు రష్యాపై ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. తమ అయుధ సంపత్తిని దెబ్బతీయాలన్నదే రష్యా ప్రయత్నంగా కనిపిస్తున్నట్లు అనుమానం వ్యక్తంచేస్తోంది. ఈ పరిణామాన్ని దేశ భద్రతకు ముప్పుగా సైనికాధికారులు అభివర్ణించారు. అట్లాంటిక్ మహా సముద్రంలో యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయని, రష్యా కార్యకలాపాలు అసాధారణ రీతిలో పెరిగిపోయాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు. రష్యా అధినేత పుతిన్ చేపట్టిన గ్రేజోన్ యుద్ధ వ్యూహంలోనే భాగంగానే తమ అణు జలాంతర్గాములను రష్యా టార్గెట్ చేసుకున్నట్లుగా యూకే అధికారులు అనుమానిస్తున్నారు. సముద్ర గర్భంలోని రహస్య కేబుల్స్‌తోపాటు పైప్‌లైన్లు, కీలక పరికరాలను ధ్వంసం చేయడం ద్వారా పరోక్ష యుద్ధం సాగించడమే గ్రేజోన్ వ్యూహం. ఇది ఇటీవలి కాలంలో మరింత ఉధృతమైందని చెబుతున్నారు. గత 15 నెలల వ్యవధిలో బాల్టిక్ సముద్రంలో 11 డీప్–సీ కమ్యూనికేషన్ కేబుల్స్ ధ్వంసమయ్యాయి. సముద్ర గర్భంలోని తమ మౌలిక సదుపాయాలను రక్షించుకోవడానికి కృషి చేస్తున్నామని యూకే అధికారులు అంటున్నారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగినప్పటి నుంచి బ్రిటన్–రష్యా మధ్య పిల్లి, ఎలుక తరహాలో పోరాటం జరుగుతూనే ఉంది. అది ఇటీవలి కాలంలో మరింత ఉధృతమైందని యూకే నిపుణులు అంటున్నారు.

టారిఫ్‌ల సునామీ నుంచి రక్షణ కల్పిస్తాం

యూకే వ్యాపారవేత్తలకు ప్రధాని స్టార్మర్ హామీ

లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాల సునామీ నుంచి యూకే వ్యాపారాలకు రక్షణ కల్పిస్తామని బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ప్రకటించారు. ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం మనకే కాదు, ప్రపంచ దేశాలన్నిటిపైనా ఉందన్న స్టార్మర్.. ఇటువంటి వాణిజ్య యుద్ధంలో విజేతలెవరూ ఉండరంటూ వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్యం సమతూకంలోనే ఉన్నప్పటికీ మరింత మెరుగైన వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు. వ్యాపారాలకు రక్షణ కల్పించడం వంటి అనే చర్యలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయంటూ 'సండే టెలిగ్రాఫ్'కు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ట్రంప్ విధించిన దిగుమతి సుంకాలతో తీవ్రంగా నష్టపోయిన దేశాల్లో బ్రిటన్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో కెయిర్ స్టార్మర్ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మార్కెట్‌ను ప్రభావితం చేసేందుకు నేరుగా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం తెలివైన పని కాదని తెలిసినా, వేగంగా మారుతున్న ప్రతికూల పరిస్థితుల్లో చూస్తూ ఉండలేమని పేర్కొన్నారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీంలో మరో పిటిషన్

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ)చట్టం–2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఈ చట్టాన్ని మతపరమైన అంశాల్లో సొంత వ్యవహారాలను నిర్వహించుకునే మతపరమైన వర్గం హక్కుల్లో స్పష్టమైన చొరబాటుగా పేర్కొంటూ సమస్త కేరళ జమియతుల్ ఉలేమా పిటిషన్ వేసింది. ఇప్పటికే ఈ చట్టంపై పలు పిటిషన్లు దాఖలవ్వడం తెల్సిందే. వక్ఫ్ చట్టానికి తీసుకువచ్చిన సవరణల ఫలితంగా వక్ఫ్‌ల మతపరమైన లక్షణాన్ని పలచన చేసినట్లయిందని అందులో తెలిపింది. అంతేకాదు, వక్ఫ్, వక్ఫ్ బోర్డుల పరిపాలనలో ప్రజాస్వామ్య ప్రక్రియకు ఈ చట్టం విఘాతం కలిగించేలా ఉందని ఆరోపించింది. ఈ చట్టం చట్టబద్ధతను ప్రశ్నిస్తూ ఇప్పటికే కాంగ్రెస్ ఎంపీ జావెద్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లాఖాన్ సుప్రీంలో పిటిషన్లు వేయడం తెల్సిందే.

నందిగ్రామ్‌లో అయోధ్య తరహా ఆలయం

సాక్షి, న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లాలో అయోధ్య రామాలయం తరహాలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా నందిగ్రామ్‌లోని సోనాచురా గ్రామంలో ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామం కాషాయమయం అయింది. ఈ గ్రామం భూసేకరణ ఉద్యమంతో ముడిపడి ఉంది. 2007లో వామపక్ష ప్రభుత్వ పాలనలో టీఎంసీ సారథ్యంలో దీర్ఘకాలం కొనసాగిన భూసేకరణ ఉద్యమానికి ఈ గ్రామం వేదికగా నిలిచింది. ఆందోళన సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు గ్రామస్తులు ప్రాణాలు కోల్పోయారు. కాగా, ఆదివారం రామనవమి సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పలు చోట్ల ర్యాలీలు నిర్వహించింది. హౌరాలోని అంజనీ పుత్ర సేన రామనవమి ఊరేగింపులో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ పాల్గొన్నారు. కోల్‌కతాలోని న్యూ టౌన్ ప్రాంతంలో లాకెట్ ఛటర్జీ నేతృత్వంలో మరో భారీ ర్యాలీ జరిగింది.

11 మంది జాలర్లను విడిచిపెట్టిన శ్రీలంక

కొలంబో: శ్రీలంక ఆదివారం 11 మంది భారతీయ మత్స్యకారులను విడుదల చేసింది. రెండు దేశాల మధ్య ఇబ్బందికరంగా పరిణమించిన మత్స్యకారుల అంశాన్ని మానవీయ దృక్పథంలో పరిష్కరించుకుందామంటూ శ్రీలంక పర్యటనలో ఉన్న భారత ప్రధాని మోదీ చర్చల సమయంలో ఆ దేశ అధ్యక్షుడు దిస్సనాయకేకు తెలిపిన నేపథ్యంలో ఈ సానుకూలమైన పరిణామం చోటుచేసుకుంది. స్వాధీనం చేసుకున్న జాలర్ల పడవలను సైతం విడిచిపెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రెండు దేశాలను విడదీసే ఇరుకైన పాక్ జలసంధిలో వేటకు వెళ్లిన భారతీయ మత్స్యకారులను శ్రీలంక నేవీ తరచూ నిర్బంధంలోకి తీసుకోవడం తెల్సిందే.

మరో 39 మంది పాలస్తీనియన్లు మృత్యువాత

డెయిర్ అల్–బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగుతున్నాయి. ఖాన్ యూనిస్ సహా పలు ప్రాంతాలపై ఆదివారం జరిగిన దాడుల్లో కనీసం 39 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో కనీసం డజను మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. ఖాన్ యూనిస్‌లోని ఓ నివాస భవనంతోపాటు టెంట్‌పై జరిగిన దాడుల్లో ఐదుగురు చొప్పున మహిళలు, చిన్నారులు, పురుషులు ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం తెలిపింది. వీరిలో ఒక మహిళా జర్నలిస్ట్ కూడా ఉన్నారు. ఇంకా..తుఫ్ఫాహ్‌లో 10 మంది, డెయిర్ అల్–బలాహ్ లో 8 మంది, గాజా నగరం శివారుల్లోని జెటౌన్‌లో ఇద్దరు, జబాలియాలో నలుగురు పాలస్తీనియన్లు ఉన్నారని వివరించింది. హమాస్ సాయుధ గ్రూపును కాల్పుల విరమణకు అంగీకరించేలా ఒత్తిడి చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడులు జరుపుతున్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే గాజా ప్రాంతానికి ఆహారం, ఇంధన, ఇతర మానవీయ సాయం అందకుండా ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధించింది.

నకిలీ డాక్టర్ నిర్వాకానికి ఏడుగురు బలి

- లండన్ కార్డియాలజిస్టుగా చెప్పుకుంటూ సర్జరీలు
- మధ్యప్రదేశ్‌లో దారుణం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దామోహ్ పట్టణంలో నకిలీ వైద్యుడి నిర్వాకానికి ఏడుగురు రోగులు బలయ్యారు. డాక్టర్ ఎన్.జాన్ కెమ్ అనే వ్యక్తి తాను లండన్‌లో కార్డియాలిస్టుగా పనిచేశానని చెప్పుకుంటూ జనాన్ని నమ్మించాడు. తనకు ఫారిన్ మెడికల్ డిగ్రీలు ఉన్నాయని, లండన్‌లోని సెయింట్ జార్జి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నానని చెప్పాడు. దామోహ్ పట్టణంలో తిష్టవేశాడు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు అతడిని ఆశ్రయించారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఓ మిషనరీ ఆసుపత్రిలో 15 మంది రోగులకు సర్జరీలు చేశాడు. వారిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా, కనీసం పోస్టుమార్టం చేయకుండా మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా వారి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. సర్జరీ పేరిట జాన్ కెమ్ భారీగానే ఫీజులు వసూలు చేశాడు. ఈ మొత్తం ఉదంతంపై దామోహ్‌కు చెందిన దీపక్ తివారీ జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ)తోపాటు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశాడు. డాక్టర్ జాన్ కెమ్ అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని తేలింది. అతడిపై, ఆసుపత్రి యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని దీపక్ తివారీ డిమాండ్ చేశాడు.

సెయింట్ పీటర్ స్క్వేర్‌లో పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ: పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్ స్క్వేర్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. రోగులు, ఆరోగ్య సిబ్బంది కోసం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఆదివారం ప్రత్యేక జూబిలీ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ చక్రాల కుర్చీలో అక్కడికి చేరుకున్నారు. అక్కడ చేరిన వారివైపు చేతులు ఊపుతూ ముందుకు సాగారు. రెండు వారాల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత బయట కనిపించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఎటువంటి ముందస్తు ప్రకటన లేకుండానే ఆయన కనిపించడంతో అక్కడ చేరిన వారంతా సంతోషం వ్యక్తం చేశారు. తన వద్ద ఉన్న మైక్రోఫోన్ ద్వారా 'గుడ్ సండే టు ఎవ్రీవన్'అంటూ పలకరించిన ఆయన మైక్‌ను తట్టి అది సరిగ్గానే పనిచేస్తున్నది నిర్ధారించుకున్నాక మరోసారి స్పష్టమైన స్వరంతో 'థాంక్యూ వెరీమచ్'అంటూ చక్రాల కుర్చీలో వేదిక దిశగా ముందుకు సాగారు. అనంతరం ఆయన తరఫున ఆర్చ్‌బిషప్ రినో ఫిసిచెల్లా సందేశాన్ని చదివి వినిపించారు. వివిధ ఆరోగ్య సంబంధ సమస్యలతో దాదాపు ఐదు వారాలపాటు గెమెల్లి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందడం తెల్సిందే. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ నుంచి బయటపడేందుకు వైద్యులు ఇప్పటికీ ఆయనకు చికిత్స కొనసాగిస్తున్నారు.

పెద్ద రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నిక ఆ తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎంపిక

బీజేపీ అధిష్టానం యోచన

న్యూఢిల్లీ: కాషాయ దళం జాతీయ అధ్యక్షుడి ఎంపిక మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ముందుగా కీలకమైన పెద్ద రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను నియమించాలని అధిష్టానం యోచిస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో సాధ్యమైనంత త్వరగా పార్టీ అధ్యక్షుల ఎంపికను పూర్తి చేసి, గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించిన జాతీయ స్థాయి సభ్యత్వ నమోదుతో ప్రారంభించిన సంస్థాగత ప్రక్రియను పరిపూర్ణం చేయాలని అగ్ర నాయకత్వం ఆలోచిస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాతే జాతీయ అధ్యక్షుడి విషయం ఆలోచించాలనుకుంటోంది. జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ చేపట్టే సమయానికి కేంద్ర పాలిత ప్రాంతాలు సహా సగానికి పైగా రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని బీజేపీ రాజ్యాంగం చెబుతోంది. అంటే, కనీసం 19 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను కొత్తగా నియమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీజేపీకి 37 సంస్థాగత రాష్ట్రాలున్నాయి. కాగా, గతేడాది సెప్టెంబర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రకటించిన అధిష్టానం.. ఈ ఏడాది జనవరి–ఫిబ్రవరి కల్లా జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నికను పూర్తి చేయాలని భావించింది. పలు పెద్ద రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షుల ఎంపికలో ఏకాభిప్రాయం సాధించడం, ఆర్ఎస్ఎస్ వంటి సైద్ధాంతిక విభాగాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అధిష్టానం భావించడంతో జాతీయ అధ్యక్షుడి ఎంపిక వ్యవహారం దాదాపుగా స్తంభించిపోయింది. యూపీ, మధ్యప్రదేశ్‌ల్లో భూపేంద్ర సింగ్, వీడీ శర్మ స్థానాల్లో మరొకరిని ఎంపిక చేయడం, కర్ణాటకలో బీవై విజయేంద్రనే కొనసాగించాలని నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యమైంది. అంతేకాదు, గుజరాత్, ఒడిశా, పంజాబ్ వంటి రాష్ట్రాల పార్టీ అధ్యక్షులను అధిష్టానం ఇప్పటికీ ఎంపిక చేయలేకపోయింది.

చీతాల దాహార్తి తీర్చినందుకు ఉద్యోగానికి ఎసరు!

భోపాల్: వేటాడి అలసిపోయిన చీతా కుటుంబం దాహార్తి తీర్చాడో గ్రామస్తుడు. అంతకుముందు, అదే గ్రామానికి చెందిన కొందరు ఆ చీతాలపై రాళ్లు రువ్వారు. మనుషులకు, జంతువులకు మధ్య సంబంధాల్లో జరుగుతున్న మార్పులకు ఇదో ఉదాహరణ. అయితే, చీతాల దాహార్తి తీర్చిన ఆ గ్రామస్తుడు అధికారుల ఆగ్రహానికి గురై తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఈ ఘటన చోటుచేసుకుంది. కునో సరిహద్దులకు సమీపంలోని అగ్రా రేంజ్‌లోని ఓ గ్రామ సమీపంలో ఓ వ్యక్తి క్యాన్‌తో నీరు తీసుకువచ్చి, ప్లేట్‌లో పోయడం, చీతాలు దాహార్తి తీర్చుకుంటున్నట్లుగా ఉన్న 40 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వీడియోలో ఉన్నది జ్వాల అనే చీతా, నాలుగు కూనలని తేలింది. విచారణ జరిపిన అధికారులు చీతాలకు నీరందించిన వ్యక్తిని అటవీ శాఖ అద్దెకు తీసుకున్న వాహనం డ్రైవర్, సమీప గ్రామ నివాసి సత్యనారాయణ్ గుర్జార్‌గా గుర్తించారు. చీతాలకు అతి సమీపంలోకి వెళ్లి వాటికి నీటిని అందించడం నిబంధనలకు విరుద్ధమంటూ అతడిని వెంటనే విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 'చీతాలకు దూరంగా ఉండాలని, వాటికి నీరు, ఆహారం వంటివి అందివ్వరాదని ఆ సమీప గ్రామాల్లో ఎప్పటి నుంచో ప్రచారం చేస్తున్నాం. మనుషులకు దగ్గరైతే, అవి నివాసప్రాంతాలకు అతి సమీపంలోకి వస్తుంటాయి. అది ప్రమాదకరం. క్రూర మృగాలతో బంధం పెంచుకోవాల్సిన అవసరం లేదు'అని చీతా ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తమ్ కుమార్ శర్మ వివరించారు. జ్వాల సారథ్యంలో చిరుతలు ఇటీవలి కాలంలో కునో నేషనల్ పార్కు సరిహద్దులకు వెలుపలికి కూడా వచ్చి, వేట సాగిస్తున్నా యని ఆయన తెలిపారు. వాటికి సమీపంలోకి వెళ్ల వద్దని గ్రామస్తులను ఆయన హెచ్చరించారు.

లాక్‌డౌన్‌లోకి కెనడా పార్లమెంట్

ఆగంతకుడు లోపలికి ప్రవేశించడమే కారణం

ఒట్టావా: కెనడా పార్లమెంట్ భవనం శనివారం ఉన్నట్టుండి లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. ఓ వ్యక్తి ఆ భవనంలోకి అనధికారికంగా ప్రవేశించి, రాత్రంతా అక్కడే ఉండడమే ఇందుకు కారణమని పోలీసులు చెప్పారు. పార్లమెంట్ హిల్స్ ఈస్ట్ బ్లాక్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం అతడిని అదుపులోకి తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఆగంతకుడి వద్ద ఏవైనా ఆయుధాలు ఉన్నాయా? అనే తెలియరాలేదు. ఈస్ట్ బ్లాక్‌లో గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించామని పోలీసులు వెల్లడించారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అన్నారు. ఆగంతకుడు ఎవరిపైనా దాడి చేయలేదని వెల్లడించారు. అతడు ఎవరు? ఎలా లోపలికి వచ్చాడు? అతడి ఉద్దేశం ఏమిటి? అతడి వెనుక ఎవరున్నారు? అనే దానిపై దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ మార్చి 23న పార్లమెంట్‌ను రద్దుచేసిన సంగతి తెలిసిందే. మరో ఆరు నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది.

ఎటుచూసినా చెత్తకుప్పలే!

బర్మింగ్‌హామ్‌కు 'చెత్త' సమస్య • పారిశుద్ధ్యకార్మికుల సమ్మెతో విలవిల

బర్మింగ్‌హామ్: బ్రిటన్‌లో రెండో అతిపెద్ద నగరంగా ఘన కీర్తులందుకుంటున్న బర్మింగ్‌హామ్ నగరం ఇప్పుడు చెత్తకంపు కొడుతోంది. నగరంలో ఏ మూలన చూసినా వ్యర్థాల వరద పారుతోంది. పారిశుద్ధ్యకార్మికుల సమ్మెతో నగరవ్యాప్తంగా చెత్తమూటలు గుట్టలు పేరుకుపోయాయి. వాటి కంపుతో నగరవాసుల ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి. దీంతో పురుగుల భరతం పట్టే విల్ టిమ్స్ లాంటి వాళ్లకు రోజూ చేతినిండా పని దొరుకుతోంది. చెత్తకుప్పల నుంచి ఇళ్లలోకి దూసుకొచ్చే పెద్ద ఎలుకలు, బొద్దింకలు, పురుగులను చంపేయడంలో ఇలాంటి పెస్ట్ కంట్రోల్ కార్మికులు ఇప్పుడు చాలా బిజీగా మారిపోయారు. మా ప్రాంతంలో ఎలుకల్ని పట్టండి మహాప్రభో అంటూ రోజూ వాళ్లకు ఫోన్‌చేసే స్థానికుల సంఖ్య పెరిగిపోయింది.

సమ్మెతో మొదలైన సమస్య

అధిక చెల్లింపులు చేయాలన్న డిమాండ్లతో గార్బేజ్ కలెక్టర్లు సమ్మెకు దిగారు. దీంతో 12 లక్షల జనాభా ఉన్న నగరంలో వ్యర్థాల బ్యాగులను తరలించేవాళ్లులేక రోడ్లన్నీ చెత్త కుప్పలకు చిరునామాగా మారాయి. బల్సాల్ హెల్త్ అనే ప్రాంతంలో అయితే చెత్తకుప్పలు ఎన్నో అడుగుల ఎత్తులో పేరుకుపోయి గబ్బు వాసనతో జనాల గుండెల్లో వ్యాధుల గుబులు పుట్టిస్తున్నాయి. చిన్న పిల్లి సైజులో ఉన్న ఎలుకలు అక్కడ సంచరిస్తున్నాయని స్థానికుడు అబిడ్ మీడియా ప్రతినిధులకు చెప్పారు. డస్ట్‌బిన్‌ల నుంచి సమీప ఇళ్లల్లో దూరుతున్న ఎలుకల సంఖ్య ఏకాఎకి పెరిగిపోయింది. దీంతో వీటిని అదుపుచేయడం స్థానిక పెస్ట్‌కంట్రోలర్ల తలకు మించిన భారమైంది. దీంతో సమీప నగరాల్లో తోటి వర్కర్లను ఇక్కడికి రప్పించి సమస్యకు పరిష్కారం వెతికే ప్రయత్నంచేస్తున్నారు.

కోతే కారణమా?

గార్బేజ్ కలెక్టర్లకు అందించాల్సిన జీతభత్యాల్లో కోత పెట్టాలని సిటీ పాలకమండలి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో 400 మంది గార్బేజ్ కలెక్టర్లు సమ్మెబాట పట్టారు. జీతభత్యాలు తగ్గించడం, కొంద మందిని తొలగించడం, మరికొందరి ర్యాంక్‌ను కుదించడం వంటి నిర్ణయాలతో వీళ్లంతా ఆగ్రహంతో ఉన్నారు. సిటీ కౌన్సిల్ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే ఒక్కో వ్యక్తి గరిష్టంగా రూ.8.88 లక్షల వార్షిక వేతనం నష్టపోయే ప్రమాదముంది. దీంతో వీళ్లంతా విధులకు గైర్హాజరై తమ నిరసనను ఇలా వ్యక్తంచేస్తున్నారు.

మూలాలు 2023లో

ఈ సంక్షోభానికి 2023లోనే బీజం పడింది. ఆదాయం తగ్గిపోయి తాము దివాళా తీశామని సిటీ కౌన్సిల్ 114 నోటీస్‌ను దాఖలుచేసింది. విద్య, వ్యర్థాల సేకరణ వంటివి మినహా అన్ని రకాల సేవలను కౌన్సిల్ నిలిపేసింది. అయితే ఈ సమస్య ఇటీవల మరింత ముదిరింది. మాజీ ఉద్యోగులకు సమానంగా పరిహారం ఇవ్వాలన్న డిమాండ్ ఊపందుకుంది. మాజీ ఉద్యోగుల్లో మహిళలతో పోలిస్తే పురుషులకు అధిక పరిహారం అందిందని వార్తలొచ్చాయి. విషయం బయటకు పొక్కడంతో కార్మికుల ఆందోళనలు ఎక్కువయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి కౌన్సిల్‌కు రావాల్సిన నిధులు, గ్రాంట్లుల్లో కోత పెరిగింది. దీంతో కౌన్సిల్ మరింత సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇంగ్లండ్‌లో 2010 ఏడాది సగటుతో పోలిస్తే కౌన్సిళ్లకు ఇచ్చే నిధులు, గ్రాంట్లు, పన్ను చెల్లింపుల్లో 18 శాతం కోత పెట్టినట్లు 2024 జూన్ నివేదిక వెల్లడించింది. దీంతో 'చెత్త'సమస్య ఎప్పుడు తీరుతుందోనని స్థానికులు వాసనలకు ముక్కు మూసుకుని మరీ దిగాలుగా ఆలోచిస్తున్నారు.



ప్రభుత్వం ఏం చెబుతోంది?

బర్మింగ్‌హామ్ సిటీ కౌన్సిల్ వాదన వేరేలా ఉంది. ''కార్మికుల వేతనాల్లో కోతలు ఉండబోవు. ప్రతిపాదనల ప్రభావానికి గురయ్యే వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పిస్తాం. కొత్త ఉద్యోగానికి కావాల్సిన శిక్షణను అందిస్తాం. వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని మరింత ఆధునీకరించి, నగరంలో సుస్థిర ఆర్థిక వ్యవస్థ పరిస్థితులను బలోపేతం చేస్తాం''అని సిటీ కౌన్సిల్ స్పష్టం చేసింది. ఫిబ్రవరి వరకు కొందరు పనిచేసినా మార్చి రెండో వారం నుంచి పరిస్థితి అధ్వానంగా తయారైంది. చెత్తసేకరణ, తరలింపు దాదాపు ఆగిపోయింది. స్వల్పస్థాయిలో కొందరు పనిచేసేందుకు ముందుకొచ్చినా మిగతా వాళ్లు అడ్డుకుంటున్నారు. దీంతో ఇళ్ల మధ్యలో చెత్తకుప్పలున్నాయా? చెత్తకుప్పల పక్కన ఇళ్లు కట్టుకున్నారా? అనే పరిస్థితి దాపురించిందని ఒక స్థానికుడు వ్యాఖ్యానించారు. ''మేం చేసేది చెత్త పనే. కానీ అత్యంత ముఖ్యమైన పని. చేస్తున్న పనికిగాను కార్మికులకు సరైన గౌరవవేతనం దక్కాల్సిందే''అని కార్మికుల సంఘం నేషనల్ లీడ్ ఆఫీసర్ ఒనే కసబ్ డిమాండ్‌చేశారు.

హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. అశోకుడి ఎన్నో పాలనా సంవత్సరంలో కళింగ యుద్ధం జరిగింది?
   1) 1వ 2) 2వ
   3) 8వ 4) 13వ
2. అశోకుడి శాసనాల్లో ఉపయోగించని లిపి?
   1) ఆరామిక్ 2) ఖరోష్టి
   3) బ్రాహ్మి 4) సంస్కృతం
3. అశోకుడు శ్రీనగర్ పట్టణ నిర్మాత అని తెలిపే గ్రంథం?
   1) రాజతరంగిణి 2) పరిశిష్ట పర్వన్
   3) అశోకవదన 4) దివ్యవదన
4. అశోకుడి శాసనాలు.. ఎవరి శాసనాలను పోలి ఉన్నాయి?
   1) ఆంటియోకస్-2 2) టాలమీ-2
   3) మాగాస్ 4) డేరియస్
5. మౌర్యుల కాలంలో శిస్తు వసూలుకు అధిపతి?
   1) సమాహర్త 2) సన్నిధాత
   3) రూపదర్శక 4) కరణిక
6. ఏ సమయంలోనైనా తనను కలిసేందుకు ఏ అధికారులకు అశోకుడు అనుమతినిచ్చాడు?
   1) రజ్జుకలు 2) యుక్తలు
   3) పతివేదకులు
   4) ధమ్మ మహామాత్రులు
7. సుదర్శన తటాకాన్ని నిర్మించినవారు?
   1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
   3) రుద్రదమన 4) ఆర్యాతుషస్ప
8. మౌర్యుల కాలంలో విష్టి అంటే..?
   1) ఒక రాష్ట్రం 2) ఒక జిల్లా
   3) బలవంతపు శ్రమ 4) ఒక నాణెం
9. పన్నుల వ్యవస్థను ప్రస్తావించిన అశోకుని శాసనం?
   1) రుమ్మిందై శాసనం
   2) నిగాలిసాగర్ శాసనం
   3) కాందహార్ శాసనం
   4) బారాబర్ శాసనం
10. మౌర్యుల కాలంలో గొప్ప విద్యాకేంద్రం?
    1) తక్షశిల 2) ఉజ్జయినీ
    3) నలంద 4) వల్లభి
11. రాణి శాసనంలో పేర్కొన్న అశోకుడి రాణి ఎవరు?
    1) విదీష మహాదేవి 2) అసంధిమిత్ర
    3) కారువాకి 4) తిస్యరక్షిత
12. మౌర్యుల ఆస్థానానికి రాయబారిగా రానివారు?
    1) మెగస్తనీస్ 2) డైమాకస్
    3) డైనోసియస్ 4) పాట్రోకిల్స్
13. మెగస్తనీస్ ప్రకారం.. మౌర్యుల కాలంలో సమాజాన్ని ఎన్ని వర్గాలుగా విభజించారు?
    1) రెండు 2) నాలుగు
    3) ఆరు 4) ఏడు
14. 'ఒకే చక్రంతో బండి ఏ విధంగా నడవలేదో పరిపాలన కూడా ఒకే వ్యక్తి ద్వారా నడవలేదు' అని వ్యాఖ్యానించినవారు?
    1) మెగస్తనీస్ 2) కౌటిల్యుడు
    3) చంద్రగుప్తుడు 4) వి.ఎ. స్మిత్
15. అశోకుడు ధమ్మ ప్రచారానికి చేపట్టిన చర్యల్లో లేనిది?
    1) ధమ్మ గురించి తెలుపుతూ శిలా శాసనాలు, స్తంభ శాసనాల జారీ
    2) ధమ్మ మహామాత్రల నియామకం
    3) స్వీయ ధమ్మ యాత్రలు చేయడం
    4) ధమ్మ ఉల్లంఘనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం
16. అశోకుడు ఏటా తన పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా మానవతా దృక్పథంతో కొంత మంది ఖైదీలను విడుదలచేసేవారని తెలిపే శాసనం?
    1) 5వ స్తంభ శాసనం
    2) మొదటి శిలాశాసనం
    3) 13వ శిలాశాసనం
    4) 4వ స్తంభ శాసనం
17. భారతదేశంలో తొలిసారిగా నౌకాదళాన్ని ఏర్పాటు చేసిన పాలకులు?
    1) నందరాజులు 2) మౌర్యులు
    3) కుషాణులు 4) గుప్తులు
18. మౌర్యుల కాలంలో ఎంత శాతం భూమిశిస్తు (భాగ)గా వసూలు చేశారు?
    1) 1/8 2) 1/6 - 1/4
    3) 1/3 4) 1/2
19. మౌర్యులు గయ వద్ద నిర్మించిన గుహల్లో అతి పెద్దది?
    1) కర్ణచౌపార గుహ 2) సుధాముని గుహ
    3) లోమస రుషి గుహ
    4) గోపికా గుహ
20. సముద్రగుప్తుడి అలహాబాద్ ప్రశస్తిపై ఏయే రాజుల శాసనాలు ఉన్నాయి?
    1) అశోకుడు, జహంగీర్
    2) అశోకుడు, కనిష్కుడు
    3) జహంగీర్, ఫిరోజ్ షా తుగ్లక్
    4) అశోకుడు, అక్బర్
21. అశోకుడిలానే 'దేవానాం ప్రియ' అనే బిరుదు ధరించిన మౌర్యచక్రవర్తి ఎవరు?
    1) సంప్రతి 2) బిందుసారుడు
    3) దశరథుడు 4) బృహద్రధుడు
22. అశోకుడి సామ్రాజ్యంలో లేని ప్రాంతం?
    1) కేరళ 2) తమిళనాడు
    3) కాశ్మీర్ 4) 1, 2
23. అశోకుడు తన పొరుగు రాజులుగా కింది వారిలో ఎవరిని పేర్కొన్నాడు?
    1) చోళులు, పాండ్యులు
    2) సత్య పుత్రులు 3) కేరళ పుత్రులు
    4) పైవారందరూ
24. కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాల్లో లేనిది?
    1) స్వామి 2) కోశ
    3) ప్రదేశ 4) దండ
25. గ్రీకు రాజ్యాల్లో అశోకుడి సమకాలీనులు కానివారు?
    1) ఆంటియోకస్ 2) మాగాస్
    3) జెక్సెస్ 4) టాలమీ ఫిలడెల్ఫస్
26. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి రాసిన అశోకుడి శిలా శాసనం ఏది?
    1) ఎర్రగుడి సూక్ష్మ శిలాశాసనం
    2) లంపక శిలాశాసనం
    3) షాబాజ్‌గరి శిలాశాసనం
    4) మాన్‌షేరా శిలాశాసనం
27. మౌర్య ప్రభుత్వ గుత్తాధిపత్యం లేని అంశం?
    1) అడవులు 2) గనులు
    3) రేవులు 4) జూద గృహాలు
28. మౌర్యుల పాలనా భాష?
    1) సంస్కృతం 2) ప్రాకృతం
    3) ఖరోష్టి 4) అర్ధమాగధి
29. కిందివాటిలో మౌర్యుల రాగి నాణెం ఏది?
    1) పణం 2) సువర్ణం
    3) నిష్క 4) మషాక
30. జాతీయ పాలకుడిగా పేరొందిన తొలి భారతీయ రాజు?
    1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
    3) సముద్రగుప్తుడు 4) అక్బర్
31. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
    1) యూథిడియస్ 2) యూకటైడస్
    3) డెమిట్రియస్ 4) మినాండర్
32. మహేశ్వర అనే బిరుదును ధరించిన విదేశీ రాజు?
    1) కుజుల కాడ్‌ఫైసెస్
    2) ఆంటియాల్ సిడాస్
    3) విమా కాడ్‌ఫైసెస్
    4) హెలియో డోరస్
33. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
    1) పాశుపతం 2) కాపాలికం
    3) కాలాముఖం 4) అఘోర శైవం



34. పాంచావొ అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
    1) కుజుల కాడ్‌ఫైసెస్ 2) కనిష్కుడు
    3) వీమా కాడ్‌ఫైసెస్ 4) హువిష్కుడు
35. కనిష్కుడు ఎవరి సలహాపై కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతి నిర్వహించాడు?
    1) వసుమిత్రుడు 2) అశ్వఘోషుడు
    3) శీలభద్రుడు 4) పార్శ్వ
36. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
    1) హువిష్కుడు 2) వాసుదేవుడు
    3) రెండో కనిష్కుడు 4) వశిష్కుడు
37. ఎవరి పాలనా కాలంలో కశ్యపమాతంగ చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
    1) మౌర్యులు 2) శుంగులు
    3) శకులు 4) కుషాణులు
38. హుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
    1) బ్రాహ్మణ 2) క్షత్రియ
    3) వైశ్య 4) శూద్ర
39. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
    1) నరవర్ధన 2) ఆదిత్యవర్ధన
    3) ప్రభాకరవర్ధన 4) హర్షవర్ధన
40. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
    1) రెండో ధ్రువసేనుడు
    2) రెండో ప్రవరసేనుడు
    3) మూడో ధ్రువసేనుడు
    4) మూడో ప్రవరసేనుడు
41. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
    1) దండి 2) భండి
    3) వ్యాఘ్రకేతు 4) నిఘ్రూత
42. సకలోత్తరపథేశ్వర అనే బిరుదు ఉన్న రాజు ఎవరు?
    1) గ్రహవర్మ 2) శశాంక
    3) హర్ష 4) భాస్కరవర్మ
43. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికారులకు భూదానాలు చేసిన రాజవంశం?
    1) శాతవాహనులు 2) గుప్తులు
    3) ఇక్ష్వాకులు 4) పుష్యభూతులు
44. ఏ వర్గాన్ని హుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
    1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
    3) వైశ్యులు 4) శూద్రులు
45. బాణుడి ప్రకారం హర్షుడి కాలంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
    1) సతీసహగమనం 2) వరకట్నం
    3) కన్యాశుల్కం
    4) వితంతు వివాహాల నిషేధం
46. హర్షుడు ఆదరించిన మతం?
    1) హిందూ మతం 2) బౌద్ధ మతం
    3) జైన మతం 4) వైష్ణవ మతం
47. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
    1) వైష్ణవం 2) బౌద్ధం
    3) శైవం 4) జైనం
48. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
    1) సముద్రగుప్తుడు 2) హర్షవర్ధనుడు
    3) రెండో చంద్రగుప్తుడు
    4) యశోధర్ముడు
49. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి మహేంద్రవర్మ
    3) హర్షుడు 4) రెండో నరసింహవర్మ
50. రెండో పులకేశి ఏ యుద్ధంలో మొదటి మహేంద్రవర్మను అంతం చేశాడు?
    1) పుల్లలూరు యుద్ధం
    2) కొప్పం యుద్ధం
    3) సంగమేశ్వర యుద్ధం
    4) మణిమంగళ యుద్ధం
51. గుజరాత్‌పై అరబ్బుల దాడిని తిప్పికొట్టిన చాళుక్యరాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి విక్రమాదిత్యుడు
    3) రెండో విక్రమాదిత్యుడు
    4) రెండో కీర్తివర్మ
52. రెండో పులకేశి క్రీ.శ.642లో జరిగిన ఏ యుద్ధంలో మొదటి నరసింహవర్మ చేతిలో అంతమయ్యాడు?
    1) మణిమంగళ యుద్ధం
    2) కంచి యుద్ధం
    3) అనిల్‌వారా యుద్ధం
    4) బనవాసి యుద్ధం
53. బాదామీ చాళుక్యుల రాజ చిహ్నం?
    1) వరాహం 2) వృషభం
    3) సింహం 4) పులి
54. ఐహోల్ శాసనాన్ని రచించిన వారు?
    1) హరిసేనుడు 2) రవికీర్తి
    3) మొదటి పులకేశి 4) బాణుడు
55. అవనీసింహ అనే బిరుదున్న పల్లవ రాజు?
    1) సింహవిష్ణు
    2) రెండో నరసింహవర్మ
    3) మొదటి మహేంద్రవర్మ
    4) మొదటి పరమేశ్వర వర్మ
56. మహాబలిపురంలోని ఆదివరాహ దేవాలయంలో ఉన్న పల్లవరాజు విగ్రహం ఎవరికి సంబంధించింది?
    1) మొదటి నరసింహవర్మ
    2) రెండో నరసింహవర్మ
    3) సింహవిష్ణు
    4) అపరాజిత వర్మ
57. ఏ పల్లవరాజును సైనికుడు, పాలనాదక్షుడు, మత సంస్కర్త, భవన నిర్మాత, కవి, సంగీతకారుడు అని పిలిచేవారు?
    1) రెండో నరసింహవర్మ
    2) మొదటి మహేంద్రవర్మ
    3) రెండో పరమేశ్వరవర్మ
    4) రెండో నందివర్మ


సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 4	5) 1
6) 3	7) 1	8) 3	9) 1	10) 1
11) 3	12) 4	13) 4	14) 2	15) 4
16) 1	17) 2	18) 2	19) 4	20) 1
21) 3	22) 4	23) 4	24) 4	25) 3
26) 1	27) 4	28) 2	29) 4	30) 1
31) 3	32) 3	33) 1	34) 2	35) 4
36) 2	37) 4	38) 3	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 4	45) 2
46) 2	47) 3	48) 4	49) 3	50) 1
51) 3	52) 1	53) 1	54) 2	55) 1
56) 3	57) 2			

భూమికి అత్యంత దగ్గరలో ఉన్న గ్రహం?

మన విశ్వం

1. విశ్వం అధ్యయనాన్ని ఏమంటారు?
జ. కాస్మాలజీ
2. నక్షత్రాల చిన్న చిన్న గుంపులను ఏమని పిలుస్తారు?
జ. నక్షత్రరాశులు
3. లక్షల కోట్ల నక్షత్రాలున్న పెద్ద గుంపులను ఏ పేరుతో పిలుస్తారు?
జ. గెలాక్సీలు
4. కోట్లాది గెలాక్సీల సముదాయాన్ని ఏమని పిలుస్తారు?
జ. విశ్వం
5. మన సౌర వ్యవస్థ ఉన్న గెలాక్సీ పేరు?
జ. పాలపుంత లేదా ఆకాశగంగ
6. నక్షత్రాల కదలికలు, వాటి గమన మార్గాన్ని తెలుసుకోవాలంటే గుర్తించాల్సినవి?
జ. ధ్రువనక్షత్రం, సప్తర్షి మండలం, ఆరు నక్షత్రాలున్న శర్మిష్ట రాశి.
7. శర్మిష్ట రాశిలోని ఆరు నక్షత్రాలు కలిగి ఉన్న ఆకారం?
జ. M
8. ధ్రువ నక్షత్రాన్ని వేటి సహాయంతో గుర్తించవచ్చు?
జ. నక్షత్రరాశులు
9. సూర్యుడి చుట్టూ అంతరిక్ష వస్తువులు పరిభ్రమించడానికి కారణమైన బలం?
జ. గురుత్వాకర్షణ బలం
10. సౌరకుటుంబంలో ప్రస్తుతమున్న గ్రహాల సంఖ్య?
జ. 8
వివరణ: 2006 ఆగస్టు 25 నాటికి మన సౌర కుటుంబంలో ప్లూటోతో కలుపుకొని తొమ్మిది గ్రహాలు ఉండేవి.
అంతర్జాతీయ అంతరిక్ష సమాఖ్య - ఇంటర్నేషనల్ ఆస్ట్రానమికల్ యూనియన్(ఐఏయూ) 26వ అసెంబ్లీలో ప్లూటోను గ్రహాల జాబితా నుంచి తొలగించారు. 'క్లియర్డ్ ద నైబర్ హుడ్' (తోటి గ్రహాల కక్ష్యలకు ఆటంకం కలిగించరాదు) అనే నియమాన్ని ప్లూటో ఉల్లంఘించడమే దీనికి కారణం. ప్లూటో కొన్నిసార్లు నెప్ట్యూన్ కక్ష్యలోకి ప్రవేశిస్తోంది.
11. మనకు అత్యంత సమీపంలో ఉన్న నక్షత్రం?
జ. సూర్యుడు
12. సౌర వ్యవస్థకు కాంతి శక్తిని, ఉష్ణశక్తిని అందించే ప్రధాన వనరు?
జ. సూర్యుడు
13. సూర్యుడి వ్యాసం?
జ. 13,92,000 కిలోమీటర్లు
14. సూర్యుడి ద్రవ్యరాశి?
జ. 2×10^{30} కిలోగ్రాములు
15. సూర్యుడికి, భూమికి మధ్య దూరం?
జ. సుమారు 15,00,00,000 కిలోమీటర్లు.
16. సూర్యుడి నుంచి లభ్యమయ్యే విటమిన్?
జ. విటమిన్ - డి
17. సూర్యకాంతి భూమిని చేరేందుకు పట్టే సమయం?
జ. 8 నిమిషాల 20 సెకన్లు
18. సూర్యుడి చుట్టూ నిర్దిష్టమైన మార్గంలో గ్రహం పరిభ్రమిస్తుంది. ఆ మార్గాన్ని ఏమంటారు?
జ. కక్ష్య



19. సూర్యుడి చుట్టూ గ్రహం ఒకసారి తిరగడానికి పట్టే కాలాన్ని ఏమంటారు?
జ. పరిభ్రమణ కాలం (పీరియడ్ ఆఫ్ రివల్యూషన్)
20. సూర్యుడి నుంచి గ్రహాలకు దూరం పెరిగే కొద్దీ వాటి పరిభ్రమణ కాలం?
జ. పెరుగుతుంది
21. ఏదైనా అంతరిక్ష వస్తువు మరో వస్తువు చుట్టూ తిరుగుతుంటే దాన్ని ఏమంటారు?
జ. శాటిలైట్ (ఉపగ్రహం)
22. సూర్యుడికి అతి దగ్గరగా ఉన్న గ్రహం?
జ. బుధుడు
23. సౌర వ్యవస్థలోని అతి చిన్న గ్రహం?
జ. బుధుడు
24. బుధగ్రహ పరిభ్రమణ కాలం?
జ. 88 రోజులు
25. ఉపగ్రహాలు లేని గ్రహాలు ఏవి?
జ. బుధుడు, శుక్రుడు
26. భూమికి అత్యంత దగ్గరలో ఉన్న గ్రహం?
జ. శుక్రుడు
27. అత్యంత ప్రకాశవంతమైన గ్రహం?
జ. శుక్రుడు
28. భూమికి కవల గ్రహంగా పిలిచే గ్రహం?
జ. శుక్రుడు
29. వేగుచుక్క, సాయంకాల చుక్క అని పిలిచే గ్రహం?
జ. శుక్రుడు
30. తూర్పు నుంచి పడమరకు ఆత్మభ్రమణం చేసే గ్రహాలేవి?
జ. శుక్రుడు, యురేనస్
31. శుక్ర గ్రహ పరిభ్రమణ కాలం?
జ. 225 రోజులు
32. జీవం ఉన్న ఏకైక గ్రహం?
జ. భూమి
33. భూమిపై జీవ ఆవిర్భావానికి, మనుగడకు కారణం?
జ. ప్రత్యేక పర్యావరణ పరిస్థితులు
వివరణ:
ప్రత్యేక పర్యావరణ పరిస్థితులు
ఎ) భూమిపై సరైన ఉష్ణోగ్రత ఉండటం
బి) నీరు, వాతావరణం ఉండటం
సి) ఓజోన్ పొర ఉండటం.
ఓజోన్ ఆక్సిజన్ రూపాంతరం. ఇది స్ట్రాటో ఆవరణంలో ఉంటుంది. సూర్యుడి నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలు భూమిని చేరకుండా రక్షణ పొరలా పనిచేస్తుంది. సెప్టెంబర్ 16న 'ప్రపంచ ఓజోన్ దినోత్సవం' జరుపుకొంటారు.
34. అంతరిక్షం నుంచి భూమి ఏ రంగులో కనిపిస్తుంది?
జ. నీలి ఆకుపచ్చ
35. భూమికి ఉన్న ఉపగ్రహాల సంఖ్య?
జ. ఒకటి
36. చంద్రుడిపై మానవుడు తొలిసారిగా అడుగుపెట్టిన సంవత్సరం?
జ. 1969
37. 'చంద్రయాన్-1' కార్యక్రమాన్ని మనదేశం ఎప్పుడు ప్రారంభించింది?
జ. 2008 అక్టోబర్ 22
చంద్రయాన్ ముఖ్యోద్దేశాలు..
ఎ) చంద్రుడిపై నీటిజాడ కనుక్కోవడం
బి) చంద్రుడిపై పదార్థ మూలకాలను తెలుసుకోవడం
సి) He-3 ఉనికి కనుగొనడం
డి) చంద్రుడి త్రిమితీయ (త్రీ-డి)అట్లాస్ రూపొందించడం.
ఇ) సౌర వ్యవస్థ ఆవిర్భావానికి సంబంధించిన ఆధారాలను అన్వేషించడం.
38. సౌర కుటుంబంలో భూకక్ష్యకు బయట ఉన్న గ్రహాల్లో మొదటి గ్రహం?
జ. కుజుడు
39. అంతర గ్రహాల్లో చివరి గ్రహం?
జ. కుజుడు
40. ఎరుపు వర్ణంలో కనిపించే గ్రహం?
జ. కుజుడు
41. కుజ గ్రహానికి ఉన్న చంద్రుల సంఖ్య?
జ. రెండు
42. సూర్యుడి చుట్టూ పరిభ్రమించేందుకు అంగారక గ్రహానికి పట్టే సమయం?
జ. 687 రోజులు
43. సూర్యుడి చుట్టూ పరిభ్రమించేందుకు భూమికి పట్టే సమయం?
జ. 365 రోజులు
44. చంద్రుడి కాంతి నుంచి భూమిని చేరేందుకు పట్టే సమయం?
జ. 1.3 సెకన్లు
45. ఆస్టరాయిడ్స్ ఏ రెండు గ్రహాల మధ్యలో ఉన్నాయి?
జ. కుజుడు, బృహస్పతి

- సౌర కుటుంబంలో అతిపెద్ద గ్రహం?
జ. గురుడు (బృహస్పతి)
- బృహస్పతి పరిమాణం, భూమి పరిమాణం కంటే ఎన్ని రెట్లు పెద్దది?
జ. 1300 రెట్లు
- బృహస్పతి ద్రవ్యరాశి, భూ గ్రహ ద్రవ్యరాశి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
జ. 318 రెట్లు
- తన చుట్టూ తాను అత్యంత వేగంగా తిరిగే గ్రహం ఏది?
జ. బృహస్పతి
- ప్రకాశవంతమైన వలయాలున్న గ్రహం?
జ. బృహస్పతి
- సూర్యుడి చుట్టూ బృహస్పతి పరిభ్రమణ కాలం ఎంత?
జ. 12 ఏళ్లు
- టెలిస్కోప్ సహాయంతో బృహస్పతికి ఉన్న ఎన్ని చంద్రులను వీక్షించగలం?
జ. నాలుగు
- పసుపు వర్ణంలో ఉండే గ్రహం ఏది?
జ. శని
- వలయాలను కలిగి ఉండటం ఏ గ్రహం ప్రత్యేకత?
జ. శని
- 'ఆరెంజ్ ప్లానెట్'గా పిలిచే గ్రహం?
జ. శని
- భూకేంద్ర సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
జ. టాలెమీ
- ఇప్పటివరకు కనుగొన్న నక్షత్రాల్లో అతి పెద్దది?
జ. ఎప్సిలాన్ అరిగ

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శుక్ర గ్రహానికి సంబంధించిన అసత్యం?
   ఎ) రాత్రంతా చూడొచ్చు.
   బి) సూర్య చంద్రుల తర్వాత అత్యంత ప్రకాశవంతంగా కనిపిస్తుంది.
   సి) భ్రమణం, పరిభ్రమణం వ్యతిరేక దిశల్లో ఉంటాయి.
   డి) ఉపరితల ఉష్ణోగ్రత సుమారు 450°C
2. నక్షత్రాలు తూర్పు నుంచి పడమరకు తిరుగుతున్నట్లుగా కనిపిస్తాయి. కారణం?
   ఎ) విశ్వాంతరాళం తూర్పు నుంచి పడమరకు పయనిస్తుంది
   బి) భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుంది
   సి) భూమి తూర్పు నుంచి పడమరకు గుండ్రంగా తిరుగుతుంది
   డి) భూమి పడమర నుంచి తూర్పునకు తిరుగుతుంది
3. ద్రవ్యం, పరిమాణం, సాంద్రతలో భూమిని పోలి ఉన్న గ్రహం?
   ఎ) అంగారకుడు బి) శుక్రుడు
   సి) బుధుడు డి) యురేనస్
4. భూమికి చేరువలో ఉన్న గ్రహం?
   ఎ) అంగారకుడు బి) శుక్రుడు
   సి) బృహస్పతి డి) బుధుడు
5. అతిపెద్ద గ్రహం?
   ఎ) గురుడు బి) బుధుడు
   సి) ఇంద్రుడు డి) శుక్రుడు
6. సూర్యుడికి అతి దగ్గరగా ఉన్న గ్రహం?
   ఎ) బుధుడు బి) గురుడు
   సి) శుక్రుడు డి) ఇంద్రుడు
7. సూర్యునికి అత్యంత దూరంగా ఉన్న గ్రహం?
   ఎ) గురుడు బి) బుధుడు
   సి) ఇంద్రుడు డి) శుక్రుడు
8. అత్యంత కాంతివంతమైన గ్రహం?
   ఎ) బుధుడు బి) గురుడు
   సి) శుక్రుడు డి) ఇంద్రుడు
9. చంద్రుడు(ఉపగ్రహం) లేని గ్రహం?
   ఎ) బుధుడు బి) ప్లూటో
   సి) శుక్రుడు డి) నెప్ట్యూన్
10. చంద్రుడిపై మానవుడు ఎప్పుడు కాలుమోపాడు?
    ఎ) 1967 బి) 1968
    సి) 1969 డి) 1966

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) బి; 4) బి; 5) ఎ;
6) ఎ; 7) సి; 8) సి; 9) ఎ; 10) సి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎం ముంబైలో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ముంబై(ఐఐఎం ముంబై).. ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **పోస్టుల వివరాలు:** మేనేజర్(అల్యూమిని అఫైర్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్)-01, అసిస్టెంట్ మేనేజర్(అల్యూమిని అఫైర్స్ అండ్ కార్పొరేట్ రిలేషన్స్)-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** మేనేజర్ పోస్టుకు 50 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.1,00,000 నుంచి రూ.1,20,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.90,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 16.04.2025.
- **వెబ్‌సైట్:** https://iimmumbai.ac.in

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.04.2025 నాటికి 37 ఏళ్ల లోపు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.60,000 నుంచి రూ.1,80,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జీజీఎం, హెచ్‌ఆర్‌ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 25.04.2025.
- **వెబ్‌సైట్:** https://ircon.org

అభివృద్ధి చోదకాలు.. పంచవర్ష ప్రణాళికలు

భారతదేశ రూపురేఖలు మార్చడంలో పంచవర్ష ప్రణాళికలు ఎంతగానో తోడ్పడ్డాయి. దేశం వృద్ధి బాటలో పయనించడంలో ప్రణాళికా సంఘం కీలకపాత్ర పోషించింది. రాజకీయ అస్థిరతలు, పొరుగు దేశాలతో యుద్ధాల వల్ల ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేని పరిస్థితి నుంచి ఆర్థిక సంస్కరణల నిచ్చెన ఆధారంగా అత్యధిక వృద్ధిరేటు సాధించే స్థాయికి భారత్ ఎదిగింది. ఆర్థిక మాంద్య పరిస్థితులు, ప్రకృతి విపత్తులను దీటుగా ఎదుర్కొంటూ.. నేడు ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి రేటు నమోదు చేస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపొందడంలో ప్రణాళికా సంఘం పాత్ర అమోఘం. విపత్కర పరిస్థితుల నేపథ్యంలో పంచవర్ష ప్రణాళికలను అమలు చేయలేకపోయినా, వార్షిక ప్రణాళికలతోనే నెట్టుకురావాల్సిన స్థితిలోనూ దేశాన్ని వృద్ధి బాటలో నిలిపేందుకు ప్రణాళికలు ఉపయోగపడ్డాయి. మారిన పరిస్థితులకు అనుగుణంగా ప్రాధాన్యాలను మారుస్తూ దేశాభివృద్ధిని పరుగులుపెట్టించడంలో పంచవర్ష ప్రణాళికలు ముఖ్య భూమిక పోషించాయి. భారత ఆర్థిక వ్యవస్థలో పంచవర్ష ప్రణాళికలకు ఎంతో ప్రాధాన్యం ఉంది.
ఈ నేపథ్యంలో.. గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోన్న అభ్యర్థుల సౌకర్యార్థం భారత ఆర్థిక ప్రణాళికా వ్యవస్థ – లక్ష్యాలు, వ్యూహాలు, ప్రణాళికా సంఘం పాత్ర తదితర వివరాలు...

భారత ఆర్థిక ప్రణాళికా వ్యవస్థ లక్ష్యాలు, వ్యూహాలు

వార్షిక ప్రణాళికలు

మూడో పంచవర్ష ప్రణాళిక ముగిసే (1966) నాటికి దేశం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. దీంతో 1967, 1968, 1969 వార్షిక ప్రణాళికలతో ఆర్థిక వ్యవహారాలను నెట్టుకు రావాల్సిన గడ్డు పరిస్థితులు తలెత్తాయి. కొందరు ఆర్థికవేత్తలు ఈ మూడేళ్ల కాలాన్ని 'ప్రణాళికా విరామం'గా పేర్కొంటారు. వార్షిక ప్రణాళికలు రూపొందించడానికి రెండు ప్రధాన కారణాలుఉండగా, చైనాతో యుద్ధం ముఖ్య కారణంగా చెప్పవచ్చు. నెహ్రూ–చౌఎన్‌లై మధ్య కుదిరిన పంచశీల ఒప్పందం విఫలమైంది. దీంతో 1962లో భారత్, చైనా సరిహద్దు ప్రాంతమైన ఆక్సాయ్ చిన్ వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధ ప్రభావం నుంచి తేరుకోక ముందే, మూడేళ్లు తిరక్కుండానే పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి రావడం రెండో కారణం. ఈ రెండు యుద్ధాలతో భారత ఆర్థిక వ్యవస్థ భారీ ఒడిదొడుకులకు గురైంది. ఆ సంక్లిష్టతను అధిగమించడం కోసం మూడేళ్లపాటు వార్షిక ప్రణాళికలతో ఆర్థిక గమనం సాగించాల్సి వచ్చింది.

ఈ మూడు వార్షిక ప్రణాళికలకు రూ. 1624 కోట్లు కేటాయించారు. అందులో 24 శాతం వ్యవసాయానికి, సామాజిక సమూహాల అభివృద్ధికి కేటాయించారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లోనూ కొన్ని సానుకూలతలను కూడా గమనించవచ్చు. వార్షిక ప్రణాళికల కాలంలో దేశంలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో వ్యవసాయ రంగ వృద్ధిరేటు 6.9 శాతంగా నమోదైంది. 1967–68లో ఆహారోత్పత్తి గరిష్ఠంగా 95.6 మిలియన్ టన్నులకు చేరింది. అప్పటి వరకు వార్షిక ఆహార పంటల దిగుబడిలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇదే కాలంలో రసాయనిక ఎరువుల వినియోగం, అధికోత్పత్తి సాధించే వంగడాల వాడకం విస్తృతమైంది. ఈ దశలోనే ఆధునిక నీటిపారుదల సౌకర్యాలు అభివృద్ధి చెందాయి. అందుకే ఆర్థికవేత్తలు ఈ దశను హరిత విప్లవం లేదా గ్రీన్ రివల్యూషన్ అని పిలుస్తారు.

హరిత విప్లవ కాలంలో వ్యవసాయాభివృద్ధి గణనీయంగా పెరిగింది. కానీ అది కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. దీంతో ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. ధనిక రైతు వర్గం మరింత బలపడింది. చిన్న, సన్నకారు రైతులు.. రైతు కూలీలుగా మారారని గణాంకాల ద్వారా తెలుస్తోంది. వ్యవసాయాభివృద్ధి ఉత్తర భారతంలోని పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లోని కొన్ని జిల్లాలకు పరిమితమైంది. దక్షిణాదిలో తమిళనాడులోని రెండు జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా లాంటి ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. ప్రాంతీయ అసమానతల నేపథ్యంలో పెద్ద ఎత్తున నిరసన పోరాటాలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక విదర్భ తదితర ఉద్యమాలు దీని పర్యావసానమే. మూడో పంచవర్ష ప్రణాళిక ఆరంభం నాటికే ప్రాంతీయ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రాంతీయ ప్రణాళికా బోర్డుల ఏర్పాటు ఆవశ్యకతను కూడా గుర్తించారు. ఈ క్రమంలోనే ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి ప్రాధాన్యాన్ని ఉటంకించారు. ఇందుకోసం తెలంగాణ ప్రాంతీయ ప్రణాళిక బోర్డుతోపాటు వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ స్థాయి (రాష్ట్ర స్థాయి) ప్రణాళిక బోర్డులను ఏర్పాటు చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ



నాలుగో పంచవర్ష ప్రణాళిక (1969 -74)

వార్షిక ప్రణాళికల కారణంగా నాలుగో పంచవర్ష ప్రణాళిక మూడేళ్లు ఆలస్యంగా 1969లో ప్రారంభమైంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక సంఘం నూతన లక్ష్యాలను నిర్దేశించింది. 5.5 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక స్థిరీకరణ, ఆదాయ అసమానతలు తగ్గించడం తదితరాలను కూడా ప్రాధాన్యాంశాల్లో చేర్చారు. స్వావలంబనను అధిక ప్రాధాన్యం ఉన్న అంశంగా పేర్కొన్నారు. వ్యవసాయం, సంబంధిత ప్రాథమిక రంగాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

పారిశ్రామిక రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పెంచాలని నిర్ణయించారు. తద్వారా క్షేత్రస్థాయిలో పారిశ్రామిక ఉత్పత్తిని పెంచవచ్చని భావించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు చేయూతనిచ్చి, ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై దృష్టి సారించారు.

ఆహార ధాన్యాలు, దినుసుల సరఫరాను మెరుగుపరిచే చర్యలు తీసుకున్నారు. వర్షాభావం వల్ల పంట దిగుబడి తగ్గిన సందర్భంలో మధ్యంతర నిల్వలు(బఫర్ స్టాక్స్) నిర్వహించే గిడ్డంగుల ఏర్పాటుకు ప్రయత్నించారు. గుత్తాధిపత్య నివారణ కోసం పారిశ్రామిక నియంత్రణ చట్టాల్లో మార్పులు చేశారు. ఆర్థికస్వామ్య కేంద్రీకృత ధోరణులను నివారించే దిశగా ద్రవ్య, కోశ విధానాల్లో మార్పులు చేపట్టారు. సహకార వ్యవస్థను పటిష్ఠం చేశారు. పరిపాలనా వికేంద్రీకరణ కోసం పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం మొదలైంది. తద్వారా సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని గ్రామ స్థాయిలో విస్తరించే పథకాన్ని ప్రారంభించడం ఈ ప్రణాళికా కాలంలోనే వేళ్లూనుకుంది. ఇందిరా గాంధీ ప్రభుత్వం 14 వాణిజ్య బ్యాంకులను జాతీయం చేసింది. రాజభరణాల రద్దు కూడా ఈ కాలంలోనే జరిగింది. 1971లో మరోసారి పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వచ్చింది. ఈ యుద్ధం ద్వారా తూర్పు పాకిస్తాన్ విమోచనం పొంది, బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. ముజీబుర్ రెహమాన్ నాయకత్వంలో బంగ్లాలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కొలువుదీరింది. ఈ యుద్ధం వల్ల ఇందిరా గాంధీ కీర్తిప్రతిష్ఠలు పెరిగాయి. ఆమె బంగ్లాదేశ్ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. కానీ వృద్ధి లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ప్రణాళిక విఫలమైంది. 5.6 శాతం వృద్ధిరేటును లక్ష్యంగా పెట్టుకోగా 3.3 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది.

అయిదో పంచవర్ష ప్రణాళిక (1974-79)

1974–75లో ప్రపంచ బ్యాంకు నేతృత్వంలోని ఆర్థిక శాస్త్రవేత్తల వర్గం స్వేచ్ఛా విపణి సిద్ధాంతాలకు అనుకూలంగా అనేక సిద్ధాంతాలను ముందుకు తెచ్చింది. ఇవి ప్రణాళికా విధానానికి, వాణిజ్యంలో ప్రభుత్వ రంగ జోక్యానికి వ్యతిరేకం. ఈ క్రమంలోనే మహలనోబిస్ సిద్ధాంత వ్యూహాలను విమర్శించడం మొదలైంది. భారతదేశ స్వావలంబన విధానాన్ని, దిగుమతి ప్రత్యామ్నాయ వ్యూహాన్ని ఈ వర్గం విమర్శించింది. ప్రభుత్వ రంగ పరిశ్రమల ఉనికిని ప్రశ్నించింది. మార్కెట్ లావాదేవీల్లో ప్రభుత్వ జోక్యం తగ్గించుకోవాలనే వాదన ఈ సమయంలోనే మొదలైంది. ఈ తరహా వాదనలు చేసిన వారిలో జగదీశ్ భగవతి, టీఎన్ శ్రీనివాసన్, అవినాశ్ దీక్షిత్, మాంటెక్ సింగ్ అహ్లువాలియా తదితరుల గురించి ప్రముఖంగా చెప్పుకోవచ్చు. అయితే వీరి వాదనలు, ప్రతిపాదనలు సాకారం కావడానికి 1991 వరకు వేచి చూడాల్సి వచ్చింది. వారి విమర్శలు, సూచనలు ఆ దశకంలో ఆకట్టుకోలేకపోయాయన్నది నిర్వివాదాంశం.

అయిదో పంచవర్ష ప్రణాళిక కూడా స్వావలంబన మార్గంలోనే పయనించింది.

ఈ ప్రణాళిక లక్ష్యాలు..

ఎ) సంపూర్ణ జాతీయ వృద్ధి రేటును 5.5 శాతం లక్ష్యంగా నిర్ణయించారు.
బి) ఉద్యోగావకాశాల విస్తరణ, ఇదివరకే ఉన్న ఉత్పత్తి సామగ్రి, నైపుణ్యాల సమగ్ర, సమర్థమైన వినియోగానికి దిశా నిర్దేశం.
సి) సామాజిక సంక్షేమానికి, జీవనానికి కావాల్సిన మౌలిక అవసరాల కోసం విస్తృత పర్చిన జాతీయ కార్యక్రమం.
డి) వ్యవసాయ విద్య, శిక్షణ, పరిశోధనలను పటిష్ఠం చేయడం. 125 మెట్రిక్ టన్నుల అదనపు ఆహార ధాన్యాల ఉత్పత్తిపై దృష్టి సారించడం.
ఇ) నిత్యావసరాల కోసం వస్తువుల ఉత్పత్తిని పెంచడం. ఇందుకు అవసరమైన మౌలిక పరిశ్రమలను నెలకొల్పడం. అంటే దేశవ్యాప్తంగా వినిమయ డిమాండ్‌ను అధికం చేయడం.
ఎఫ్) ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులకు ప్రత్యామ్నాయాలు కల్పించడం.
జి) సంస్థాగత, వ్యవస్థాగత, ద్రవ్య, కోశ విధానాలను మెరుగుపర్చడం. తద్వారా సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం.

ఈ ప్రణాళిక కోసం రూ.53,410 కోట్లు కేటాయించారు. అందులో ప్రభుత్వ రంగ కేటాయింపులు సుమారు రూ.39,426 కోట్లు. ఇదే కాలంలో దిగుమతి ఆంక్షలను సడలించి, కొంత సరళీకరణ చర్యలు చేపట్టడం కూడా గమనించవచ్చు. ఎమర్జెన్సీ విధించడం వల్ల 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 1978లోనే ప్రణాళికా కాలాన్ని కుదించింది.

1978–79, 1979–80 సంవత్సరాలకు భారతదేశ ఆర్థిక గమనంలోనే నూతన తరహా ప్రణాళికా పద్ధతి చోటు చేసుకుంది. ఈ తరహా ప్రణాళికలనే 'చలన ప్రణాళికలు' లేదా రోలింగ్ ప్రణాళికలు అంటారు. జనతా ప్రభుత్వం 1978లో ప్రవేశపెట్టిన ఆరో పంచవర్ష ప్రణాళిక ప్రారంభమై రెండేళ్లపాటు అమల్లో ఉంది. 1979లో తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జనతా పార్టీ ప్రణాళికాలను రద్దు చేసింది. ఆ స్థానంలో 1980లో మళ్లీ ఆరో పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టింది. ఆరో ప్రణాళికను పరిశీలించే ముందు రోలింగ్ ప్రణాళికా విధాన సిద్ధాంతాన్ని క్షుణ్నంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఒక రోలింగ్ ప్లాన్‌లో మూడు ఉత్తర భాగాలుంటాయి. అంటే ఒకే ప్రణాళికలో మూడు విడివిడి భిన్న ప్రణాళికలు ఉంటాయన్నమాట. మొదటిది ప్రస్తుత సంవత్సర ప్రణాళిక. ఇది వార్షిక బడ్జెట్‌లో భాగంగా ఉంటుంది. రెండో ప్రణాళికను ఒక నిర్దిష్ట కాల పరిమితికి నిర్ణయిస్తారు.

దీన్ని మూడు నుంచి నాలుగు లేదా అయిదేళ్లకు స్థిరీకరిస్తారు. ఆర్థిక పురోగమనం, మారుతున్న అవసరాలకు అనుగుణంగా లక్ష్యాలను సడలిస్తూ (పెంచడం లేదా తగ్గించడం చేస్తూ) రోలింగ్ చేస్తుంటారు. అంటే ఇందులో చలన ప్రణాళికా లక్షణాలున్నాయి. మూడో ప్రణాళికను దీర్ఘకాలిక ప్రణాళిక (పర్స్పెక్టివ్ ప్లాన్)గా వ్యవహరిస్తారు. దీని కాల పరిధి పదేళ్లు, పదిహేనేళ్లు లేదా 20 ఏళ్లు కూడా ఉండవచ్చు. ఈ తరహా ప్రణాళికలో సమీక్ష, సవరణల వెసులుబాటు ఉంటుంది. పంచవర్ష ప్రణాళికలోని కఠినతరమైన, సవరించడానికి వీల్లేని నిబంధనల దృఢత్వం ఉండదు.

ఈ తరహా పద్ధతిలో ఆర్థిక, రాజకీయ మార్పులకు అనుగుణంగా ప్రణాళికా తీరుతెన్నులను మార్చుకోగలగడం ప్రధాన ప్రయోజనమని చెప్పవచ్చు. రోలింగ్ ప్రణాళికా విధానం జనతా పార్టీ ప్రభుత్వంతోనే కనుమరుగైంది. అందుకే ఈ ప్రణాళికా లక్ష్యాలు కూడా అర్థాంతరంగానే ముగిసిపోయాయి.

What is core inflation?

BANK EXAMS
BANKING AWARENESS



Model Questions

1. Insurance Repository is formed and registered under:
a) Companies Act 1956
b) IRDA Act 1999
c) Partnership Act 1932
d) Shops and Establishments Act of respective States
e) None of these

2. Which type of banking that shuns the very idea of interest rates and is founded on the principles of profit sharing:
a) Islamic Banking
b) Land Development Banking
c) Consumer Banking
d) Exchange Banking
e) Personal Banking

3. Which of the following banks has issued Multi Currency World Travel Card?
a) Karur Vysya Bank
b) Union Bank of India
c) Kotak Mahindra Bank
d) Bank of Baroda
e) State Bank of India

4. The Gold Monetisation Scheme, 2015 will replace the existing ________. However, the deposits outstanding under the Gold Deposit Scheme will be allowed to run till maturity unless the depositors prematurely withdraw them.
a) Gold Deposit Scheme, 1995
b) Gold Deposit Scheme, 1999
c) Sovereign Gold Bond Scheme.
d) Gold Deposit Scheme, 1991
e) None of the above

5. Which of the following is not correct regarding the Rajiv Gandhi Equity Savings Scheme.
a) Those investors whose annual taxable income is below Rs. 10 lacs are eligible under the scheme.
b) The maximum investment permissible under the scheme is Rs.50,000.
c) It is a tax savings scheme which gives tax benefit for new investors.
d) The scheme aims to promote debt culture in India.
e) None of the above

6. Which of the following banking system is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
a) Tiered Banking
b) Shadow Banking
c) Multiple Banking
d) Universal Banking
e) Night Banking

7. Which one of the following entity is not authorised to open insurance accounts?
a) Central Insurance Repository Limited
b) SHCIL Projects Limited
c) NSDL Database Management Limited
d) Kotak Insurance Repository Limited e) None of the above

8. The scheme "Aapka paisa aapke haath", refers to the
a) Direct Transfer Scheme
b) Direct Benefit Transfer Scheme
c) Direct Bank Transfer Scheme
d) Direct Bank Transfer Mode
e) Direct handing over of cash benefit by hand through postal services

9. Interest rate payable on saving bank account is:
a) Regulated by RBI
b) Regulated by State Govt
c) Regulated by Finance Ministry
d) Deregulated e) None

10. Which of the following are eligible to make deposits under Gold Monetisation Scheme?
a) Resident Indians & HUF
b) Trusts including Mutual Funds / Exchange Traded Funds
c) Registered under SEBI (Mutual Fund) Regulations
d) Companies
e) All of these

11. The Union Finance Minister has launched the IRDA's Insurance Repository System (IRS). Which of the following is not correct about IRS service record of all insurance policies?
a) Insurance Repository is authorised only to maintain the policies in physical form
b) Insurance Repository provide a Insurance
c) The Repository acts as a single stop for several policy service requirements.
d) The Repository will issue a unique code number to all policy holders
e) None of the above

12. The drawee of a cheque can be:
a) One person b) Two person
c) Any legal or juristic person
d) A Bank e) None of these

13. Which of the following organization was established as a subsidiary of the Reserve Bank of India with the purpose of providing long term industrial finance and later took over business of Refinance Corporation of India in September, 1964?
a) ICICI Ltd b) IDBI Ltd
c) IFCI Ltd
d) Development Credit Bank of India(DCB)
e) None of the above

14. Which of the following is/are called Bretton Woods institution?
a) International Monetary Fund
b) World Trade Organization
c) United Nations
d) Asian Development Bank
e) Multilateral Development Bank

15. The minimum deposit at any one time shall be raw gold (bars, coins, jewellery excluding stones and other metals) equivalent to ____ grams of gold of 995 fineness.
a) 10 gm b) 20 gm
c) 30 gm d) 40 gm e) 50 gm

16. The new RTGS System operationalised is based on which standard messaging formats?
a) ISO 2002 b) ISO 20022
c) ISO 2022 d) ISO 22200
e) ISO 22220

17. The forensic audit of which bank ordered by the Reserve Bank of India is a first in the country's banking history?
a) United Bank of India
b) Allahabad Bank
c) State Bank of India
d) Union Bank of India
e) Dena Bank

18. RBI has mandated that the banks intending to enter insurance broking:
a) NPAs should not exceed 3% of their loans.
b) Should have a minimum net worth of Rs. 500 crore
c) Should have capital adequacy ratio of 10%
d) Only a & b e) All a, b, and c

19. Which State Govt. in India will introduce a cash compensation policy for housewives with less than Rs. 3 laks annual income:
a) Karnataka b) Goa
c) Maharashtra d) Delhi
e) Andhra Pradesh

20. The maximum limit for deposit under the Gold Monetisation Scheme is _______:
a) Rs. 1 lak b) Rs. 5 lak
c) Rs. 10 lak d) Rs 20 lak
e) No limit

21. No margin is required to bought in by the borrower for the education loans to special courses up to _________:
a) Rs. 2 lak b) Rs. 4 lak
c) Rs. 3 lak d) Rs. 5 lak
e) None of the above

22. What is core inflation?
a) It is the inflation rate of a particular basket of commodities
b) It is the sudden increase in prices of certain amount of food grains
c) It is caused by supply shocks in certain essential commodities.
d) It is the sudden decrease in supply of all goods and services.
e) Only a & b

23. Which of the following regulatory authority has been introduced by the Central Govt. with wide powers to recommend, enforce and monitor the compliance of accounting and auditing standards?
a) Financial Reporting Authority of India
b) National Financial Reporting Authority
c) National Financial Stabilization Authority
d) Audit Departments of Respective States
e) None of the above

24. Japan will promote ________, a theory which asserts that the advancement of women in the society is directly correlated with its growth rate.
a) womenomics
b) womenpowerment
c) women Empowerment
d) women Employment
e) None of the above.

25. The Reserve Bank is issuing Banknotes in Mahatma Gandhi Series 2005 with a new numbering pattern and special features for the visually impaired in ____, ____ and _____ denominations.
a) Rs.10, Rs. 50, Rs.100
b) Rs.100, Rs.500 and Rs.1000
c) Rs.50, Rs.100 and Rs.500
d) Rs.10, Rs.500 and Rs.1000
e) Rs.5, Rs.10, and Rs.20

26. To provide better security for debit card holders, payment services provider, National Payment Corporation of India has introduced a chip based card that provide protection to banks and their customers against card skimming and counterfeiting frauds. Such cards falls under which brand?
a) Rupay Brand
b) Rupaiya Brand
c) Rupee Brand
d) Rupiah Brand
e) Rupai Branch

27. As per Govt. guidelines, banks having total business of Rs. 300000 cr are to have how many EDs?
a) Minimum 2 b) 2
c) 3 d) Maximum 3
e) Only one irrespective of total business

28. According to Pension Fund Regulatory and Development Authority which Bank has been appointed as the new National Pension System Trustee Bank ?
a) State Bank of India
b) Axis Bank c) ICICI Bank
d) Punjab National Bank
e) Bank of India

29. Which of the following banks is the first Indian bank to introduce Display Debit cards?
a) HDFC Bank b) Axis Bank
c) ICICI Bank
d) State Bank of India
e) HSBC Bank

30. The Reserve Bank has reviewed and enhanced the limit on cash withdrawal at Point of Sale (POS - for debit cards and open system prepaid cards issued by banks in India) from Rs.1000 to ________ per day in Tier III to VI centres.
a) Rs. 1500 b) Rs. 2000
c) Rs. 2,500 d) Rs.3000
e) Rs. 3,500

KEY

1) a	2) a	3) c	4) b	5) d
6) b	7) d	8) b	9) d	10) e
11) a	12) d	13) b	14) a	15) c
16) b	17) a	18) e	19) b	20) e
21) b	22) a	23) b	24) a	25) b
26) a	27) c	28) b	29) b	30) b